Haqeeqat-e-Shirk
(Telugu)

షిర్క్ వాస్తవికత

ఉర్దూ మూలం

మౌలానా అమీన్ అహ్సన్ ఇస్లాహీ (అలైహిర్రహ్మాహ్)

తెలుగు అనువాదం

ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

విషయ సూచిక

భూమిక 4

ఉపోద్ఘాతం 8

షిర్క్ వాస్తవికత, దాని రకాలు 13

1. ముష్రిక్‌ల షిర్క్ 19

2. గ్రంథ వహుల షిర్క్ 78

3. కపటుల షిర్క్ 115

4. వెనుకటి అధ్యాయాల సారాంశం 133

5. నేటి ప్రపంచ స్థితి– ఒక చూపులో 139

6. ముస్లింల ప్రస్తుత స్థితిగతులు 156

7. విధ్యుక్త ధర్మం : కొన్ని సందేహాల నివృత్తి 170

8. మానవ నైజం షిర్క్‌ను వాంఛిస్తుందా? 188

9. షిర్క్‌కు మూల కారణం 212

అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో...

భూమిక

'లా ఇలాహ ఇల్లల్లాహు ముహమ్మదుర్రసూలుల్లాహ్' కలిమాయే (వచనమే) ఇస్లామ్ ధర్మానికి ప్రాతిపదిక. ఈ కలిమాలోని మొదటి పదం **'లా ఇలాహ'**కు వివరణే ఈ పుస్తకం. మరో విధంగా చెప్పాలంటే దేవుని ఏకత్వం (తౌహీద్)లో లేనిదేమిటి? షిర్క్ వాస్తవికత, దాని రకాలు, దాని చెడుగులు, మానవ నైజంతో దాని సమన్వయ రాహిత్యం- ఇత్యాది అంశాలు ఈ పుస్తకం ద్వారా సుస్పష్టం అవుతాయి. దేవుని ఏకత్వానికి సంబంధించిన ఆధారాలను మేము ఈ పుస్తకంలో వివరించలేదు. దీని కొరకు మేము **'హఖీఖతె తౌహీద్'** అనే మరో పుస్తకం రాశాము. అది ఒక విధంగా **'ఇల్లల్లాహ్'**కు విశదీకరణ.

ఈ పరంపరలో **'హఖీఖతె రిసాలత్'** అనే ఇంకొక పుస్తకం కూడా వస్తుంది. అందులో దేవుని ఏకత్వానికి- దైవదౌత్యానికి మధ్య గల అవినాభావ సంబంధంతోపాటు దైవ దౌత్యానికి సంబంధించిన పలు అంశాలపై చర్చ జరుగుతుంది. ఆ తరువాత ప్రవక్త ముహమ్మద్(స) వారి దైవదౌత్య నిదర్శనాలు, ప్రత్యేకతలు ఖుర్ఆన్ వెలుగులో విశ్లేషించటం జరుగుతుంది. ఈ (మూడవ) పుస్తకం కలిమయె తయ్యిబాలోని రెండవ భాగమైన **'ముహమ్మదుర్రసూలుల్లాహ్'**కు తాత్పర్యంగా ఉంటుంది.

మీ ముందున్న ఈ పుస్తకాన్ని రచయితలు సాధారణంగా అవలంబించే పద్ధతిననుసరించి వ్రాయలేదు. ఒకానొక అంశాన్ని ఎన్నుకుని దానికి సంబంధించిన కొన్ని ఖుర్ఆనీ వాక్యాలను ఒకచోట చేర్చి తత్సం

బంధితమయిన పాక్షిక, అనుబంధ విషయాలను కూర్చి పుస్తక రూపం ఇచ్చే విధానాన్ని మేము అవలంబించలేదు. **'తదబ్బురె ఖుర్ఆన్'** (ఖుర్ఆన్‌పై యోచన చేసే) ప్రయత్నంలో భాగంగా నేను అనేక సార్లు దీనిని తరచి చూశాను. ఇందలి ఉచితానుచితాలను, బలాలు– బలహీనతలను (ఖుర్ఆన్ అనే ప్రమాణనికషంపై) పరికించాను, పరిశీలించాను. ఈ సందర్భంగా నా మనోమస్తిష్కాలలో నాటుకున్న భావాలు భావనలను భద్రపరచి, దైవచిత్తమైనప్పుడు తఫ్సీరె ఖుర్ఆన్‌లో సందర్భోచితంగా– వాటిని విశదీకరించాలని సంకల్పించుకున్నాను.

ఈ సాధనలో ముందుకు వచ్చిన పలు అంశాలలోని కొంత భాగాన్ని ఈ పుస్తకంలో ఓ పద్ధతి ప్రకారం కూర్చటం జరిగింది. నేను చేసినదంతా సజావుగా సాగిందని చెప్పటం లేదు. నా వల్లనూ మరుపు జరిగి ఉండవచ్చు. నా వల్ల జరిగిన పొరపాటును జ్ఞాన సంపన్నులు ఎత్తి చూపితే సంతోషంతో, సహృదయంతో వాటిని స్వీకరిస్తాను, శిరసావహిస్తాను, సంస్కరించుకుంటాను.

ఈ పుస్తకంలో మొదట షిర్క్ నిర్వచనం ఇవ్వబడింది, దాని సూత్రప్రాయమైన రకాలు వివరించబడ్డాయి. ఆ తరువాత ముష్రిక్‌లు, గ్రంథ వహులు, మునాఫిక్‌లలో ఎన్నెన్ని రకాల షిర్క్ తిష్ఠవేసి ఉంటుందో ఖుర్ఆన్ వెలుగులో స్పష్టం చేయడం జరిగింది. **'లా ఇలాహ'**ను నిరాకరించటంలో దాగివున్న అంశాల వాస్తవికతను పూర్తిగా పాఠకుల ముందుకు తీసుకురావటం అసలు ఉద్దేశం. ఆపైన పాఠకులకు విషయం ఒక్క చూపులో సుబోధకమయ్యేలా వివిధ అధ్యాయాలను క్రమబద్ధంగా తీసుకురావటం జరిగింది. దరిమిలా రెండు వేర్వేరు అధ్యాయాలలో ప్రస్తుత ప్రపంచం మరియు ముస్లింల స్థితిగతులను సింహావలోకనం చేస్తూ దేవుని ఏకత్వం, బహు దైవోపాసన దృష్టి కోణంతో ఇప్పటి లోకం పోకడను

కూడా అవలోకనం చేశాను. దరిమిలా ఈనాడు చేయవలసిందేమిటో సూచించాను. కాలపు ప్రత్యేక పరిస్థితుల మూలంగా జనించే ప్రశ్నలకు సమాధానం కూడా ఇవ్వటం జరిగింది. పుస్తకంలోని మొదటి అధ్యాయాలను చదువుకుంటూ ముందుకు సాగిన ఒక పాఠకుని మస్తిష్కంలో జనించే సందేహాలకు కూడా ఈ సందర్భంగా సమాధానం ఇచ్చే ప్రయత్నం చేశాను. నేను ప్రస్తావించ లేకపోయిన మరికొన్ని అనుబంధ సంశయాలు కూడా జనించేందుకు ఆస్కారముంది. సంకల్పశుద్ధి గల పాఠకులు స్వయంగా వీటికి సమాధానం కనుగొనగలరు.

ఆఖరిలో మరో రెండు అధ్యాయాలు 'ప్రకృతి వాంఛించే విషయమా షిర్క్?' 'షిర్క్‌కు ప్రధాన కారణమేమిటి?' అనే అంశాలతో కూడుకున్నవి వస్తాయి. మానవ నైజంతో షిర్క్ ఎప్పటికీ పొసగదనీ, ప్రకృతి ధర్మం కేవలం దేవుని ఏకత్వమే (తౌహీద్)నని ఈ అధ్యాయాలలో నిర్ద్వంద్వంగా చెప్పటం జరిగింది. ఈ రెండు అధ్యాయాల ముఖ్యోద్దేశం ఒక్కటే– సత్య సందేశానికి బలం చేకూర్చటం! షిర్క్ (బహు దైవోపాసన) ప్రపంచమంతటా ప్రబలి ఉన్నప్పటికీ అది చెత్తకుప్పపై మొలిచిన మొక్క మాత్రమే. తౌహీద్ (ఏకేశ్వరోపాసన) యొక్క ఒక బలమైన తాకిడికి కూడా అది తట్టుకుని నిలబడజాలదు. కాకపోతే ఏకేశ్వరోపాసన సంస్థాపనం కొరకు దేవుడు ప్రభవింపజేసిన సముదాయం తన విధ్యుక్త ధర్మాన్ని గుర్తించాలి. అది బహుదైవోపాసనా ఆర్భాటాన్ని చూసి ధైర్యం కోల్పోరాదు.

وَمَثَلُ كَلِمَةٍ خَبِيثَةٍ كَشَجَرَةٍ خَبِيثَةٍ اجْتُثَّتْ مِنْ فَوْقِ الْأَرْضِ مَا لَهَا مِنْ قَرَارٍ

"అపరిశుద్ధ వాక్కును ఒక చెడు జాతి చెట్టుతో పోల్చవచ్చు. అది భూమి ఉపరితలం నుండి పెకలించి వేయబడుతుంది. దానికి స్థిరత్వం అనేదే లేదు." ***(ఖుర్ఆన్– 14: 26)***

మరోవైపు ఖుర్ఆన్ దేని వైపునకు పిలుపు ఇస్తుందో మానవాళికి విశదపరచాలి. ఇంతకీ ఖుర్ఆన్ చెప్పేదేమిటంటే, మానవ నైజంలో తౌహీద్ (దేవుని ఏకత్వం) ఉంది. కేవలం అపార్థం వల్ల, అవగాహనా లేమి వల్ల షిర్క్(బహుదైవోపాసన) మనిషి అణువణువునూ పెనవేసుకుపోతుంది.

ఇది కేవలం పరిశోధన నిమిత్తం చేసిన రచన కాదు, పైగా ఇదొక మహదాశయంలో భాగంగా రాసిన పుస్తకం. సత్య సందేశాన్ని అంద జేయటంతోపాటు సొసైటీలో వెర్రితలలు వేస్తున్న షిర్క్‌ను ఎండగట్టడం కూడా దీని వెనుక ఒక ప్రధాన ఉద్దేశమై ఉంది. వైజ్ఞానిక, శాస్త్రీయ పరిశోధనలను ప్రజలు నిశ్శబ్దంగా చదువుకుంటారు. కొందరు దానిని శ్లాఘిస్తారు. మరికొందరు వ్యాఖ్య అనవసరమంటారు. ఇంకొందరేమో ఇదేమన్నా కొత్త విషయమా!? అంటూ ముందుకు సాగిపోతారు. ఈ విషయాలు మీకు తెలియవని కాదు, తెలుసు. సమకాలీన వ్యవస్థను, సమాజాన్ని విమర్శించినందుకు ప్రజలు అసంతృప్తి చెందుతుంటారు. ఒక్కోసారి ఆ అసంతృప్తి కాస్తా ఆగ్రహంగా మారుతూ ఉంటుంది. విమర్శ నేరమనుకుంటే, ఆ నేరాన్ని నేను ఒప్పుకుంటున్నాను. దాని గురించి సంజా యిషీ ఇచ్చుకోవటం వృథా అని భావిస్తున్నాను. అయితే నా సంకల్పం మంచిది. ఒకవేళ నా కలం నుండి సత్యం వెలువడి ఉంటే అది ప్రజల హృదయాలలో చోటు సంపాదించేలా చేయమని దైవానికి విన్నవించుకుం టున్నాను. ఈ పుస్తక రచన కోసం ప్రేరణగా నిలిచిన వారందరికీ దీని ప్రతిఫలంలో భాగస్థుల్ని చేయమని వేడుకుంటున్నాను. ఒకవేళ నా కలం ఎక్కడయినా పొరబడి ఉంటే, దాని దుష్ప్రభావాన్ని చెరిపివేయమనీ, ఆ పాపం నుండి అందరినీ కాపాడమని ఆ పరమ ప్రభువును ప్రార్థిస్తున్నాను.

– అమీన్ అహ్సన్ ఇస్లాహీ

ఉపోద్ఘాతం

షిర్క్ (బహు దైవోపాసన, దైవత్వంలో సహవర్తుల్ని ఎంచటం) ఘోరమయిన అపచారం. ఇదెంత తీవ్రమయిన పాపమంటే ముస్లిమైన ఏ వ్యక్తి అయినా దాంతో తేలికపాటి సంబంధాన్ని కూడా సహించలేడు. ఒక సాధారణ ముస్లిం కూడా అన్ని రకాల నిందారోపణలను భరిస్తాడు, అన్నిరకాల నిష్ఠూరాలను, తప్పులను ఒప్పుకుంటాడు గాని అతని విశ్వాసంలో, ఆచరణలో ఏ కాస్త 'షిర్క్' చేరి ఉందని చెప్పినా దానిని భరించలేడు. వ్యాకులతతో విలవిల్లాడుతాడు.

నేడు ఆధునిక విద్యకు, నూతన సిద్ధాంతాలకు ప్రభావితులైన వారు సయితం– వారు ఏ మత వర్గానికి, సముదాయానికి చెందిన వారయినా సరే– షిర్క్‌ను మనస్ఫూర్తిగా ఇష్టపడరు. పైగా దాని పట్ల వారు చిరాకును ప్రదర్శిస్తారు. వారిలో 'దేవుని ఏకత్వం' (తౌహీద్) పట్ల అభిమానం ఉన్నా లేకున్నా షిర్క్‌ను మాత్రం వారు అభిమానించరు. వారి భావన ఇది : ఈ కాలంలో ఉంటే 'నాస్తికత్వం' ఉంది లేదా 'దేవుని ఏకత్వం' ఉంది. షిర్క్ వంటి మూఢాచారాలకు, ఆరాధనలకు బుద్ధిజీవులైన మనుషులెవరూ లోనవరు. తనకు ఏదయినా షిర్క్ మూఢాచారంతో సంబంధం అంట గట్టడాన్ని కూడా ఏ వ్యక్తీ అంగీకరించడు.

అదే సమయంలో–

ఖుర్ఆన్, హదీసుల కాస్తో కూస్తో పరిజ్ఞానం ఉన్న ఒక వ్యక్తి, షిర్క్ పట్ల కొందరు వ్యక్తులు వ్యక్తపరిచే ఈ వెగటును, దాంతోపాటు నేటి

ముస్లిం‌ల విశ్వాసాలను, ఆచరణలను కూడా తరచి చూసినప్పుడు లోకంలో కొనసాగుతున్న నిత్య వ్యవహారాలను కూడా చూసి వాటితో పోల్చుకున్నప్పుడు అతను ఆశ్చర్యచకితుడవుతాడు. తనకు తెలిసిన దానికీ-జనులు ఆచరణలో ప్రదర్శిస్తున్న దానికీ పొంతన ఉండదు సరికదా తీవ్రమయిన వైరుధ్యం అతనికి కానవస్తుంది. ఈ లోకంలోని ప్రతి మూలన షిర్క్ ప్రబలి ఉండటాన్ని అతను కళ్ళారా వీక్షిస్తాడు. కాని అదే సమయంలో కొంతమంది 'ఈ ప్రపంచంలో షిర్క్ పూర్తిగా సమసి పోయింది' అని చెప్పటం అతనికి వింతగా తోస్తుంది. ఒక విషయంపై తానొక అభిప్రాయం ఏర్పరచుకొని ఉండగా ఎదుటివారు ముక్తకంఠంతో దానికి వ్యతిరేకంగా వాదించటమంటే ఆశ్చర్యపడాల్సిన విషయమే కదా మరి! అతనికి దిమ్మ తిరిగినంత పనవుతుంది. తన మీద తనకే నమ్మకం లేకుండా పోతుంది. తాను ఆర్జించిన జ్ఞానం గురించి సంశయంలో పడిపోతాడు. 'షిర్క్'ను అర్థం చేసుకోవటంలో నేనే పొరబడ్డానా? అనుకుం టాడు. తౌహీద్ (దేవుని ఏకత్వపు) భావనను నిర్వచించటంలో నేను బహు దూరం వెళ్ళిపోయానా!? అన్న మీమాంసకు గురవుతాడు. ఇంటి గదిలో దుర్వాసన వస్తూ ఉన్నప్పటికీ 'లేదు, సుగంధ పరిమళం గుబాళిస్తూ ఉంద'ని అందరూ అంటుంటే, అతను ఆలోచనలో పడిపోతాడు. కాని పదే పదే పరికించిన తరువాత కూడా తన అభిప్రాయమే సరైందన్న నిర్ధారణకు వచ్చినప్పుడు అతను దుర్వాసనను కాదనలేడు, తనే కరెక్ట్ అని అతనికి కచ్చితంగా తెలిసిపోతుంది. అట్టి పరిస్థితిలో అతని ముందు రెండే రెండు మార్గాలుంటాయి. ఒకటి: ప్రజాభిప్రాయాన్ని ఎదిరించే ధైర్యం అతనిలో లేనందున నలుగురితో నారాయణ అన్న చందాన సర్దుకు పోవటం, తను కూడా దుర్వాసనను సువాసన అని చెప్పటం. రెండవ

మార్గం: జనుల అభిప్రాయం ఏమైతేనేమి, నేను మాత్రం సత్యానికి కట్టుబడి ఉంటాను. నా పంచేంద్రియాలు నాకిచ్చిన సంకేతం ప్రకారం నా దారి నాది అనుకుంటాడు. వీళ్ళు ఏదో 'ప్రయోజనాన్ని' ఆశించి దుర్వాసనను సువాసన అంటున్నారు. లేదా సువాసన- దుర్వాసనకు మధ్య విచక్షణ పాటించే సామర్థ్యమే ఈ జనంలో లేదని భావిస్తాడు.

ఈ కాలపు ముస్లింల గురించి, దేవుని ఏకత్వాన్ని నొక్కి వక్కాణించే ఇతర సమూహాల గురించి నేను కూడా ఈ చివరి అభిప్రాయమే కలిగి ఉన్నాను. నా ఉద్దేశ్యంలో ముస్లింలలో షిర్క్ పట్ల గల విసుగు, తౌహీద్ పట్ల గల ప్రేమాభిమానం వెనుక సరైన విజ్ఞానం లేదు. ధార్మిక చైతన్యం లేదు. వారు లాంఛనప్రాయంగా వారసత్వంగా లభించిన కొన్ని మతా చారాలపై నిలబడి ఉన్నారంతే. మేము షిర్క్‌ను ఖండించటానికి ప్రభవింప జేయబడిన సముదాయమైనప్పుడు, మేము స్వయంగా ఆ షిర్క్ చేష్టకు ఎలా లోనవుతాము? అని వారంటారు. ముస్లింలను మినహాయిస్తే, ఇక తౌహీద్‌ని సమర్థించే ఇతర సముదాయాలను తీసుకోండి, 'షిర్క్' పట్ల వారి విరక్తికి ప్రధాన కారణం విజ్ఞానం వల్ల వారికి అబ్బిన మితిమీరిన ధీమా. లేదా ఒకింత గర్వం. ఉదాహరణకు- కూపర్‌నేక్స్ ప్రాచీన నమ్మకానికి వ్యతిరేకంగా భూమి సూర్యుని చుట్టూ తిరుగుతుందని ప్రకటించాడు. గెలీలియో 'దూరదర్శిని'ని ఆవిష్కరించి ఆ వాదనలో ఉన్న వాస్తవికతని నిరూపించాడు. ఈ విధంగా పలు ఆధునిక పరిశోధనలు, కొంగ్రొత్త ఆవిష్కరణలు ఈ కోవకు చెందిన ప్రజలలో షిర్క్‌కి సంబంధించిన మూఢనమ్మకాలన్నింటినీ పటాపంచలు చేసేశాయి. శాస్త్రీయ పరిశోధనలు జరుగుతున్న ఈ యుగంలో ఇప్పుడు ఈ భ్రమల వలయంలో చిక్కుకునే ప్రమాదం లేకుండాపోయింది. అయితే అసలు 'షిర్క్' అంటే ఏమిటి? అది

ఏ ఏ రూపాల్లో ఉంటుంది? అది ఎన్ని రకాలు? మన వైజ్ఞానిక, నైతిక, రాజకీయ రంగాలపై దానివల్ల పడే ప్రభావం ఎటువంటిది? అన్నదేమీ వారికి తెలీదు పాపం. ఈ లోకం ఒకప్పుడు వైజ్ఞానికంగా పొరబడింది; ఇప్పుడు మానవుడు వైజ్ఞానికంగా అభివృద్ధి చెందిన మీదట ఆ మూఢ నమ్మకం సంస్కరించబడింది అని వారు తలపోస్తున్నారు. షిర్క్‌కు సంబంధించిన ఒక పరిమిత భావన– 'విగ్రహారాధన', 'ప్రకృతి ఆరాధన' మాత్రమే వారి మస్తిష్కంలో నాటుకొని ఉంది. ప్రకృతికి సంబంధించిన ఎన్నో రహస్యాలు ఛేదించబడ్డాయి. అతి త్వరలోనే మానవుడు గగన భువనాలకు తానే దైవాన్నని ప్రకటించుకునే స్థితికి చేరుకుంటున్నప్పుడు ఈ నదీనదాలను, పర్వతాలను, గ్రహాలను, నక్షత్రాలను పూజించటంలో అర్థమేముంది? అని వారంటున్నారు.

పరిస్థితుల ఈ స్వరూపం హజ్రత్ ఉమర్(రజి) గారి వివేచనాభరితమయిన ఒక మాటను తలపిస్తోంది. ఒకానొక సందర్భంలో ఆయన సమక్షంలో ఎవరో ఒక వ్యక్తిలోని సద్గుణాన్ని ప్రశంసిస్తూ 'అతనెంత పుణ్యాత్ముడంటే, పాపమంటే ఏమిటో కూడా అతనికి తెలీదు' అన్నారు. అతను చేసే ఈ ప్రశంసను విన్న హజ్రత్ ఉమర్(రజి), 'అలాగా! అదే నిజమైతే ఆ వ్యక్తి పాప పంకిలంలో చిక్కుకునే ప్రమాదం ఎంతైనా ఉంది'అన్నారు. ఎందుకంటే మంచీ చెడుల మధ్య, పాపపుణ్యాల మధ్య గల తేడా తెలియని వాడు సదా చెడులకు లోనయ్యే ప్రమాదం ఉంటుంది. ఈనాడు మనవాళ్ళ పరిస్థితీ ఇదే. వీరికి ధర్మం (దీన్) గురించి బొత్తిగా తెలీదు. అన్నిటికన్నా పెద్ద చెడుగు, ఘోర అపచారమైన 'షిర్క్' అంటే ఏమిటో వారికి తెలీదు. అస్వస్థతను తెలుసుకోలేని వ్యక్తి, ఒకవేళ రోగం గురించి సరిగ్గా ఊహించలేకపోతే, అనారోగ్యాన్నే ఆరోగ్యమని భ్రమపడితే ఇక అతని గురించి

ఆశ్చర్యపడాల్సిన పనేముంది? కాబట్టి ప్రస్తుతం ఈ 'అజ్ఞానాన్ని' గురించి విడమరచి చెప్పాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. దీనిని ఖుర్‌ఆన్ 'ఘోర మయిన జుల్మ్'గా ఖరారు చేసింది. ఈ సందర్భంగా తౌహీద్ వాస్తవికత ప్రస్ఫుటమవటంతోపాటు సత్యమేదో అసత్యమేదో పాఠకులకు సుబోధకం అవ్వాలి. ఈ విషయంలో వారికి ఎలాంటి సందేహాలు సంశయాలకు ఆస్కారం మిగులకూడదు.

لِيَهْلِكَ مَنْ هَلَكَ عَنْ بَيِّنَةٍ وَيَحْيَىٰ مَنْ حَيَّ عَنْ بَيِّنَةٍ ۔

"నశించవలసిన వాడు స్పష్టమయిన నిదర్శనంపై నశించాలని, జీవించవలసి ఉన్నవాడు స్పష్టమైన నిదర్శనంతో జీవించాలని (ఇలా నిర్ణయించటం జరిగింది)" ***(అల్ అన్‌ఫాల్ - 42)***

షిర్క్ వాస్తవికత, దాని రకాలు

ఏ వస్తువు అయినాసరే, దాని నిర్వచనం ఏమిటో తెలియనంత వరకూ దాని గురించిన స్పష్టమయిన భావన ఏర్పడదు. అందుకే మనం అన్నిటికన్నా ముందు షిర్క్ అంటే ఏమిటో చూసి, దానికి నిర్వచనం చెప్పాలి. ఆ తరువాతే దాని రకాలపై, దానికి సంబంధించిన అనుబంధ అంశాలపై చర్చించాలి.

దివ్యఖుర్ఆన్‌లో, ప్రవక్త(స) వారి ప్రవచనాలలో ఏ ఏ వస్తువులు షిర్క్‌గా ఖరారు చేయబడ్డాయో, వాటిని దృష్టియందుంచుకుని షిర్క్‌ను నిర్వచిస్తే ఆ నిర్వచనం ఇలా ఉంటుంది :

> **"దేవుని అస్థిత్వంలో లేదా దేవుని కొరకు మాత్రమే ప్రత్యేకమై ఉన్న భావంలో ఆయన గుణగణాలలో లేదా ఆయన హక్కులలో ఎవరినయినా సహవర్తునిగా ఎంచటమే షిర్క్."**

ఈ నిర్వచనాన్ని బాగా అర్థం చేసుకోవటానికి మరింత వివరణ అవసరం. దేవుని అస్థిత్వంలో భాగస్వామ్యం కల్పించటం (లేదా సహ వర్తుల్ని ఎంచటం) అంటే అర్థం దైవాన్ని వేరొకరుగా లేక వేరొకరిని దైవంగా ఖరారు చేయటం. వేరెవరికయినా దైవంతో సంబంధాన్ని ఆపాదించటం, ఎవరినయినా దేవుని తండ్రిగానో లేక కుమారునిగానో పేర్కొనటం. ఉదాహరణకు - క్రైస్తవులు మసీహ్ (ఏసుక్రీస్తు- అలైహి స్సలామ్)ను దేవ కుమారునిగా చెబుతారు. లేదా దేవుడు ఆయన్ని

కన్నాడని అంటారు. లేదా హజ్రత్ మర్యమ్ (అలైహస్సలామ్)ను దేవుని మాతగా అభివర్ణిస్తారు. లేదా అరబ్బులు దైవదూతలను దేవుని కుమార్తె లుగా నమ్ముతారు - ఈ నమ్మకాలన్నీ దేవుడు అజరుడు, నిత్యుడు, ఆది మధ్యాంత రహితుడన్న దానికి, ఆయన లక్షణాలన్నింటికీ విరుద్ధం. ధార్మికంగానూ, బౌద్ధికంగానూ, ప్రకృతి పరంగానూ ఇవి దేవుని అస్థిత్వంలో, ఉనికిలో షిర్క్ అనబడతాయి.

దేవుని గుణగణాలలో షిర్క్‌కు పాల్పడటమంటే అర్థమేమిటో, ఆ వైనం ఎలా ఉంటుందో చూద్దాం. కొన్ని 'పరిపూర్ణ గుణాలు' దైవానికి మాత్రమే ప్రత్యేకమై ఉంటాయి. ఉదాహరణకు- సృష్టించటం, నిర్వహణా సామర్థ్యం, సర్వాధిపత్యం, సర్వశక్తిమంతుడవటం, జ్ఞానం, వివేకం మొదలగునవి. దేవుని ఈ గుణాలలో ఎవరినయినా సహవర్తిగా ఖరారు చేస్తే అది గుణగణాలలో షిర్క్ అవుతుంది. అయితే ఇక్కడొక విషయం గమనార్హం. ఇవే గుణాలను మనం కొన్ని సందర్భాలలో మనలాంటి మనుషుల కొరకు ప్రయోగిస్తుంటాము. కాని వీటిని మనం దైవం కొరకు ప్రత్యేకించినప్పుడు ఆ భావమే వేరుగా, ప్రత్యేకంగా ఉంటుంది. అవే పదాలను మనుషుల కొరకు చెప్పినప్పుడు, వాటిని ఆ భావం నుండి పూర్తిగా వేరుపరచి చెబుతాము. ఉదాహరణకు- హకీమ్ (వివేకి, వివేచనా పరుడు, యుక్తిపరుడు) అనే గుణాన్ని మనం దేవుని కోసం, మనిషి కోసం కూడా వాడుతూ ఉంటాము. అయితే ఇదే గుణాన్ని దేవుని కోసం వాడి నప్పుడు దాని అర్థం వేరు, మనిషి కోసం వాడినప్పుడు దాని అర్థం వేరు. కేవలం దేవుని కొరకు ప్రయోగించే ఇదే గుణాన్ని మనిషి కొరకు కూడా, ఇదే భావంలో ప్రయోగిస్తే అప్పుడది దేవుని గుణగణాలలో షిర్క్ (షిర్క్ ఫిస్సిఫాత్) అవుతుంది.

ఇక దేవుని హక్కులలో షిర్క్ అంటే ఏమిటో చూద్దాం - దేవుని 'పరిపూర్ణ గుణాల'ను అంగీకరించిన మీదట కొన్ని విషయాలు అనివార్యంగా విధితమవుతాయి. మరోవిధంగా చెప్పాలంటే మనపై కొన్ని బాధ్యతలు మోపబడతాయి. వాటిలో వేరెవరినయినా భాగస్వామిగా చేర్చినట్లయితే అది దేవుని హక్కులలో సహవర్తుల్ని ఎంచటంగా భావించబడుతుంది. ఉదాహరణకు- దేవుడు సృష్టికర్త అయినప్పుడు సమస్త జగతిలో ఆయన ఆజ్ఞే చెల్లాలి. సమస్త వ్యవహారాల నిర్వహణ కూడా ఆయన ద్వారానే జరగాలి. ఇది అనివార్యం. ఇక ఇప్పుడు మనం భూమ్యాకాశాల సృష్టికర్త దేవుడేనని నమ్ముతాము. కాని వీటి నిర్వహణలో, పరిపాలనలో దైవంతోపాటు మరొకరు కూడా భాగస్వామిగా ఉన్నారని అన్నామనుకోండి, అది 'షిర్క్ ఫిల్లవాజిమ్' అవుతుంది. ఎందుకంటే దైవాన్ని సృష్టికర్త అని అంగీకరించిన తరువాత మనపై అనివార్యంగా విధితమైన అంశంలో మనం దైవానికి వేరొకరికి భాగస్వామ్యం కల్పిస్తున్నాము. వాస్తవానికి సృష్టించినవాడే ఆజ్ఞాపించేందుకు హక్కుదారుడు. అందుకే ఈ విధంగా సెలవీయడం జరిగింది:

اَلَا لَهُ الْخَلْقُ وَالْاَمْرُ

'తెలుసుకోండి! పుట్టించడం, పాలించడం ఆయనకే చెల్లుతుంది?'
(అల్ ఆరాఫ్ : 54)

ఇదే విధంగా, సమస్త జగతిని నడిపే, పరిపాలించే అధికారం ఆయనకే ఉన్నప్పుడు ఆయనకు మాత్రమే దాస్యం చేయటం అనివార్యం. ఆయనకు మాత్రమే విధేయత కనబరచాలి. సిసలైన ప్రేమాభిమానానికి కేంద్ర బిందువు ఆయన మాత్రమే. ఇప్పుడు మనం గనక ఆ నిజదైవాన్ని కాదని వేరొక కాల్పనిక దైవాన్ని పూజించసాగితే లేదా ఆయన విధేయతకు బదులు వేరెవరికయినా విధేయత చూపటం ధర్మసమ్మతమని భావిస్తే లేదా

ఆ దేవుని ప్రేమకు బదులుగా వేరొకరిని ప్రేమకు కేంద్ర బిందువుగా ఖరారు చేసుకుంటే– ఇవన్నీ **షిర్క్ ఫిల్ హుఖూఖ్** (హక్కులలో షిర్క్)గా పరిగణించబడతాయి. అందుకే దీని ప్రాతిపదికపై, దివ్యఖుర్ఆన్ ఈ విధంగా కోరుతోంది–

فَاعْبُدُوا اللّٰهَ مُخْلِصِيْنَ لَهُ الدِّيْنَ.

'ధర్మాన్ని (విధేయతను) కేవలం అల్లాహ్‌కే ప్రత్యేకిస్తూ ఆయన దాస్యం చేయండి.'

వేరొక సందర్భంలో ఈ విధంగా అనబడింది.

وَالَّذِيْنَ اٰمَنُوْٓا اَشَدُّ حُبًّا لِّلّٰهِ ـ

'విశ్వసించిన వారు అల్లాహ్ ప్రేమలో ఇతరత్రా ప్రేమలన్నింటికన్నా దృఢంగా ఉంటారు. (అంటే వారు ఇతరుల్ని ప్రేమించినా ఆ ప్రేమ దైవప్రేమకు లోబడి ఉంటుంది)'

ఇవీ షిర్క్‌కు సంబంధించిన వివిధ (అసలు) రకాలు. ఇవి గాక మరికొన్ని విషయాలు కూడా ఉన్నాయి. అవి స్వతహాగా షిర్క్ కాకపోయి నప్పటికీ, వీటిలోని ఏ ఒక్కటీ పైన పేర్కొనబడిన షిర్క్ కోవలలో రాకపోయి నప్పటికీ అవి కూడా షిర్క్ రూపాలుగానో, లేక షిర్క్ వైపునకు గొనిపోయే సాధనాలుగానో ఎంచబడతాయి. వాటిని గనక మిగిల్చి ఉంచినట్లయితే, ఏదో ఒకనాడు అవి అసలు సిసలు షిర్క్ తలుపు తట్టే ప్రమాదం ఉంది. ఇస్లామీయ షరీఅత్ ముఖ్య సూత్రమేమిటంటే, అది పాపంతోపాటు ఆ పాపానికి దోహదకారి అయ్యే మార్గాలను కూడా మూసివేస్తుంది. అందుకే షరీఅత్ వాటిని కూడా అధర్మంగా ఖరారు చేసింది. ఉదాహరణకు– దైవేతరులకు సాష్టాంగ ప్రణామం చేయటం, భక్తీ ప్రపత్తులతో దైవేతరుల

పేర ప్రమాణం చేయటం. సాష్టాంగ ప్రణామం (సజ్దా) సదా దైన్యావస్థకు పరాకాష్ఠగా భావించబడింది. ముష్రిక్ జాతులు తమ ఆరాధ్య దైవాలకు సాష్టాంగపడుతూ ఉంటాయి. అలాగే ముష్రిక్ జాతుల వారు తమ ఇలవేల్పులపై ఒట్టేసుకుంటూ ఉంటారు. ఈ కారణంగానే అంతిమ జీవన సంవిధానం, అంతిమ శాసనాంగమయిన ఇస్లాం షిర్క్‌కు దారితీసే ఇలాంటి వాటన్నింటికీ స్వస్తి పలికింది. ఈ రకమయిన షిర్క్‌ను **'షిర్క్ షుబ్హీ'** అనవచ్చు.

షిర్క్‌కు చెందిన ఈ వివిధ రకాలను విశదీకరించేందుకు మేము ఖుర్ఆన్ ఉపమానాలను సమర్పించటం సమంజసమని భావిస్తున్నాము. దివ్యఖుర్ఆన్ తన అవతరణా కాలంలో ఏ వర్గాలను ప్రత్యక్షంగా సంబోధించిందో, వారి చేష్టలలో, విశ్వాసాలలో అంతర్లీనమై ఉన్న షిర్క్‌ను ఎత్తి చూపిందో, వాటికి పాల్పడుతున్న వారి చిరునామా కూడా ఇచ్చింది. ఆ వర్గాలు మూడు-

1) అరబ్బులు (బనీ ఇస్మాయీల్)

2) గ్రంథవహులు (యూదులు, క్రైస్తవులు)

3) కపటులు (మునాఫిఖీన్)

ఈ మూడు వర్గాలలో కూడా అరబ్బులకు గల ప్రత్యేకత ఏమిటంటే, **'ముష్రికీన్'** అనే పదం వారికి పతాకంగా ఉపయోగించబడింది. మిగతా రెండు వర్గాలలోనూ షిర్క్ ఉన్నప్పటికీ 'ముష్రిక్' లేక 'ముష్రికీన్' అనే పదం వారి కోసం ధ్వజం లేక గుణ విశేషంగా ఉపయోగించలేదు. దీనికి కారణమేమిటంటే ఇతర వర్గాలు తౌహీద్‌ను మౌలికాంశంగా ఒప్పుకున్నాయి. వారికీ - ముస్లింలకు మధ్య 'దేవుని ఏకత్వం' ఉమ్మడి

అంశంగా ఉండేది. యూదులలో గానీ, క్రైస్తవులలోగానీ ఏ ఒక్కరూ దేవుని ఏకత్వాన్ని త్రోసిపుచ్చలేదు. ఇక కపటుల విషయానికి వస్తే వారు తమ బాహ్యాచరణల రీత్యా ముస్లింలుగానే ఉండేవారు. అయితే 'ముష్రిక్కులు'గా ఖుర్ఆన్ సంబోధించిన వర్గం మాటే వేరు. వారు షిర్క్‌ను తమ మౌలిక విశ్వాసంగా అంగీకరించినవారు. దైవత్వపు కర్మాగారంలో వారి భాగస్వాములు కేవలం పాల్గొనటమే కాదు, వారి భాగస్వామ్యం అవశ్యంగా భావించబడేది. షిర్క్‌ను ఒప్పుకోనంతవరకూ వారి దృష్టిలో ఈ జగతికి సంబంధించిన పజిల్ పరిష్కారమయ్యేది కాదు. షిర్క్‌కు వారు ఇచ్చిన ఈ ప్రాముఖ్యత దృష్ట్యా షిర్క్– తౌహీద్‌ల చర్చనీయాంశంలో ఖుర్ఆన్ కూడా వాళ్ళను ముందు వరుసలో ఉంచింది. మేము కూడా వాళ్ళను ముందే ఉంచుతున్నాము.

1. ముష్రిక్‌ల షిర్క్

అరబ్బుల గురించి అన్నిటికంటే ముందు తెలుసుకోవలసిన ఓ ముఖ్య విషయం ఏమిటంటే, వారిలోని ఏ ఒక్క వర్గం వారు కూడా దైవాన్ని తిరస్కరించే వారు కారు. కొంతమంది وَمَا يُهْلِكُنَآ إِلَّا ٱلدَّهْرُ **"మమ్మల్ని కాలచక్రం మాత్రమే అంతమొందించగలదు"** అన్న అరబ్బుల ఉద్ఘాటనను ఉదాహరిస్తూ, వారిలోని పలు వర్గాలు దైవాన్ని తిరస్కరించేవారని, వారు నాస్తికులనీ వ్యాఖ్యానించారు. కాని ఈ భావన సరైంది కాదు. ఖుర్‌ఆన్ అవతరించే కాలంలో అరబ్బులలోని ఏ వర్గం కూడా నాస్తికత్వాన్ని అవలంబించేది కాదు. 'వమా యుహ్లికునా ఇల్లద్దహ్ర్ (కాలచక్రం తప్ప మరొకటేదీ మమ్మల్ని తుదముట్టించదు)'అని వారు చెప్పినంత మాత్రాన దేవుని ఉనికిని వారు త్రోసిపుచ్చేవారని భావం ఎంతమాత్రం కాదు. వారు దైవాన్ని నమ్మేవారు. అయితే జాతుల ఉత్థాన పతనాలు ఆ జాతుల విశ్వాసాలు, ఆచరణల సంస్కరణపైనో, చెడుగుపైనో ఆధారపడి ఉంటాయన్న వాదనను మాత్రం వారు త్రోసిపుచ్చేవారు.

జాతుల ఉత్థాన పతనాల గురించి దివ్యఖుర్‌ఆన్ ఒక నైతిక ప్రాతిపదికను నిర్ధారించింది. ఆద్, సమూద్, లూత్, మద్‌యన్, ఫిరౌన్ జాతుల వినాశాన్ని ప్రస్తావిస్తూ ఆయా జాతులు తమలోని కుఫ్ర్ (తిరస్కార వైఖరి), షిర్క్ (బహు దైవోపాసన), దౌర్జన్యం, పాపం, అత్యాచారం, తలబిరుసు తనం తదితర సైద్ధాంతిక క్రియాత్మక చెడుగుల కారణంగా నాశనమయ్యా

యని ఖుర్ఆన్ ఘంటాపథంగా చెప్పింది. అరబ్బులను హెచ్చరించటం దీని అసలు ఉద్దేశం. వారు గనక తమ విశ్వాసాలు, ఆచరణలలోని చెడుగును సంస్కరించుకోకపోతే – వారు ఎంత బలవంతులైనప్పటికీ – వెనుకటి జాతుల మాదిరిగా నాశనమవక తప్పదని నిర్దిష్టంగా చెప్పటం జరిగింది. కాని ఈ మాట వారికి జీర్ణమవలేదు. జాతుల ఉత్థాన పతనాలలో నైతిక సూత్రాలకు ఎలాంటి ప్రమేయం ఉండదని వాళ్ళు అనేవారు. జాతి ఒక మహావృక్షం వంటిదని వారు భావించేవారు. ఆ వృక్షం మొలకెత్తుతుంది, పెరిగి శాఖోపశాఖలుగా విస్తరిస్తుంది. పండ్లు ఫలాలనిస్తుంది. ఆ విధంగా అది తనలోని సహజ శక్తిసామర్థ్యాలన్నింటినీ ధారబోసి కాలగర్భంలో కలసిపోతుంది. లేదా జాతి కూడా ఒక వ్యక్తి వంటిదేనని తలపోసేవారు. ఆ వ్యక్తి పుడతాడు. పెరిగి పెద్దవాడవుతాడు. చివరకు వ్యాధిగ్రస్తుడవుతాడు. లేదంటే వార్ధక్యం వల్ల నీరసించి మృత్యు వాతన పడతాడు. నిఖిల జగతిలో నలుమూలలా పనిచేస్తున్న జీవన్మరణాల నియమమే జాతులకూ వర్తిస్తుంది అని వాదించేవారు. వారు తమ కవితలలో వెనుకటి జాతుల వారి గురించి ఈ దృక్పథాన్నే చాటిచెప్పేవారు. కాగా, కుర్ఆన్ చరిత్రను ఓ వినూత్న దృష్టి కోణంతో వారి ముందుంచింది. అది వారి భౌతిక తత్వపు దృక్పథానికి పూర్తిగా భిన్నమైనది. ప్రపంచంలో మనుగడ కోసం సరికొత్త జీవన సూత్రాలను అవలంబించాలని అది వారిని కోరింది. అయితే అది అరబ్బుల మనోవాంఛలకు వ్యతిరేకంగా కనిపించింది. ఈ కారణంగా వాళ్ళు దానిని అవలంబించడానికి సిద్ధ మవలేదు. దీనికి సమాధానంగా వారు 'మమ్మల్ని ఒక్క కాల చక్రం మాత్రమే అంతమొందించగలద'ని చెప్పేవారు. జాతుల జీవన్మరణాలతో ఈ నీతి సూత్రాలకు ఎలాంటి సంబంధంలేదని అనేవారు. జాతులలోని

మంచీ చెడులకు ఇందులో ఎలాంటి ప్రమేయం లేదని కూడా వాదించేవారు.

ఇటలీకి చెందిన ప్రసిద్ధ రాజకీయ తత్వవేత్త మాకియవెల్లి మతం (విధానం) కూడా ఇదే. అతనేమంటాడంటే, ప్రభుత్వం ఒక తిరుగులేని రాజకీయ వ్యవస్థ. అది నైతికమైనది గానీ, శాసనపరమైనది గానీ కాదు. పరిపాలకులు, కార్యనిర్వాహకులు, రాజకీయ ప్రక్రియకు సంబంధించిన సమస్త వ్యవహారాలను ప్రభుత్వం కొరకే చేయాలి. ప్రభుత్వం వాంఛించే దానిని చేసి తీరాలి. అలా చేయటంలో న్యాయపరమైన, నైతికమయిన అంశమేదీ అవరోధంగా ఉండకూడదు – మాకియవెల్లీ చెప్పిన ఈ మాట వినూత్నమైనదేమీ కాదు. అలనాడు అరబ్బుల అజ్ఞానంతో కూడిన దృక్ప థానికే అతను ప్రాతినిధ్యం వహించాడు.

చెప్పవచ్చేదేమిటంటే అరబ్బులు దైవ తిరస్కారులు కారు. వారు దేవుని గుణగణాలలో కూడా దేనినీ త్రోసిపుచ్చేవారు కారు. భూమ్యాకాశాల నిర్మాత, సూర్యచంద్రుల సృష్టికర్త, గాలులు మేఘాలను సృజించినవాడు దేవుడేనని వారు అంగీకరించేవారు. జీవనాన్ని ప్రసాదించేవాడు, ఉపాధిని వొసగేవాడు, ప్రాణాన్ని తీసుకునేవాడు కూడా ఆ దేవుడేననివాళ్ళు నమ్మి నడుచుకునేవారు. అలాగే తమ వద్ద ఉన్న శక్తిసామర్థ్యాలన్నీ ఆ దేవుడు ప్రసాదించినవేనని, ఈ జగతిని నడిపేవాడు ఆయనేనని కూడా వారు విశ్వసించేవారు. కాని వీటన్నింటితోపాటు వారికి మరికొన్ని 'నమ్మకాలు' కూడా ఉండేవి. అవి దేవుని గుణగణాలపై గల నమ్మకానికి విరుద్ధమైనవి. ఇలా చెప్పాలంటే వారి నమ్మకాలు కుఫ్రకు, అవిశ్వాసానికి తార్కాణం వంటివి. వాటిని గనక అవలంబిస్తే దేవుని హక్కులలో ఇతరులకు భాగస్వామ్యం కల్పించినట్లే. అదే షిర్క్. దివ్యఖుర్ఆన్ అరబ్బులలోని ఈ

'వైరుధ్యాన్ని' ఎత్తిచూపింది. పదేపదే హెచ్చరించింది. ఈ పూర్వ రంగంలో మేము కేవలం రెండు ఆయత్‌లను మాత్రమే ఉదాహరిస్తున్నాము–

قُلْ مَنْ يَّرْزُقُكُم مِّنَ السَّمَآءِ وَالْاَرْضِ اَمَّنْ يَّمْلِكُ السَّمْعَ وَ الْاَبْصَارَ وَ مَنْ يُّخْرِجُ الْحَيَّ مِنَ الْمَيِّتِ وَ يُخْرِجُ الْمَيِّتَ مِنَ الْحَيِّ وَ مَنْ يُّدَبِّرُ الْاَمْرَ ؕ فَسَيَقُوْلُوْنَ اللّٰهُ فَقُلْ اَفَلَا تَتَّقُوْنَ ○ فَذٰلِكُمُ اللّٰهُ رَبُّكُمُ الْحَقُّ ۚ فَمَاذَا بَعْدَ الْحَقِّ اِلَّا الضَّلٰلُ ۖ فَاَنّٰى تُصْرَفُوْنَ ○ (یونس:۳۱،۳۲)

"వారిని అడుగు : 'ఆకాశం నుండీ, భూమి నుండీ మీకు ఉపాధి నిచ్చేవాడు ఎవడు? వినే శక్తీ, చూసే శక్తీ ఎవడి అధీనంలో ఉన్నాయి? ప్రాణము లేని దాని నుండి ప్రాణమున్న దానినీ, ప్రాణ మున్న దాని నుండి ప్రాణములేని దానినీ వెలికి తీసేవాడు ఎవడు? ఈ విశ్వ వ్యవస్థను నడుపుతున్నవాడు ఎవడు?' వారు 'అల్లాహ్' అని తప్పకుండా అంటారు. ఇలా అను : 'అలాంటప్పుడు మీరు (సత్యానికి వ్యతిరేకంగా నడవటం)మానుకోరేమిటి? ఆ అల్లాహ్‌యే మీ నిజమైన ప్రభువు. కనుక సత్యాన్ని తృణీకరిస్తే మార్గభ్రష్టత్వం తప్ప ఇక మిగిలేదేమిటి? అసలు మీరు ఎటు మరలింపబడు తున్నారు?" *(దివ్య ఖుర్ఆన్ -10: 31, 32)*

ఈ విరుద్ధ వైఖరే అరబ్బులను దైవారాధనతోపాటు మరెన్నో చిల్లర దేవుళ్ళ ఆరాధనకు కూడా లోను చేసింది. తత్కారణంగా దేవుని అస్తిత్వంలో, ఆయన గుణగణాలలో, ఆయన హక్కులు అధికారాలలో 'షిర్క్'కు సంబంధించిన ఎన్నెన్నో పోకడలు పుట్టుకు వచ్చాయి. క్రమేణా

అవి వారి అణువణువునూ పెనవేసుకుపోయాయి. వారి మనోమస్తిష్కాలపై దట్టంగా క్రమ్ముకున్నాయి. ఖుర్ఆన్ వెలుగులో వారి ఈ బహు దైవోపాసనా ఆరాధనలను గనక విశ్లేషించదలిస్తే అయిదు రకాల బహు దైవారాధనలు వెలికి వస్తాయి–

1) దైవదూతల పూజ
2) జిన్నుల పూజ
3) నక్షత్రాల పూజ
4) పెద్దల పూజ
5) స్వీయ పూజ

ఇప్పుడు వీటిలో ప్రతి ఒక్క దానిని గురించి సంక్షిప్తంగా చర్చిద్దాం–

(1) దైవదూతల పూజ

అరబ్బులు దైవదూతలను దేవుని కుమార్తెలుగా ఖరారు చేసేవారు. ఇది స్పష్టంగా దేవుని వ్యక్తిత్వంలో షిర్క్ అవుతుంది. దీనివల్ల దేవుని ఘనత్వాన్ని, నిరపేక్షా భావాన్ని తిరస్కరించినట్లవుతుంది. ఇది సరాసరి కుఫ్ర్ (అవిశ్వాసం, తిరస్కారవైఖరి) క్రిందికి వస్తుంది. దివ్యఖుర్ఆన్ వాళ్ళ ఈ విశ్వాసాన్ని ఖండిస్తూ ఇలా చెప్పింది :

قَالُوا اتَّخَذَ اللّٰهُ وَلَدًا سُبْحَانَهٗ هُوَ الْغَنِيُّ ط لَهٗ مَا فِي السَّمٰوٰتِ
وَمَا فِي الْاَرْضِ ط اِنْ عِنْدَكُمْ مِّنْ سُلْطٰنٍ بِهٰذَا ا اَتَقُوْلُوْنَ عَلَى
اللّٰهِ مَا لَا تَعْلَمُوْنَ ۝ - (يونس)

“అల్లాహ్ ఎవరినో కొడుకుగా చేసుకున్నాడని వారంటున్నారు. సుబ్హానల్లాహ్! (అల్లాహ్ అత్యంత పవిత్రుడు) ఆయన ఏ అక్కరా

లేనివాడు. ఆకాశాలలో, భూమిలో ఉన్నదంతా ఆయన ఆస్తియే. ఈ మాటకు అసలు మీ వద్ద ఉన్న నిదర్శనమేమిటి? అల్లాహ్‌ను గురించి మీకు తెలియని మాటలంటున్నారా? (దివ్యఖుర్‌ఆన్-10: 68)

వారు దైవదూతలను దైవాన్ని సమీపించే సాధనంగా భావించే వారు. మరి చూడబోతే ఇది దాస్య భావానికి విరుద్ధాంశం. దైవదూతలు కూడా దైవదాస్యం చేసేవారే. దాసులను దేవుని సరసన చేర్చటం అంటే దేవుని గుణగణాలలో షిర్క్‌కు పాల్పడటం వంటిదే. దీనిని ఖండిస్తూ ఖుర్‌ఆన్ ఏమంటుందో చూడండి-

وَ لِلّٰهِ يَسْجُدُ مَا فِى السَّمٰوَاتِ وَ مَا فِى الْاَرْضِ مِن دَآبَّةٍ وَّ
الْمَلٰئِكَةُ وَهُمْ لاَ يَسْتَكْبِرُوْنَ○ يَخَافُوْنَ رَبَّهُمْ مِّنْ فَوْقِهِمْ وَ
يَفْعَلُوْنَ مَا يُؤْمَرُوْنَ○ (النحل:۴۹،۵۰)

"భూమిలోనూ ఆకాశాలలోనూ ఉన్న సమస్త జీవరాసులూ, సర్వ దైవదూతలూ అల్లాహ్ ముందు సాష్టాంగపడుతున్నారు. వారు ఎంత మాత్రం గర్వాహంకారం ప్రదర్శించరు. తమ పైన ఉన్న ప్రభువునకు భయపడుతూ ఉంటారు. తమకు ఇవ్వబడిన ఆదేశం ప్రకారమే పని చేస్తారు.' ***(దివ్య ఖుర్‌ఆన్ - 16 : 49,50)***

'గర్వాహంకారం' ప్రదర్శించరు- అంటే దైవదాస్యం చేయటాన్ని తలవంపుగా భావించరు. తమ ప్రభువుకు భయపడుతూ ఉంటారు. పైనుండి అందే ఆదేశాలను శిరసావహిస్తారు - వారు దైవసామీప్యం పొందినవారే అయినప్పటికీ, దేవుని తేజోవంతమయిన సాంగత్యం వరకు చేరే శక్తి వారికి లేదు. పైనుండి అందే ఆజ్ఞలను యథాతథంగా అమలు పరచటం వరకే వారి పని. ఎల్లవేళలా దేవుని దాస్యం చేయటంలో,

ఆయనకు విధేయులై ఉండటంలో తలమునకలై ఉంటారు. ఆయన ప్రసన్నతను బడయటానికి వారు తహతహలాడుతూ ఉంటారు. ఆయన సామీప్యం పొందాలని కోరుకుంటూ ఉంటారు.

వేరొకరి 'వాస్తా' లేకుండా దైవసామీప్యం పొందటం అసంభవం అని ముష్రిక్కులు తలపోసేవారు. అందుకే వారు దైవదూతలను దైవాన్ని చేరుకునే ఆధారంగా (సాధనంగా) చేసుకునేవారు. ఈ ప్రయత్నంలో భాగంగా దైవదూతలను కొలిచేవారు. ఈ విధంగా 'ఆరాధనలో షిర్క్' అనే కొత్త పోకడ మొదలయింది. ఖుర్ఆన్ స్వయంగా వారి నోట వారు చేసే దైవదూతల పూజకు గల కారణాన్ని ఇలా తెలిపింది :

وَ الَّذِيْنَ اتَّخَذُوْا مِنْ دُوْنِهٖٓ اَوْلِيَآءَ مَا نَعْبُدُهُمْ اِلَّا لِيُقَرِّبُوْنَآ اِلَى اللّٰهِ زُلْفٰىؕ (الزمر:٣)

"అల్లాహ్‌ను వదలివేసి ఇతరులను సంరక్షకులుగా చేసుకున్నవారు, (తమ ఈ చర్యకు కారణంగా), 'వారు మమ్మల్ని అల్లాహ్ వద్దకు చేరుస్తారని మాత్రమే మేము వారిని ఆరాధిస్తున్నాము' అని అంటారు." ***(దివ్య ఖుర్ఆన్ - 39: 3)***

దైవదూతలను సేవిస్తేనే ప్రపంచంలోని తమ సమస్యలు పరిష్కారమవుతాయని, దైవదూతల దాస్యం వల్లనే తమ లోగిళ్ళలో శుభాలు పొంగి పొర్లుతాయని వారు భావించేవారు. సంతాన ప్రాప్తి వెనుక కూడా దైవదూతల కటాక్షం ఉందని అనుకునేవారు. అందుకే ఖుర్ఆన్ అరబ్బుల ఈ ఆలోచనను ప్రస్తావిస్తూ, దానిని ఈ విధంగా ఖండించింది:

فَلَمَّآ اٰتٰهُمَا صَالِحًا جَعَلَا لَهٗ شُرَكَآءَ فِيْمَآ اٰتٰهُمَا فَتَعٰلَى اللّٰهُ عَمَّا يُشْرِكُوْنَ ۝ اَيُشْرِكُوْنَ مَا لَا يَخْلُقُ شَيْـًٔا وَّهُمْ يُخْلَقُوْنَ ۝
(الاعراف)

"మరి అల్లాహ్ వారికి ఒక చక్కని, ఏ లోపమూ లేని పిల్లవాణ్ణి ప్రసాదిస్తే, వారు ఆయన ప్రసాదించిన ఈ కానుక విషయంలో ఇతరులను ఆయనకు భాగస్వాములుగా చేయసాగారు. వారు చేసే ఈ షిర్క్ పనులకు అల్లాహ్ అతీతుడు, ఉన్నతుడూను. ఎంత మూఢులు వీళ్ళు! ఏ వస్తువునూ సృష్టించలేని వారిని, స్వయంగా వారే ఒకరిచేత సృష్టించబడిన వారిని వీళ్ళు అల్లాహ్‌కు భాగ స్వాముల్ని చేస్తున్నారా? *(దివ్య ఖుర్ఆన్ - **7: 190, 191**)*

ఇదే విధంగా - వారి అభిప్రాయంలో జీవనోపాధి కూడా దైవ దూతల అనుగ్రహం వల్ల ప్రాప్తించేది. దివ్యఖుర్ఆన్ వారి ఈ మూఢ భావనను ఖండించింది-

اِنَّ الَّذِيْنَ تَعْبُدُوْنَ مِنْ دُوْنِ اللّٰهِ لَا يَمْلِكُوْنَ لَكُمْ رِزْقًا فَابْتَغُوْا عِنْدَ اللّٰهِ الرِّزْقَ وَ اعْبُدُوْهُ وَ اشْكُرُوْا لَهٗ اِلَيْهِ تُرْجَعُوْنَ○ (العنكبوت:١٧)

"యదార్థానికి అల్లాహ్‌ను కాదని మీరు పూజిస్తున్నవి మీకు ఏ ఉపాధినీ ఇచ్చే అధికారం కలిగిలేవు. ఉపాధి కొరకు అల్లాహ్‌నే అడ గండి. ఆయనకే దాస్యం చేయండి. ఆయనకు కృతజ్ఞతలు తెలు పండి. ఆయన వైపునకే మీరు మరలింపబడతారు.'

*(దివ్య ఖుర్ఆన్ - **29: 17**)*

అరబ్బులు మరణానంతర జీవితాన్ని, లెక్కల దినాన్ని నమ్మేవారు కారు. అయితే ఒకవేళ మరణానంతరం తమను లేపి లెక్కల కోసం హాజరు పరచటం జరిగితే, తాము పూజించే దైవదూతలు తమ కోసం సిఫారసు చేస్తారని, తమకు ఎలాంటి అవమానం జరగకుండా చూసుకుంటారని అనేవారు. వారి ఈ నమ్మకం వల్ల దేవుని జ్ఞాన విశేషాన్ని, న్యాయ గుణాన్ని,

దేవుని యుక్తిని త్రోసిపుచ్చినట్లయింది. ఇది తిరస్కారం (కుఫ్ర్)గా పరిగణించబడుతుంది. మరో విధంగా చెప్పాలంటే ఈ వైఖరి దేవుని గుణగణాలలో దైవేతరులకు భాగస్వామ్యం కల్పించటమే. ఇది పచ్చి షిర్క్. దివ్యఖుర్ఆన్ వివిధ కోణాల నుండి ఈ షిర్క్‌ను ఖండించింది. ఈ సందర్భంగా మేము కొన్ని ఆయతులను ఇక్కడ పొందుపరుస్తున్నాము. వీటి ఆధారంగా అలనాటి ముష్రిక్ అరబ్బుల విశ్వాసం ఎటువంటిదో స్పష్టంగా తెలిసివస్తుంది–

اَفَنَجْعَلُ الْمُسْلِمِيْنَ كَالْمُجْرِمِيْنَ ۝ مَا لَكُمْ كَيْفَ تَحْكُمُوْنَ ۝ اَمْ لَكُمْ كِتَابٌ فِيْهِ تَدْرُسُوْنَ ۝ اِنَّ لَكُمْ فِيْهِ لَمَا تَخَيَّرُوْنَ ۝ اَمْ لَكُمْ اَيْمَانٌ عَلَيْنَا بَالِغَةٌ اِلٰى يَوْمِ الْقِيٰمَةِ اِنَّ لَكُمْ لَمَا تَحْكُمُوْنَ ۝ سَلْهُمْ اَيُّهُمْ بِذٰلِكَ زَعِيْمٌ ۝ اَمْ لَهُمْ شُرَكَآءُ فَلْيَاْتُوْا بِشُرَكَآئِهِمْ اِنْ كَانُوْا صٰدِقِيْنَ ۝ (القلم:٣٥-٤١)

"(ఏమిటి?) మేము విధేయుల స్థితిని అపరాధుల స్థితి మాదిరిగా చేస్తామా? ఏమయింది మీకు, ఇలాంటి నిర్ణయాలు చేస్తారు? అక్కడ మీకు తప్పకుండా మీరు మీ కోసం కోరుకునేదే లభిస్తుందని వ్రాసిపెట్టి ఉన్న గ్రంథం ఏదైనా ఉందా మీరు చదవటానికి? మీరు నిర్ణయించుకున్నదే మీకు లభిస్తుందనడానికి ఆధారంగా ప్రళయ దినం వరకూ మీరు మాతో చేసుకున్న ఒడంబడిక ఏదైనా ఉందా? మీలో ఎవరు దీనికి హామీగా ఉంటారు? అని వారిని అడగండి. లేక వారు నిలబెట్టిన భాగస్వాములెవరైనా ఉన్నారా? (దీనికి బాధ్యత వహించటానికి)? అలాగైతే తాము నిలబెట్టిన భాగస్వాములను తీసుకురావాలి– వారు గనక సత్యవంతులే అయితే.'

*(దివ్య ఖుర్ఆన్ – **68 : 35-41**)*

أَفَرَأَيْتُمُ اللَّاتَ وَالْعُزَّى ٥ وَمَنَاةَ الثَّالِثَةَ الْأُخْرَى ٥ أَلَكُمُ الذَّكَرُ وَلَهُ الْأُنثَى ٥ تِلْكَ إِذًا قِسْمَةٌ ضِيزَى ٥ إِنْ هِيَ إِلَّا أَسْمَاءٌ سَمَّيْتُمُوهَا أَنتُمْ وَآبَاؤُكُم مَّا أَنزَلَ اللَّهُ بِهَا مِن سُلْطَانٍ. إِن يَتَّبِعُونَ إِلَّا الظَّنَّ وَمَا تَهْوَى الْأَنفُسُ وَلَقَدْ جَاءَهُم مِّن رَّبِّهِمُ الْهُدَى. (النجم ١٩-٢٣)

"చూడండి, ఈ లాత్, ఈ ఉజ్జా, మూడోది ఒక దేవత అయిన మనాత్‌ల వాస్తవికతను గురించి మీరు కాస్తయినా ఆలోచించారా? ఏమిటి, మీ కోసం కుమారులున్నూ, దేవుని కోసం కుమార్తెలునా? ఇది మరీ అడ్డగోలు పంపకం! అసలు ఇవి ఏమీ కావు; మీరూ మీ తాత ముత్తాతలూ పెట్టుకున్న కొన్నిపేర్లు మాత్రమే. అల్లాహ్ వాటికై ఏ ప్రమాణాన్నీ పంపలేదు. యదార్థమేమిటంటే, వారు కేవలం ఊహలనూ, అనుమానాలనూ అనుసరిస్తున్నారు. మనోవాంఛలకు దాసులైపోయారు. వాస్తవానికి వారి ప్రభువు తరఫు నుండి వారి వద్దకు సన్మార్గం వచ్చేసింది.' *(దివ్య ఖుర్‌ఆన్ - **53: 19-23**)*

పై ఆయత్‌లలో ప్రస్తావించబడిన లాత్, మనాత్, ఉజ్జా- ఇవి మూడూ దైవదూతల విగ్రహాలు. ముగ్గురి పేర్లూ ఆడవారి పేర్లే. వాటి సిఫారసుపై అరబ్బు ముష్రిక్కులకు మితిమీరిన ధీమా ఉండేది. అరబ్బులు ఈ విగ్రహాల వద్దకు వెళ్ళినప్పుడు వాటి చుట్టూ ప్రదక్షిణ చేసేవారు. ప్రదక్షిణ చేస్తున్నప్పుడు ఇలా పలికేవారు.

تِلْكَ الْغَرَانِيقُ الْعُلَى وَإِنَّ شَفَاعَتَهُنَّ لَتُرْتَجَى.

'ఇది (మా పాలిట) అత్యున్నత స్థాయి. ఈ దేవతలు మా కోసం సిఫారసు చేస్తాయని మేమాశిస్తున్నాము.'

రానున్న దివ్య వచనాలలో వారి ఈ భావన ఖండించబడింది :

اَمْ لِلْاِنْسَانِ مَا تَمَنّٰى ۝ فَلِلّٰهِ الْاٰخِرَةُ وَالْاُوْلٰى ۝ وَكَمْ مِّنْ
مَّلَكٍ فِى السَّمٰوٰتِ لَا تُغْنِىْ شَفَاعَتُهُمْ شَيْئًا اِلَّا مِنْۢ بَعْدِ
اَنْ يَّاْذَنَ اللّٰهُ لِمَنْ يَّشَآءُ وَيَرْضٰى ۝ اِنَّ الَّذِيْنَ لَا يُؤْمِنُوْنَ
بِالْاٰخِرَةِ لَيُسَمُّوْنَ الْمَلٰٓئِكَةَ تَسْمِيَةَ الْاُنْثٰى ۝ (نجم)

'ఏమిటి, మానవుడు కోరేదల్లా అతనికి ప్రాప్తమవుతుందా? ప్రపంచానికీ, పరలోకానికి యజమాని అల్లాహ్ మాత్రమే. ఆకాశా లలో ఎంతోమంది దైవదూతలు ఉన్నారు. కాని వారి సిఫారసు ఏమాత్రం ఉపయోగపడదు. అల్లాహ్ తాను ఎవరిని గురించైతే ఏదయినా విన్నపం వినదలుస్తాడో, ఎవడయితే ఆయనకు ఇష్టుడో, అటువంటి వ్యక్తి విషయంలో దానికి (సిఫారసుకు) అనుమతిని ఇస్తేనే తప్ప. కాని పరలోకాన్ని విశ్వసించనివారు దైవదూతలను దేవతల పేర్లతో (ఆడవారి పేర్లతో) పిలుస్తున్నారు. (అంటే లాత్, ఉజ్జా, మనాత్‌ల వంటివి అన్నమాట).

*(దివ్యఖుర్ఆన్ - **53: 24-27**)*

ఆ తరువాత సిఫారసుకు సంబంధించిన ఆధారం గురించి వివరించటం జరిగింది. 'సిఫారసు' ద్వారా మంచిని చెడుగా, చెడును మంచిగా మార్చటం అనేది జరగని పని. ఎందుకంటే ఇది అల్లాహ్ న్యాయ నిబద్ధతకు, యుక్తికి పూర్తిగా విరుద్ధం. ప్రతి వ్యక్తీ తాను చేసుకున్న కర్మకు ప్రతిఫలం పొంది తీర్తాడు. సత్కార్యాలు చేసినవారే, చెడుల నుండి, పాపాల నుండి తప్పించుకున్నవారే దైవ కారుణ్యానికి అర్హులుగా నిలబడతారు. కాకపోతే మరుపు వల్ల, మనోవాంఛ ఆధిపత్యం వహించటం వల్ల ఎప్పు

డయినా ఏదయినా దుష్కార్యానికి ఒడిగడితే అది వేరే విషయం. దైవ కారుణ్యం, క్షమాభిక్ష ఎంతో విశాలమైనది. ఆయన పెద్దపెద్ద పాపాలనుండి తమను కాపాడుకునేవారి చిన్నచిన్న తప్పిదాలను మన్నిస్తాడు. అందుకే ఈ విధంగా సెలవీయబడింది:

وَلِلّٰهِ مَا فِي السَّمٰوٰتِ وَمَا فِي الْاَرْضِ لِيَجْزِيَ الَّذِيْنَ اَسَآءُوْا بِمَا
عَمِلُوْا وَيَجْزِيَ الَّذِيْنَ اَحْسَنُوْا بِالْحُسْنٰى ۝ اَلَّذِيْنَ يَجْتَنِبُوْنَ
كَبٰٓئِرَ الْاِثْمِ وَالْفَوَاحِشَ اِلَّا اللَّمَمَ ؕ اِنَّ رَبَّكَ وَاسِعُ الْمَغْفِرَةِ ؕ
(النّجم)

"భూమ్యాకాశాలలోని ప్రతి వస్తువుకూ యజమాని అల్లాహ్‌యే- చెడు చేసేవారికి అల్లాహ్ వారి కర్మలకు ప్రతిఫలం ఇచ్చేందుకు, సదాచరణ వైఖరి అవలంబించినవారికి మంచి ప్రతిఫలం ప్రసాదించేందుకు. వారు పెద్దపెద్ద పాపాలకు, స్పష్టమయిన అసభ్య చేష్టలకు దూరంగా ఉంటారు- కొన్ని పొరపాట్లు తప్ప. నిస్సంశయంగా నీ ప్రభువు క్షమాగుణం పరిధి అత్యంత విశాలమైనది."

*(దివ్యఖుర్ఆన్- **53: 31,32**)*

ఏ దైవదూతలపై వారు ఆశలు పెట్టుకున్నారో, వారిని అమితంగా ప్రేమించారు, ఆరాధించారు. అంటే అల్లాహ్‌ను ప్రేమించవలసిన విధంగా దైవదూతలను ప్రేమించసాగారు. ఇది 'దేవుని హక్కులలో షిర్క్' క్రిందికి వస్తుంది. ఈ పూర్వరంగంలో ఖుర్ఆన్ ఏమంటుందో చూడండి :

وَمِنَ النَّاسِ مَنْ يَّتَّخِذُ مِنْ دُوْنِ اللّٰهِ اَنْدَادًا يُّحِبُّوْنَهُمْ
كَحُبِّ اللّٰهِ وَالَّذِيْنَ اٰمَنُوْٓا اَشَدُّ حُبًّا لِّلّٰهِ وَلَوْ يَرَى الَّذِيْنَ

ظَلَمُوْٓا اِذْ يَرَوْنَ الْعَذَابَ اَنَّ الْقُوَّةَ لِلّٰهِ جَمِيْعًاۙ وَّاَنَّ اللّٰهَ شَدِيْدُ الْعَذَابِ ۝

"అల్లాహ్‌ను కాకుండా ఇతర భాగస్వాములను నిలబెట్టుకున్న వారు కూడా జనులలో ఉన్నారు. వారు అల్లాహ్‌ను ప్రేమించవలసిన విధంగా వారిని (దైవేతరులను) ప్రేమిస్తారు. అయితే విశ్వసించిన వారు మాత్రం అందరికన్నా అధికంగా అల్లాహ్‌నే ప్రేమిస్తారు. (షిర్క్ అనే) దౌర్జన్యానికి ఒడిగట్టిన వీళ్ళు ఆ సమయాన్ని చూస్తే ఎంత బాగుండు! అప్పుడు శిక్షించే అధికారం అంతా అల్లాహ్ హస్త గతమై ఉంటుంది. ఆయన చాలా కఠినంగా శిక్షించగలవాడు."

*(దివ్యఖుర్‌ఆన్ - **2 : 165**)*

"అల్లాహ్‌ను ప్రేమించవలసిన విధంగా వారిని ప్రేమిస్తారు" అంటే భావం దైవదూతల పట్ల వారికి గల ప్రేమాభిమానం స్థిరమైనది. ఆ ప్రేమాభిమానం అల్లాహ్ ప్రేమకు లోబడిలేదు. అల్లాహ్ ప్రేమకు లోబడని ప్రేమ 'షిర్క్'గా భావించబడుతుంది. అయితే విశ్వాసులు (మోమినీన్) మాత్రం అలాంటి వారు కారు. అల్లాహ్ యెడల వారికి గల ప్రేమ ప్రగాఢ మైనది. వారి ఇతరత్రా ప్రేమలన్నీ అల్లాహ్ ప్రేమకు లోబడి ఉంటాయి. ప్రపంచంలోని ఏ ప్రేమ అయినా అల్లాహ్ ప్రేమతో వ్యాఘాతం చెందు తున్నట్లు వారు పసిగడితే, వెంటనే తప్పుకుంటారు. లోకవాసుల మెప్పు కోసం వారు దైవప్రేమను పణంగా పెట్టరు.

"విశ్వసించిన వారు అల్లాహ్‌ను ఎంతో తీవ్రంగా ప్రేమిస్తార"ంటే భావం ఇదే.

దైవదూతలపై ఇన్ని ఆశలు పెట్టుకొని పూజించినప్పుడు, వారి పేర

మొక్కుకున్నప్పుడు తమ ఆరాధనలు, అర్చనలు, మొక్కుబడుల గురించి దైవదూతలకు 'తెలిసి ఉంటుంది'అన్న నమ్మకం కలిగి ఉండటం కూడా అవశ్యమైపోతుంది. తమ భక్తుల స్థితిగతులను దైవదూతలు ఎరుగు అన్న విశ్వాసం వారి ఆంతర్యాల్లో నాటుకుంటుంది. ఎందుకంటే వారికి ఈ 'జ్ఞానం' లేకుంటే వారిని సేవించిగానీ, ప్రేమించి గానీ లాభమేమీ లేదు. ఆ విధంగా వారు (దైవదూతలు) అల్లాహ్‌కు మాత్రమే ప్రత్యేకమైన 'జ్ఞాన గుణం'లో భాగస్వాములైపోయారు. దీనిని దివ్యఖుర్‌ఆన్ ఖండిస్తూ ఇలా అంటోంది:

وَيَوْمَ نَحْشُرُهُمْ جَمِيعًا ثُمَّ نَقُولُ لِلَّذِينَ أَشْرَكُوا مَكَانَكُمْ أَنْتُمْ وَشُرَكَاؤُكُمْ فَزَيَّلْنَا بَيْنَهُمْ وَقَالَ شُرَكَاؤُهُمْ مَا كُنْتُمْ إِيَّانَا تَعْبُدُونَ ۝ فَكَفَىٰ بِاللَّهِ شَهِيدًا بَيْنَنَا وَبَيْنَكُمْ إِنْ كُنَّا عَنْ عِبَادَتِكُمْ لَغَافِلِينَ ۝ (يونس-٢٨-٢٩)

మేము వారందరినీ ఒకేసారి (మా న్యాయస్థానంలో) సమావేశ పరిచే రోజున షిర్కు చేసిన వారితో ఇలా అంటాము: "ఆగండి మీరూ, మాకు మీరు భాగస్వాములుగా కల్పించినవారూ!" ఆ తరువాత మేము వారి మధ్య ఉన్నటువంటి అపరిచయపు తెరను తొలగిస్తాము. వారు కల్పించిన భాగస్వాములు ఇలా అంటారు, 'మీరు మమ్మల్ని ఆరాధించలేదు. మీకూ– మాకూ మధ్య అల్లాహ్ సాక్ష్యం చాలు. (ఒకవేళ మీరు మమ్మల్ని ఆరాధించి ఉండినా) మీరు చేసిన ఆ ఆరాధనను గురించి మాకు ఏ మాత్రమూ తెలియదు.' *(దివ్యఖుర్‌ఆన్ - **10: 28, 29**)*

(2) జిన్నుల పూజ

దైవదూతల మాదిరిగానే జిన్నులనే సృష్టిరాశులను కూడా అరబ్బులు తమ ఆరాధ్య దైవాలుగా చేసుకునేవారు. దైవత్వంలో జిన్నులకు కూడా భాగస్వామ్యం కల్పించేవారు. ఎందుకంటే దేవాధిదేవునితో జిన్నులకు దృఢ సంబంధం ఉందని వారు తలపోసేవారు. దివ్యఖుర్ఆన్ వారి ఆలోచనను క్రింది విధంగా ప్రస్తావించింది :

وَجَعَلُوا بَيْنَهُ وَبَيْنَ الْجِنَّةِ نَسَبًا وَلَقَدْ عَلِمَتِ الْجِنَّةُ إِنَّهُمْ لَمُحْضَرُونَ ۝ سُبْحَانَ اللَّهِ عَمَّا يَصِفُونَ ۝ (صافات)

"ఆఖరికి వారు అల్లాహ్‌కు– జిన్నాతులకు మధ్య కూడా బంధుత్వ సంబంధం ఏర్పరచారు. వాస్తవానికి తాము అల్లాహ్ సమక్షంలో నిస్సహాయులుగా హాజరుపరచబడుతామన్న విషయం స్వయంగా జిన్నాతులకు కూడా తెలుసు. (అల్లాహ్ విషయంలో) వారు కల్పించే మాటల నుండి అల్లాహ్ పరమ పవిత్రుడు."

(దివ్యఖుర్ఆన్– 37: 158, 159)

ఈ ఉన్నత సంబంధం కారణంగా దైవత్వంలో జిన్నాతులు కూడా తప్పనిసరి భాగస్వాములుగా నిర్ధారించబడ్డారు:

وَجَعَلُوا لِلَّهِ شُرَكَاءَ الْجِنَّ وَخَلَقَهُمْ ـ (انعام)

"జనులు జిన్నాతులను అల్లాహ్‌కు సహవర్తులుగా చేసుకున్నారు. మరి చూడబోతే వాళ్ళను (జిన్నాతులను) సృష్టించినది కూడా అల్లాహ్‌యే." ***(దివ్యఖుర్ఆన్ – 6: 100)***

అల్లాహ్ మాదిరిగానే లాభనష్టాలు చేకూర్చే శక్తి, అధికారం

జిన్నులనే ప్రాణులకు ఉందని వారు భావించేవారు. అంటే జిన్నులు ఎవరి కయినా హాని కలిగించదలిస్తే, వారిని అడ్డుకునేవారు ఎవరూ లేరని అనుకునేవారు. ఒకవేళ వారు ఎవరికయినా లాభం చేకూర్చదలిస్తే, వారిని నిలువరించేవారు కూడా ఎవరూ లేరని తలపోసేవారు. కాబట్టి వారిని ప్రసన్నుల్ని చేసుకోవటానికి, వారిని శాంతింపజేయడానికి నరబలి ఇవ్వటం అవసరమని తీర్మానించటం జరిగింది. ఇది మొక్కుబడికి, సమర్పణా భావానికి పరాకాష్ఠ అని తలపోయబడింది. వాస్తవానికి అలాంటి బలిదానం అనేది ఉండి ఉంటే దానికి నిజదైవం అయిన అల్లాహ్‌యే హక్కుదారుడయ్యేవాడు. కాని అల్లాహ్ ఇలాంటి కోరిక ఏదీ తన దాసుల నుండి కోరలేదు. కాని ఈ ముష్రికులు మాత్రం తమ భాగ స్వాముల కోసం ప్రాణత్యాగాలు సమర్పించడానికీ సిద్ధపడేవారు. ఈ పూర్వ రంగంలో ఖుర్‌ఆన్ ఇలా అంటోంది :

زَيَّنَ لِكَثِيرٍ مِّنَ الْمُشْرِكِينَ قَتْلَ أَوْلَادِهِمْ شُرَكَاؤُهُمْ ـ

"అనేక మంది బహుదైవారాధకులలకు వారి భాగస్వాములు (జిన్నాతులనే భాగస్వాములు) సంతాన హత్యను అందమైనదిగా చిత్రీకరించారు." ***(దివ్యఖుర్‌ఆన్ - 6 : 137)***

కష్టకాలంలో జిన్నాతులకు మొరపెట్టుకోవటం జరిగేది, వారి శరణు కోరబడేది :

وَأَنَّهُ كَانَ رِجَالٌ مِّنَ الْإِنسِ يَعُوذُونَ بِرِجَالٍ مِّنَ الْجِنِّ ـ

"అసలు విషయం ఏమిటంటే మనుషుల్లోని కొందరు జిన్నాతుల్లోని కొందరి శరణు వేడేవారు. ఈ కారణంగా జిన్నాతుల పొగరు మరింత అధికమైపోయింది." *(దివ్యఖుర్‌ఆన్ - 72 : 6)*

జిన్నాతులు దైవ కుటుంబీకులని భావించటం వల్ల దైవదూతల (మలాయిక) వరకూ వారికి పలుకుబడి ఉంటుందని, అక్కడి నుండి వారు అగోచర సమాచారం తెస్తారని తలపోయటం జరిగింది. ప్రపంచంలోని జ్యోతిష్కులకు రహస్య సమాచారం చేర్చేది కూడా జిన్నాతులేనని నమ్మే వారు. జిన్నుల మూలంగానే లోకంలో జ్యోతిష్కుల దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్థిల్లుతోందని అనుకునేవారు. ఈ మూఢ నమ్మకాన్ని ఖుర్‌ఆన్ ఈ విధంగా ఖండించింది :

إِنَّا زَيَّنَّا السَّمَاءَ الدُّنْيَا بِزِينَةٍ الْكَوَاكِبِ وَحِفْظًا مِّن كُلِّ شَيْطَانٍ
مَّارِدٍ لَّا يَسَّمَّعُونَ إِلَى الْمَلَإِ الْأَعْلَىٰ وَيُقْذَفُونَ مِن كُلِّ جَانِبٍ
دُحُورًا وَلَهُمْ عَذَابٌ وَاصِبٌ إِلَّا مَنْ خَطِفَ الْخَطْفَةَ فَأَتْبَعَهُ
شِهَابٌ ثَاقِبٌ (صافات ٦-١٠)

"మేము సమీప ఆకాశాన్ని నక్షత్రాలతో ముస్తాబు చేశాము. తలబిరుసు అయిన ప్రతి షైతాన్ బారి నుండి దానిని రక్షించాము. ఊర్ధ్వ లోకాలలోని దైవదూతల వైపునకు వారు (వారి మాటలను వినేందుకు) చెవి యొగ్గి కూడా వినలేరు. (ఒకవేళ వారలా చేస్తే) అన్ని వైపుల నుండీ విదిలించబడతారు, తరిమి వేయబడతారు. ఇంకా వారికి శాశ్వతమయిన యాతన తథ్యం. ఒకవేళ వారిలో ఎవడయినా ఒకటీ అరా మాటను ఎగరేసుకుపోయేటట్లయితే తక్షణమే జ్వలించే తార ఒకటి అతనిని వెంబడిస్తుంది.'

(దివ్యఖుర్‌ఆన్ - 37: 6-10)

(ఊర్ధ్వలోకాల) రహస్య సమాచారాన్ని రాబట్టే ప్రయత్నంలో తాంత్రి

కులు, జ్యోతిష్కులు వారితో (జిన్నాతులతో) సంబంధం పెట్టుకున్నారు. ఈ మార్గం ద్వారా వారు లోకంలోని ఓ పెద్ద సమూహాన్ని 'క్షుద్ర విద్య' అనే ఉపద్రవానికి లోను చేశారు. ఆ విధంగా జిన్నాతుల పూజ మొదలయింది. ఆ విషయాన్నే ప్రస్తావిస్తూ ఖుర్‌ఆన్ ఇలా అంది :

يَامَعْشَرَ الْجِنِّ قَدِ اسْتَكْثَرْتُمْ مِّنَ الْإِنْسِ ۝ (انعام-١٢٨)

"జిన్నాతు వర్గీయులారా! మీరు మానవజాతిని పూర్తిగా వాడుకున్నారు (అంటే, వారిలోని చాలా మందిని పెడదారి పట్టించారు.)" *(దివ్యఖుర్‌ఆన్- 6: 128)*

ఈ మాంత్రికులు, జ్యోతిష్కులు జిన్నాతులను ప్రసన్నుల్ని చేయడానికి పడరానిపాట్లన్నీ పడతారు. వారి దాస్యం చేస్తారు. మొక్కుబడులు చెల్లించుకుంటారు. వారి గొంతెమ్మ కోర్కెలు ఇంకా ఏమన్నా ఉంటే అవి కూడా తీర్చి, వారి నుండి రహస్య సమాచారం రాబట్టేందుకు ప్రయత్నిస్తారు. తమ జాతకం తెలుసుకోవటానికి జనులు వారి వద్దకు వచ్చినప్పుడు (ఏదో ఒక క్లూ ఆధారంగా) గాలికబుర్లు చెప్పి వారిని ముగ్గులోకి దించుతారు. వారి ఈ మోసాన్ని గురించి ఖుర్‌ఆన్ ఇలా ప్రస్తావించింది :

يُلْقُوْنَ السَّمْعَ وَاَكْثَرُهُمْ كٰذِبُوْنَ ۝ (شعراء)

"గాలి వార్తలను చెవులలో ఊదుతాయి. వాటిలో అబద్ధాలు చెప్పేవే ఎక్కువ." *(దివ్యఖుర్‌ఆన్- 26: 223)*

దివ్యఖుర్‌ఆన్‌లో అగోచర విషయాల ప్రస్తావన ఉంది. భవిష్యవాణి కూడా ఉంది. జ్యోతిష్యులు చెప్పేదానిలో కూడా భవిష్యవాణి ఉండేది. అందువల్ల ఖుర్‌ఆన్‌లోని విషయాలు దివ్యవాణి కాదని, ఇది కూడా తాంత్రికుల వాక్కు లాంటిదేనని ఆనాటి మక్కా ముష్రిక్కులైన ఖురైషులు

ఎద్దేవా చేశారు. అందుకే వారు అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స)ను మాంత్రికుడన్నారు. జ్యోతిష్కుడన్నారు. ఈ 'వహీ' (దైవవాణి) దైవదూత తెచ్చినది కాదని, ఇది జ్యోతిష్కులకు జిన్నాతులు చేరవేసే సమాచారం వంటిదేనని ఆరోపించారు. అంటే ముహమ్మద్(స)పై అవతరించేది దైవ దూత కాదని, వారు జిన్నాతులు మాత్రమేనని ఎద్దేవా చేసేవారు. దీనిని ఖుర్ఆన్ ఖండిస్తూ ఇలా సెలవిచ్చింది :

وَمَا تَنَزَّلَتْ بِهِ الشَّيٰطِيْنُ وَمَا يَنْبَغِيْ لَهُمْ وَمَا يَسْتَطِيْعُوْنَ ۝
اِنَّهُمْ عَنِ السَّمْعِ لَمَعْزُوْلُوْنَ ۝ (الشعراء- ٢١٠-٢١٢)

"దీనిని (సుబోధకమైన ఖుర్ఆన్ గ్రంథాన్ని) తీసుకుని దిగిన వారు షైతానులు కారు. ఈ పని వాటికి యుక్తమైనదీ కాదు. అవి అలా చేయనూ లేవు. దీనిని వినే విషయంలో కూడా అవి దూరంగా ఉంచబడ్డాయి." *(దివ్యఖుర్ఆన్- 26: 210-212)*

ఖుర్ఆన్ ఇక్కడ ఖురైషులకు ఇచ్చిన సమాధానం లోగడ పెరిసయ్యులకు హ్రజత్ ఈసా (అలైహిస్సలాం) ఇచ్చినటువంటిదే- పెరిసయ్యులు దైవప్రవక్త ఈసా (ఏసుక్రీస్తు- అలైహిస్సలామ్) గారి అద్భుతమయిన వాక్కును విన్నప్పుడు, ఆయన గారు చేసి చూపిన మహిమ లను కళ్ళారా వీక్షించినప్పుడు అసూయాగ్నిలో రగిలిపోయారు. జనులు ఈసా(అ)చే ప్రభావితులవటం గమనించి, ప్రజా బాహుళ్యంలో ఆయన యెడల అనుమానాలను రేకెత్తించేందుకు యత్నించారు.

కొత్త నిబంధన, మత్తయి సువార్త 12వ అధ్యాయంలో ఇలా వుంది:

"పరిసయ్యులు ఆ మాట విని- వీడు దయ్యములకు అధిపతియైన

బయెల్జెబూలు వలననే, దయ్యములను వెళ్ళగొట్టుచున్నాడు గాని మరియొకని వలన కాదనిరి. ఆయన వారి తలంపులనెరిగి వారితో ఇట్లనెను– తనకుతానే విరోధముగా వేరుపడిన యే పట్టణమైననూ, ఏ ఇల్లయిననూ నిలువదు. సాతాను సాతానును వెళ్ళగొట్టిన యెడల తనకు తానే విరోధముగా వేరుపడును."

(మత్తయి– 12వ అధ్యాయం; 24–26)

ఖుర్ఆన్ కూడా **'వమా యన్‌బఖీ లహుమ్'** అనే పదాల ద్వారా ఇదే యదార్థం వైపు సంజ్ఞ చేస్తోంది. దాని ఒక్కొక్క అక్షరం షైతాన్‌కు, పైశాచిక ఉద్దేశ్యాలకు, పైశాచిక ప్రేరణలకు విరుద్ధం. అలాంటప్పుడు అది షైతాన్ తోడ్పాటుతో ఎలా కాగలదు? అయినా షైతాన్ భ్రష్టుపట్టిన తన కార్యకలాపాలను కొల్లగొట్టేందుకు ఇలాంటి శుభప్రదమయిన గ్రంథాన్ని అవతరింపజేస్తాడా? ఒకవేళ వాడు గనక అలా చేశాడంటే, వాడు తాను నిర్మించుకున్న పైశాచిక సామ్రాజ్యాన్ని తన చేజేతులా నాశనం చేసుకున్నాడన్నమాటే! వాడు తన స్వయానికి కీడు తలపెట్టాడన్నమాటే!!

ఆయత్‌లోని రెండవ భాగం **'వమా యస్తతీవూన్, ఇన్నహుమ్ అనిస్సమ్ఇ లమాజూలూన్'** (అది వారి వల్ల అయ్యే పనీ కాదు, దీనిని వినే విషయంలో కూడా అవి దూరంగా ఉంచబడ్డాయి). ఇంతకుముందు సాఫ్ఫాత్ సూరాలోని ఆయత్‌లో చెప్పబడిన విషయం వంటిదే ఇదీను. ఆ విషయాన్ని జిన్నాతులు సయితం స్వయంగా ఒప్పుకున్నారు.

وَاَنَّا كُنَّا نَقْعُدُ مِنْهَا مَقَاعِدَ لِلسَّمْعِ فَمَنْ يَّسْتَمِعِ الْاٰنَ يَجِدْ
لَهٗ شِهَابًا رَّصَدًا ۝ (الجن:۹)

"మొదట్లో మనం దొంగతనంగా వినటానికి పోయినప్పుడు, ఆకాశంలో మనకు కూర్చోవటానికి స్థలం దొరికేది. కాని ఇప్పుడు

ఎవడైనా దొంగతనంగా వినే ప్రయత్నం చేస్తే అతడి కొరకు ఒక అగ్నిజ్వాల మాటు కాసి ఉంటుంది." *(దివ్యఖుర్ఆన్ - 72 : 9)*

ఊర్ధ్వలోకాలలోని దైవదూతలతో జిన్నాతులకు సంబంధాలున్నాయనే విషయాన్ని ఖుర్ఆన్ ఎన్నోచోట్ల ఖండించింది. దివ్యఖుర్ఆన్ పైశాచిక ప్రేరణలకు, ప్రమేయాలకు తావులేని పవిత్ర గ్రంథమన్న విషయం కూడా పదేపదే చెప్పటం జరిగింది. ఇలాంటి సందర్భాలలో సాధారణంగా తారలు ఊడిపడటం, అవి విసరివేయబడటాన్ని సాక్ష్యంగా ఒట్టు వేసుకోవటం జరుగుతుంది. అంటే అది జ్వలించే అగ్నికావచ్చు. లేదా షైతానులు తరిమి వేయబడ్డారన్నదానికి అది తార్కాణమూ కావచ్చు. అల్ వాఖియ సూరా, అల్ హాఖ్ఖా సూరా, తక్వీర్ సూరా, నజ్మ్ సూరాలలో దీనికి సంబం ధించిన దృష్టాంతాలున్నాయి. అష్ షుఅరా సూరాలో మరో కోణం నుండి ఈ విషయం ఖండించబడింది. అంటే- దెయ్యాలు, పిశాచాలు దైవ ప్రవక్తపై అవతరించవు. ఈగలు మాలిన్యంపై, కసువుపై వాలినట్లుగా జిన్నాతులు, షైతానులు కేవలం దురాత్మలపై మాత్రమే అవతరిస్తాయి. అవి దైవ సందేశ హరులను సమీపించే సాహసం చేయలేవు. అవి దైవప్రవక్తల వచనాలను కలుషితం కూడా చేయలేవు. దివ్యఖుర్ఆన్‌లోని ఈ వచనాలను గమనించండి.

هَلْ اُنَبِّئُكُمْ عَلٰى مَنْ تَنَزَّلُ الشَّيٰطِيْنُ۝ تَنَزَّلُ عَلٰى كُلِّ اَفَّاكٍ اَثِيْمٍ۝ يُلْقُوْنَ السَّمْعَ وَ اَكْثَرُهُمْ كٰذِبُوْنَ۝ (الشعراء:٢٢١-٢٢٣)

"(ప్రజలారా!) షైతానులు ఎవరిపై దిగుతాయో నేను మీకు తెలుపనా? అవి వంచకుడైన ప్రతి దుర్మార్గుడిపై దిగుతాయి. గాలి వార్తలను చెవులలో ఊదుతాయి; వాటిలో అబద్ధాలు చెప్పేవే ఎక్కువ". *(దివ్యఖుర్ఆన్ -26: 221-223)*

(3) నక్షత్రాల పూజ

ప్రపంచంలోని విగ్రహారాధకులైన జాతులన్నింటిలోనూ– దాదాపు– సూర్యచంద్రుల ఆరాధన ఉంది. అరబ్బులు కూడా సూర్యచంద్రులను ఆరాధ్య దైవాల కోవలో చేర్చేవారు. వాటిని పూజించేవారు. దివ్యఖుర్ఆన్ ఈ పోకడను ఖండించింది.

وَمِنْ اٰيٰتِهِ الَّيْلُ وَالنَّهَارُ وَالشَّمْسُ وَالْقَمَرُ لَا تَسْجُدُوْا لِلشَّمْسِ
وَلَا لِلْقَمَرِ وَاسْجُدُوْا لِلّٰهِ الَّذِيْ خَلَقَهُنَّ اِنْ كُنْتُمْ اِيَّاهُ
تَعْبُدُوْنَ ۝ (۳۷ - حم السجدہ)

"ఈ రేయింబవళ్ళూ, ఈ సూర్యచంద్రులూ అల్లాహ్ సూచనల లోనివే. సూర్యచంద్రులకు సాష్టాంగపడకండి; వాటిని సృజించిన దేవునికి సాష్టాంగపడండి– నిజంగానే మీరు ఆయనను ఆరాధించే వారైతే." ***(దివ్యఖుర్ఆన్– 41: 37)***

తారలు చూపే ప్రభావంపై కూడా అరబ్బులకు నమ్మకం ఉండేది. భూమండలంలో కలిమి లేముల వెనుక తారాబలానికి గల ప్రమేయం చాలా ఎక్కువని వారు విశ్వసించేవారు. వానలు కురవటం వెనుక కూడా వాటి పాత్ర ఉందని తలపోసేవారు. ఫలానా తార పుష్కలంగా కురిసిందని అనేవారు. ప్రఖ్యాత అగ్ని నక్షత్రం 'షిఅరా' కూడా అరబ్బుల ఆరాధ్య దైవమే. వారి నమ్మకం ప్రకారం అది ఎండాకాలంలో ఉదయించేది.

ఆ కాలంలో అరేబియాలో శీతాకాలం కరువు కాటకాల కాలంగా, దారిద్ర్య సీజన్‌గా పరిగణించబడేది. ఉత్తరాది నుండి వీచే శీతల పవనాలు ఆ రోజుల్లో రాజ్యంలోని వర్తక కార్యకలాపాలన్నింటినీ మందగించేలా చేసేవి. ఈ కారణంగానే అరబ్బులు చలి కాలాన్ని 'అయ్యామిన్ నహిసాత్" అని అనేవారు. వ్యాపార లావాదేవీలు, ప్రయాణాలు, ఎండాకాలంలోనే

చురుకుగా సాగేవి. ఎందుకంటే ఈ వేసవి కాలమే 'షిఅరా' (అగ్ని నక్షత్రం) ప్రస్ఫుటమయ్యే కాలమై ఉండేది. అందువల్లనే తమ కార్యకలాపాలలో కనిపించే శుభ సమృద్ధులన్నీ ఆ నక్షత్రానికే ఆపాదించటం జరిగేది. ఈ మూఢ నమ్మకాన్నే దివ్యఖుర్‌ఆన్ అన్ నజ్మ్ సూరాలో ఇలా ఖండించింది:

وَاَنَّهٗ هُوَاَغْنٰى وَاَقْنٰى وَاَنَّهٗ هُوَرَبُّ الشِّعْرٰى ٥ (النجم- ٤٨، ٤٩)

"సంపన్నునిగా చేసేదీ ఆయనే (అల్లాహ్‌యే), ఆస్తిపాస్తులను ప్రసాదించేదీ ఆయనే. ఆయనే 'సిరియస్' (అగ్ని నక్షత్రము)కు కూడా ప్రభువు" ***(దివ్యఖుర్‌ఆన్ – 53 : 48,49)***

కాని అరబ్బులలోని మత భావన పెడదారి పట్టింది. వారు మతం యొక్క అసలు విషయాలను వదిలిపెట్టి దేవతల కొలువు (Gods-Constellation)ను తీర్చిదిద్దుకున్నారు. అందులో దేవుని స్థాయి సింహాసనా ధీశుని వంటిది లేదా దేవాధిదేవుని వంటిది. వారు దేవతలను దేవాధిదేవుని సన్నిహితులుగా ఖరారు చేశారు. వారిని దేవుని సామ్రాజ్యంలో హోదా కలవారుగా నిర్ధారించారు. మరి ఆ భావనలో 'పోలిక'ను ఆపాదించారు. షిర్క్ ఉన్నచోట ఈ పోలిక అలవోకగా చొరబడుతుందనేది సువిదితమే. ఆ తరువాత ఏర్పరచుకున్న భావన ఏమంటే, భూ ప్రపంచంలో రాజులు, సామ్రాజ్యాధిపతులు సుదూర ప్రదేశాలలో గవర్నర్లను, వైస్రాయ్‌లను నియమించి పరిపాలనా వ్యవహా రాలను నడిపినట్లే ఆకాశాన ఉన్న దేవుడు భూమండలంలోని పరిపాలనా వ్యవహారాలను దేవతలకు అప్పగించాడు. ఆయన ఎక్కడో దూరాన ఉండి ఈ ప్రపంచంతో నామమాత్రపు సంబంధం పెట్టుకున్నాడు. ఊర్ధ్వ లోకాల వ్యవస్థను మాత్రం ఆయన నేరుగా పర్యవేక్షిస్తున్నాడు. ఆ విధంగా ఆకాశం 'రాజధాని నగరం' స్థాయిని సంతరించుకుంది. భూమండలం మాత్రం రాజధాని నగరానికి చాలా దూరాన

ఉన్న మారుమూల ప్రాంతం వంటిది. కాబట్టి ఇక్కడి రాజకీయ వ్యవస్థ ప్రత్యక్షంగా ఆయనతో సంబంధం కలిగిలేదు.

మతం యొక్క ఈ సంకుచిత భావన కొన్ని ముష్రిక్ వర్గాలలో ఉంది. అయితే ఈ భావన ఒకవైపున దేవుని జ్ఞాన విశేషానికి విరుద్ధమైనది. మరో వైపున దీనివల్ల దేవుని దైవత్వాన్ని, ఆయన సార్వభౌమత్వాన్ని అవశ్యంగా విభజించవలసి వస్తుంది. అందుకే దివ్యఖుర్‌ఆన్ ఈ మూఢ భావనను నిర్ద్వంద్వంగా ఖండించింది.

ఈ విభజన (పంపకం) వల్ల దేవుని అధికారాలను, అపరిమిత మయిన ఆయన జ్ఞాన సంపదను నిరాకరించినట్లవుతుంది. ఆ విధంగా ఆయన అశక్తుడు, సర్వజ్ఞాని కాడు అన్న లోపాన్ని అంటగట్టినట్లవుతుంది. ఆ విషయాన్నే ఖుర్‌ఆన్ ఈ విధంగా ఖండించింది:

اَللّٰهُ لَآ اِلٰهَ اِلَّا هُوَ اَلْحَیُّ الْقَیُّوْمُ لَا تَاْخُذُهٗ سِنَةٌ وَّلَا نَوْمٌ
لَهٗ مَا فِی السَّمٰوٰتِ وَمَا فِی الْاَرْضِ

'అల్లాహ్ – ఆయన తప్ప ఆరాధ్య దైవం ఎవ్వడూ లేడు. సకల చరాచర సృష్టికి మూలాధారం అయిన ఆయన సజీవుడు, నిత్యుడు, అనంతుడు. ఆయన నిదురపోడు, ఆయనకు కునుకూ రాదు. భూమ్యాకాశాలలో ఉన్న సమస్తమూ ఆయనదే...

وَسِعَ كُرْسِیُّهُ السَّمٰوٰتِ وَالْاَرْضَ وَلَا یَئُوْدُهٗ حِفْظُهُمَا (بقرہ)

ఆయన రాజ్యాధికారం ఆకాశాలనూ భూమినీ పరివేష్టించి ఉంది. వాటి సంరక్షణ ఆయనకు ఎంతమాత్రం అలసట కలిగించదు.'

(దివ్యఖుర్‌ఆన్ – 2: 255)

إِنَّ رَبَّكُمُ اللّٰهُ الَّذِي خَلَقَ السَّمٰوَاتِ وَالْأَرْضَ فِي سِتَّةِ أَيَّامٍ
ثُمَّ اسْتَوٰى عَلَى الْعَرْشِ يُدَبِّرُ الْأَمْرَ ط (يونس)

"యదార్థం ఏమిటంటే ఆకాశాలనూ, భూమినీ ఆరు రోజులలో సృష్టించి, తరువాత రాజ్యపీఠాన్ని అలంకరించి సృష్టి వ్యవహారాలను నడుపుతూ ఉన్న దేవుడే మీ ప్రభువు." *(దివ్యఖుర్‌ఆన్ **-10: 3**)*

ఈ పంపకం వల్ల దేవుని సామ్రాజ్యంలో ఏర్పడే విభజన స్వరూపాన్ని ఖండిస్తూ ఖుర్‌ఆన్ ఇలా అంటోంది :

وَقَالَ اللّٰهُ لَا تَتَّخِذُوْٓا اِلٰهَيْنِ اثْنَيْنِ اِنَّمَا هُوَ اِلٰهٌ وَّاحِدٌ.
فَاِيَّايَ فَارْهَبُوْنَ (نحل)

"అల్లాహ్ ఇలా ఆజ్ఞాపించాడు : ఇద్దరిని దేవుళ్ళుగా చేసుకోకండి. దేవుడు మటుకు ఒక్కడే. కనుక మీరు నాకే భయపడండి.'
*(దివ్యఖుర్‌ఆన్ **- 16: 51**)*

وَهُوَ الَّذِي فِي السَّمَآءِ اِلٰهٌ وَّفِي الْاَرْضِ اِلٰهٌ وَهُوَ الْحَكِيْمُ
الْعَلِيْمُ۔ (زخرف)

"ఆకాశాలలోనూ, భూమిలోనూ దేవుడు ఆయన ఒక్కడే. ఆయనే వివేకవంతుడు, జ్ఞాన సంపన్నుడు." *(దివ్యఖుర్‌ఆన్**- 43: 84**)*

قُلْ لَّوْ كَانَ مَعَهٗٓ اٰلِهَةٌ كَمَا يَقُوْلُوْنَ اِذًا لَّابْتَغَوْا اِلٰى ذِي الْعَرْشِ
سَبِيْلًا (بنی اسرائیل)

వారితో ఇలా అను : "ఒకవేళ అల్లాహ్‌తోపాటు వారు అనేవిధంగా

ఇతర దేవుళ్ళు కూడా ఉండి ఉంటే, వారు సింహాసనాధీశుని స్థానానికి చేరే మార్గాన్ని కూడా తప్పకుండా అన్వేషిస్తారు.'

(దివ్యఖుర్ఆన్- 17: 42)

لَوْ كَانَ فِيهِمَآ اٰلِهَةٌ اِلَّا اللّٰهُ لَفَسَدَتَا۔ (الانبیاء)

"ఒకవేళ ఆకాశంలో, భూమిలో ఒక్క అల్లాహ్ తప్ప ఇతర దేవుళ్ళు కూడా ఉండి ఉంటే, అప్పుడు (భూమ్యాకాశాల) రెండింటి వ్యవస్థ ఛిన్నాభిన్నమై ఉండేది." ***(దివ్యఖుర్ఆన్ -21: 22)***

భూమండలంలోని సమస్త వ్యవహారాలను ప్రత్యక్షంగా నడిపేవారు ఈ దేవీ దేవతలేనని అరబ్బులు నమ్మటం వల్ల వారిని ఆరాధనలకు అర్హులుగా ఖరారు చేయటం అనివార్యమైంది. వాస్తవానికి ఆరాధనలకు, ఉపాసనలకు అర్హుడు అల్లాహ్‌యే. అల్లాహ్ కొరకు కాబా గృహం ఉండేది. అందువల్ల దేవీదేవతల కొరకు ఆస్థానాలు, పీఠాలు నిర్మించబడ్డాయి. అల్లాహ్ కొరకు హజ్, ఖుర్బానీ వంటి పద్ధతులు ఉండేవి. అయితే చిల్లరదేవుళ్ళ కోసం కూడా హజ్, ఖుర్బానీ క్రియలు అవలంబించబడ్డాయి. అల్లాహ్ కోసం కొన్ని ప్రత్యేక 'చిహ్నాలు', ఖుర్బానీ పశువుల ఆనవాళ్ళు నిర్ధారించబడి ఉండేవి. కాబట్టి ముష్రిక్కులు 'తమ దేవుళ్ళ' కోసం కూడా బహీరా, సాయిబా, వసీలా, హామ్ (అనే జంతువు)లను ప్రత్యేకించారు.[1] నిజదైవం కోసం వ్యవసాయోత్పత్తుల్లోని ఒక భాగం నిర్ణీతమై ఉండేది. అలాగే చతుష్పాద పశువుల్లోని ఒక వాటా నిర్ధారితమై ఉండేది. అందువల్ల వారి దేవతలు కూడా ఆ వాటాకు హక్కుదారులుగా ఖరారు చేయబడ్డారు.

---

1. బహీరా, సాయిబా, వసీలా, హామ్ అనేవి వివిధ రకాల పశువులకు పెట్టిన పేర్లు : అరబ్బులు ఈ పశువులను తమ దేవతల పేర (అచ్చువేసి) వదలిపెట్టేవారు. వాటిని హదీ (ఖుర్బానీ) పశువుల మాదిరిగానే పవిత్రంగా తలపోసేవారు.

వారి దృష్టిలో భూమండలంలో ఆలనాపాలనకు అసలు బాధ్యతాయుతులు దేవతలే అయినందున, ఆకాశాన ఉన్న దేవాధిదేవుని కన్నా ఈ దేవతలే ఈ 'వాటా'కు ప్రథమ హక్కుదారులయ్యారు. ఆ విషయాన్నే ఖుర్ఆన్ ఇలా ప్రస్తావించింది :

وَجَعَلُوا لِلّٰهِ مِمَّا ذَرَأَ مِنَ الْحَرْثِ وَالْأَنْعَامِ
نَصِيبًا فَقَالُوا هٰذَا لِلّٰهِ بِزَعْمِهِمْ وَهٰذَا لِشُرَكَائِنَا فَمَا كَانَ لِشُرَكَائِهِمْ فَلَا
يَصِلُ إِلَى اللّٰهِ وَمَا كَانَ لِلّٰهِ فَهُوَ يَصِلُ إِلٰى شُرَكَائِهِمْ سَاءَ مَا يَحْكُمُونَ

"అల్లాహ్ కొరకు ఈ ప్రజలు స్వయంగా ఆయనే సృష్టించిన పొలాల నుండి, పశువుల నుండీ ఒక భాగాన్ని కేటాయించారు. 'ఇది అల్లాహ్ కొరకు, ఇదేమో మేము నిలబెట్టిన భాగస్వాముల కొరకు' అని స్వయంగా తామే తీర్మానించుకుని ఉంటారు. వారు నిలబెట్టిన భాగస్వాములకు చెందే భాగం అల్లాహ్‌కు ఎలాగూ చేరదు. కాని అల్లాహ్‌కు చెందవలసినది మాత్రం వారు నిలబెట్టిన భాగస్వాములకు చేరిపోతుంది. ఎలాంటి తప్పుడు నిర్ణయాలు చేస్తారు ఈ ప్రజలు?" *(దివ్యఖుర్ఆన్- **6: 136**)*

దేవుని కోసం కేవలం జంతు బలి మాత్రమే ఉండేది. కాని వారు నిలబెట్టుకున్న భాగస్వాముల కోసం- కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో-తమ సంతానాన్ని సయితం అర్పించేవారు. దేవుడు కొన్ని వస్తువులను మాత్రమే నిషిద్ధం (హరామ్) గావించాడు. కాని వీళ్ళు తమ దేవతల కొరకు ఎన్నో వస్తువులను నిషిద్ధంగా ఖరారు చేసుకున్నారు. దేవుడు 'వహీ'ని అవతరింప జేస్తాడు. అయితే వీళ్ళ దేవతలు 'అదృష్ట బాణాల' భాషలో తమ అగోచర తీర్పులు వెలువరించసాగారు!

ఈ రకమయిన మొక్కుబడులు దైవదూతలు, జిన్నాతులు, నక్షత్రాల కోసం ప్రముఖుల చేత చెల్లించబడేవి. కాని సామాన్య జనులకు ఇంతటి అదృష్టం ఎక్కడ?! వారు మట్టితో, రాళ్ళతో, కొయ్యలతో చేయబడిన విగ్రహా లతోనే సరిపెట్టుకునేవారు. అందుకే ఖుర్ఆన్ విగ్రహారాధనను ఖండిస్తూ ప్రముఖులతోపాటు సామాన్యుల మనస్తత్వాన్ని కూడా మన ముందుం చింది. ఉదాహరణకు– అల్ ఆరాఫ్ సూరాలోని ఈ ఆయత్‌ను గమనిం చండి–

إِنَّ الَّذِينَ تَدْعُونَ مِنْ دُونِ اللَّهِ عِبَادٌ أَمْثَالُكُمْ فَادْعُوهُمْ
فَلْيَسْتَجِيبُوا لَكُمْ إِنْ كُنْتُمْ صَادِقِينَ۔

"అల్లాహ్‌ను త్రోసిరాజని మీరు వేడుకుంటున్నవారు మీ మాదిరి గానే కేవలం దాసులు. మీరు వారిని ప్రార్థించి చూడండి. మీకు వారి పట్ల ఉన్న భావాలు నిజమే అయితే మీ ప్రార్థనలకు వారు సమాధానం ఇవ్వాలి." ***(దివ్యఖుర్ఆన్ – 7: 194)***

ఆ తరువాత ఇలా అనబడింది –

أَلَهُمْ أَرْجُلٌ يَمْشُونَ بِهَا أَمْ لَهُمْ أَيْدٍ يَبْطِشُونَ بِهَا أَمْ لَهُمْ
أَعْيُنٌ يُبْصِرُونَ بِهَا أَمْ لَهُمْ آذَانٌ يَسْمَعُونَ بِهَا۔

"వారికి కాళ్ళు ఉన్నాయా వాటితో నడవటానికి? వారికి చేతులు ఉన్నాయా వాటితో పట్టుకోవటానికి? వారికి కళ్ళు ఉన్నాయా వాటితో చూడటానికి? వారికి చెవులు ఉన్నాయా వాటితో వినటా నికి?" *(దివ్యఖుర్ఆన్– 7: 195)*

(4) పెద్దల పూజ

తమ దేవతల కొలువులో వీరు క్రమక్రమంగా చనిపోయిన తమ పూర్వీకులకు కూడా చోటు కల్పించారు. ముఖ్యంగా తమ పూర్వీకుల్లో పుణ్య పురుషులుగా, ధార్మిక ప్రముఖులుగా పేరొందిన వారిని ఈ జాబితాలో చేర్చారు. వారి సమాధులను అవశేషాలను ఆశ్రయించి మొదట్లో శుభం కోసం వేడుకునేవారు. ఆ సమాధులే కడకు దేవాలయాలుగా మారాయి. క్రమేణా వారు దైవదూతల పట్ల, జిన్నాతుల పట్ల ఏర్పరచుకున్న భావాలనే ఈ 'పెద్దల' పట్ల కూడా ఏర్పరచుకున్నారు. దివ్యఖుర్ఆన్ దీనిని ఈ విధంగా ఖండించింది :

وَالَّذِيْنَ يَدْعُوْنَ مِنْ دُوْنِ اللّٰهِ لَا يَخْلُقُوْنَ شَيْـًٔا وَّهُمْ يُخْلَقُوْنَ ۝ اَمْوَاتٌ غَيْرُ اَحْيَاۗءٍ ۚ وَمَا يَشْعُرُوْنَ ۙ اَيَّانَ يُبْعَثُوْنَ ۝
(نحل)

"అల్లాహ్‌ను వదలి, ప్రజలు వేడుకుంటున్న ఇతర శక్తులు ఏ వస్తువుకూ సృష్టికర్తలు కారు. వారు స్వయంగా సృష్టింపబడినవారు, నిర్జీవులే కాని సజీవులు కారు. వారు ఎప్పుడు (మళ్ళీ బ్రతికించ బడి) లేపబడుతున్నారో వారికెంత మాత్రం తెలియదు."

(దివ్య ఖుర్ఆన్ - 16: 20, 21)

ఈ 'పెద్దల పూజ'కు సంబంధించిన అత్యంత దరిద్రమయిన రూపం ఏదంటే, వారు తమ పూర్వీకుల ఆచార సంప్రదాయాలకు, వారి స్వయం పోకడలకు దీన్ (ధర్మం) మరియు షరీఅత్ (శాసనాంగం) స్థాయిని కల్పించారు. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స) సందేశాన్ని అరబ్బులు వ్యతిరేకించటంలో కీలకపాత్ర వహించింది కూడా ఈ 'పెద్దల పూజే'. వారిని అల్లాహ్ మార్గం వైపునకు పిలుపు ఇచ్చినప్పుడు, అల్లాహ్ ఆదేశా

లను, శాసనాలను వారికి విడమరిచి చెప్పినప్పుడు వారు చెప్పేదొక్కటే- ఏమిటి, మేము పిచ్చివాడైన ఒక కవిపుంగవుడు చెప్పినంత మాత్రాన మా పూర్వీకుల (తాత ముత్తాతల) పద్ధతిని విడిచిపెట్టేయాలా? ఇది జరగని పని. ఉదాహరణకు ఈ ఆయత్‌ను చూడండి-

وَإِذَا قِيلَ لَهُمْ تَعَالَوْا إِلَىٰ مَا أَنزَلَ اللَّهُ وَإِلَى الرَّسُولِ قَالُوا
حَسْبُنَا مَا وَجَدْنَا عَلَيْهِ آبَاءَنَا أَوَلَوْ كَانَ آبَاؤُهُمْ لَا يَعْلَمُونَ
شَيْئًا وَلَا يَهْتَدُونَ ○ (مائدہ -)

"అల్లాహ్ అవతరింపజేసిన శాసనం వైపునకు రండి, ప్రవక్త వైపునకు రండి" అని వారితో చెప్పినప్పుడు, వారు "మా కొరకు మా తాత ముత్తాతలు అవలంబిస్తూ ఉండగా మేము చూసిన విధానమే చాలు" అని జవాబు చెబుతారు. ఏమిటి, వారు తమ తాత ముత్తాతలనే అనుసరిస్తూ పోతారా, వారికి ఏమీ తెలియనప్పటికీ, రుజుమార్గ జ్ఞానమే వారికి లేకపోయినప్పటికీ?

(దివ్యఖుర్ఆన్- 5: 104)

పై ఆయత్‌లోని చివరి వాక్యం ద్వారా తెలిసేదేమిటంటే, తాత ముత్తాతల జీవన సరళిని మనిషి సాధారణంగా ఇష్టపడతాడు. వారి అడుగుజాడలలో నడవాలని అభిలషిస్తాడు. అయితే మనిషి నడవడికి కేవలం ఇదొక్కటే ప్రాతిపదిక కాదు. తాతముత్తాతల సంప్రదాయాన్ని అనుసరించేటప్పుడు అసలది సహేతుకమైనదా? కాదా? మానవ నైజంతో అది పొసగుతుందా? లేదా? నీతి నడవడికలకు అది అనుగుణంగా ఉందా? లేదా? ముఖ్యంగా అది దేవుడు సమ్మతించిన జీవన సంవిధానంతో సమన్వయం చెందుతున్నదా? లేదా? అనేది పరికించాలి. ఈ

గీటురాయిపై గనక అది మేలైనదని తేలితే ఖచ్చితంగా అది సరైనదే. అట్టి పరిస్థితిలో తాతముత్తాతల ఈ సంప్రదాయాన్ని సంతోషంగా, సగర్వంగా అనుసరించవచ్చు. దానిని వ్యాపింపజేయవచ్చు. కాని ఒకవేళ అది ఈ ప్రమాణ నికషంపై 'కల్తీ' అని తేలితే మాత్రం కచ్చితంగా అది అసత్యమే, అధర్మమే. అట్టి పరిస్థితిలో పూర్వీకుల ఈ సంప్రదాయాన్ని పుణికిపుచ్చుకో వలసిన పనిలేదు. పైగా దానిని పరిత్యజించాలి.

కాని ఈ విషయంలో ప్రపంచం సదా అతివాదానికే పోయింది. అజ్ఞాన కాలం నాటి తాతముత్తాతల సిద్ధాంతం ఎట్టి పరిస్థితిలోనూ సత్యమే, సరైనదే అనే మొండి వాదం ఒకటి ఉంది. పై పంక్తుల్లో చెప్పబడింది కూడా ఇదే. 'అదెలాగండి?' అని అడిగితే, 'ఎలాగంటే అది అనాదిగా మా పూర్వీకుల నుండి నడుస్తూ వస్తున్న విధానం కాబట్టి' అనే జవాబు వస్తుంది. నేటి ఆధునిక యుగపు అజ్ఞానులిచ్చే ఈ సమాధానాన్ని వింటుంటే సుప్రసిద్ధ కవి టెన్నిసన్ మాటలు జ్ఞప్తికి వస్తాయి. అతనిలా అంటాడు: 'అత్యుత్తమ నడవడి కూడా ఎల్లకాలం మిగిలివుండే మాటైతే అది ప్రపంచాన్ని చెడగొట్టేస్తుంది.'

ఇవి రెండూ రెండు అతివాదాలే. ఒకటి, పూర్వీకుల అంధానుసరణపై ఆధారపడినది. దేవుడిచ్చిన బుద్ధీ వివేకాలను ఉపయోగించక పోవటం వల్ల జనించిన పోకడ యిది. రెండవది : బుద్ధి పెడదారి పట్టడం వల్లనూ, దానిని కళ్ళెం లేని గుర్రంలా వదలి వేయటం వల్లనూ కలిగిన పర్యవసానం. వీటిలో ఒక షిర్క్ విగ్రహారాధనకు సంబంధించిన ఒక ప్రత్యేక తరహా వైపునకు మార్గం చూపుతుంది. అంటే పెద్దల పూజ (Ancestor Worship) వైపు దారి చూపుతుంది. రెండవది : నాస్తికత్వం వైపునకు గొనిపోతుంది. ఇది ఒక విధంగా 'స్వయం పూజ'కు ద్వారం

వంటిది. ఈ రెండు (అతివాద) మార్గాలలోనూ మనిషి దైవదాస్యపు వాస్తవికతకు దూరమైపోతాడు. పరలోక చింతన పట్ల బొత్తిగా శ్రద్ధ వహించడు. మనిషి తన బుద్ధీ వివేకాలకు, విచక్షణా జ్ఞానానికి స్వస్తి చెప్పి చదుష్పాద జంతువుల కోవలో చేరడం ఏ విధంగా ధర్మసమ్మతం కాదో అదేవిధంగా ఒక మార్గంలోని తప్పును, మరొక మార్గంలోని ఒప్పును నిర్ణయించకుండానే ఒక దారిని వదిలి రెండవ దారిన పోవటం కూడా ధర్మసమ్మతం కాదు.

ఈ రెండు దారులలో కూడా మనిషి షైతాన్ అడుగులకు మడుగు లొత్తిన అపరాధియే. గతకాలంలో లోకంలోని మహనీయులు, సజ్జనులు, దైవప్రవక్తల (అలైహిముస్సలామ్) విధానం ద్వారా సన్మార్గమని రుజు వయిన విధానమే బుద్ధికి అనుగుణమైన విధానం! మానవ నైజంతో సమరసం చెందే మార్గం!! మార్గదర్శకత్వపు కిరణాలు ఆ మహనీయులపై ఎప్పుడు ప్రసరించినా వారు అన్నిటికన్నా ముందు తమ పూర్వీకుల నుండి వారసత్వంగా తమకు సంక్రమించిన ఆచార సంప్రదాయాలపై యోచన చేశారు. ఆ పెద్దల విధానం మానవ నైజం వాంఛించేదిగా ఉంటేనే దానిని అవలంబించారు. ఒకవేళ అది ప్రకృతితో, బుద్ధీ వివేకాలతో వ్యాఘాతం చెందేదిగా ఉంటే దానిని పరిత్యజించారు. ఈ మార్గంలో వారు మనుషుల చేత ఎన్నో కష్టాలకు గురిచేయబడ్డారు. బాధలు భరించారు. అయినా తమ కర్తవ్యాన్ని విస్మరించలేదు. వీరు మానవ జాతిలో నవనీతం వంటివారు. వీరి మూలంగా మనమంతా సత్యాన్ని ఆస్వాదించటంలో ముందంజ వేశాము. సూర్యుడు ఉదయించినప్పుడు దాని లేత కిరణాలు అన్నిటికన్నా ముందు ఎత్తయిన గుట్టలపై ప్రసరించి మెరిసినట్లే ఈ ప్రపంచంలో సత్యోదయం అయినప్పుడల్లా వీరి అంతర్యాలే అందరికన్నా ముందు ప్రకాశమానమైనాయి.

దీనికి అత్యుత్తమ ఉపమానం దైవప్రవక్త మహనీయ యూసుఫ్ (అలైహిస్సలామ్) జీవితం. ఆయన ఇలా చెప్పారు

اِنِّیۡ تَرَکۡتُ مِلَّۃَ قَوۡمٍ لَّا یُؤۡمِنُوۡنَ بِاللّٰہِ وَ ہُمۡ بِالۡاٰخِرَۃِ ہُمۡ کٰفِرُوۡنَ ۝ وَ اتَّبَعۡتُ مِلَّۃَ اٰبَآءِیۡۤ اِبۡرٰہِیۡمَ وَ اِسۡحٰقَ وَ یَعۡقُوۡبَ

"(నా చెరసాల సహచరులారా!) అసలు విషయం ఏమిటంటే, నేను అల్లాహ్‌ను విశ్వసించని వారి, పరలోకాన్ని తిరస్కరించే వారి విధానాన్ని వదిలిపెట్టి నా పెద్దలైన ఇబ్రాహీమ్, ఇస్‌హాక్ యాఖూబ్‌ల విధానాన్ని అవలంబించాను." (దివ్యఖుర్ఆన్- *12: 37, 38*)

దైవప్రవక్త హజ్రత్ యూసుఫ్ (అ) గారి బాహ్య జీవితాన్ని మనం చూసినట్లయితే ఆయన ఏ ఒక్కరి మత ధర్మాన్ని అవలంబించిన వారూ కారు, ఏదేని ఒక మతధర్మాన్ని పరిత్యజించినవారూ కారు. ఆయన ఏ మతధర్మంపై పుట్టారో జీవితాంతం ఆ మతధర్మంపైనే స్థిరంగా ఉన్నారు. ఆయన దైవప్రవక్తగా నియుక్తులైన తరువాత కూడా ఆయన పుట్టిన మత ధర్మానికి సంబంధించిన దైవదౌత్యమే అందింది. ఈజిప్టులో ఆయన 'ఖిబ్తీల' మధ్యన ఉన్నారు. ఖిబ్తీల జీవన విధానాన్ని కళ్ళారా చూశారు. కాని పవిత్రమయిన ఆయన శుభాత్మ ఒక్క క్షణం కూడా దాని కాలుష్యంతో కలుషితం కాలేదు. అయితే ఆయన ఏమన్నారంటే, 'నేను అల్లాహ్‌ను, పరలోకాన్ని నమ్మని జాతి జనుల జీవన విధానాన్ని విడనాడి, నా పెద్దలైన ఇబ్రాహీమ్, ఇస్‌హాఖ్, యాఖూబ్‌ల జీవన విధానాన్ని అవలంబించాను'. ఆయన ఒకరి మతాన్ని పరిత్యజించటమయినా, ఇంకొకరి మతాన్ని అవలంబించటమయినా బౌద్ధికమయిన విషయం! మనోమయ వ్యవహారం!! ఆయన తన పూర్వీకుల మతాన్ని వారసత్వ ఆస్తిగా భావించి

స్వీకరించలేరు. పైగా ఆయనలోని సురక్షిత హృదయం (ఖల్బె సలీమ్) పూర్వీకుల జీవన విధానంలోని ఉచితానుచితాలను బాగా పరికించింది. అందులో ఉన్న సత్యాన్ని స్వాగతించింది. ఒకవిధంగా చెప్పాలంటే అది స్వయంగా ఆయన పరిశోధన! ఆయన తరఫున జరిగిన ధ్రువీకరణ. అందుకే అది ఆయన స్వంతమయింది. అది ఆయన ఆంతర్యంలోని అణు వణువునూ పెనవేసుకుని ఉంది. దాని ప్రామాణికతపై, ఔచితిపై ఆయన బుద్ధి స్వయంగా సత్యమని సాక్ష్యమిచ్చింది. ఆ జీవన విధానం దైవికమని ఆయన అంతరాత్మ ప్రబోధించింది. ఆయన మనసు దాని పట్ల కుదుట పడింది. తన తండ్రీ తాతలపై గల అభిమానంతో ఆయన దానిని అవలం బించలేదు. కేవలం సత్యత ఆధారంగానే స్వీకరించారు. ఒకవేళ ఆ కాలంలో ఏ ఒక్క జీవీ ఆ మార్గాన్ని అవలంబించక పోయినాసరే ఆయన ఒక్కరే ఆ జీవన విధానంపై స్థిరంగా ఉండేవారు. అయితే ఆయన తాత ముత్తాతల జీవన విధానం కూడా అదే అయి ఉండటం ముమ్మాటికీ దైవానుగ్రహమే అనాలి.

యుక్త వయసులో ఉండగా ఈజిప్టులో ఆయన గడిపిన జీవితమే దీనికి ప్రబల సాక్ష్యం. ఎలాంటి పరీక్షలు ఎదుర్కొన్నారాయన!? కాని ఎక్కడా ఆయన అడుగులు తడబడలేదు. జారిపడలేదు. ఆయనపై చీకట్లు ఆవరించిన కొలదీ ఆయనలోని ఈమాన్ (విశ్వాసం) దృఢతరం కాసాగింది. ఆయన్ని కదిలించడానికి, దిగజార్చటానికి ప్రయత్నించిన కొలదీ సత్యపథాన ఆయన పాదాలు మరింత గట్టిగా నిలదొక్కుకున్నాయి. ప్రపంచంలో ఎవరు ఈ మార్గాన్ని అంత:చక్షువులతో అవలంబించినా వారు నిజభావంలో ఆ మార్గాన్ని అవలంబించారనవచ్చు. ఆ మార్గం తమ తాతముత్తాతలదై ఉన్నంత మాత్రాన వారు దానిని గుడ్డిగానో లేక

దురభిమానంతోనో అవలంబించరు. ఇలాంటి వారు సత్యం కోసం ఇతరత్రా మార్గాలను వదలిపెట్టారంటే వాస్తవంగానే 'వదిలిపెట్టారు'. ఇదే ధర్మం యొక్క దూరాలోచన! ఇదే పర్యాలోచన!! ఇదే మనోనేత్రం విశిష్టత!!! ఇదే గనక లేకపోతే మత ధర్మాలన్నీ నిర్జీవంగా మిగిలిపోతాయి. ఎవరయినా ఒక వ్యక్తి ఏదైనా ఒక విధానాన్ని సత్యప్రాతిపదికపై గాకుండా కేవలం తన తాతముత్తాతల విధానమన్న అభిమానంతో అవలంబించినట్లయితే ఇది కూడా అజ్ఞాన కాలపు అరబ్బుల మాదిరిగా పెద్దల పూజగానే పరిగణించబడుతుంది. ఇది కూడా షిర్కే.

(5) స్వయంపూజ (స్వీయ దాస్యం)

దేవతల ఈ కొలువులో అరబ్బు ముష్రికులు కూడా తాము స్వయంగా భాగస్వాములుగా ఉండేవారు. కాని దైవవాణి ద్వారా హెచ్చరిక రాకమునుపు వారికి దీని స్పృహ ఉండేది కాదు. వారు తమను తాము దేవుని దాసులుగానైతే చెప్పుకునేవారు గాని దాస్యం వారి నుండి కోరేదేమిటో వారికి తెలీదు. అందువల్ల దైవదాస్యపు హద్దు మీరిపోయి దైవత్వపు పరిధిలో చేరిపోయారు. వారు ఎప్పుడు, ఎక్కడ, ఎలా హద్దుమీరి పోయేవారో ఖుర్ఆన్ విశదీకరించింది. సంక్షిప్తంగానయినాసరే మేము దీనిని ప్రస్తావించదలిచాము. పాఠకులు దీనిని చాలా శ్రద్ధగా గమనించ గలరని ఆశిస్తాము.

(అ) అరబ్బులు తమను తాము దైవదాసులుగా అంగీకరించేవారు. దేవుడు సృష్టికర్త, పాలకుడు, పోషకుడు అన్న విషయాన్ని కూడా వారు నిరాకరించేవారు కారు. కాని దైవదాస్యం వారి నుండి వాంఛించే వాటిని మాత్రమే వారు నిరాకరించేవారు. అంటే ఒక్కడైన అల్లాహ్‌కు విధేయత కనబరచటంపై వారు విముఖతను ప్రదర్శించేవారు. 'విధేయత'లో

ఇతరులను సహవర్తులుగా ఎంచేవారు. ఆరాధన, దాస్యం అంటే వారి దృష్టిలో 'పూజా పురస్కారాలు' మాత్రమే. అంతకుమించి మరేమీ కాదు. 'దాస్యం' దైవానికి చేసి, 'విధేయత' విషయంలో వేరొకరిని అనుసరించ టంలో ఎలాంటి తప్పులేదని అనుకునేవారు. వారు అల్లాహ్ ఆదేశాలు ఉపదేశాలను అనుసరించవలసిన చోట తమ మనోరథాన్ని అనుసరించే వారు. తమ పెద్దలు, పూర్వీకులు, నాయకులు చెప్పినట్లుగా నడుచుకునే వారు. ఇలా నడుచుకోవటం దైవాదేశాలకు విరుద్ధంగా ఉన్నా లక్ష్యపెట్టే వారు కారు. అయితే దైవానికి విధేయత చూపకుండా చేసే దైవారాధన అర్థం లేనిదని ఖుర్ఆన్ హెచ్చరించింది. దైవారాధన చేసేవారు, దైవానికి విధేయత కనబరచటం అనివార్యమని చెప్పింది ఖుర్ఆన్.

إِنَّآ أَنزَلْنَآ إِلَيْكَ ٱلْكِتَٰبَ بِٱلْحَقِّ فَٱعْبُدِ ٱللَّهَ مُخْلِصًا لَّهُ ٱلدِّينَ
أَلَا لِلَّهِ ٱلدِّينُ ٱلْخَالِصُ (۲-۳-زمر)

"(ఓ ప్రవక్తా!) మేము ఈ గ్రంథాన్ని సత్యంతో నీపై అవతరింప జేశాము. కనుక నీవు ధర్మాన్ని (విధేయతను) అల్లాహ్‌కే ప్రత్యేకిస్తూ అల్లాహ్‌కు మాత్రమే దాస్యం చెయ్యి. జాగ్రత్త! ధర్మం (విధేయత) ప్రత్యేకంగా అల్లాహ్‌కు చెందిన హక్కు మాత్రమే."

(దివ్యఖుర్ఆన్ – 39 : 2,3)

పై ఆయత్‌లో 'దీన్' అంటే అసలు 'విధేయత' అని అర్థం. ఈ విషయానికి సంబంధించిన ఆయత్‌లు ఖుర్ఆన్‌లో అనేక చోట్ల వస్తాయి. వాటన్నింటినీ ఇక్కడ పొందుపరచలేము. అయితే వాటన్నింటి భావం ఒక్కటే – అల్లాహ్ తన ధర్మాన్ని అవతరింపజేశాడు. అందులో ప్రక్షిప్తాలకు పాల్పడి మార్పులు చేర్పులు చేయటం వల్ల ఎన్నో విభేదాలకు ఆస్కారం

కలిగింది. ధర్మంలో అసంఖ్యాకమయిన కొత్త పోకడలు (బిద్అత్) చొర బడ్డాయి. ఈ కారణంగా దేవుని స్వచ్ఛమయిన దాస్యానికి అవకాశం లేకుండా పోయింది. ధర్మంలో కొత్త పుంతలు తొక్కిన కారణంగా దైవా రాధన చేసేవారు ఏకేశ్వరోపాసనకు నోచుకోకుండా పోయారు. వారు అల్లాహ్ పేరునయితే ఉచ్చరించేవారు. కాని అడుగడుగునా దైవేతరుల విధేయతకు తలొగ్గేవారు. కాగా, ఈ గ్రంథం ఈ విభేదాలను రూపుమాపి షరీఅత్‌ను దైవేతర శక్తుల నుండి పవిత్ర పరచింది. ఇది సత్యాసత్యాల మధ్య ఒక నిర్ణయాత్మకమయిన వాక్కుగా ప్రస్ఫుటమయింది. ఇప్పుడు దైవ విధేయత, దైవదాస్యానికి సంబంధించిన మార్గం సుస్పష్టం. కాబట్టి ఇప్పుడు విధేయతా భావాన్ని ఒక్కడైన అల్లాహ్‌కే ప్రత్యేకిస్తూ ఆయన్ని ఆరాధించండి. అంటే- దైవ విధేయతకు కట్టుబడి చేసే దైవారాధనే సరైనది, స్వీకార యోగ్యమైనది. అలాకాకుండా కేవలం కొన్ని నిర్ణీత వేళల్లో దైవనామాన్ని జపించి, విధేయతేమో ఇతరులకు కనబరిస్తే- ఆఖరికి మనిషి తన ఆత్మకు విధేయత చూపినాసరే- అది దైవారాధన అనిపించుకోదు. పైగా అది 'నమ్రూద్ దైవత్వం' అవుతుంది. దానివల్ల ఎన్నటికీ ఎలాంటి మేలు జరుగు తుందని ఆశించలేము.

اَرَاَیۡتَ مَنِ اتَّخَذَ اِلٰـهَهٗ هَوَاهُ اَفَاَنۡتَ تَكُوۡنُ عَلَيۡهِ وَكِيۡلًا (فرقان-۴۳)

"తన మనోవాంఛను తన దేవుడుగా చేసుకున్న వ్యక్తి యొక్క స్థితిని ఎప్పుడయినా నీవు గమనించావా? నీవు అలాంటి వ్యక్తిని రుజు మార్గానికి తెచ్చే బాధ్యతను స్వీకరించగలవా?"

(దివ్యఖుర్‌ఆన్ - 25: 43)

దైవప్రవక్తల విధానాన్ని అనుసరించటమే దైవవిధేయతా మార్గం.

దైవప్రవక్త(స)ను అనుసరించినవాడు అల్లాహ్‌ను అనుసరించాడు. ఈ కారణంగానే ప్రతి ప్రవక్తా ఈ విధంగా పిలుపు ఇచ్చారు : 'దైవదాస్యం చేయండి. నేను చెప్పినట్లుగా వినండి (అనీబుదుల్లాహ వత్తఖూహు వ అతీవూన్). దీని భావమేమిటంటే దైవప్రవక్తకు విధేయత చూపాలి. ఆయన చెప్పినట్లుగా ఆచరించాలి. దైవమార్గం పట్ల విముఖత చూపిన వారి మార్గాన్ని విడనాడాలి. ఇదే దైవదాస్యం. దైవప్రవక్తలు (అలైహిముస్సలామ్) ఇంకా ఇలా అన్నారు: 'మాకు విధేయత చూపండి. హద్దులను అతిక్ర మించిన వారిని, దైవంపై తిరుగుబాటు బావుటా ఎత్తిన వారిని అనుస రించకండి."

ఏకేశ్వరోపాసకులకు- బహు దైవోపాసకులకు మధ్య వివాదం తలెత్తేది ఇక్కడే. దైవారాధన కేవలం కొన్ని పూజా పునస్కారాలకు మాత్రమే పరిమితం కాదు. దైవదాసులనేవారు కేవలం దైవానికే విధేయత చూపాలి. ఆయన విధేయత మినహా మరెవరి విధేయత అయినాసరే అది షిర్క్. అది దైవ విధేయతకు విరుద్ధం - ఈ మాట చెప్పినప్పుడు తమను తాము దేవుళ్ళుగా ఊహించుకునేవారు సహించలేరు.

ఇస్లామీయ విద్వాంసులలో అల్లామా ఇబ్నె తైమియ ఈ వాదనపై 'అల్ అబూదియత్' అనే పేరుతో ఒక పుస్తకం రాశారు. అందులో ఆయన ఈ అంశంపై చర్చించిన తీరు అమోఘం, ప్రయోజనదాయకం. ఇబాదత్ (ఆరాధన, దాస్యం) అనేది కేవలం కొన్ని ఆచారాలకు, పూజలకు పరిమితం కాదని, దీన్ (ధర్మం) సమస్తం అందులో చేరి ఉందన్న వాస్తవం దీనిద్వారా స్పష్టమవుతుంది. దైవానికి పూర్తిగా 'విధేయత' (ఇతాఅత్) కనబరచనంత వరకూ 'దైవారాధన'కు అర్థమే లేదంటారాయన.

దీని ఆధారంగా ఆదేశించే, శాసనాలను విధించే హక్కు అధికారం

అల్లాహ్‌కు ఉందని ఖుర్‌ఆన్ ఖరారు చేసింది. ఈ వ్యవహారంలో ఎలాంటి భాగస్వామ్యాన్నీ ఖుర్‌ఆన్ సహించలేదు. అందుకే దేవుని ఏకత్వం (తౌహీద్) గురించి నొక్కి వక్కాణించినప్పుడల్లా ఏదేని విషయాన్ని హరామ్ లేక హలాల్‌గా ఖరారు చేసే హక్కు అల్లాహ్‌కు మాత్రమే ఉందని కూడా నిర్ద్వంద్వంగా చెప్పింది. ఆయన సార్వభౌమాధికారి. తన పాలనలో ఉన్న వారి కోసం శాసనాలను చేసే హక్కు ఆయనకు మాత్రమే ఉంది. ఆయన శాసనాలకు వ్యతిరేకంగా శాసనాల రూపకల్పన చేయడం 'తౌహీద్'కు వ్యతిరేకం. అది షైతాన్ అడుగులకు మడుగులొత్తటం అవుతుంది. ఇంకా, అది దైవదాస్యాన్ని తృణీకరించటమే అవుతుంది. అల్లాహ్ శాసనాలకు విరుద్ధంగా చట్టాలు రూపొందించేవాడు తనను అల్లాహ్ పరిపాలనలో భాగస్వామిగా నిలబెట్టుకున్నట్లే. ఒకవేళ ఇతరులకు ఆ హక్కు ఉందని ఒప్పుకున్నాడంటే, అల్లాహ్‌ను కాదని వారిని 'రబ్' (పాలకుడు, ప్రభువు)గా చేసుకున్నాడన్నమాటే. ఒకవేళ అది (ఆ శాసనం) అల్లాహ్ తరఫున ఉందని ఎద్దేవా చేశాడంటే, అతను 'షిర్క్'తోపాటు అల్లాహ్‌కు అబద్ధాలు కల్పించిన వాడుగా కూడా పరిగణించబడతాడు. అల్ బఖరా సూరాలోని 163-173 వచనాలను చదవండి. వీటిలో మొదటి ఐదు ఆయత్‌లలో దేవుని ఏకత్వం గురించి చెప్పబడింది. ఆ తరువాత ఈ క్రింది ఆయత్ వస్తుంది:

يَاأَيُّهَا النَّاسُ كُلُوا مِمَّا فِي الْأَرْضِ حَلَالًا طَيِّبًا وَلَا تَتَّبِعُوا خُطُوَاتِ
الشَّيْطَانِ إِنَّهُ لَكُمْ عَدُوٌّ مُبِينٌ ﴿١٦٨﴾

"ప్రజలారా! భూమిలోని ధర్మసమ్మతమయిన, పరిశుభ్రమయిన వాటినన్నింటినీ మీరు తినండి. షైతాను చూపే మార్గాలను తొక్కకండి. వాడు మీకు బహిరంగ శత్రువు." *(దివ్యఖుర్‌ఆన్ -2 : 168)*

"షైతాన్ మార్గాలను తొక్కకండి" అని అనబడింది. అంటే షైతాన్ షిర్క్ వైపునకు పిలుపు ఇస్తాడు. ఈ విషయాన్ని వాడు తొలినాడే ప్రకటించాడు కూడా– 'నేను వారిని (మనుషులను) భ్రష్టు పట్టిస్తాను. వారిలో ఆశలు రేపుతాను. నేను వారికి సలహా ఇస్తాను. దాని ప్రకారం వారు పశువుల చెవులు కోస్తారు. నా సలహానుసరించి వారు అల్లాహ్ సృష్టించిన వస్తువుల సహజత్వాన్ని మార్చివేస్తారు."

ఆ తరువాత షైతాన్ పిలుపులోని అసలు ఉద్దేశ్యం ఏమిటో తెలుపటం జరిగింది. వాడు చెడు వైపునకు, నీతి బాహ్యత అశ్లీలం వైపునకు ఆహ్వానిస్తాడు. మనిషి తనంతట తానుగా హలాల్– హరామ్‌లను (ధర్మాధర్మాలను) నిర్ధారించుకుని వాటికి తనదైన భాష్యం చెప్పుకుని, వాటిని దేవునికి ఆపాదించేలా చేయాలనేది షైతాన్ ముఖ్య లక్ష్యం.

إِنَّمَا يَأْمُرُكُم بِالسُّوٓءِ وَالْفَحْشَآءِ
وَأَن تَقُولُوا عَلَى اللَّهِ مَا لَا تَعْلَمُونَ

"వాడు మిమ్మల్ని కేవలం చెడు వైపునకు, నీతి బాహ్యత వైపునకు పురికొల్పుతాడు. ఏ విషయాల జ్ఞానం మీకు లేదో వాటిని అల్లాహ్ పేరుతో చెప్పమని మీకు ఆజ్ఞాపిస్తాడు." ***(దివ్యఖుర్ఆన్–2: 169)***

ఆ తరువాత ఏమనబడిందంటే, దైవశాసనాలను అనుసరించమని మనిషికి పిలుపు ఇచ్చినప్పుడు, అతను తన తాతముత్తాతల ఆచార సంప్రదాయాలను సనదుగా ఉదాహరిస్తాడు. వాస్తవానికి తాతముత్తాతల ప్రవచనాలు, కర్మలు షరీఅత్ బద్ధంగా లేనంతవరకూ వాటికంటూ ఒక సనదు ఉండదు. షరీఅత్ పరమయిన ప్రాతిపదిక ఏదీ లేకపోయినా తాతముత్తాతల ఆచారంపై నిలబడటం మూర్ఖత్వం తప్ప మరొకటి కాదు. ఈ

పోకడ అతనిని మనుషుల శ్రేణి నుండి తొలగించి పశువుల దొడ్డిలో నిలబెడుతుంది. అంటే అతను ఒక విధంగా గుడ్డివాళ్ళ, మూగవాళ్ళ, చెవిటివాళ్ళ జాబితాలో చేరిపోతాడు.

وَ اِذَا قِيلَ لَهُمُ اتَّبِعُوا مَآ اَنْزَلَ اللّٰهُ قَالُوا بَلْ نَتَّبِعُ مَآ اَلْفَيْنَا عَلَيْهِ اٰبَآءَنَا ؕ اَوَ لَوْ كَانَ اٰبَآؤُهُمْ لَا يَعْقِلُوْنَ شَيْئًا وَّلَا يَهْتَدُوْنَ ○ وَ مَثَلُ الَّذِيْنَ كَفَرُوْا كَمَثَلِ الَّذِىْ يَنْعِقُ بِمَا لَا يَسْمَعُ اِلَّا دُعَآءً وَّ نِدَآءً صُمٌّۢ بُكْمٌ عُمْىٌ فَهُمْ لَا يَعْقِلُوْنَ ○ (البقرة:١٧٠:١٧١)

"అల్లాహ్ అవతరింపజేసిన ఆదేశాలను అనుసరించండి' అని వారితో అన్నప్పుడు, వారు 'మా పూర్వీకులు అవలంబిస్తూ ఉండగా చూసిన పద్ధతినే మేము అనుసరిస్తాము' అని సమాధానం చెబుతారు. వారి పూర్వీకులు జ్ఞానం లేనివారైనప్పటికీ,సన్మార్గం పొందని వారైనప్పటికీ, వారు వారినే అనుసరిస్తూ పోతారా? అల్లాహ్ చూపిన మార్గాన్ని తిరస్కరించేవారి పోలిక ఇలా వుంది : పశువుల కాపరి పశువులకు కేక వేస్తాడు. కాని అవి ఆ కేకల, అరుపుల ధ్వనిని తప్ప దేనినీ వినలేవు. వారు చెవిటివారు, మూగవారు, గ్రుడ్డి వారు. అందుకని ఏ విషయమూ వారి బుర్రకెక్కదు."

(దివ్యఖుర్ఆన్ - 2: 170, 171)

తరువాత ఇలా అనబడింది : కొంతమంది తమను తాము అల్లాహ్ దాసులుగా చెప్పుకుంటారు. అయితే వారు అల్లాహ్ దాస్యం చేస్తూనే ధర్మాధర్మాల (హలాల్- హరామ్‌ల) విషయంలో మాత్రం మనసు కోరిన విధంగా నడుచుకుంటారు. వాస్తవానికి అల్లాహ్ దాస్యం వాంఛించే

దేమిటంటే శాసనాలను చేసే అధికారం కేవలం అల్లాహ్‌కే ఉందన్న విషయాన్ని కూడా అంగీకరించి తీరాలి.

يَاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْا كُلُوْا مِنْ طَيِّبٰتِ مَا رَزَقْنٰكُمْ وَاشْكُرُوْا لِلّٰهِ اِنْ كُنْتُمْ اِيَّاهُ تَعْبُدُوْنَ ○

"విశ్వసించిన ప్రజలారా! నిజంగానే మీరు అల్లాహ్ ఆరాధకులు అయితే, మేము మీకు ప్రసాదించిన పరిశుభ్రమయిన వస్తువులను నిస్సంకోచంగా తినండి. అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపండి."

*(దివ్యఖుర్‌ఆన్- **2: 172**)*

అందుకే దైవధర్మాలన్నీ అనివార్యమని ఖరారు చేశాయి- జీవితపు సమస్త వ్యవహారాలు అల్లాహ్ అవతరింపజేసిన షరీఅత్‌కు అనుగుణంగా ఉండాలనీ, దైవంపై విశ్వాసానికి, దాస్యానికి ఇది తప్పనిసరి అనీని. దేవుని శాసనాంగాన్ని వదలి వేరొక వస్తువును మార్గదర్శకంగా చేసుకోరాదని కూడా ఈ మతధర్మాలు చెప్పాయి. దివ్యఖుర్‌ఆన్ వెనుకటి సముదాయాల చరిత్రను వివరిస్తూ యూదులకు సయితం ఇదే ఆజ్ఞ ఇవ్వబడిందని చెప్పింది :

اِنَّآ اَنْزَلْنَا التَّوْرٰاةَ فِيْهَا هُدًى وَّ نُوْرٌ يَحْكُمُ بِهَا النَّبِيُّوْنَ الَّذِيْنَ اَسْلَمُوْا لِلَّذِيْنَ هَادُوْا وَالرَّبّٰنِيُّوْنَ وَالْاَحْبَارُ بِمَا اسْتُحْفِظُوْا مِنْ كِتٰبِ اللّٰهِ وَ كَانُوْا عَلَيْهِ شُهَدَآءَ فَلَا تَخْشَوُا النَّاسَ وَ اخْشَوْنِ وَلَا تَشْتَرُوْا بِاٰيٰتِىْ ثَمَنًا قَلِيْلًا وَّ مَنْ لَّمْ يَحْكُمْ بِمَآ اَنْزَلَ اللّٰهُ فَاُولٰٓئِكَ هُمُ الْكٰفِرُوْنَ ○ (المائدہ:۴۴)

"మేము తౌరాతును అవతరింపజేశాము. అందులో మార్గదర్శ కత్వమూ, జ్యోతీ ఉన్నాయి. ముస్లిములైన ప్రవక్తలంతా దాని ప్రకారమే ఈ యూదుల వ్యవహారాలను పరిష్కరించేవారు. ఇదే విధంగా రిబ్బీలు, షరీయతువేత్తలు కూడా (దాని ఆధారంగానే తీర్పు చెప్పేవారు). ఎందుకంటే, అల్లాహ్ గ్రంథాన్ని రక్షించే బాధ్యత వారిపై మోపబడింది. వారు దీనికి సాక్షులుగా ఉండేవారు. కనుక (యూదులారా!) మానవులకు భయపడకండి. నాకు భయపడండి. నా ఆయత్‌లను కొద్దిపాటి మూల్యం కొరకు అమ్మటం మానండి. అల్లాహ్ అవతరింపజేసిన చట్టం ప్రకారం తీర్పు చెయ్యనివారే అవిశ్వాసులు." *(దివ్యఖుర్ఆన్- 5: 44)*

సరిగ్గా ఇదే ఆజ్ఞ క్రైస్తవులకు కూడా ఇవ్వబడిందని ఖుర్ఆన్ తెలిపింది. వారు కూడా అల్లాహ్ అవతరింపజేసిన షరీఅత్ ప్రకారం జీవన వ్యవహారాలను సాగించాలని, అన్యథా వారు పాపాత్ములుగా, అవిధేయులుగా ఖరారు చేయబడతారని హెచ్చరించటం జరిగింది-

وَلْيَحْكُمْ اَهْلُ الْاِنْجِيْلِ بِمَآ اَنْزَلَ اللّٰهُ فِيْهِ وَمَنْ لَّمْ
يَحْكُمْ بِمَآ اَنْزَلَ اللّٰهُ فَاُولٰٓئِكَ هُمُ الْفٰسِقُوْنَ ○ (المائدہ ۴۷)

"మేము ఇంజీలు గ్రంథ ప్రజలను (కూడా) ఆ గ్రంథంలో అల్లాహ్ అవతరింపజేసిన శాసనం ప్రకారం తీర్పు చెయ్యాలని ఆజ్ఞాపించాము. అల్లాహ్ అవతరింపజేసిన శాసనం ప్రకారం తీర్పు చెయ్యనివారే హద్దు మీరినవారు." *(దివ్యఖుర్ఆన్- 5: 47)*

మరి ఆ గత సముదాయాలకు ఇవ్వబడిన ఆదేశమే ముస్లింలకు కూడా ఇవ్వబడింది, వారి వైపునకు అవతరింపజేయబడిన గ్రంథంలోని

మార్గదర్శక సూత్రాల ప్రకారమే జీవితపు సమస్త వ్యవహారాలను నడపాలని ఆజ్ఞాపించటం జరిగింది–

وَاَنزَلْنَآ اِلَيْكَ الْكِتَابَ بِالْحَقِّ مُصَدِّقًا لِّمَا بَيْنَ يَدَيْهِ مِنَ
الْكِتَابِ وَمُهَيْمِنًا عَلَيْهِ فَاحْكُم بَيْنَهُم بِمَآ اَنزَلَ اللّٰهُ وَلَا
تَتَّبِعْ اَهْوَآئَهُمْ عَمَّا جَآءَكَ مِنَ الْحَقِّ ـ(۴۸ـ مائدہ)

"ప్రవక్తా! మేము నీ వద్దకు పంపిన ఈ గ్రంథం సత్యాన్ని తీసుకుని వచ్చింది. తన కాలంలో ఉన్నటువంటి 'అల్ కితాబ్'లోని భాగాలను అది ధ్రువీకరిస్తుంది, పరిరక్షిస్తుంది. కనుక నీవు అల్లాహ్ పంపిన చట్టం ప్రకారం ప్రజల వ్యవహారాలను పరిష్కరించు. నీ వద్దకు వచ్చిన సత్యానికి విముఖుడవై వారి వాంఛలను అనుసరించకు." ***(దివ్యఖుర్ఆన్– 5: 48)***

సరిగ్గా ఇదే విషయం ఇంతకన్నా మరింత స్పష్టంగా, నిర్దిష్టంగా అల్ అన్ఆమ్ సూరాలోని 136వ ఆయత్‌నుంచి 153వ ఆయత్ వరకు విశదీకరించబడింది. ముఖ్యంగా చివరి ఆయత్‌లో ఇలా అనబడింది; ఏ వ్యవస్థ లేక సముదాయమైనా సంఘటితంగా ఉండటమనేది దాని శాసనాంగంపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి శాసనాలను నిర్మించే, వాటికి సంబంధించిన మార్గదర్శక సూత్రాలను జారీ చేసే హక్కు, అధికారం అల్లాహ్‌కు మాత్రమే ఉండాలి. సృష్టికర్త, విశ్వసామ్రాట్టు అయిన అల్లాహ్‌కు చెందే ఆ అధికారాన్ని మనమంతా శిరసావహించాలి. ఈ హక్కు లేక అధికారంలో వేరితరులు కూడా భాగస్వాములుగా చేరితే, ప్రతి సముదాయం తనకోసం తాను మెచ్చిన శాసనాలు రూపొందించసాగితే వ్యవస్థ ఛిన్నాభిన్నమవుతుంది. భువిలో అరాచకం ప్రబలుతుంది.

وَاَنَّ هٰذَا صِرَاطِیْ مُسْتَقِيْمًا فَاتَّبِعُوْهُ وَلَا تَتَّبِعُوا السُّبُلَ فَتَفَرَّقَ بِكُمْ عَنْ سَبِيْلِهٖ ذٰلِكُمْ وَصّٰكُمْ بِهٖ لَعَلَّكُمْ تَتَّقُوْنَ

"నా రుజుమార్గం ఇదే. కనుక మీరు దీనిపైనే నడవండి. వేరే మార్గాలపై నడవకండి. ఎందుకంటే అవి మిమ్మల్ని ఆయన మార్గం నుండి తొలగించి విచ్ఛిన్నపరుస్తాయి. మీ ప్రభువు మీకు చేసిన హితోపదేశం ఇదే; బహుశా మీరు వక్ర వైఖరికి దూరంగా ఉంటారని." ***(దివ్యఖుర్ఆన్- 6: 153)***

దేవుని ఏకత్వానికి సంబంధించిన ఇదే వివరణ అన్ నహ్ల్ సూరాలోని 54-57 ఆయత్‌లలో కూడా వచ్చింది. కాని స్థలాభావం వల్ల దానిని మేము ఇక్కడ పొందుపరచలేకపోతున్నాము.

మనిషిలోని స్వీయ ఆడంబరానికి, స్వయం పూజకు సంబంధించిన అత్యంత ముఖ్యమైన రూపాల్లో మరొకటి ఇది: ప్రజలు ఒక సుదీర్ఘ కాలం సిరిసంపదలతో తులతూగుతూ సుఖమయమైన జీవితం గడిపిన పిదప, రాజ్యంలోని ఒనరులపై, వారసత్వం, కళలపై ఆధిపత్యం చెలాయించిన మీదట వారిలో మితిమీరిన ధీమా వచ్చేస్తుంది. ఈ సిరిసంపదలు, ఈ ప్రగతీ వికాసాలన్నీ కేవలం తమ ప్రతిభ వల్లనే సాధ్యమయ్యాయని గొప్పలు చెప్పుకుంటారు. ఈ రకమయిన మనస్తత్వం వ్యక్తిలో ప్రబలినా, జాతిలో తిష్టవేసినా అది పతనానికి తొలిమెట్టు. దీనివల్ల అసంఖ్యాకమయిన చెడుగులు పుట్టుకువస్తాయి. దీని లోతుల్లోకి పోయి చూస్తే అది కూడా స్పష్టమయిన షిర్కే అన్న సంగతి బోధపడుతుంది. ఎందుకంటే ఈ ప్రపంచంలో ఏమున్నా అదంతా సృష్టికర్త అయిన అల్లాహ్‌దే. సమస్త మానవ ఒనరులను, ఉత్పత్తి కారకాలను పుట్టించినవాడు ఆయనే. ఈ ఒనరులను

ఉపయోగంలోకి తేవడానికి మనం వెచ్చించే శక్తియుక్తులు, శారీరక శ్రమ, సమయం– ఇవన్నీ కూడా దైవ కానుకలే.

هُوَ الَّذِي أَنشَأَكُمْ وَجَعَلَ لَكُمُ السَّمْعَ وَالْأَبْصَارَ وَالْأَفْئِدَةَ
قَلِيلًا مَّا تَشْكُرُونَ

"మిమ్మల్ని పుట్టించినవాడు అల్లాహ్‌యే; ఆయనే మీకు వినే, చూసే శక్తులు ఇచ్చాడు. ఇంకా ఆయనే మీకు ఆలోచించే, అర్థం చేసుకునే మనస్సు కూడా ఇచ్చాడు. కాని మీరు చాలా తక్కువగా కృతజ్ఞతలు తెలుపుతారు." ***(దివ్యఖుర్‌ఆన్– 67: 23)***

ఇక మన ఔన్నత్యం, పరిపూర్ణత, విజ్ఞానం విషయానికి వస్తే అది దైవదాస్యం పట్ల నిరపేక్షతను ప్రదర్శించవలసినంత గొప్పదేమీ కాదు. మనం సులైమాన్ (అ) జుల్‌ఖర్‌నైన్‌లు అయినప్పటికీ సల్మాన్ ఫార్సీ, అబూజర్ (ర.అన్‌హుమ్)ల మాదిరిగా దేవుని ముందు నిస్సహాయులమే. మనలోని గర్వం మన వ్యక్తిగత గుణం. అది మన నుండి వేరవకపోవచ్చు. అయినా మనమెంత? మన జోరెంత? మనం ఉన్నత స్థాయికి ఎదిగినా మన పరిమితులు మనకుంటాయి.

కాని అరబ్బులు ఇక్కడే పొరబడ్డారు. వారు తమ వద్ద ఉన్న కలిమిని, సంపత్తిని తమ ప్రతిభకు తార్కాణంగా భావించేవారు. తమ జ్ఞాన సంపద, తెలివితేటల మూలంగానే తాము ఆ స్థాయికి ఎదిగామని తలపోసేవారు. వారిలోని ఈ ధీమా కూడా వారు పరలోకాన్ని తిరస్కరించటానికి ఒక కారణమయ్యేది. ఒకవేళ మరణానంతర జీవితమనేది ఉన్నా దాని కోసం తాము ఈ లోకంలో కష్టపడాల్సిన అవసరం లేదని అనుకునేవారు. ఈ ప్రాపంచిక జీవితంలో తాము శ్రీమంతులుగా, గౌరవ

నీయులుగా పేరు మోసినట్లే పరలోక జీవితంలో కూడా తమకు ఉన్నత అంతస్తులు లభిస్తాయని చెప్పుకునేవారు. అది తమ హక్కు అని, దానిని ఎవరూ తమ నుండి లాక్కోలేరని మితిమీరిన ధీమాను వ్యక్తం చేసేవారు. అరబ్బుల ఈ మనస్తత్వాన్ని గురించి ఖుర్ఆన్ ఇలా అంటోంది:

فَاِذَا مَسَّ الْاِنْسَانَ ضُرٌّ دَعَانَا ثُمَّ اِذَا خَوَّلْنٰهُ نِعْمَةً مِّنَّا قَالَ اِنَّمَآ اُوْتِيْتُهٗ عَلٰی عِلْمٍ بَلْ هِیَ فِتْنَةٌ وَّ لٰكِنَّ اَكْثَرَهُمْ لَا يَعْلَمُوْنَ۝
(الزمر:٤٩)

"మనిషికి బాధ కలిగినప్పుడు అతను మమ్మల్ని (ఆవేదనతో) మొరపెట్టుకుంటాడు. మరి మేమతనిని అనుగ్రహిస్తే, 'ఇదంతా నాకు నా పరిజ్ఞానం కారణంగా లభించింది' అని అంటాడు. అసలు విషయం ఏమిటంటే ఇది పరీక్షగా ఉంది. కాని చాలా మంది తెలుసుకోరు." ***(దివ్యఖుర్ఆన్- 39 : 49)***

అంటే మనిషికి ఏది లభించినా అది కేవలం అతని తెలివితేటలు, శక్తియుక్తుల ఆధారంగా లభించదు. దైవకృప వల్లనే లభిస్తుంది. ఆ దైవ కటాక్షం ద్వారా అతను పరీక్షించబడతాడు. అతను కృతజ్ఞుడుగా మెలగుతాడా లేక మేలును మరిచినవాడుగా వ్యవహరిస్తాడా అనేది చూడబడుతుంది. కాని చాలామంది ఈ పరీక్ష గురించి తెలుసుకోరు. వారు కృతఘ్నతా వైఖరినే అవలంబిస్తారు. దైవకృప వల్ల ప్రాప్తించిన అనుగ్రహ భాగ్యాన్ని తమ ప్రతిభకు పట్టంగా ఊహించుకుంటారు. ఆ విధంగా వారు దేవుని పోషకత్వంలో, ఉపాధి ప్రసాదంలో భాగస్వాములుగా అవతారమెత్తుతుంటారు.

గర్వాహంకారానికి, భువిలో కల్లోలానికి మూల కారణమిదే. అహంభావం, భాగస్వామ్య ధోరణి కలగలసిన ఈ మనస్తత్వం గురించి వేరొకచోట ఇలా సెలవీయబడింది :

وَلَئِنْ اَذَقْنٰهُ رَحْمَةً مِّنَّا مِنْۢ بَعْدِ ضَرَّآءَ مَسَّتْهُ لَيَقُوْلَنَّ
هٰذَا لِيْ وَمَآ اَظُنُّ السَّاعَةَ قَآئِمَةً وَّلَئِنْ رُّجِعْتُ اِلٰى رَبِّيْٓ
اِنَّ لِيْ عِنْدَهٗ لَلْحُسْنٰى۔

“అతనికి కలిగిన కష్టం తరువాత మేమతనికి మా కారుణ్యం రుచిని చూపితే, ‘ఇది నా హక్కు. ప్రళయం వస్తుందని నేనైతే అనుకోను. ఒకవేళ నేను నా ప్రభువు వైపునకు మరల్చబడటం అనేదే జరిగితే అక్కడ కూడా నాకు మంచే జరుగుతుంది’ అనంటాడు.”

(దివ్యఖుర్ఆన్- *42 : 50*)

ఇదే మనస్తత్వం గురించి సూరయే ముద్దస్సిర్‌లో ఇలా అనబడింది:

وَجَعَلْتُ لَهٗ مَالًا مَّمْدُوْدًا ۝ وَّبَنِيْنَ شُهُوْدًا ۝ وَّمَهَّدْتُّ
لَهٗ تَمْهِيْدًا ۝ ثُمَّ يَطْمَعُ اَنْ اَزِيْدَ۔

“నేను అతనికి ఎంతో ధనం ఇచ్చాను. ఎల్లప్పుడూ అతన్ని వెన్నంటి ఉండే కుమారులను ప్రసాదించాను. అతని కొరకు రాజ్యాధికార (సకల సౌకర్యాల) మార్గాన్ని సుగమం చేశాను. అయినప్పటికీ నేను అతనికి ఇంకా ఏదో ఇవ్వాలని కాంక్షిస్తున్నాడు.”

(దివ్యఖుర్ఆన్- 74: 12-15)

‘ఇంకా ఇంకా పొసగాలని(పిచ్చిగా) కోరుకుంటున్నాడు’ అనే చివరి వాక్యం గమనించదగినది. అంటే ఒకవేళ ఈ ప్రపంచంలో చావు వచ్చి

దేవుని వద్దకు వెళ్ళటమనేదే జరిగితే, నాకు అక్కడ ఈ ప్రపంచం కన్నా మరింత ఉన్నత స్థానం లభించగలదు అంటాడు. ఎందుకంటే ఈ ఐహిక జీవితంలో తనకు లభించిన భోగభాగ్యాలకు ప్రధాన కారణం తనలోని 'ప్రతిభే'నని అతను తలపోస్తున్నాడు. దానిని దైవకటాక్షంగా తలపోయటం లేదు. ఇదంతా తనను పరీక్షించేందుకు అని భావించటం లేదు.

ఈ ఆలోచనా ధోరణికి ప్రతిబింబం అల్ మఆరిజ్ సూరాలోని ఈ క్రింది ఆయత్‌లు :

فَمَالِ الَّذِيْنَ كَفَرُوْا قِبَلَكَ مُهْطِعِيْنَ ۝ عَنِ الْيَمِيْنِ وَعَنِ
الشِّمَالِ عِزِيْنَ ۝ اَيَطْمَعُ كُلُّ امْرِئٍ مِّنْهُمْ اَنْ يُّدْخَلَ
جَنَّةَ نَعِيْمٍ ۝ كَلَّآ اِنَّا خَلَقْنٰهُمْ مِّمَّا يَعْلَمُوْنَ ۝

"(ఓ ప్రవక్తా!) ఇంతకీ ఈ సత్య తిరస్కారులు కుడివైపు నుండీ, ఎడమ వైపు నుండీ గుంపులు గుంపులుగా ఎందుకు నీ వైపునకు పరుగెత్తుకొస్తున్నారు? వారిలో ప్రతి ఒక్కడూ కానుకలతో నిండిన స్వర్గంలో తనను ప్రవేశపెట్టడం జరుగుతుందనే పేరాశ కలిగి ఉన్నాడా? ఎంతమాత్రం అలా జరగదు. ఏ వస్తువుతో మేము వారిని పుట్టించామో, ఆ వస్తువేమిటో స్వయంగా వారు ఎరుగుదురు." *(దివ్యఖుర్ఆన్- **70: 36-39**)*

ఖుర్ఆన్ సందేశాన్ని ప్రజలకు అందజేయడానికి నడుం బిగించినప్పుడు ఎదురయిన పరిస్థితికి అద్దం పడుతున్నాయి ఈ ఆయత్‌లు. అధికార మదాంధులకు ఎదురయ్యే పరాభవం, శిక్షా బహుమానాలకు సంబంధించిన దివ్యవచనాలు వినిపించినప్పుడు అవి మక్కాలోని ఖురైషు నాయకులకు తగలాల్సిన చోటే తగిలేవి, దానికి వాళ్ళు విలవిల్లాడేవారు. ఆ (పరలోక) దృశ్యానికి వారు తారెత్తిపోయేవారు. 'ఆ రోజు' ఉత్థాన

పతనాల త్రాసు విశ్వాసం (ఈమాన్) సదాచరణ (అమలె సాలెహ్) ప్రాతిపదికపై నెలకొంటుంది. ఒక సన్నకారు రైతు, నిరుపేద అయిన కార్మికుడు సయితం దైవదాస్యం, దైవవిధేయత ఆధారంగా గొప్ప అంతస్తులు పొందుతాడు. అతనికి లభించిన పురస్కారాన్ని చూసి పెద్దపెద్ద నాయకులు కూడా ఈర్ష్య చెందుతారు. ఖుర్‌ఆన్‌లోని ఈ వచనాలను విన్నప్పుడు ఖురైషు నాయకులు ఓర్వలేక చిందులు వేసేవారు. వాటిని ఖండించేవారు. దైవప్రవక్త(స)ను ఎగతాళి చేసే ఉద్దేశ్యంతో మార్కెట్టులో ఆయన వైపునకు నలువైపుల నుంచీ ఎగబడి వచ్చేవారు. ఇంతకీ వారి ఈ గర్వానికి, మిడిసిపాటుకు కారణం ఏమిటి? దేన్ని చూసుకుని వారు ఇలా ఎగిరెగిరి పడుతున్నారు? వారి వద్ద ఉన్న ఆస్తి అంతస్తులను, తమను వెన్నంటి ఉన్న కొడుకులను చూసుకునేనా వారు ఈ అదురుపాటు పడుతున్నది!? ఒకవేళ తాము దేవుని వద్దకు మరలిపోవలసి వచ్చినా అక్కడ కూడా తమ పరిస్థితి బాగానే ఉంటుందని ప్రగల్భాలు పలుకుతున్నారు ఈ ఆసాములు. ఈ లోకంలోనయినా పైలోకంలోనయినా తమ వద్ద ఉన్న ఈ భోగభాగ్యాలను లాక్కునేవాడు ఎవడూలేడని బీరాలు పోతున్నారు. అసలు మేము పుట్టించబడిందే అధికారం చెలాయించటానికి, జీవితాన్ని అనుభవించడానికి, జనులపై ఔన్నత్యాన్ని చాటుకోవటానికి అంటూ తమ బడాయి చాటుకుంటున్నారు. అందుకే ఖుర్‌ఆన్ వారికి ఇలా సమాధానం ఇచ్చింది:

كَلَّآ ۖ إِنَّا خَلَقْنَٰهُم مِّمَّا يَعْلَمُونَ ○

"అసంభవం (వారు అనుకుంటున్నట్లుగా జరగదు). ఏ వస్తువుతో మేము వారిని పుట్టించామో, ఆ వస్తువేమిటో స్వయంగా వారికీ తెలుసు." **(దివ్యఖుర్‌ఆన్- *70 : 39*)**

అంటే దాని గురించి వారికి తెలియజేయవలసిన అవసరం లేదు-

వారికి స్వయంగా తెలుసు కాబట్టి. ఎంతో అల్పమైన, అశుద్ధమయిన ఒక్క బొట్టు కోసం వారు తమ పవిత్రతను, ప్రతిభను, వంశపారంపర్య వైభవాన్ని చాటుకోవడం వారికి ఎంతమాత్రం శోభాయమానం కాదు. మనిషిలోని శక్తిసామర్థ్యాలు, తెలివితేటలన్నీ రెండు బలహీన దశల మధ్య వ్రేలాడుతూ ఉన్నాయి– ఒకటి : బాల్య దశ. రెండవది : వార్ధక్య దశ.

اَللّٰهُ الَّذِىْ خَلَقَكُمْ مِّنْ ضُعْفٍ ثُمَّ جَعَلَ مِنْۢ بَعْدِ ضُعْفٍ قُوَّةً
ثُمَّ جَعَلَ مِنْۢ بَعْدِ قُوَّةٍ ضُعْفًا وَّ شَيْبَةً (الروم: ۵۴)

"మిమ్మల్ని బలహీన స్థితిలోనుంచి పుట్టించినవాడు ఆ అల్లాహ్‌యే. ఈ బలహీనత తరువాత ఆయన మీకు బలం ఇచ్చాడు. మరి ఆ బలం తరువాత బలహీనతను, వృద్ధాప్యాన్ని వొసగాడు."

(దివ్యఖుర్ఆన్- 30 : 54)

అటువంటి మనిషి దైవదాస్యం పట్ల అలక్ష్యాన్ని ప్రదర్శించటం, దైవ విధేయతకు కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదని తలపోయటం, దేవుని దైవత్వంలో వాటాదారునిగా ఊహించుకోవటం ధర్మసమ్మతం కాదు.

ఈ వాస్తవాన్ని అన్ నజ్మ్ సూరాలో అత్యంత మనోహరంగా విడమరచి చెప్పటం జరిగింది:

وَ لِلّٰهِ مَا فِى السَّمٰوٰتِ وَ مَا فِى الْاَرْضِ لِيَجْزِىَ الَّذِيْنَ
اَسَآؤُوْا بِمَا عَمِلُوْا وَ يَجْزِىَ الَّذِيْنَ اَحْسَنُوْا بِالْحُسْنٰى۝
اَلَّذِيْنَ يَجْتَنِبُوْنَ كَبٰٓئِرَ الْاِثْمِ وَ الْفَوَاحِشَ اِلَّا اللَّمَمَ ؕ اِنَّ
رَبَّكَ وَاسِعُ الْمَغْفِرَةِ ؕ هُوَ اَعْلَمُ بِكُمْ اِذْ اَنْشَاَكُمْ مِّنَ
الْاَرْضِ وَ اِذْ اَنْتُمْ اَجِنَّةٌ فِىْ بُطُوْنِ اُمَّهٰتِكُمْ ۚ فَلَا تُزَكُّوْٓا
اَنْفُسَكُمْ هُوَ اَعْلَمُ بِمَنِ اتَّقٰى۝ (النجم: ۳۱، ۳۲)

"భూమ్యాకాశాలలో ఉన్న ప్రతి వస్తువుకూ యజమాని అల్లాహ్‌యే- చెడు చేసేవారికి వారి కర్మలకు ప్రతిఫలం ఇచ్చేందుకు, సదాచరణ వైఖరి అవలంబించిన వారికి మంచి ప్రతిఫలం ప్రసాదించేందుకు. వారు పెద్దపెద్ద పాపాలకు, స్పష్టమయిన అసభ్య చేష్టలకు దూరంగా ఉంటారు; కొన్ని పొరపాట్లు తప్ప. నిస్సంశయంగా నీ ప్రభువు క్షమాగుణ పరిధి అత్యంత విశాలమైనది. ఆయన మిమ్మల్ని భూమి నుండి సృష్టించినప్పటి నుండీ, మీరు మీ మాతృగర్భాలలో ఇంకా పిండాలుగానే ఉన్నప్పటి నుండీ బాగా ఎరుగును. కనుక మీ పవిత్రతను గురించి గొప్పలు చెప్పుకోకండి. నిజమైన భయభక్తులు గల వాడెవడో ఆయనకే బాగా తెలుసు."

(దివ్యఖుర్‌ఆన్- 53: 31,32)

పై వచనాల ద్వారా ఊర్ధ్వ లోకాలలో దైవదూతలు సిఫారసు చేస్తారన్న వాదన ఖండించబడింది. ఆ తరువాత శిక్షా బహుమానాలు సత్యం అనే విషయం ప్రస్తావించడం జరిగింది. పెద్దపెద్ద పాపాల నుండి తమను కాపాడుకునేవారు మాత్రమే దైవ సన్నిధిలో సఫలీకృతులుగా నిర్ణయించబడతారని, ఎప్పుడయినా క్షణికావేశంలో కాలుజారి మురికిలో పడినా వెంటనే తమ తప్పును తెలుసుకుని దైవసన్నిధిలో క్షమాపణ కోరుకుంటారని, పశ్చాత్తాప కన్నీటితో తమకు అంటుకున్న మురికిని కడిగివేస్తారని చెప్పబడింది. ఇకపోతే తమలోని వ్యక్తిగత ప్రతిభ గురించి బీరాలు పోయేవారు; వారు తమను తాము మహా పవిత్రులుగా ఊహించుకుంటున్నారు. జన్మతః తాము స్వర్గానికి హక్కుదారులమని భావిస్తున్నారు. వారి పుట్టుపూర్వోత్తరాలను గురించి దైవానికి తెలియనిదేముంది? ఆయన వారిని మట్టితో సృజించినప్పటి నుండీ, అత్యంత అల్పమైన ఒక రేతస్సు రూపంలో మాతృగర్భాలలో స్ఖలించబడినప్పటి నుండీ, ఆ తరువాత ఒక

మాంసపు ముద్దగా రూపొంది శిశువుగా మారినప్పటి నుండే వారి 'యవ్వారం' అల్లాహ్‌కు తెలుసు. వారు కడు బలహీన స్థితిలో ఈ పుడమిపై కాలు మోపారు. అలాంటి బలహీనులు ఇలా గర్వాహంకారంతో విర్రవీగటం వారికి ఎంతమాత్రం తగదు. వారి వద్ద ఉన్నదంతా వాస్తవానికి దైవానుగ్రహమే. అది వారి ప్రతిభ వల్ల ప్రాప్తించినది కానేకాదు.

ఈ బహుదైవోపాసనా తత్వాన్నే అల్ కహ్ఫ్ సూరాలో ఇలా విశదీకరించటం జరిగింది :

وَاضْرِبْ لَهُمْ مَّثَلًا رَّجُلَيْنِ جَعَلْنَا لِأَحَدِهِمَا جَنَّتَيْنِ مِنْ
أَعْنَابٍ وَحَفَفْنَاهُمَا بِنَخْلٍ وَجَعَلْنَا بَيْنَهُمَا زَرْعًا ۝ كِلْتَا
الْجَنَّتَيْنِ آتَتْ أُكُلَهَا وَلَمْ تَظْلِمْ مِّنْهُ شَيْئًا وَفَجَّرْنَا
خِلَالَهُمَا نَهَرًا ۝ وَكَانَ لَهُ ثَمَرٌ فَقَالَ لِصَاحِبِهِ وَهُوَ
يُحَاوِرُهُ أَنَا أَكْثَرُ مِنكَ مَالًا وَأَعَزُّ نَفَرًا ۝ وَدَخَلَ جَنَّتَهُ
وَهُوَ ظَالِمٌ لِّنَفْسِهِ قَالَ مَا أَظُنُّ أَن تَبِيدَ هَٰذِهِ أَبَدًا ۝
وَمَا أَظُنُّ السَّاعَةَ قَائِمَةً وَلَئِن رُّدِدتُّ إِلَىٰ رَبِّي لَأَجِدَنَّ خَيْرًا
مِّنْهَا مُنقَلَبًا ۝ قَالَ لَهُ صَاحِبُهُ وَهُوَ يُحَاوِرُهُ أَكَفَرْتَ
بِالَّذِي خَلَقَكَ مِن تُرَابٍ ثُمَّ مِن نُّطْفَةٍ ثُمَّ سَوَّاكَ
رَجُلًا ۝ لَّٰكِنَّا هُوَ اللَّهُ رَبِّي وَلَا أُشْرِكُ بِرَبِّي أَحَدًا ۝

"ప్రవక్తా! వారి ముందు ఒక ఉపమానం పేర్కొను : ఇద్దరు వ్యక్తులు ఉండేవారు. వారిలో ఒకనికి మేము రెండు ద్రాక్ష తోటలు ఇచ్చాము. వాటి చుట్టూ ఖర్జూరపు చెట్ల కంచెను పెంచాము. ఇంకా

వాటి మధ్య సేద్యపు భూమిని ఉంచాము. ఆ రెండు తోటలు పుష్కలంగా పండాయి. పండటంలో అవి ఎంత మాత్రమూ కొరత చూపలేదు. ఆ తోటల మధ్య ఒక కాలువను ప్రవహింపజేశాము. యజమానికి మంచి లాభాలు వచ్చాయి. ఇదంతా పొంది కూడా అతను ఒకనాడు తన పొరుగు మిత్రునితో మాట్లాడుతూ ఇలా అన్నాడు : 'నేను నీకంటే ఎక్కువ ధనం కలవాణ్ణి'. ఎక్కువ బలవంతులైన జనం కలవాణ్ణి' ఆ తరువాత అతను తన స్వర్గం (తోట)లో ప్రవేశించాడు. తన ఆత్మకు అన్యాయం చేసుకున్నవాడై ఇలా ప్రకటించాడు: 'ఎప్పటికయినా ఈ సంపద నశిస్తుందని నేను భావించటం లేదు. ఎప్పటికయినా ప్రళయ ఘడియ వస్తుందనే నమ్మకం కూడా నాకు లేదు. అయినప్పటికీ, ఒకవేళ ఎప్పుడయినా నేను నా ప్రభువు సన్నిధికి మరలింపబడినట్లయితే తప్పకుండా దీనికంటే మహోజ్వలమైన స్థానాన్ని పొందుతాను'. అప్పుడు అతని పొరుగువాడు మాట్లాడుతూ అతనితో ఇలా అన్నాడు: 'నిన్ను మట్టితోనూ, తరువాత వీర్యబిందువుతోనూ పుట్టించి ఒక సంపూర్ణ మానవునిగా తీర్చిదిద్దిన ఆయనను నీవు తిరస్కరిస్తున్నావా? ఇక నా విషయమంటావా, నా ప్రభువైతే అల్లాహ్‌యే. నేను ఎవరినీ ఆయనకు భాగస్వామిగా చేయను.' *(దివ్యఖుర్ఆన్– 18: 32–38)*

అరబ్బుల సామాజిక జీవితంలో అభివ్యక్తమయ్యే 'అహంభావం' ఇది. దీనికి అరబ్బుల సాహిత్యంలో కూడా విశిష్ఠ స్థానముండేది. తన స్వంత ప్రతిభను చూసుకుని విర్రవీగే ఒకానొక క్యారెక్టర్‌లోని చెడుగులన్నీ ఈ సందర్భంగా మన ముందుకు వచ్చేశాయి. దీనికి భిన్నంగా ఏకేశ్వరోపాసి అయిన అతని పొరుగువాడు చెప్పిన మాటల్ని గమనించండి. అన్ నజ్మ్, అల్ మఆరిజ్ సూరాలలో ఇంతకుముందు వచ్చిన విషయాన్నే ఆ

ఏకేశ్వరోపాసి కూడా ప్రస్తావించాడు. మనిషి దేంతో పుట్టించబడ్డాడో మరచిపోరాదని గుర్తు చేశాడు. మనిషి తన ప్రతిభను చూసుకుని మిడిసి పడటం, గర్వంతో విర్రవీగటం కూడా ఒక విధమయిన షిర్కేనని బోధపరి చాడు. తన ప్రభువైతే అల్లాహ్‌యేనని, తాను మాత్రం ఆ దైవానికి సహవర్తునిగా ఎవరినీ నిలబెట్టనని నిర్ద్వంద్వంగా చెప్పేశాడు.

ఆ తరువాతి ఆయత్‌లో ఆ గర్విష్టి తోట నాశనమైన ప్రస్తావన ఉంది. అప్పుడు అతను ఇలా పశ్చాత్తాపం చెందాడు :

يَٰلَيْتَنِى لَمْ أُشْرِكْ بِرَبِّىٓ أَحَدًا ۝

'అయ్యో! నేను నా ప్రభువుకు సహవర్తునిగా ఎవరినీ నిలబెట్టకుండా ఉంటే ఎంత బాగుండేది!' *(దివ్యఖుర్‌ఆన్- **18 : 42**)*

దీనినిబట్టి తెలిసేదేమిటంటే ధన మదం ఉన్నంతవరకూ అతని కళ్ళు బైర్లు కమ్ముకుని ఉన్నాయి. అతనికి తన శక్తిపైన, ఉపాయం పైన మితిమీరిన ధీమా ఉండింది. తన మంది మార్బలాన్ని చూసుకుని మిడిసి పడ్డాడు. కాని తోట నాశనమవగానే, తన వద్ద ఉన్న మందీ మార్బలం దేనికీ పనికిరానిదని అర్థమవగానే తన దౌర్భాగ్యస్థితిపై విచారం వ్యక్తం చేశాడు. తాను తన ప్రభువుకు భాగస్వామ్యం కల్పించి తప్పు చేశానని బాధపడ్డాడు-

"అల్లాహ్ పట్టు నుండి అతనిని రక్షించి, సహాయపడటానికి అతని జన సమూహమేమీ రాలేదు." *(దివ్యఖుర్‌ఆన్- **18 : 43**)*

మనోమస్తిష్కాలలో ఇలాంటి గర్వం ఉన్నవారు నియంత్రణలో ఉండరు. వారు సంతులనం కోల్పోవటం సహజం. ఇలాంటి వారి దైవత్వపు పునాది ఇసుకపై ఉంటుంది. దేవుని ఆగ్రహం ఒక చిన్న కుదుపు

కుదిపితే చాలు వారి తలపొగరు కాస్తా దిగిపోయి, వారిపై నిరాశా నిస్పృహల చీకట్లు ఆవరిస్తాయి. కాని కష్టాల నుండి గట్టెక్కగానే కథ మళ్ళీ మొదటికొస్తుంది. ఆర్భాటాలు అట్టహాసాల దృశ్యాలు మళ్ళీ దర్శనమిస్తుంటాయి. మనసులో అణగారి ఉన్న వారి 'దైవత్వం' మళ్ళీ జాగృతమవుతుంది. ఖుర్ఆన్ మాటల్లోనే చెప్పాలంటే వారు భువిలో విర్రవీగుతూ, నీల్గుతారు. కల్లోలం వ్యాపింపజేస్తారు. దేవుని దైవత్వాన్ని అంగీకరించే బదులు మనుషుల చేత తమ దైవత్వాన్ని ఒప్పించేందుకు యత్నిస్తారు. దానికోసం వారు తమ శక్తినీ, సంపదను ధారబోస్తుంటారు.

هُوَ الَّذِي يُسَيِّرُكُمْ فِي الْبَرِّ وَالْبَحْرِ حَتَّىٰ إِذَا كُنتُمْ
فِي الْفُلْكِ وَجَرَيْنَ بِهِم بِرِيحٍ طَيِّبَةٍ وَفَرِحُوا بِهَا
جَاءَتْهَا رِيحٌ عَاصِفٌ وَجَاءَهُمُ الْمَوْجُ مِن كُلِّ مَكَانٍ
وَظَنُّوا أَنَّهُمْ أُحِيطَ بِهِمْ دَعَوُا اللَّهَ مُخْلِصِينَ لَهُ الدِّينَ
لَئِنْ أَنجَيْتَنَا مِنْ هَٰذِهِ لَنَكُونَنَّ مِنَ الشَّاكِرِينَ ۝ فَلَمَّا
أَنجَاهُمْ إِذَا هُمْ يَبْغُونَ فِي الْأَرْضِ بِغَيْرِ الْحَقِّ ۝

"మిమ్మల్ని నేలపైనా నీటిపైనా నడిపేవాడు అల్లాహ్‌యే. కాబట్టి మీరు ఓడలపై ఎక్కి వాయువులు అనుకూలంగా వీస్తూ ఉండగా ఆనందంగా, ఆహ్లాదంగా ప్రయాణం చేస్తూ ఉంటారు. ఆ తరువాత అకస్మాత్తుగా ఎదురుగాలి ఉధృతమై అన్ని దిశల నుండి అలల దెబ్బలు తగలగా ప్రయాణికులు తాము తుఫానులో చిక్కుకుపోయామని తెలుసుకుంటారు. ఆ సమయంలో అందరూ తమ ధర్మాన్ని కేవలం ఆయనకే ప్రత్యేకం చేసుకుని ఆయనను ఇలా వేడుకుం

టారు: 'నీవు గనక మాకు ఈ ఆపద నుండి విముక్తి కలిగిస్తే మేము కృతజ్ఞతలు తెలుపుకునే దాసులమవుతాము.' కాని ఆయన వారిని రక్షించిన తరువాత వారే సత్యానికి విముఖులై భూతలంపై తిరుగుబాటు చేస్తారు." *(దివ్యఖుర్‌ఆన్-10: 22, 23)*

బహు దైవోపాసనకు సంబంధించిన ఇలాంటి మనస్తత్వమే అల్ ఖసస్ సూరాలోనూ ప్రస్తావించబడింది :

وَابْتَغِ فِيمَآ اٰتَاكَ اللّٰهُ الدَّارَ الْاٰخِرَةَ وَلَا تَنْسَ نَصِيْبَكَ
مِنَ الدُّنْيَا وَاَحْسِنْ كَمَآ اَحْسَنَ اللّٰهُ اِلَيْكَ وَلَا تَبْغِ
الْفَسَادَ فِي الْاَرْضِ اِنَّ اللّٰهَ لَا يُحِبُّ الْمُفْسِدِيْنَ ۝
قَالَ اِنَّمَآ اُوْتِيْتُهٗ عَلٰى عِلْمٍ عِنْدِيْ ۔

'అల్లాహ్ నీకు ఇచ్చిన సంపదతో పరలోకంలో గృహాన్ని నిర్మించుకునే యోచన చెయ్యి. ప్రపంచంలో కూడా నీ వాటాను విస్మరించకు. అల్లాహ్ నీకు ఉపకారం చేసిన విధంగానే నీవూ ఉపకారం చేయి. భూమిపై కల్లోలాన్ని సృష్టించే ప్రయత్నం చేయకు అల్లాహ్ కల్లోలాన్ని సృష్టించే వారిని ప్రేమించడు' (అని ఖారూన్‌కు అతని జాతి ప్రజలు సలహా ఇచ్చినప్పుడు) అతను ఇలా అన్నాడు: 'నాకు లభ్యమైన జ్ఞానంతోనే ఇదంతా నాకు ఇవ్వబడింది.'

(దివ్యఖుర్‌ఆన్- 28: 77,78)

సూరతుల్ ఫజ్ర్‌లో మనిషి స్వభావం ఈ విధంగా చిత్రీకరించబడింది :

فَاَمَّا الْاِنْسَانُ اِذَا مَا ابْتَلٰهُ رَبُّهٗ فَاَكْرَمَهٗ وَنَعَّمَهٗ فَيَقُوْلُ
رَبِّيْٓ اَكْرَمَنِ ۝ وَاَمَّآ اِذَا مَا ابْتَلٰهُ فَقَدَرَ عَلَيْهِ رِزْقَهٗ
فَيَقُوْلُ رَبِّيْٓ اَهَانَنِ ۔ (فجر)

"మానవుడు ఎలాంటి వాడంటే, అతని ప్రభువు అతనికి గౌరవాన్నీ, వరాలనూ ప్రసాదించి అతన్ని పరీక్షకు గురి చేసినప్పుడు, 'నా ప్రభువు నా గౌరవప్రతిష్టలను ఇనుమడింపజేశాడు' అని (సంబర పడుతూ) అంటాడు. మరి ఆయన అతనికి లభించే ఉపాధిని తగ్గించి అతన్ని పరీక్షించినప్పుడు 'నా ప్రభువు నన్ను అవమాన పరిచాడు' అని (నిష్ఠూరంగా) అంటాడు.

(దివ్యఖుర్ఆన్– 89: 15,16)

అంటే అతనిలో రెండు విపరీత పోకడలు ఉంటాయి. ఒకటి : నేను ఈ గౌరవానికి తగినవాణ్ణి గనకనే దేవుడు నన్ను కటాక్షించాడు. నాకు లభించినదంతా నా తెలివితేటల మూలంగానే. లేకపోతే నాకు ఇదంతా ఎలా ప్రాప్తమవుతుంది? అనుకుంటాడు. ఈ ఆలోచనే అతనిని గర్విష్టిగా తయారుచేస్తుంది. తత్ఫలితంగా మిడిసిపడతాడు. ధరిత్రిలో అరాచకాన్ని, విచ్ఛిన్నాన్ని సృష్టిస్తాడు. ఈ లోకంలో తానేం చేసినా అది తనకు సమ్మతమే అని భావిస్తాడు.

రెండు : దీనికి భిన్నంగా దేవునిపైనే నిందలు మోపుతాడు. ఆ పైవాడికే నాపైన దయలేదని నిష్ఠూరంగా మాట్లాడతాడు. ఆ దేవుడే నాపై పగ తీర్చుకుంటూ నన్ను ఈ అధోగతికి చేర్చాడని చెబుతాడు. ఆ విధంగా నిరాశా నిస్పృహలకు లోనై ఒక మనిషిగా తన స్థాయికి తగని విధంగా ప్రవర్తిస్తాడు. తనను తాను కించపరచుకుంటాడు. ఏ ఆత్మ గౌరవం వల్ల సొసైటీలో తానొక మర్యాదస్తునిగా రాణించగలడో దానినే చేజేతులా పోగొట్టుకుంటాడు.

దైవ ప్రసాదితమయిన మేళ్ళను మానవుడు తన స్వంత ప్రతిభా ఫలంగా భావించటం వల్ల ఏర్పడిన అసమతౌల్యం ఇది. అసలు ఈ ఆలోచనే తప్పుడు ఆలోచన! బహుదైవోపాసనతో కూడిన తత్వం!!

మరి ఏకేశ్వరోపాసనాతత్వం ఎలా ఉంటుంది? కలిమి సోకినా,

లేమి దాపురించినా, కష్టాలొచ్చినా సుఖాలు ప్రాప్తించినా ఏకేశ్వరవాది (ముమహ్హిద్) అయినవాడు దానిని దేవుని తరఫున పెట్టబడిన పరీక్షగా తలపోస్తాడు. కలిమి ప్రాప్తిస్తే ఇది నా కృతజ్ఞతా భావానికి పరీక్ష అనుకుంటాడు. లేమి ఆవహిస్తే ఇది నా సహనానికి పరీక్ష అని భావిస్తాడు. ఈ రెండు అవస్థల ద్వారా ఒక విశ్వాసి (మోమిన్) అవలంబించే ధర్మం (దీన్) పరీక్ష అనే గీటురాయిపై పరికించబడుతుంది. ఎందుకంటే సహనం- కృతజ్ఞతా భావాల సమ్మిళితమే ఇస్లాం ధర్మం.

ఎట్టి పరిస్థితిలోనూ తన మనసు సంతులనం కోల్పోకుండా ఉంటుందనే ఆత్మ విశ్వాసం కలిగివుండి, దాని కోసం యత్నించిన వ్యక్తి మాటే వేరు. తాను శత్రువుల పద్మవ్యూహంలో చిక్కుకున్నప్పుడు కూడా, శత్రువులు తన ప్రాణానికి పెద్ద బహుమానం ప్రకటించారని తెలిసి కూడా **'లా తహ్జన్ ఇన్నల్లాహ మఅనా'** (ఆవేదన చెందకు. అల్లాహ్ మనకు తోడుగా ఉన్నాడు) అని తన మనసుకు ఓదార్పునిస్తూ ఉంటాడు. వేలాది మంది సైనికుల మధ్యన ఉండగా సేనలు తన నేతృత్వానికి వత్తాసు పలుకుతూ జయ జయ నినాదాలు చేస్తూ ఉన్నప్పుడు కూడా అతని తల దైవసన్నిధిలో ఒరిగి ఉంటుంది. ఇలాంటి సంతులితమయిన మనసు కోసం, ప్రశాంత చిత్తంతో కూడిన శుభాత్మ కోసం ఖుర్ఆన్ ఉపయోగించిన పదాలు ఇవి :

يَـٰٓأَيَّتُهَا النَّفْسُ الْمُطْمَئِنَّةُ○ ارْجِعِىٓ إِلٰى رَبِّكِ رَاضِيَةً مَّرْضِيَّةً○
فَادْخُلِىْ فِىْ عِبَادِىْ○ وَادْخُلِىْ جَنَّتِىْ○ (الفجر:٢٧-٣٠)

కుదుట పడిన ఓ మనసా! నీ ప్రభువు వైపునకు సాగిపో. సంతోషాతిశయంతో! గుండె నిండా నెమ్మదితో!! సజ్జనులైన నా దాసులలో చేరిపో. నా స్వర్గంలో ప్రవేశించు.

2. గ్రంథ వహుల షిర్క్

దివ్యఖుర్‌ఆన్‌లో గ్రంథం కల ప్రజల రెండు వర్గాల ప్రస్తావన వచ్చింది. వారిలో ఒకరు యూదులు. రెండవ వారు క్రైస్తవులు. వీరు ఒక్క అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స)ను మినహాయించి ఖుర్‌ఆన్ పిలుపు నిచ్చే మిగతా ధార్మిక మౌలికాంశాలన్నింటినీ విశ్వసించేవారు. కడకు దేవుని ఏకత్వపు విశ్వాసం కూడా వారికీ– ముస్లిములకు మధ్యన ఏకీభవిత అంశంగానే ఉండేది. కాని ఎన్నో అంశాలపై విశ్వాసం కలిగి ఉన్నప్పటికీ వారి ఆచరణలలో, నమ్మకాలలో కుఫ్ర్ (తిరస్కారం), షిర్క్ (బహుదైవత్వం) అంతర్లీనమై ఉండేది. దివ్యఖుర్‌ఆన్ ఈ మౌలిక విశ్వాసం ఆధారంగా వారితో వాదిస్తూ, వారు తమ విశ్వాసాలలో ఆచరణలలో ఉన్న లోపాన్ని సరిదిద్దుకోమని కోరింది. వారు దేవుని ఏకత్వాన్ని (తౌహీద్‌ని) పూర్తిగా నిరాకరించి అది మోపే బాధ్యతల నుండి చేతులు దులుపుకుని ఏ కొండల్లోనో కోనల్లోనో తచ్చాడుతూ ఉండవచ్చు. లేదంటే దేవుని ఏకత్వాన్ని హృదయ పూర్వకంగా విశ్వసించి, అది వాంఛించే వాటిని చిత్తశుద్ధితో అమలు పరచటమయినా చేయవచ్చు. వారు 'తౌహీద్' అనే జ్యోతిని పుచ్చుకుని తద్వారా తమ విశ్వాసాలలో కర్మలలో తిష్ఠ వేసిన నవీన పోకడలను, చెడుగులను గాలించాలి. ఆ లొసుగులను దూరం చేసు కోవాలి.

అరబ్బులతో తర్జనభర్జన మొదలైనప్పుడు తీసుకున్న ప్రధానాంశం

(దృక్పథం) గుర్తుండే ఉంటుంది– భూమ్యాకాశాల నిర్మాత, సమస్త శక్తియుక్తుల ఆవిష్కర్త, గగన భువనాల నిర్వహణకర్త అల్లాహ్‌యే అన్న దానిని మీరు ఒప్పుకుంటున్నప్పుడు ఈ మణిహారపు దారాన్ని ముక్కలు ముక్కలుగా త్రెంపివేసే విషయాలను ఎందుకు నమ్మి నడుచుకుంటారు? అని వారిని ప్రశ్నించటం జరిగింది. గ్రంథం కల ప్రజలతో కూడా సరిగ్గా ఇలాగే – దేవుని ఏకత్వపు విశ్వాసాన్ని కేంద్ర బిందువుగా చేసుకుని– వాదనను మొదలెట్టడం జరిగింది. మీకూ– మాకూ మధ్యన 'తౌహీద్' అనే మోకు ఆధారంగా ఉన్నప్పుడు సంకోచమెందుకు? రండి, ఆ గీటురాయి పైనే కల్తీ ఏదో మేలిమి ఏదో పరికించుకోండి అని పిలుపు ఇవ్వటం జరిగింది. ఈ విధంగా సెలవీయబడింది :

قُلْ يَآاَهْلَ الْكِتَابِ تَعَالَوْا اِلٰى كَلِمَةٍ سَوَآءٍ بَيْنَنَا وَبَيْنَكُمْ
اَنْ لَّا نَعْبُدَ اِلَّا اللّٰهَ وَلَا نُشْرِكَ بِهٖ شَيْئًا وَّلَا يَتَّخِذَ
بَعْضُنَا بَعْضًا اَرْبَابًا مِّنْ دُوْنِ اللّٰهِ فَاِنْ تَوَلَّوْا فَقُوْلُوا
اشْهَدُوْا بِاَنَّا مُسْلِمُوْنَ ○ (آل عمران-٦٤)

ప్రవక్తా! ఇలా చెప్పు: "గ్రంథ ప్రజలారా! మాకూ – మీకూ మధ్య సమానమైన ఒక విషయం వైపునకు రండి. (అది ఏమిటంటే) మనం అల్లాహ్‌కు తప్ప మరెవరికీ దాస్యం చెయ్యరాదు. ఆయనకు భాగస్వాములుగా ఎవరినీ నిలబెట్టరాదు. మనలోని వారెవరూ అల్లాహ్‌ను తప్ప మరెవరినీ తమ ప్రభువుగా చేసుకోరాదు(అనేది)". ఈ సందేశాన్ని స్వీకరించటానికి వారు వైముఖ్యం కనబరిస్తే, వారితో స్పష్టంగా ఇలా చెప్పు: "మేము ముస్లిములము (కేవలం

అల్లాహ్‌కే దాస్యం చేసేవారము, విధేయత చూపేవారము) అనే విషయానికి మీరు సాక్షులుగా ఉండండి." *(దివ్యఖుర్ఆన్-3 : 64)*

దీనినిబట్టి అవగతమయ్యేదేమిటంటే ఒకే దైవాన్ని ఆరాధించటం, దేనినీ ఆయనకు సహవర్తిగా ఎంచకుండా ఉండటం, ఒక్క దైవం తప్ప వేరెవరినీ పాలకుడుగా, ప్రభువుగా నిలబెట్టకుండా ఉండటం - ఇది ముస్లింలకు- గ్రంథ వహులకు మధ్యన ఏకీభవిత అంశంగా ఉండేది. వీటిలో ఏ ఒక్క దానితో కూడా యూదులుగానీ, క్రైస్తవులుగానీ విభేదించే వారు కారు. కాని వేరొకరిని 'ప్రభువు'గా అంగీకరించకపోవటమనే దానివి అర్థం చేసుకోవటంలో వాళ్ళు పొరబడ్డారు. కేవలం నిజదైవానికే ప్రత్యేకమయిన హక్కులు గుణగణాలలో వేరితరులను భాగస్వాములుగా చేసినప్పటికీ వారికెలాంటి వ్యత్యాసం గోచరించేది కాదు. ఉదాహరణకు- శాసనాలను చేసే అధికారం కేవలం అల్లాహ్‌కే ప్రత్యేకం. ఆయనకు మాత్రమే ప్రత్యేకమయిన ఆ అధికారంలో జోక్యం చేసుకోవడం వేరొకరికి ధర్మసమ్మతం కాదు. ఒకవేళ ఏ వ్యక్తి అయినా అలాచేస్తే అతను అల్లాహ్ దైవత్వంలో భాగస్వామిగా పెత్తనం చెలాయించే దుస్సాహసానికి ఒడిగట్టి నట్లే. అలా దుస్సాహసానికి ఒడిగట్టిన వాని 'హక్కు'ను మనం గనక అంగీకరిస్తే- మనం మన నోటితో అతనిని దేవుడు లేక ప్రభువు (రబ్) అని చెప్పకపోయినప్పటికీ- వాస్తవానికి మనం దేవుని దైవత్వంలో, దేవుని పరిపాలనలో అతనిని భాగస్వామిగా చేసేసినట్లే. అయితే యూదులు, క్రైస్తవులు దేవుని ఈ 'హక్కు లేక అధికారం'లో వేరితరులను భాగస్వాము లుగా ఎంచటంలో ఎలాంటి దోషం లేదని అనుకునేవారు. అందుకే దివ్య ఖుర్ఆన్ దీని ఆధారంగానే యూదులను, క్రైస్తవులను (మాత్రమే) ఈ విషయంలో అపరాధులుగా ఖరారు చేసింది. ఎందుకంటే వారు తమ

పండితులను, ధర్మవేత్తలను–అల్లాహ్‌కు ప్రతిగా–ప్రభువుగా నిలబెట్టేవారు.

اتَّخَذُوٓا أَحْبَارَهُمْ وَرُهْبَانَهُمْ أَرْبَابًا مِّن دُونِ اللَّهِ
وَالْمَسِيحَ ابْنَ مَرْيَمَ وَمَآ أُمِرُوٓا إِلَّا لِيَعْبُدُوٓا إِلَـٰهًا
وَاحِدًا سُبْحَانَهُ عَمَّا يُشْرِكُونَ (۳۱-توبہ)

"వారు అల్లాహ్‌ను కాదని తమ పండితులను, తమ సన్యాసులను తమ ప్రభువులుగా చేసుకున్నారు. ఇంకా ఇదేవిధంగా మర్యమ్ కుమారుడైన మసీహ్‌ను కూడా. వాస్తవానికి ఒకే దేవుని దాస్యం తప్ప మరెవరి దాస్యాన్ని చేసే ఆజ్ఞ వారికి ఇవ్వబడలేదు. ఆయన తప్ప ఆరాధనకు అర్హుడైన వాడెవడూ లేదు. ఆయన పరిశుద్ధుడు. వారు అనే షిర్క్ మాటలకు ఆయన అతీతుడు."

(దివ్యఖుర్‌ఆన్- 9: 31)

ఈ ఆయత్‌కు సంబంధించి హదీసులలో అదీ బిన్ హాతిమ్ గారి ప్రశ్న ఒకటి ఉటంకించబడింది. ఈయన గారు దైవప్రవక్త(స)తో, 'యూదులు, క్రైస్తవులు తమ పండితులను, మతాచార్యులను ప్రభువు (రబ్) అని చెప్పరు కదా!' అని సందేహపడగా, 'అల్లాహ్ హలాల్ (ధర్మ సమ్మతం)గా ఖరారు చేసిన వస్తువులను వారు హరామ్ (నిషిద్ధం)గా చేసుకుంటారు. అల్లాహ్ హరామ్ (నిషిద్ధం) గావించిన వాటిని వారు హలాల్ (ధర్మసమ్మతం)గా ఖరారు చేస్తారు. అవునా? కాదా?' అని దైవప్రవక్త(స) చెప్పగా, 'అవును, ఈ విషయమైతే నిజమే' అని అదీ బిన్ హాతిమ్ అన్నారు. "వారిని ఆరాధించటమంటే ఇదే కదా!" అని దైవ ప్రవక్త(స) సమాధానమిచ్చారు.

నోటితో ఒకరిని 'దేవుడు' అని పలకనంతవరకూ అతను ఆరాధ్య దైవం లేక ప్రభువు అవడని అదీ బిన్ హాతిమ్ అనుకునేవారు. ఒకరి

పేరుతో లాంఛనంగా పూజా పునస్కారాలు చేయనంతవరకూ అది షిర్క్ అవదని కూడా ఆయన తలపోసేవారు. ఈ తలంపు సరైనది కాదని, ఒకరిని 'దేవా!' లేక 'ప్రభువా' అని పిలవనప్పటికీ నిజదైవానికి మాత్రమే ప్రత్యేకమయిన హక్కులు అధికారాలను వేరితరులకు కట్టబెట్టినట్లయితే వారిని దైవం (ఇలాహ్) లేక ప్రభువు (రబ్)గా శిరసావహించినట్లేనని ప్రవక్త(స) వారి పలుకుల ద్వారా స్పష్టమైపోయింది. అంటే- లాంఛనంగా వారి పేర పూజలు చేయకపోయినప్పటికీ వారి దైవత్వాన్ని, ప్రభుతను అంగీకరించినట్లే. శాసనాంగాన్ని నిర్మించటమనేది కేవలం అల్లాహ్ హక్కు. ఆ హోదాను మీరు మరెవరికి కట్టబెట్టినా అతను మీ దేవుడై కూర్చుంటాడు. మీరు అతని దాసులైపోతారు. నోటితో మీరతన్ని దాసుడు అని పలికినా, దేవుడని అన్నా దానివల్ల వ్యత్యాసమేమీ ఉండదు.

పై ఆయత్‌కు సరైన భావం ఏమిటో తెలుసుకోవటానికి ఈ మాత్రం వివరణ సరిపోతుంది. అయితే ఈ నేపథ్యంలో మరిన్ని లాభదాయక మయిన విషయాలను వివరించటం - ఇన్‌షాఅల్లాహ్- అసందర్భం కాబోదు.

ఈ ఆయతులో గ్రంథవహులైన యూదుల క్రైస్తవుల రెండు షిర్క్ చేష్టలు ప్రస్తావనకు వచ్చాయి. పండితులను (అహ్‌బార్), సన్యాసులను (రుహ్‌బాన్) 'ప్రభువులు'గా చేసుకోవటం. 2) మహనీయ మసీహ్ (ఏసుక్రీస్తు- అలైహిస్సలామ్)ను ప్రభువుగా చేసుకోవటం. ఈ రెండు విషయాలపై మేము సంక్షిప్తంగా చర్చించదలిచాము-

(అ) పండితుల పూజ

యూదులు తమ షరీఅత్‌కు సంబంధించిన ఎన్నో విషయాలను విస్మరించారు. ఈ విషయం అందరికీ తెలిసిందే (వారు తమకు బోధిం చబడిన ఉపదేశంలో చాలా భాగం మరచిపోయారు- అల్ మాయిదా-

13). చాలాచోట్ల వాటిలో ప్రక్షిప్తాలకు పాల్పడ్డారు. విషయాలను తారుమారు చేశారు. ఉదాహరణకు– ఇస్మాయీల్ సంతతిలో అంతిమ దైవప్రవక్త ప్రభవనం విషయం గానీ, ఇబ్రాహీమ్ (అ)గారి 'ఖిబ్లా' విషయంలోగానీ, ఖుర్బానీ (బలి) స్థలం విషయంలో గానీ వారు చేసిన ప్రక్షిప్తాలు జగద్విదితమే. ఇంకా ఎన్నో దైవాదేశాలను వారు మరుగుపర చారు. ఉదాహరణకు – వ్యభిచారం, దొంగతనం, మానవ హత్యలకు విధించబడే శిక్షల విషయంలో వారు అతి తెలివిని ప్రదర్శించారు. కొన్ని ఆజ్ఞలపై షరీఅత్ పరమైన వంకలతో ముసుగు తొడిగించారు. మరెన్నో ధార్మిక తీర్పులు (ఫత్వాలు) దైవశాసనాంగానికి విరుద్ధంగా– ప్రాపంచిక లాభాల కోసం– లిఖించేవారు. పైగా అవి తౌరాతు ఆజ్ఞలేనని బుకాయించే వారు. వారి ఈ అవకతవకలన్నీ దివ్యఖుర్ఆన్‌లో కూలంకషంగా వివరించబడ్డాయి. మొత్తానికి యూదుల ఈ స్వార్థపూరిత చేష్టల కారణంగా, వారి షరీఅత్‌లోని వివిధ విభాగాలలో దేవుని తిరుగులేని అధికారాలు నీరుగారి పోయాయి. దాని స్థానంలో వారి పండితులు, మతాచార్యుల కాల్పనిక ఆజ్ఞలు, చట్టాలు చొరబడ్డాయి.

అలాగే బైబిల్ చరిత్ర, యూదుల న్యాయవ్యవస్థ,శాసనాల క్రోడీకరణ గురించి అధ్యయనం చేసినప్పుడు అవగతమయ్యే ఒక ముఖ్య విషయం ఏమిటంటే, వారి వద్ద షరీఅత్ సూత్రాల అన్వయింపు (ఇజ్తెహాద్) దాదాపు లేదు. వివిధ తెగల మధ్య న్యాయమూర్తులుగా నియుక్తులై ఉన్న వారు తౌరాతులో లేని కేసులు వచ్చినప్పుడు, తౌరాతులోని ఇతర ఆదేశాల, తమ ప్రవక్త నిర్ణయాల వెలుగులో పర్యాలోచన చేసి ఒక నిర్ధారణకు వచ్చే ప్రయత్నం బొత్తిగా చేసేవారు కాదు. ఇలాంటి వివాదాస్పద వ్యవహారాన్ని వారు ప్రధాన జ్యోతిష్కునికి అప్పజెప్పేవారు. ఈ ఆచారం వారిలో ఉండేది. దైవనిర్ణయం ఏమిటో తెలుసుకోవటానికి ప్రధాన జ్యోతిష్కుణ్ణి

ఆశ్రయించటం ఒక్కటే మార్గం అని వారు తలపోసేవారు. ఆ ప్రధాన జ్యోతిష్కుడు ప్రత్యేక ధ్యానంలో భాగంగా ఒక పవిత్ర స్థలంలో ప్రవేశించే వాడు. అక్కడ ఒక పేటిక తెరవెనుక ఉంటుంది. ఆ స్థలం ప్రభువు నుండి దివ్యప్రేరణ పొందే స్థలంగా భావించబడేది. ప్రధాన జ్యోతిష్కుడు ఆ స్థానానికి చేరినప్పుడు యెహోవా (దేవుని) ఆదేశం, అభిమతం అతనికి ప్రేరేపితమవుతుంది. దానిని అతను ప్రజలకు తెలియపరుస్తాడు. దానిని ప్రజలు శిరసావహించటం తప్పనిసరిగా భావించబడేది. బెన్‌చలీ 'ది థియరీ ఆఫ్ ది స్టేట్ (The Theory of the state) అనే తన పుస్తకంలో మతపరమైన ప్రభుత్వం (థియాక్రసీ) అధ్యాయంలో ఇలా రాస్తున్నాడు :

> **"దైవ శాసనం స్వర్ణఖచితమయిన ఒక పేటికలో భద్రపరచబడి ఉండేది. దానిని ఇరువురు వ్యక్తులు పర్యవేక్షిస్తూ ఉండేవారు. దానిపట్ల భక్తిప్రపత్తులు కలిగి ఉండటం దివ్య ప్రేరణకై చాలా ముఖ్యంగా పరిగణించటం జరిగేది. ఆ పేటిక గుడారం లోపల ఒక తెర వెనుక 'ఖదసుల్ అఖ్‌దాస్'లో ఉండేది. జ్యోతిష్కులు దానిని కంటికిరెప్పలా కాపాడుతూ ఉండేవారు. ఈ ప్రధాన జ్యోతిష్కుడే యెహోవా ఆజ్ఞలను తెలుసుకుని వాటిని ప్రజలకు చేరవేసేవాడు.**
>
> **"తెగల వారిలో న్యాయమూర్తులుగా నియమితులై శాసనాంగాన్ని అమలుపరిచేవారు దేవుని పేరుతో ఈ పనిని నిర్వర్తించేవారు. ఎందుకంటే శాసనాలను నిర్మించే అధికారం కేవలం దైవానికే ప్రత్యేకమై ఉండేది. తాము పరిష్కరించలేని వివాదం ఏదయినా వారి వద్దకు వచ్చినప్పుడు లాదీల సహాయంతో వారు దేవుని అభిమతాన్ని తెలుసుకోవటం అవశ్యమైపోయేది."**

ఈ పద్ధతి ఇంచుమించు విగ్రహారాధకులైన జాతుల అనుకరణ

తప్ప మరొకటి కాదు. యూదులు ధార్మికంగా కొత్త పుంతలు తొక్కుతున్న కాలంలో ఈ పద్ధతిని అవలంబించారు. ఆ కాలంలో ఈజిప్టు, ఇరాక్, సైన్యా ప్రదేశాలలోని విగ్రహాలయాలలో పూజారులు, పురోహితులు చాలా ముఖ్యమైన అవసరం ఏర్పడినప్పుడు తమ ఆరాధ్య దైవాల సమక్షంలోకి వెళ్ళి అగోచరవాణి నోట ఈ ఆరాధ్య దైవాల ఇచ్ఛను తెలుసుకునేవారు. దాదాపు అదే విధానాన్ని యూదులు కూడా అనుసరించారు. పూర్వం అరబ్బులు కూడా తమ దేవతల ముందు బాణాల ద్వారా అదృష్టాన్ని పరీక్షించుకునే వారు. తమ దేవతల అభిమతాన్ని పరిగ్రహించేవారు. అదేవిధంగా పేటిక (తాబూత్) రూపంలో ఒక ఆరాధ్యదైవాన్ని నిర్మించుకున్నారు. ఏ వ్యవహారంలో వారికి సంక్లిష్ట పరిస్థితి ఎదురయినా ప్రధాన జ్యోతిష్కుడు పేటిక దగ్గరకు వెళ్ళి దైవాదేశాన్ని, దైవ నిర్ణయాన్ని తెలుసుకుంటాడు. అంటే దైవనిర్ణయం సంగ్రహించడానికి కేవలం పేటిక ముందు నిలబడితే చాలు. ఇలాంటి జ్యోతిష్కులు ఏ పాపం ఎరుగని నిర్దోషులుగా, దివ్య ప్రేరణ పొందినవారుగా భావించబడేవారు. ఆ విధంగా యూదులు నిజ దైవాన్ని కాదని జ్యోతిష్కులను తమ ప్రభువులుగా చేసుకున్న వారయ్యారు.

ఇక క్రైస్తవుల (నసారా) విషయానికివస్తే వాళ్ళ వ్యవహారం ఇంతకన్నా అపసవ్యంగా ఉండేది. 'నసారా' అంటే అసలు యూదులలోని ఆచార దురాచారాలను సంస్కరించుకున్న సంస్కరణా ప్రియుల వర్గం. వారు దైవాజ్ఞలను అవలంబించే విషయంలో పూర్తిగా తౌరాతు గ్రంథానికి అనుయాయులే. కాని సెంట్‌పాల్ క్రైస్తవ మతం అంతర్బాహ్యాలన్నింటినీ పూర్తిగా ప్రక్షిప్తం చేసేశాడు. అతను 'నసారా'ను ఒక ప్రత్యేక నామంగా, ఒక ప్రత్యేక సముదాయం (ఉమ్మత్)గా వేరుపరిచాడు. తౌరాతు గ్రంథం లోని ఆజ్ఞలకు కట్టుబడి ఉండటం ఒక్క బనీ ఇస్రాయీల్‌కే పరిమితం చేశాడు. ఇస్రాయీలేతరులను తౌరాతు ఆదేశాల కట్టడి నుంచి వేరుపరి

చాడు. అంటే మద్యపానం, పంది మాంసం వంటి వాటిని వారికి ధర్మ సమ్మతంగా ఖరారు చేశాడు. మహనీయ మసీహ్ (ఏసుక్రీస్తు– అలైహిస్సలామ్) గారి సిసలయిన వారసులు (ప్రతినిధులు) ఈ నవీన పోకడలపై వేడివాడి చర్చలు జరిపారు. దీనికి వ్యతిరేకంగా వాదించారు. కాని సెంట్‌పాల్ తొక్కిన కొత్త పుంతల ముందు, రోమనుల ఆశల అభిలాషల ముందు ఈ వాదన బధిర శంఖారావమే అయింది. ఆ విధంగా క్రైస్తవం ఒక శాశ్వతమయిన ఉమ్మత్(ధార్మిక సముదాయం)గా ముందుకువచ్చింది. కాని ఇది గ్రంథం, షరీఅత్ లేని సముదాయం. ఎందుకంటే 'ఇంజీలు'లో ఆజ్ఞలు దాదాపు శూన్యం. తౌరాతు గ్రంథానుసరణ నుండి పాల్ వాళ్ళను 'విముక్తుల్ని' చేసేశాడు. ఫలితం సుస్పష్టమే. జీవితపు సమస్త వ్యవహారాలలో 'నసారా' (క్రైస్తవులు) నిజదైవానికి బదులు తమ పండితులు, మతాధిపతులు సృష్టించిన నవీన పోకడల (బిద్అత్)ను అవలంబించ సాగారు. వారి పండితులు, సన్యాసులు చెప్పిందే దైవాదేశంగా చెలామణీ అయ్యేది. కాన్‌స్టాంట్ నోపుల్ కాలం నుండీ రోము చక్రవర్తుల 'ఖడ్గం' క్రైస్తవుల విరోధానికి బదులు మద్దతుగా మారినప్పుడు పోప్ ధార్మిక ఔన్నత్యానికి తిరుగులేకుండా పోయింది. పరిస్థితి ఎంతవరకు వచ్చిందంటే ఒకవైపు నుంచి పోప్ ఆదేశాలు పంపబడితే రెండోవైపు నుంచి చక్రవర్తి ఉత్తర్వులు జారీ అయ్యేవి– ఆ ఆదేశాలను తిరుగులేని సార్వభౌమాధికారి అయిన దేవుని ఆదేశాలుగా భావించి వాటిని తు.చ తప్పకుండా శిరసావహించాలని ప్రజలకు సూచించటం జరిగేది. ఆఖరికి వ్యవహారం ఎంత వరకు వెళ్ళిందంటే మతాధిపతులు పరమ పవిత్రులు. వారు ఈ భువిపై కట్టేది ఆకాశంలోనూ కట్టబడుతుంది. వారు భువిలో విప్పేది దివిలో కూడా విప్పబడుతుంది. వారి మాటే దేవుని మాట. వారు భూమిలో ఇచ్చే వరమే ఆకాశంలో వరంగా ఇవ్వబడుతుంది. మరో విధంగా చెప్పాలంటే వీరు

దైవాజ్ఞలకు బద్ధులు కారు. దేవుడే వీరి ఆజ్ఞలకు బద్ధుడు (దైవం మన్నించుగాక!)

(ఆ) మహనీయ మసీహ్ (ఏసుక్రీస్తు- అ)ను ప్రభువుగా చేసుకోవటం

ఇలాగే క్రైస్తవులు మర్యమ్ కుమారుడగు మసీహ్ (ఏసుక్రీస్తు-అ)ను కూడా 'ప్రభువు' (రబ్)గా చేసుకున్నారు. ఈ ఉపద్రవానికి మూల కారకుడు, స్థాపకుడు కూడా సెంట్ పాల్‌యేనని క్రైస్తవ మతచర్చల ద్వారా తెలుస్తోంది. మసీహ్ (ఏసుక్రీస్తు- అ) శిష్యులు విద్యావంతులు కారన్న సంగతి అందరికీ తెలిసిందే. దీనికి భిన్నంగా సెంట్ పాల్ ఉన్నత విద్యావంతుడు. గ్రీకు తత్వ శాస్త్రంలో నిష్ణాతుడు. గ్రీకు వేదాంతాన్ని ఔపోసన పట్టినవాడు. అతను ఇంజీలుకు భాష్యం (వ్యాఖ్యానం) వినూత్న పంథాలో సమర్పించాడు. తాను నిరక్షరాస్యులైన ఏసు శిష్యుల నోటి మాటలను అనుసరించాల్సిన అవసరం లేదన్నాడు. ఎందుకంటే వాటి ద్వారా యదార్థాలను పరిగ్రహించలేము అని చెప్పాడు. తనకున్న జ్ఞానం ప్రత్యక్షంగా ఏసు ప్రబోధనలతో అనుసంధానం అవుతుందని ప్రకటించాడు. విచిత్రమేమిటంటే ఇంజీలు అసలు భాష అయిన హెబ్రూ భాష గురించి సెంట్ పాల్‌కు బొత్తిగా తెలీదు. అజ్ఞాని అయిన ఒక అరబ్బేతర వ్యక్తి (అజమీ)కి ఖుర్ఆన్ భాష (అరబీ) గురించి ఎంత తెలిసి ఉంటుందో పాల్‌కు కూడా హెబ్రూ భాష గురించి అంతే తెలుసు. ఖుర్ఆన్ హదీసుల భాష, పరిభాష తెలియని అరబ్బేతర వ్యక్తులు ఇస్లాంలో నవీన పోకడలు (బిద్అత్) ప్రవేశ పెట్టినట్లే ఇంజీలు భాష తెలియని సెంట్ పాల్ అనే గ్రీకు తత్వశాస్త్ర ప్రవీణుడు ఇంజీలు గ్రంథం, క్రైస్తవ మతం యొక్క రూపురేఖలనే మార్చి వేశాడు. అతనిపై అతీంద్రియ జ్ఞానం (Gnosticism) ప్రభావం చాలా ఎక్కువగా ఉండేది. ఆనాటి అతని కార్యకలాపాలను, శ్రద్ధాసక్తులను నిశిత దృష్టితో చూస్తే అర్థమయ్యేదొక్కటే- ఎలాగయినాసరే రోమనులకు క్రైస్తవ

మతాన్ని రమ్యమైనదిగా చూపించి, వారిలో ఈ మతధర్మానికి ప్రాచుర్యం ఇవ్వాలి. ఈ మహానుభావుడికి ఏసుక్రీస్తు నిజ జీవితంతోగానీ, ఆయన ప్రబోధనలతోగానీ పెద్దగా ఆసక్తి ఉండేది కాదు. తనకు ప్రియాతి ప్రియ మయిన ఆత్మజ్ఞాన తత్వంతో సమరసం చెందే జీవన విధానాన్ని ప్రజా బాహుళ్యానికి పరిచయం చేయాలి. రోమను మైథాలిజీతో దానిని అను సంధానం చేయాలి. అందుకే అతను తొక్కిన ప్రతి కొత్త పుంతలోనూ అతని ఈ 'అభిరుచి' తొంగిచూస్తూ ఉంటుంది. అయితే మేమిక్కడ కేవలం మసీహ్ దైవత్వపు బిద్అత్ గురించి మాత్రమే వివరించదలిచాము.

ఇంజీలులో మసీహ్ (ఏసుక్రీస్తు–అ) కొరకు 'కుమారుడు', దైవ వాక్కు మరియు దేవుని కొరకు 'తండ్రి' అనే పదాలు ప్రయోగించబడ్డాయి. దాంతోపాటే ఆయన గురించి 'ఆదాము కుమారుడు' అనే పదం కూడా అనేకచోట్ల వచ్చింది. 'దేవుని ఏకత్వం' గురించి కూడా చాలా స్పష్టమయిన పదాల్లో ఉపదేశం చేయటం జరిగింది. ఏసుక్రీస్తు (అ) శిష్యులకు మాత్రం ఈ మాటలను అర్థం చేసుకోవటంలో ఎలాంటి ఇబ్బంది కలగలేదు. హెబ్రూ భాషలో 'ఇబ్ను' (కుమారుడు) అనే పదం దాసుడు, కుమారుడు అనే అర్థాలకు ఉమ్మడిగా వర్తిస్తుంది. అలాగే 'అబ్' (తండ్రి) అనే పదానికి తండ్రి, ప్రభువు పోషకుడు అనే అర్థాలు కూడా వస్తాయి. అందువల్ల 'ఇబ్న్' అనే పదం వల్ల గానీ, 'అబ్' అనే పదం వల్లగానీ వారు ఎలాంటి సందిగ్ధా నికి లోను కాలేదు. వారు ఎలాంటి సంకోచం లేకుండా 'దేవ కుమా రుడు' అనే పదాన్ని 'దైవదాసుడు' అన్న అర్థంలో తీసుకున్నారు. అలాగే 'తండ్రి' అనే పదాన్ని ప్రభువు అన్న భావంలో పరిగ్రహించారు. ఒకవేళ ఈ పదజాలం వారిని అప్పుడప్పుడూ సంశయానికి లోను చేసినప్పటికీ దేవుని ఏకత్వం (తౌహీద్)కి సంబంధించిన నిర్దిష్టమయిన పలుకులు వారి ఈ సంశయాలను దూరం చేసేవి. సత్య ప్రేమికుల విధానం సుస్పష్టమే–

వారెన్నడూ సందేహాస్పదమయిన విషయాలపై విశ్వాసాల పునాది నిలబెట్టరు. పైగా వారి భావాన్వయం కచ్చితమయిన ప్రబోధనలపై, నిర్దిష్టమయిన నియమ నిబంధనలపై ఆధారపడి ఉంటుంది. కాని పాల్ వ్యవహారం అలా కాదు. ఇంజీలులోని ఈ ప్రత్యేక పదజాలాలే పాల్ గారి పరిభాషకు, కొంగ్రొత్త పోకడకు ద్వారం తెరిచి వేశాయి. హెబ్రూ భాష తెలీకపోవటం వల్ల పాల్ గ్రీకు భాషలో ఉన్న సువార్తలపై ఆధారపడ్డాడు. గ్రీకు భాష దగ్గరకొచ్చేసరికి 'కుమారుడు', 'తండ్రి' పదాలు తమ మూల భావాల నుండి పూర్తిగా వేరైపోయాయి. అక్కడి నుంచే పాల్ గారి అతీంద్రియ జ్ఞాన అభిరుచికి 'టానిక్కు' లభించింది. మసీహ్ (ఏసు)ను దైవ వాక్కుగా కూడా అనటం వల్ల దానినే ప్రాతిపదికగా చేసుకుని అతను ఒక ఫిలాసఫీని కల్పించాడు. దాని ప్రకారం దివ్యవాక్కు (Logos) ఒక అత్యున్నతమయిన సృష్టి; విశ్వశక్తి (World Power) కాగా, మసీహ్ (ఏసుక్రీస్తు) ఈ అత్యున్నతమైన విశ్వశక్తి అవతారం (Incarnation), ప్రతిరూపం. అంతే, ఆనాటి నుంచే మర్యమ్ కుమారుడగు మసీహ్ (ఏసుక్రీస్తు–అ) దైవ కుమారుడు, దేవుడు అనే నవీన పోకడ సమాజంలో వ్రేళ్ళూనుకుంది.

పాల్ క్రీ.శ. 64లో మరణించాడు. ఆనాటి నుంచీ క్రీ.శ.4వ శతాబ్ది ప్రారంభం వరకూ ఈ వ్యవహారంపై క్రైస్తవుల మధ్య పెద్ద దుమారమే రేగింది. దీని ఆధారంగా అనేక మతాలు, కూటములు పుట్టుకువచ్చాయి. అయితే ఆ కాలపుచరిత్రను అధ్యయనం చేసిన విద్యార్థి దృష్టికి మూడు వర్గాలు మాత్రం ప్రస్ఫుటంగా కానవస్తాయి–

1. ఆర్యూసీ (ARIANS). వీరు ఆర్యుస్ (ARIUS)ను అనుసరించే వారు.
2. సాబీలీ (SABELLIASS). వీరు ఏసుక్రీస్తు (అ)ను దేవుని అవతారంగా భావిస్తారు. దేవుని దృక్కోణం (ASPECT) అని కూడా అంటారు.

3. త్రిత్వం (TRINITY)– అథాన్సియన్ (Athansian) దీనికి ప్రముఖ నాయకుడు. ఈ సిద్ధాంతాన్ని నమ్మేవారు ముగ్గురు దైవాల భావన వైపునకు పిలుపు ఇచ్చారు.

ఈ వర్గాలలో ఆర్యూసీలు మాత్రమే అసలు సిసలు క్రైస్తవానికి ప్రతినిధులు. ఇతర మతాల ఒత్తిడిపై వీళ్ళు కూడా – తరువాతి కాలంలో– మహనీయ ఏసుక్రీస్తు (మసీహ్– అలైహిస్సలామ్)ను మానవతా స్థానం కన్నా ఉన్నతునిగా భావించినప్పటికీ త్రిత్వానికి, అవతారానికి వ్యతిరేకంగా వారు సాగించిన సంఘర్షణ మాత్రం శ్లాఘనీయం.

క్రీ.శ. మూడవ శతాబ్ది చివర్లోనూ, 4వ శతాబ్ది ఆరంభంలోనూ ఒక ముఖ్య ఘటన సంభవించింది. మసీహ్ (ఏసుక్రీస్తు) 'దైవత్వ స్థానం– దాస్య స్థానం' గురించి క్రైస్తవ కూటములన్నింటినీ చాలా తీవ్రంగా ప్రభావితం చేసిన ఘటన అది. అప్పటికే రోమను చక్రవర్తులలో క్రైస్తవం బాగా వ్రేళ్ళూనుకుంది. అయితే క్రైస్తవ వర్గాలలో పొడసూపిన విభేదాలు రోమను సామ్రాజ్య శత్రువులకు సానుకూలంగా పరిణమించే అవకాశం ఉంది. ఈ కారణంగా కానిస్టాంటినోపుల్ తన పూర్వీకుల వ్యతిరేక భావనను విడనాడి క్రైస్తవానికి అనుకూల విధానాన్ని అవలంబించాడు. ఈ పాలసీలో భాగంగా అతను వివిధ కూటముల మధ్య ఉన్న విభేదాలను, వైరుధ్యాలను దూరం చేసి వాటన్నింటినీ ఒకే త్రాటిపైకి తెచ్చేందుకు కృషి చేశాడు. ఆ విధంగా మత విభేదాల వల్ల సామ్రాజ్యానికి నష్టం వాటిల్లకుండా జాగ్రత్త పడ్డాడు. ఈ కృషిలో భాగంగా అతను క్రీ.శ. 314లో అర్లీస్ చర్చిలో ఒక కౌన్సిల్‌ను రూపొందించాడు. కాని అది ఆశయ సాధనలో అంతగా ఉపయుక్తం కాలేదు. ఎట్టకేలకు క్రీ.శ. 325లో అతని ప్రోద్బలంపై 'నీసియా'లో చర్చికి సంబంధించిన ఒక జనరల్ కౌన్సిల్ ఏర్పాటు చేయ

బడింది. అప్పటికింకా అతను పూర్తిగా క్రైస్తవం పుచ్చుకోకపోయినప్పటికీ ఆ కౌన్సిల్‌కు అధ్యక్షత వహించాడు. ఆనాటి పరిస్థితుల దృష్ట్యా ఆ కౌన్సిల్ ఎనలేని ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆ కౌన్సిల్‌లో క్రైస్తవ మతానికి అన్ని వర్గాల, కూటముల వారికి, చర్చీలకు ప్రాతినిధ్యం లభించింది. అసలైన పోటీ ఆర్యూసీ వర్గానికీ– ఏసును దేవుని అవతారంగా నమ్మే వర్గం వారికి మధ్యనే. ఆ కౌన్సిల్ తీర్మానాలు అత్యంత ఆసక్తికరంగా ఉన్నాయి. ఈ కౌన్సిల్‌లో వృద్ధుడైన ఒక ఆర్యూసీ ప్రసంగించడానికి లేచి నిలబడ్డాడు. మర్యమ్ కుమారుడగు మసీహ్ (ఏసుక్రీస్తు–అ) సృష్టించబడిన మానవ మాత్రుడు అని అతను చెప్పనారంభించగానే ఒక వ్యక్తి లేచి అతని చెంప ఛెళ్ళుమనిపించాడు. అనేకమంది పాదరీలు, బిషప్‌లు తమ చెవులలో వ్రేళ్ళు పెట్టుకొని, మేము ఈ ముసలి పీనుగు చెప్పే అవిశ్వాస భరిత మయిన అధిక ప్రసంగాన్ని భరించలేము అంటూ పరుగులు తీయ సాగారు. కౌన్సిల్‌లోని సభ్యులు అత్యధికులు ఆర్యూసీకి వ్యతిరేకంగా ఉండటం వల్ల ఆర్యూసీ వర్గానికి పరాజయం తప్పలేదు. అనేక రోజులు జరిగిన సదస్సులో సుదీర్ఘ వాదోపవాదాలు, తర్జన భర్జనల అనంతరం మెజారిటీ సభ్యుల అభిప్రాయానుసారం క్రైస్తవ విశ్వాసం ఈ క్రింది పదజాలంతో రూపుదిద్దబడింది. అది 'నీసీన్ క్రీడ్' (NICENE CREED) పేరుతో ప్రసిద్ధి చెందింది. క్రైస్తవ విశ్వాసాల అధ్యాయంలో అది క్రీ.శ. 4వ శతాబ్ది నుంచి నేటివరకూ అత్యంత ముఖ్యమయిన దస్తావేజుగా పరిగణించబడుతుంది–

"మేము ఒకే దైవాన్ని విశ్వసిస్తున్నాము. ఆయనే తండ్రి– తిరుగులేని శక్తిమంతుడు. సమస్త గోచర అగోచర వస్తువులను సృష్టించినవాడు– ఇంకా ఏసు మసీహ్‌ని నమ్ముతున్నాము. ఆయన దేవుని కుమారుడు (దేవునిచే జనించినవాడు), ఒకే ఒక్కడు. తండ్రి అణువుతో, దేవాధి దేవుడు,

జ్యోతితో జ్యోతి, సాక్షాత్తూ దేవునితో దేవుడు, జననమివ్వబడినవాడు, చేయ బడినవాడు కాడు, తండ్రి సారంతోనే, ఆయన భూమి ఆకాశాలలోని సమస్త వస్తువులను చేశాడు. ఆయన మనుషులమైన మన కోసం, మన మోక్షం కోసం అవతరించాడు, మానవాకారంలో, ఆయన దుఃఖా వేదనను అనుభవించాడు, మరి మూడవ దినాన సజీవంగా లేచాడు, ఆకాశానికి ఎక్కిపోయాడు, మృతులు, సజీవుల తీర్పు కొరకు మళ్ళీ వస్తాడు, ఇంకా మేము పరిశుద్ధాత్మను నమ్ముతున్నాము."

"కాని ఆయన మొదట లేడని, సజీవుడవడానికి పూర్వం ఆయనకు ఉనికి లేదని, ఆయన ఏమీ లేని స్థితి నుండి ఉనికిలోకి వచ్చాడని వారం టున్నారు. లేదా వారిలా అంటున్నారు : దేవుని కుమారుడు వేరొక వస్తువుతో చేయబడ్డాడు లేదా వేరొక అణువుతో చేయబడినవాడు లేదా ఆయన సృష్టించబడినవాడు లేదా ఆయన మానవ మాత్రుడు. ఇలా అనేవారు కేథలిక్కుల, రసూలీ చర్చీల మాదిరిగా ధూత్కారులు."

నీసియా కౌన్సిల్ తర్వాత ఈ నమ్మకమే క్రైస్తవ జగతిలో అసలు సిసలు విశ్వాసంగా చెలామణీ అవుతూ ఉంది. ఈ ప్రకటన ద్వారా ఆర్యూసీలు పబ్లిగ్గా తిరస్కరించబడ్డారు. ఈ కౌన్సిల్ అనంతరం ఇది కేవలం చర్చీ ధర్మమే కాదు, రాజధర్మంగా కూడా మారింది. దాని మద్దతు కోసం ప్రభుత్వం తరఫున ఖడ్గం కూడా ఝుళిపించబడింది. అందువల్ల ఆర్యూస్ అనుయాయులు కూడా గత్యంతరం లేక దీనికి వత్తాసు పలక వలసి వచ్చింది.

ఎంత విచిత్రం! ఎంతటి గుణపాఠంతో కూడిన వ్యవహారమిది! ఏ క్రైస్తవులయితే మూడువందల సంవత్సరాల వరకూ మానవ దైవత్వాన్ని తిరస్కరించిన నేరానికి రోమను చక్రవర్తుల కరాళ దంష్ట్రాల కింద నలిగి పోయారో, రంపపు కోతలకు గురయ్యారో, అగ్నికి ఆహుతి అయ్యారో,

క్రూర మృగాలకు ఎరగా వేయబడ్డారో ఆ క్రైస్తవులే నీసియాలో సమావేశమై అవిశ్వాసియైన ఒక చక్రవర్తి సారథ్యంలో మసీహ్ (ఏసుక్రీస్తు) దైవత్వంపై, దేవుని అవతారం అన్న అంశంపై ధ్రువీకరణ ముద్ర వేసేశారు.

ఆ కౌన్సిల్ తరువాత ఆ తరహా సదస్సులు అనేకం జరిగాయి. తరువాతి శతాబ్దాలలో కూడా ఇలాంటి సదస్సుల పరంపర కొనసాగింది. అనేక పాక్షికమయిన విభేదాలు కూడా ఈ సందర్భంగా పొడసూపాయి. కొన్ని సందర్భాలలో ఆర్యూస్ సమర్థకులు కూడా గొంతు విప్పారు. తమ వాదనను గట్టిగా వినిపించారు. ఒక దశలో కానిస్టాంట్ నోపుల్ శిష్యుల్లో కూడా కొంతమంది ఆర్యూసీ పంథాను అనుసరించటం మొదలెట్టారు. అయితే ఇవన్నీ తాత్కాలికమైనవే. మొత్తమ్మీద ఇంతకుముందు ప్రస్తావించిన సిద్ధాంతమే ప్రాబల్యం వహించింది.

క్రైస్తవులలోని ఈ బహు దైవత్వపు విశ్వాసాలనే దివ్యఖుర్ఆన్ కూలంకషంగా ఖండించింది. మేము ఈ సందర్భంగా కొన్ని ఆయత్‌లను పొందుపరుస్తున్నాము.

قَالَتِ الْيَهُوْدُ عُزَيْرُنِ ابْنُ اللّٰهِ وَقَالَتِ النَّصٰرَى الْمَسِيْحُ
ابْنُ اللّٰهِ ذَالِكَ قَوْلُهُمْ بِاَفْوَاهِهِمْ يُضَاهِئُوْنَ قَوْلَ الَّذِيْنَ
كَفَرُوْا مِنْ قَبْلُ قَاتَلَهُمُ اللّٰهُ اَنّٰى يُؤْفَكُوْنَ (توبہ)

"ఉజైర్ అల్లాహ్ కుమారుడు" అని యూదులంటున్నారు. "మసీహ్ (ఏసుక్రీస్తు) అల్లాహ్ కుమారుడు" అని నసారా అంటున్నారు. ఇవి వారి నోటి మాటలు మాత్రమే. తమ పూర్వీకుల్లోని అవిశ్వాసులు చెప్పిన మాటలనే వీళ్ళూ అనుకరిస్తున్నారు. అల్లాహ్ వారిని నాశనం చెయ్యు! వారెలా (సత్యం నుండి) తిరిగిపోయారు!?

(దివ్యఖుర్ఆన్ -9: 30)

'ఇవి వారి నోటి మాటలు మాత్రమే'– అంటే ఇది అల్లాహ్ చెప్పినది కాదు. ఇది వీళ్ళ మనో కల్పితమయిన మాట. దైవగ్రంథంలో దీనికి సంబంధించిన 'ప్రమాణం' ఏదీలేదు. 'తమ పూర్వీకుల్లోని అవిశ్వాసులు చెప్పిన మాటలనే వీళ్ళూ అనుకరిస్తున్నారు'–అంటే అనాలోచితంగానే, అర్థం చేసుకోకుండానే పూర్వీకుల మాటలను వల్లెవేస్తున్నారు. వాస్తవాలను ఖుర్‌ఆన్ విడమరిచి చెప్పిన తరువాత అయినా కనీసం వారు ఆలోచిం చాల్సింది. కాని వారలా చేయలేదు.

అలాంటి వారినే ఉద్దేశించి ఖుర్‌ఆన్ వేరొకచోట ఇలా అంటోంది–

"గ్రంథ ప్రజలారా! మీ ధర్మం విషయంలో అతిగా ప్రవర్తించకండి. అల్లాహ్‌కు సత్యం తప్ప వేరే విషయాన్ని ఆపాదించకండి. మసీహ్, మర్యమ్ కుమారుడైన ఈసా అల్లాహ్ పంపిన ఒక ప్రవక్త. అల్లాహ్ మర్యమ్ వైపునకు పంపిన ఒక ఆజ్ఞ." ***(దివ్య ఖుర్‌ఆన్– 4: 171)***

ఇంకా ఈ విధంగా సెలవీయటం జరిగింది :

يَا أَهْلَ الْكِتَابِ لَا تَغْلُوا فِي دِينِكُمْ غَيْرَ الْحَقِّ وَلَا تَتَّبِعُوا أَهْوَاءَ قَوْمٍ قَدْ ضَلُّوا مِنْ قَبْلُ وَأَضَلُّوا كَثِيرًا وَضَلُّوا عَنْ سَوَاءِ السَّبِيلِ ۝

"గ్రంథ ప్రజలారా! మీ ధర్మం (దీన్) విషయంలో అన్యాయంగా హద్దులు మీరి ప్రవర్తించకండి. మీకు పూర్వం, స్వయంగా తామూ మార్గభ్రష్టులై, ఇంకా చాలామందిని మార్గభ్రష్టులుగా చేసి, రుజుమార్గం తప్పిపోయిన వారి ఊహాపోహలను అనుసరించ కండి." ***(దివ్యఖుర్‌ఆన్–5: 77)***

అంటే ఈ ఉపద్రవమంతటికీ మూలం 'పెద్దల,పూర్వీకుల ఆరాధనే'. తమ పెద్దల నుండి అనాదిగా వస్తున్న అపమార్గాన్ని వారు

గుడ్డిగా అనుసరిస్తున్నారు. ఈ అంధానుసరణే వారిని సిసలైన ధర్మోప దేశాలకు నోచుకోకుండా చేసింది.

మరికొన్ని ఆయతులలో వారి ఈ షిర్క్‌ను కుఫ్ర్ (తిరస్కార వైఖరి, అవిశ్వాసం)తో పోల్చటం జరిగింది. ఎందుకంటే షిర్క్ కూడా తన వాస్తవికత రీత్యా తిరస్కారమే (కుఫ్ర్ మార్గమే). ధర్మావలంబనలో భాగంగా కేవలం దైవాన్ని నమ్మితే సరిపోదు. పైగా ఆయనకు చెందిన సమస్త గుణగణాలతో సహా ఆయన్ని నమ్మి నడుచుకోవాలి. అలాకాకుండా– ముష్రిక్‌ల మాదిరిగా కేవలం దేవుని ఉనికిని అంగీకరిస్తే అది 'విశ్వాసం' అనిపించుకోదు. పైగా అది వాస్తవాన్ని ఒప్పుకోకపోవటంగా పరిగణించ బడుతుంది.

అల్ మాయిదా సూరాలో ఏమనబడిందో చూడండి :

لَقَدْ كَفَرَ الَّذِيْنَ قَالُوْآ اِنَّ اللّٰهَ هُوَ الْمَسِيْحُ ابْنُ مَرْيَمَ
قُلْ فَمَنْ يَّمْلِكُ مِنَ اللّٰهِ شَيْئًا اِنْ اَرَادَ اَنْ يُّهْلِكَ
الْمَسِيْحَ ابْنَ مَرْيَمَ وَاُمَّهٗ وَمَنْ فِي الْاَرْضِ جَمِيْعًا
وَلِلّٰهِ مُلْكُ السَّمٰوٰتِ وَالْاَرْضِ وَمَا بَيْنَهُمَا يَخْلُقُ مَا
يَشَآءُ وَاللّٰهُ عَلٰى كُلِّ شَيْءٍ قَدِيْرٌ (مائدہ)

"మర్యమ్ కుమారుడైన మసీహ్‌యే అల్లాహ్ అని అన్నవారు నిశ్చయంగా అవిశ్వాసానికి పాల్పడ్డారు. ప్రవక్తా! వారితో ఇలా అను : 'అల్లాహ్ గనక మర్యమ్ కొడుకైన మసీహ్‌నీ, ఆయన తల్లినీ, సమస్త భూలోక వాసులనూ నాశనం చెయ్యగోరితే, ఆయన తన ఈ సంకల్పాన్ని విరమించుకునేలా చేసే శక్తి ఎవరికుంది? అల్లాహ్ భూమికీ, ఆకాశాలకూ, వాటి మధ్యఉన్న సమస్తానికీ ప్రభువు.

తాను కోరిన దానిని సృష్టిస్తాడు. ఆయన అధికారం ప్రతి వస్తు వునూ ఆవరించి వుంది." *(దివ్య ఖుర్‌ఆన్ – 5: 17)*

ఏసుక్రీస్తును దేవుని అవతారంగా నమ్మేవారు ఈ ఆయత్‌లో సంబోధితులు. అల్లాహ్ తాను కోరిన దానిని సృష్టిస్తాడంటూ ఆయత్ చివరి భాగంలో వారి సిద్ధాంతాన్ని కొట్టివేయడం జరిగింది.

అంతేకాదు, ఈ దృక్పథాన్ని దివ్యఖుర్‌ఆన్ ఒకట్రెండు సార్లు కాదు, అనేకసార్లు– సందర్భోచితంగా– ప్రస్తావించి దీనిని నిర్ద్వంద్వంగా ఖండించింది. కొన్ని అధ్యాయాలలో దైవప్రవక్త హజ్రత్ యహ్యా (అలైహిస్సలామ్) పుట్టుకను ఏసు వృత్తాంతానికి 'భూమిక'గా ఖరారు చేయటం జరిగింది. సాధారణ ప్రక్రియకు విరుద్ధంగా జరిగే మనిషి పుట్టుకే గనక అతను దేవుడవటానికి 'నిదర్శనం' అనుకుంటే పురుషుడు పండు ముదుసలిగా స్త్రీ వంధ్యురాలిగా ఉండగా ఆ దంపతులకు అబ్బాయి పుట్టడం కూడా సాధారణ ప్రక్రియకు విరుద్ధమే మరి. మరలాంటప్పుడు మహనీయ యహ్యా (అలైహిస్సలామ్)ను దైవంగా అంగీకరిస్తారా?

అల్ మాయిదా సూరాలో ఇలా వుంది :

لَقَدْ كَفَرَ الَّذِينَ قَالُوٓا۟ إِنَّ ٱللَّهَ هُوَ ٱلْمَسِيحُ ٱبْنُ مَرْيَمَ
وَقَالَ ٱلْمَسِيحُ يَٰبَنِىٓ إِسْرَٰٓءِيلَ ٱعْبُدُوا۟ ٱللَّهَ رَبِّى وَرَبَّكُمْ
إِنَّهُۥ مَن يُشْرِكْ بِٱللَّهِ فَقَدْ حَرَّمَ ٱللَّهُ عَلَيْهِ ٱلْجَنَّةَ
وَمَأْوَىٰهُ ٱلنَّارُ ۖ وَمَا لِلظَّٰلِمِينَ مِنْ أَنصَارٍ ۝ لَّقَدْ كَفَرَ ٱلَّذِينَ
قَالُوٓا۟ إِنَّ ٱللَّهَ ثَالِثُ ثَلَٰثَةٍ ۘ وَمَا مِنْ إِلَٰهٍ إِلَّآ إِلَٰهٌ وَٰحِدٌ ۚ

"మర్యమ్ కుమారుడైన మసీహ్‌యే అల్లాహ్' అని అన్నవారు నిశ్చయంగా అవిశ్వాసానికి పాల్పడినట్లే. వాస్తవానికి మసీహ్ ఇలా

అన్నారు: 'ఇస్రాయీలు వంశీయులారా! అల్లాహ్‌కు దాస్యం చేయండి. ఆయన నాకూ ప్రభువే. మీకూ ప్రభువే. ఇతరులను అల్లాహ్‌కు భాగస్వాములుగా చేసేవారికి అల్లాహ్ స్వర్గాన్ని నిషిద్ధం చేశాడు. వారి నివాసం నరకం. అటువంటి దుర్మార్గులకు సహాయం అందించేవాడెవడూ లేడు. 'అల్లాహ్ ముగ్గురిలో ఒకడు' అని అన్నవారు నిశ్చయంగా అవిశ్వాసానికి పాల్పడినవారు. వాస్తవ మేమిటంటే దేవుడు ఒక్కడే. మరొక దేవుడు లేడు....

(దివ్య ఖుర్ఆన్ - 5 : 72, 73)

مَا الْمَسِيحُ ابْنُ مَرْيَمَ إِلَّا رَسُولٌ قَدْ خَلَتْ مِنْ قَبْلِهِ
الرُّسُلُ ۖ وَأُمُّهُ صِدِّيقَةٌ ۖ كَانَا يَأْكُلَانِ الطَّعَامَ ۗ

... మర్యమ్ పుత్రుడైన మసీహ్ ఒక ప్రవక్త తప్ప మరేమీ కాడు. ఆయనకు పూర్వం కూడా ఎంతోమంది ప్రవక్తలు గతించారు. ఆయన తల్లి సద్గుణ సంపన్నురాలు. వారు ఉభయులూ (ప్రతి రోజూ) భోజనం చేసేవారు. ***(దివ్యఖుర్ఆన్-5: 75)***

ఈ ఆయత్‌లలో అవతారం, త్రిత్వం – ఈ రెండింటినీ నమ్మేవారి విధానం ఖండించబడింది. ఈ రెండు వర్గాల వారి వాదనకు వ్యతిరేకంగా మర్యమ్ కుమారుడైన మసీహ్ (ఏసుక్రీస్తు– అ) స్వయంగా చేసిన ప్రబోధన ఇది–

"అల్లాహ్ దాస్యమే చేయండి. ఆయనే నాకూ ప్రభువు, మీకునూ ప్రభువు."

ఇంజీలులో మసీహ్ (ఏసుక్రీస్తు–అ) 'నా తండ్రి, మీ తండ్రి' అని మాటిమాటికీ పలికిన పలుకులు పునరావృతమవుతుంటాయి. దివ్య ఖుర్ఆన్ దానికి ఖచ్చితంగా చేసిన భావాన్వయం ప్రకారం ఆయన 'నా

ప్రభువూ, మీ ప్రభువు' అని చెప్పేవారు. హెబ్రూ భాషలో 'అబ్' అనే పదం తండ్రి కోసం, ప్రభువు కోసం కూడా ప్రయోగించబడేది అని ఇంతకు ముందు తెలుసుకున్నాం.

అల్ మాయిదా సూరాలోని 75వ ఆయత్ చివర్లో తల్లీ కొడుకు లిద్దరూ భోజనం చేసేవారని కూడా ఉంది. ఇది వారిద్దరూ మానవ మాత్రు లనడానికి ఒక నిదర్శనంగా చెప్పబడింది. భోజనం చేయడం మానవ సహజమయిన అవసరం అనే వాదన ఆనాడు బనీ ఇస్రాయీల్‌లో కూడా బలంగా వినిపించేది. దైవప్రవక్త హజ్రత్ ఇబ్రాహీమ్ (అలైహిస్సలామ్) వద్దకు దైవదూతలు మానవాకారంలో విచ్చేసినప్పుడు ఆయన వారికి భోజనం సమర్పించారు. కాని వారు భోజనం పట్ల ఏమాత్రం ఆసక్తి కనబరచకపోవటంతో, బహుశా వారు మానవమాత్రులు కారేమోనని ఇబ్రాహీమ్ (అ) లోలోపలే భయాందోళన చెందారు.

ఇంజీలు (లూకా)లో వచ్చిన ఒక సంఘటన ప్రకారం మర్యమ్ కుమారుడగు ఈసా (ఏసుక్రీస్తు–అ) స్వయంగా భోజనం చేసి తానొక మానవమాత్రుడినని తన శిష్యులైన హవారీలకు నమ్మబలికారు. లేపుకో బడిన తరువాత ఆయన మళ్ళీ తన శిష్యుల దగ్గరకు వచ్చినప్పుడు, ఆయన్ని చూసి వారు కలవరం చెందారు. ఆయన మాటలు విన్నప్పుడు, బహుశా ఏదో ఆత్మ తమతో మాట్లాడుతూ ఉందేమోనని వారికి అనుమానం వచ్చింది. హజ్రత్ మసీహ్ (ఏసుక్రీస్తు) తన శిష్యుల శంకను ఏ విధంగా దూరం చేశారో ఇంజీలులో వివరంగా వచ్చింది :

> **.... అప్పుడాయన మీరెందుకు కలవరపడుచున్నారు? మీ హృదయ ములలో సందేహము పుట్టనేల? నేనే ఆయనను అనుటకు నా చేతులను, నా పాదములను చూడుడి; నన్ను పట్టి చూడుడి, నాకు న్నట్టుగా మీరు చూచుచున్న యెముకలును మాంసమును**

భూతమున కుండవని చెప్పి, తన చేతులను పాదములను వారికి చూపెను. అయితే వారు సంతోషము చేత ఇంకను నమ్మక ఆశ్చర్యపడుచుండగా ఆయన- ఇక్కడ మీ వద్ద ఏమైన ఆహారం కలదా అని వారినడిగెను. వారు కాల్చిన చేప ముక్కను ఆయన కిచ్చిరి. ఆయన దానిని తీసుకొని వారి యెదుట భుజించెను.

(లూకా- 24: 38-42)

ఈ సందర్భంగా దివ్యఖుర్ఆన్‌లోని ఆ గొప్ప సూరాను కూడా ఒకసారి మననం చేసుకోవాలి. అది క్రైస్తవులలోని బహుదైవత్వపు అప మార్గాన్ని నిర్ద్వంద్వంగా ఖండించే సమగ్ర సూరా. అదే సూరయె ఇఖ్లాస్.

قُلْ هُوَ اللّٰهُ اَحَدٌ○ اَللّٰهُ الصَّمَدُ○ لَمْ يَلِدْ وَ لَمْ يُوْلَدْ○ وَلَمْ يَكُنْ لَّهٗ كُفُوًا اَحَدٌ○ (۱-۴)

"ఇలా చెప్పెయ్యి, ఆయన అల్లాహ్, అద్వితీయుడు. అల్లాహ్ నిరపేక్షాపరుడు. ఎవరి ఆధారమూ, ఎవరి అక్కరా లేనివాడు; అందరూ ఆయనపై ఆధారపడేవారే. ఆయనకు సంతానం ఎవరూ లేరు. ఆయన కూడా ఎవరి సంతానమూ కాదు. ఆయనకు సరిసమానులు ఎవరూ లేరు." ***(దివ్యఖుర్ఆన్- 112 : 1-4)***

ఈ సూరాలోని ఒక్కొక్క పదం, ఒక్కొక్క వాక్యంలోని బరువును అర్థం చేసుకోవటానికి, వెనుకటి పంక్తుల్లో మేము ప్రస్తావించిన నీసియా కౌన్సిల్ తీర్మానాన్ని మరోసారి చదవండి. దానిని గురించి మరోసారి కాస్త ఆలోచించండి- సూరయె ఇఖ్లాస్ ఏ విధంగా ఆ తీర్మానంలోని ఒక్కొక్క వాక్యాన్ని తూర్పారబట్టిందో మీకే బోధపడుతుంది. ఈ కారణంగానే ఒకానొక కాలంలో క్రైస్తవులు ఈ సూరా ప్రస్తావన రాగానే చిర్రెత్తేవారు. విసుగును ప్రదర్శించేవారు. ఎవరయినా క్రైస్తవ మతం స్వీకరించదలచి

తమ వద్దకు వచ్చినప్పుడు – క్రైస్తవ మత స్వీకార సమయంలో – సూరయె ఇఖ్లాస్‌లో ప్రస్తావించబడిన గుణాలు కల దైవాన్ని ఆ వ్యక్తి చేత శపింప జేసేవారు. (అల్లాహ్ శరణు)

ఇక్కడివరకూ మనం పండితులను, సన్యాసులను, మసీహ్ (ఏసుక్రీస్తు)ను 'ప్రభువు'గా చేసుకున్న వైనం గురించి తెలుసుకున్నాం. అయితే దివ్యఖుర్‌ఆన్ గ్రంథవహుల మరికొన్ని బహుదైవోపాసనా చేష్టలను కూడా ప్రస్తావించి, వారిని నేరస్తులుగా ఖరారు చేసింది. ఉదాహరణకు,

يَاأَيُّهَا الَّذِينَ أُوتُوا الْكِتَابَ آمِنُوا بِمَا نَزَّلْنَا مُصَدِّقًا لِمَا مَعَكُمْ مِنْ قَبْلِ أَنْ نَطْمِسَ وُجُوهًا فَنَرُدَّهَا عَلَى أَدْبَارِهَا أَوْ نَلْعَنَهُمْ كَمَا لَعَنَّا أَصْحَابَ السَّبْتِ ط وَكَانَ أَمْرُ اللَّهِ مَفْعُولًا ۝ إِنَّ اللَّهَ لَا يَغْفِرُ أَنْ يُشْرَكَ بِهِ وَيَغْفِرُ مَا دُونَ ذَلِكَ لِمَنْ يَشَاءُ وَمَنْ يُشْرِكْ بِاللَّهِ فَقَدِ افْتَرَى إِثْمًا عَظِيمًا ۝ أَلَمْ تَرَ إِلَى الَّذِينَ يُزَكُّونَ أَنْفُسَهُمْ بَلِ اللَّهُ يُزَكِّي مَنْ يَشَاءُ وَلَا يُظْلَمُونَ فَتِيلًا ۝ انْظُرْ كَيْفَ يَفْتَرُونَ عَلَى اللَّهِ الْكَذِبَ وَكَفَى بِهِ إِثْمًا مُبِينًا ۝ أَلَمْ تَرَ إِلَى الَّذِينَ أُوتُوا نَصِيبًا مِنَ الْكِتَابِ يُؤْمِنُونَ بِالْجِبْتِ وَالطَّاغُوتِ وَيَقُولُونَ لِلَّذِينَ كَفَرُوا هَؤُلَاءِ أَهْدَى مِنَ الَّذِينَ آمَنُوا سَبِيلًا (۴۷ ـ ۵۱ نساء)

"గ్రంథం వొసగబడిన ప్రజలారా! మేము ఇప్పుడు అవతరింపజేసిన గ్రంథాన్ని విశ్వసించండి. అది, మీ వద్ద పూర్వం నుండే ఉన్న

గ్రంథాన్ని ధ్రువపరుస్తుంది, సమర్థిస్తుంది. మేము ముఖాలను వికృతం చేసి వెనక్కి తిప్పకముందే, లేక మేము సబ్బత్ వారిని శపించినట్లుగా వారినీ శపించకముందే, దీనిని విశ్వసించండి. అల్లాహ్ ఆజ్ఞ తప్పకుండా అమలుపరచబడుతుందని గుర్తు పెట్టుకోండి. అల్లాహ్ క్షమించనిది కేవలం షిర్క్‌ను మాత్రమే. అది తప్ప ఏ పాపాన్ని అయినా ఆయన తాను ఇష్టపడిన వారి కొరకు క్షమిస్తాడు. ఇతరులను అల్లాహ్‌కు భాగస్వాములుగా చేసేవాడు ఎంతో ఘోరమయిన అబద్ధాన్ని కల్పించాడు అన్నమాట! ఎంతో తీవ్రమయిన పాపపు మాట అన్నాడన్నమాట!! తమ ఆత్మపరిశుద్ధతను గురించి గొప్పలు చెప్పుకునే వారిని కూడా మీరు గమనించారా? నిజానికి పరిశుద్ధతను అల్లాహ్‌యే తాను కోరిన వారికి ప్రసాదిస్తాడు. (వారికి పరిశుద్ధత లభించకపోతే) వారికి రవ్వంత అన్యాయం కూడా జరిగినట్లు కాదు. చూశారా! వారు అల్లాహ్‌పై లేనిపోని అభాండాలు వెయ్యటానిక్కూడా జంకడం లేదు. వారు స్పష్టంగా పాపాత్ములని చెప్పటానికి ఈ ఒక్క పాపం చాలు. గ్రంథ జ్ఞానంలో కొంతభాగం ఇవ్వబడిన వారిని నీవు చూడలేదా? వారి పరిస్థితి ఎలా ఉందంటే, వారు 'జిబ్త్'ను, 'తాగూత్'ను నమ్ముతారు. ఇంకా వారు అవిశ్వాసులను గురించి, 'విశ్వాసులకంటే వీరే చాలా వరకు సరైన మార్గంలో ఉన్నారు' అని అంటారు.

(దివ్యఖుర్ఆన్- 4: 47-51)

ఈ వచనాలలో గ్రంథవహులకు పిలుపు ఇవ్వటం జరిగింది- ఖుర్ఆన్‌ను విశ్వసించండి అని. దాంతోపాటే విశ్వసించని పక్షంలో ముఖాలను వికృతం చేసివేసే శిక్ష పొంచి ఉందని హెచ్చరించటం కూడా జరిగింది. శనివారం ఆజ్ఞను ఖాతరు చేయనివారికి పట్టిన దుర్గతే వారికీ

పడుతుందని భయపెట్టడం జరిగింది. కళ్ళు, చెవులు, మనో మస్తిష్కాలు ప్రసాదించబడినది ఎందుకు? దైవ ప్రసాదితమయిన ఆ వస్తువుల ద్వారా ప్రయోజనం పొందాలనే కదా! ఒకవేళ ఏ జాతి వారయినా ఆ అనుగ్రహ భాగ్యాలను పొందిన మీదట కూడా వాటి ద్వారా లబ్ధి పొందకపోతే, దైవ వచనాలు వారి కంటికి కానరాకపోతే, వారి చెవులకు వినిపించకపోతే, ఇక ఆ అనుగ్రహ భాగ్యాలను వారికి దూరం చేయటమే తగినది. ఆ తరువాత అల్లాహ్ 'షిర్క్'ను సుతరామూ క్షమించడని చెప్పడం జరిగింది. అయితే అది మినహా మిగిలిన తప్పులను అల్లాహ్ తాను కోరుకున్న వారి కొరకు మన్నిస్తాడు. ఆ తరువాత గ్రంథవహుల మూడు రకాల షిర్క్ పనులు ప్రస్తావించబడ్డాయి.

1) తమ ఆత్మ పరిశుద్ధతను గురించి గొప్పలు చెప్పుకోవటం.
2) 'జిబ్త్'ను, 'తాగూత్'ను నమ్మటం.
3) షిర్క్‌ను సమర్థించటం.

ఈ మూడు రకాల షిర్క్‌ను గురించి మేమిక్కడ విశదీకరించ దలిచాము- అయితే విషయాన్ని సాగదీయకుండా, క్లుప్తంగా వివరిస్తాము.

1) ఆత్మపరిశుద్ధత గురించి గొప్పలు చెప్పుకోవటం

ఏమిటి, తమ ఆత్మ పవిత్రత గురించి గొప్పలు చెప్పుకునే వారిని మీరు చూడటం లేదా? అన్న ఖుర్ఆన్ ఆయత్ వాస్తవానికి యూదుల, క్రైస్తవుల నేపథ్యంలోనే ఉంది. ఉదాహరణకు- అల్ మాయిదా సూరాలోని ఈ ఆయత్‌ను చదవండి-

وَقَالَتِ الْيَهُودُ وَالنَّصٰرٰى نَحْنُ اَبْنٰٓؤُا اللّٰهِ وَاَحِبَّآؤُهٗ ؕ
قُلْ فَلِمَ يُعَذِّبُكُمْ بِذُنُوْبِكُمْ ؕ بَلْ اَنْتُمْ بَشَرٌ مِّمَّنْ خَلَقَ ؕ
يَغْفِرُ لِمَنْ يَّشَآءُ وَيُعَذِّبُ مَنْ يَّشَآءُ ؕ

"మేము అల్లాహ్ పుత్రులం – ఆయనకు ప్రీతిపాత్రులం" అని యూదులు, క్రైస్తవులు అంటారు. వారిని ఇలా అడుగు; "అయితే ఆయన మీ పాపాలకు మిమ్మల్ని ఎందుకు శిక్షిస్తున్నాడు. వాస్తవానికి మీరు కూడా అల్లాహ్ సృష్టించిన ఇతర మానవుల్లాంటి మానవులే. ఆయన తాను కోరిన వారిని క్షమిస్తాడు. తాను కోరిన వారిని శిక్షిస్తాడు." ***(దివ్యఖుర్ఆన్ – 5: 18)***

సూరయె జుముఅహ్‌లో ఈ విధంగా సెలవీయబడింది :

قُلْ يَآأَيُّهَا الَّذِينَ هَادُوٓا إِن زَعَمْتُمْ أَنَّكُمْ أَوْلِيَآءُ
لِلَّهِ مِن دُونِ النَّاسِ فَتَمَنَّوُا الْمَوْتَ إِن كُنتُمْ صَٰدِقِينَ ۝

వారితో ఇలా అను : 'యూదులైపోయిన ప్రజలారా! ఒకవేళ మిగతా ప్రజలందరికంటే మీరు మాత్రమే అల్లాహ్‌కు ప్రియమైన వారు అనే గర్వం మీకు ఉంటే, చావును కోరుకోండి – మీరు సత్యవంతులే అయితే.' ***(దివ్యఖుర్ఆన్ – 62: 6)***

వెనుకటి పంక్తుల్లో మనం 'బహు దైవారాధకుల స్వయంపూజ' అనే అంశంపై వ్రాసిన దానిని అర్థం చేసుకునేందుకు ఇక్కడ స్థూలంగానయినా దానిపై ఓసారి దృష్టిని సారించవలసిన అవసరం ఉంది. బహుదైవారాధకుల, గ్రంథవహుల ఆంతర్యాలు ఈ విషయంపై సమరసం చెందుతున్నాయని ఖుర్ఆన్ అనేకచోట్ల ప్రస్తావించింది. ఇది కూడా ఆ సామ్యంలో ఒక రకమే. ఒకప్పుడు (అరబ్బు) ముష్రిక్కులు పవిత్ర కాబాగృహం మూలంగా మానవ కోటిని ఆకర్షించారు. కాబా గృహం కారణంగా వారి గౌరవ ప్రతిష్టలు ఇనుమడించాయి. శాంతిభద్రతలు నెలకొన్నాయి. తత్ఫలితంగా వారు సుఖప్రదమయిన జీవితం గడిపారు. అయితే ఈ సుఖశాంతులకు ప్రధాన కారణం తమలోని యోగ్యతేనని, ఇదంతా తమ వంశపరంపరకు

గల మహిమేనని, తమ పూర్వీకులు చేసుకున్న పుణ్యఫలం వల్లనే తాము దర్జాగా బ్రతుకుతున్నామని అరబ్బులు భావించసాగారు. తాము ఎల్లకాలం ఇలాగే వర్థిల్లుతామని, ఇది తమ తాత ముత్తాతల నుండి తమకు వారసత్వంగా సంక్రమించిన సిరి అని నమ్మసాగారు. సరిగ్గా ఇదే ఆలోచన గ్రంథం కల ప్రజలలో కూడా మొగ్గ తొడిగింది. తాము దేవునిచే ప్రత్యేకంగా ఎంపిక చేసుకోబడిన ప్రాణులవటం చేతనే, దైవానికి తాము ప్రియతములం అవటం చేతనే దేవుడు తమను విశేషంగా కటాక్షించాడని యూదులు, క్రైస్తవులు నమ్మేవారు.

తౌరాతు గ్రంథంలో ఏ గౌరవోన్నతులయితే ప్రజల గుణగణాలతో, విశిష్ఠ నైతిక నడవడికతో ముడిపెట్టబడ్డాయో, వాటన్నింటినీ గ్రంథవహులు తమ జాతికి, తమ సంతతికి ప్రత్యేకించుకున్నారు. ఈ భ్రమకు లోనవటం తోనే తాము ఇబ్రాహీమ్, ఇస్‌హాఖ్, యాకూబ్ (అలైహిముస్సలామ్)ల సంతానమన్న మితిమీరిన ధీమా వారిలో చోటుచేసుకుంది. దైవసామీప్యం పొందడానికి, దేవుని పట్టు నుండి విముక్తి పొందడానికి ఈ మహనీయుల సంతతి వారమన్న ధ్రువపత్రం ఒక్కటి చాలని భావించారు. తాము సదాచరణ చేయకపోయినా, దైవానికి విధేయత కనబరచకపోయినా చాలనుకున్నారు. ఈ మితిమీరిన ధీమాయే వారిని అలసత్వానికి, నిర్లక్ష్యానికి గురిచేసింది. ఒకవేళ తమను నరకాగ్ని తాకినా, అది కొన్నేళ్ళేనని, తాము ఎల్లకాలం నరక యాతనకు లోను కాబోమని చెప్పారు. అంతేకాదు, ఇకమీదట ఈ జగతికి ధర్మం (దీన్), విశ్వాసానికి (ఈమాన్)కి సంబంధించిన వెలుగు ఎవరి ద్వారానయినా లభించగలదంటే, వారు తామేనని సగర్వంగా చెప్పుకున్నారు. తాము తప్ప ఇతర జాతుల వారికి మార్గదర్శకత్వం వహించే అవకాశం లేదని అన్నారు. జాతి అంటే మా జాతే. ప్రవక్త

అంటే మా ప్రవక్తే. మార్గబోధన అంటే మా మార్గబోధనే. మేము నిర్దేశిం చేదే సత్యపథం. అన్యులు నిర్దేశించేది మార్గభ్రష్టతే అని తలపోశారు.

యూదుల ఈ మితిమీరిన ధీమాను చూసే మర్యమ్ కుమారుడగు ఈసా (ఏసుక్రీస్తు– అలైహిస్సలామ్) వారితో ఇలా అన్నారు: మీరు ఇబ్రాహీమ్ సంతతి వారమని మిడిసి పడకండి. దేవుడు ఇబ్రాహీమ్ కొరకు భూమి రేణువులతో సంతతిని పుట్టించగలడు.

వారి ఈ ఆలోచనలన్నింటినీ దివ్యఖుర్ఆన్ అల్ బఖరా సూరా లోను, ఇతర చోట్లనూ పొందుపరిచింది. వారు ఒట్టి ఆకాంక్షలతో ఊపిరి పీలుస్తున్నారనీ, ఊహాలోకాల్లో విహరిస్తున్నారనీ, బంగారు పూత ఎక్కించ బడిన మాటలు చెప్పి చెలామణీ అవుతున్నారని చెప్పింది. వారిలో తిష్ట వేసిన ఒక్కో మూఢనమ్మకాన్ని ఖండించింది. వారి ఈ నిరాధారమయిన ఊహలే వారిని దైవమార్గదర్శనానికి నోచుకోకుండా చేశాయని ఖరారు చేసింది. వారిని దైవప్రవక్తల మధ్య విచక్షణ పాటించే అపరాధులుగా నిర్ధారించింది. చివరకు వారిని ఇస్లామ్‌కు, దైవదాస్యానికి, ఇఖ్లాస్ (అంటే తౌహీద్)కి సయితం దూరమైన వారుగా ఖరారు చేసింది. 'యూదులుగా నయినా మారండి లేదా క్రైస్తవులుగానయినా మారండి– సన్మార్గం పొందుతార'న్న వారి పిలుపు స్థానే మధ్యస్థ సమాజం (ముస్లిం సము దాయం) కలిమా ఏదో వివరించింది :

قُولُوٓا آمَنَّا بِاللّٰهِ وَمَآ أُنْزِلَ إِلَيْنَا وَمَآ أُنْزِلَ إِلٰى إِبْرَاهِيمَ
وَإِسْمٰعِيلَ وَإِسْحٰقَ وَيَعْقُوبَ وَالْأَسْبَاطِ وَمَآ أُوتِيَ
مُوسٰى وَعِيسٰى وَمَآ أُوتِيَ النَّبِيُّونَ مِنْ رَّبِّهِمْ لَا نُفَرِّقُ
بَيْنَ أَحَدٍ مِّنْهُمْ وَنَحْنُ لَهُ مُسْلِمُونَ ○ فَإِنْ آمَنُوا بِمِثْلِ
مَآ آمَنْتُمْ بِهِ فَقَدِ اهْتَدَوْا وَإِنْ تَوَلَّوْا فَإِنَّمَا هُمْ فِي

شِقَاقٍ فَسَيَكْفِيكَهُمُ اللّٰهُ ۚ وَهُوَ السَّمِيعُ الْعَلِيمُ ۝
صِبْغَةَ اللّٰهِ ۚ وَمَنْ اَحْسَنُ مِنَ اللّٰهِ صِبْغَةً ۫ وَّنَحْنُ
لَهٗ عٰبِدُوْنَ ۝ قُلْ اَتُحَآجُّوْنَنَا فِى اللّٰهِ وَهُوَ رَبُّنَا وَرَبُّكُمْ
وَلَنَآ اَعْمَالُنَا وَلَكُمْ اَعْمَالُكُمْ وَنَحْنُ لَهٗ مُخْلِصُوْنَ ۝
(بقرہ ۱۳۶-۱۳۹)

వారితో ఇలా అనండి : "మేము అన్ని మార్గాలనూ విసర్జించి, ఒక్క ఇబ్రాహీము మార్గాన్నే అనుసరిస్తాము. ఇబ్రాహీము ముష్రిక్కుల లోని వాడు కాడు" ముస్లిములారా! ఇలా ప్రకటించండి- "మేమంతా అల్లాహ్‌నూ, ఆయన మా వైపునకు పంపిన హితోప దేశాన్నీ విశ్వసించాము. ఇంకా ఇబ్రాహీము, ఇస్మాయీలు, ఇస్‌హాఖు, యాఖూబు, యాఖూబు సంతానంపై అవతరించిన దానినీ మూసాకూ, ఈసాకూ ఇతర ప్రవక్తలందరికీ వారి ప్రభువు ప్రసాదించిన దానినీ మేము విశ్వసించాము. వారిలో ఏ ఒక్కరి పట్లా మేము భేదభావం చూపము. మమ్మల్ని మేము ముస్లిములుగా అల్లాహ్‌కు సమర్పించుకున్నాము." మీరు విశ్వసించినట్లే వారూ విశ్వసిస్తే, అప్పుడు వారు ధర్మమార్గంలో ఉన్నట్లు. కాని, వారు ఒకవేళ దీనికి వైముఖ్యం చూపితే, కేవలం వైషమ్యంతో మంకుపట్టు పడుతున్నారన్నది విశదము. కనుక వారి బారి నుండి మిమ్మల్ని ఆదుకునేందుకు అల్లాహ్ చాలు. మీరు నిశ్చింతగా ఉండండి. ఆయన అన్నీ వింటాడు, ఆయనకు అన్నీ తెలుసు. వారితో ఇలా చెప్పండి : "అల్లాహ్ రంగును స్వీకరించండి. అల్లాహ్ రంగు కంటే మరెవరి రంగు శ్రేష్ఠతరమైనది? మేము కేవలం ఆయననే ఆరాధి స్తాము." ప్రవక్తా! వారితో ఇలా అను: "అల్లాహ్ విషయంలో మీరు

మాతో వాదులాడుతున్నారా? వాస్తవానికి ఆయనే మాకూ ప్రభువు, మీకూ ప్రభువు. మా కర్మలు మాకు. మీ కర్మలు మీకు. మేమైతే మా దాస్యాన్ని కేవలం అల్లాహ్‌కే ప్రత్యేకం చేసుకున్నాము.'

(దివ్యఖుర్ఆన్‌- 2: 136-139)

ఈ ఆయత్‌లోని క్రింది అంశాలను చూడండి-

1) మేము ఆయనకే విధేయత చూపుతాము
2) మేము ఆయన్నే ఆరాధిస్తాము
3) మేము మా దాస్యాన్ని (ఆరాధనను) కేవలం ఆయనకే ప్రత్యేకం చేసుకుంటాము.

ఈ 'పదాలు' ప్రత్యేకంగా గమనించదగినవి. ఈ మూడు పదాల లోనూ గ్రంథవహులపై ఆక్షేపణ ఉంది. గ్రంథ వహులారా! మీరు దైవ విధేయులూ కారు, దైవారాధకులు కూడా కారు. ఏకేశ్వరోపాసకులు అసలే కారు. దైవ విధేయుడు, దైవారాధకుడైనవాడు నికార్సయిన ఏక దైవా రాధకుడై ఉంటాడు. అతను పూర్తిగా అల్లాహ్ రంగులో రంగరించబడిన వాడై ఉంటాడు. అతను యూద, క్రైస్తవ రంగుల్లో ఉండడు. అతను దైవ మార్గదర్శకత్వం ప్రకారం నడుచుకుంటాడు. ఆ మార్గదర్శకత్వం ఏ రూపంలో, ఏ భాషలో వచ్చినాసరే దానిని స్వాగతిస్తాడు. అతను దైవ ప్రవక్తలందరినీ విశ్వసిస్తాడు- ఆ ప్రవక్తలు ఏ వంశంలో, ఏ ప్రాంతంలో ప్రభవించిన వారైనాసరే- వారి మధ్య భేదభావం పాటించడు. ఒకరిని నమ్మి మరొకరిని నిరాకరించడం లాంటిది చేయడు. భేదభావం పాటించే మాటైతే అది దేవుని ఏకత్వాన్ని (తౌహీద్)కి విరుద్ధం అవుతుంది. అది దైవారాధన కానేకాదు. అది జాతి పూజ అవుతుంది. తమ తమ వంశపు ప్రవక్తల పూజ అవుతుంది.

ఈ ఆయత్ ముస్లింలు సయితం శ్రద్ధతో గమనించదగినదే. (ముస్లింలలో) ఎవరయితే తమ తమ ఇమాముల దురభిమానంలో చిక్కుకుని ఉన్నారో, వారు తమ ఇమాముల, తమ వర్గీయులలోనే సత్యం, సన్మార్గం ఉందని గిరిగీసుకుంటారు. ఈ సందర్భంగా ఇలాంటి వారు ఆలోచించాలి- ఒకవేళ ఎవరో ఒక ప్రవక్త లేక ప్రవక్తల ఒక సమూహం చెప్పే మాటపై పాతుకుపోవడం సమ్మతం కాదనుకుంటే, అది ఏకేశ్వరో పాసనకు విరుద్ధం అనుకుంటే మరి సత్యాన్ని కేవలం ఒక ఇమామ్ లేక ఒకే పంథాకు చెందిన విద్వాంసులకు పరిమితం చేయటం దైవారాధన, దైవ విధేయత ఎలా అవుతుంది? అది తౌహీద్‌తో, ప్రవక్త విధానం (సంప్రదాయం)తో ఎలా పొసగుతుంది?

2) 'జిబ్త్', 'తాగూత్'లపై విశ్వాసం

'జిబ్త్'లో కనికట్టు, గారడీ, తాయెత్తులు, రక్షరేకులు, మంత్రించిన తాళ్ళు లాంటివన్నీ వస్తాయి.

బైబిల్ హిస్టరీని, యూదుల చరిత్రను శోధించినప్పుడు, వారు క్షుద్ర విద్యకు సంబంధించిన మెళకువలన్నీ నేర్చుకున్నారన్న సంగతి తెలుస్తుంది. ఈ వస్తువులు ప్రతి యుగంలోనూ మతావలంబీకుల పాలిట ఒక పరీక్ష గానే ఉన్నాయి. మత ధర్మానికి చెందిన ప్రబోధనలు సాదాసీదాగానూ, సూటిగానూ ఉండటం వల్ల మనిషిలోని మనసు కొంతకాలం తరువాత మాయల వైపునకు, ఆసక్తికరమయిన విషయాల వైపునకు ఆకర్షితమవు తుంది. అలాంటప్పుడే ఈ క్షుద్ర విద్య ప్రాచుర్యంలోకి వస్తుంది. ఇది సదా మతధర్మం ఇచ్చే స్ఫూర్తిని అంతమొందిస్తుంది. ఏనాడయితే మానవ సముదాయంలో ఈ క్షుద్ర విద్య ప్రబలుతుందో ఆనాటి నుంచే మత ప్రబో ధనలు పతన దిశలో పోవటం ప్రారంభిస్తాయి. క్షుద్ర విద్య వైపునకు

ఆకర్షితులైన వారు దైవగ్రంథ ప్రబోధనలకు దూరమవటం తథ్యం. ఎందుకంటే ఇవి రెండూ వేర్వేరు సరోవరాలు. వాటిలో ఒక దాని ఉత్పత్తి స్థానం షైతానయితే, రెండవ దానికి మూలం కరుణామయుడైన దైవం. షైతాన్‌తో సంబంధం ఏర్పరచుకున్న వారు కరుణామయుడైన దైవానికి దూరమవటం తథ్యం. ఇలాంటి వారు ప్రవక్తల ప్రబోధనలను, దైవగ్రంథంలోని ఉప దేశాలను వీపు వెనుక పడవేస్తారు. యూదుల పరిస్థితి అచ్చం ఇలాగే తయారయింది. దివ్యఖుర్ఆన్‌లో వారి ఈ 'జిబ్త్' దాస్యం గురించి ఇలా చెప్పబడింది:

وَلَمَّا جَآءَهُمْ رَسُولٌ مِّنْ عِنْدِ اللّٰهِ مُصَدِّقٌ لِّمَا
مَعَهُمْ نَبَذَ فَرِيقٌ مِّنَ الَّذِينَ أُوتُوا الْكِتَابَ ۙ
كِتٰبَ اللّٰهِ وَرَآءَ ظُهُورِهِمْ كَأَنَّهُمْ لَا يَعْلَمُونَ ۝ وَاتَّبَعُوا
مَا تَتْلُوا الشَّيَاطِينُ عَلٰى مُلْكِ سُلَيْمٰنَ ۚ وَمَا كَفَرَ سُلَيْمٰنُ
وَلٰكِنَّ الشَّيٰطِينَ كَفَرُوا يُعَلِّمُونَ النَّاسَ السِّحْرَ وَمَآ
أُنْزِلَ عَلَى الْمَلَكَيْنِ بِبَابِلَ هَارُوتَ وَمَارُوتَ ۚ

"వారి వద్ద పూర్వం నుంచే ఉన్న దైవగ్రంథాన్ని ధ్రువపరుస్తూ ఏ ప్రవక్త అయినా అల్లాహ్ తరఫు నుండి వచ్చినప్పుడు, గ్రంథ ప్రజలలోని ఒక వర్గం వారు అల్లాహ్ గ్రంథాన్ని, దానిని గురించి ఏమీ తెలియనివారుగా త్రోసి పుచ్చారు. సులైమాను రాజ్యం పేరు చెప్పి షైతానులు ప్రచారం చేసే విషయాలను వారు అనుసరించ సాగారు. కాని వాస్తవంగా సులైమాను ఎన్నడూ అవిశ్వాసానికి ఒడిగట్టలేదు. అసలు అవిశ్వాసానికి పాల్పడింది ప్రజలకు చేతబడిని బోధించే షైతానులే." *(దివ్యఖుర్ఆన్- **2: 101, 102**)*

ఇక 'తాగూత్' విషయానికి వస్తే, హద్దుమీరిపోవటాన్ని 'తాగూత్' అంటారు. ఏదయినా ఒక వస్తువు దాని నియమిత పరిధిని దాటిపోతే అరబీలో దానిని 'తగా' అంటారు. ఉదాహరణకు : 'తగా అల్ మాయి' (అంటే నీరు కట్టలు త్రెంచుకునిపోయింది). సమూద్ జాతి గురైన విపత్తును ప్రస్తావించినప్పుడు ఖుర్ఆన్‌లో 'తాగియత' అనే పదం ప్రయోగించబడింది. అంటే హద్దుమీరిపోయిన విపత్తు అన్నమాట. అక్కడినుంచే ఈ పదం దాస్యం లేక ఆరాధనలో మితిమీరిపోవటం కొరకు ప్రయోగించబడింది. ఆ విధంగా నిర్ధారిత హద్దులను దాటిపోయిన వస్తువును 'తాగూత్'గా వ్యవహరించటం పరిపాటి అయింది.

దివ్యఖుర్ఆన్ ఈ పదాన్ని వివిధ సందర్భాలలో ఉపయోగించింది. ప్రస్తావించిన ప్రతి చోటా దానికి ఎదురుగా ఉన్న దానిని కూడా పేర్కొని దానికి సంబంధించిన వివిధ భావాలను విశ్లేషించింది. ఉదాహరణకు- అల్ బఖరా సూరాలో **ఫమంయ్యక్ఫుర్ బిత్తాగూతి వ యూమిన్ బిల్లాహి.** ఇక్కడ తాగూత్ అంటే దైవేతరులు అని భావం. అన్ నహ్ల సూరాలో **'అనీబుదుల్లాహ వజ్తనిబూ అత్తాగూత్'** అనబడింది.

అన్ నిసా సూరాలోని ఈ ఆయత్‌ని గమనించండి-

اَلَّذِيْنَ اٰمَنُوْا يُقَاتِلُوْنَ فِىْ
سَبِيْلِ اللّٰهِ وَالَّذِيْنَ كَفَرُوْا يُقَاتِلُوْنَ فِىْ سَبِيْلِ الطَّاغُوْتِ-

"విశ్వాస మార్గాన్ని ఎన్నుకున్నవారు అల్లాహ్ మార్గంలో పోరాడుతారు. అవిశ్వాస మార్గాన్ని ఎన్నుకున్నవారు తాగూత్ మార్గంలో పోరాడతారు." ***(దివ్య ఖుర్ఆన్-4: 76)***

ఆ తరువాత ఈ విధంగా సెలవీయబడింది-

فَقَاتِلُوٓا اَوْلِيَآءَ الشَّيْطٰنِ۔

"కనుక షైతాన్ సహచరులతో పోరాడండి.' (దివ్యఖుర్ఆన్-4: 76)

ఇక్కడ 'తాగూత్' అంటే షైతాన్ అని అర్థమైపోయింది. ఈ షైతాను లలో మానవ వర్గంలోని షైతానులు, జిన్ను వర్గంలోని షైతానులు కూడా చేరి ఉన్నారు. దైవేతరుల దాస్యానికి, విధేయతకి ఖుర్ఆన్ చేసిన సమగ్ర మయిన పోలిక ఇది. అలాగే వేరొకచోట ఈ పదాన్ని దైవగ్రంథానికి, ప్రవక్త విధానానికి వ్యతిరేకార్థంలో తీసుకోవడం జరిగింది:

اَلَمْ تَرَ اِلَى الَّذِيْنَ يَزْعُمُوْنَ اَنَّهُمْ اٰمَنُوْا بِمَآ اُنْزِلَ اِلَيْكَ وَمَا اُنْزِلَ مِنْ قَبْلِكَ يُرِيْدُوْنَ اَنْ يَّتَحَاكَمُوْٓا اِلَى الطَّاغُوْتِ وَ قَدْ اُمِرُوْٓا اَنْ يَّكْفُرُوْا بِهٖ وَ يُرِيْدُ الشَّيْطٰنُ اَنْ يُّضِلَّهُمْ ضَلٰلًاۢ بَعِيْدًا○ وَ اِذَا قِيْلَ لَهُمْ تَعَالَوْا اِلٰى مَآ اَنْزَلَ اللّٰهُ وَ اِلَى الرَّسُوْلِ رَاَيْتَ الْمُنٰفِقِيْنَ يَصُدُّوْنَ عَنْكَ صُدُوْدًا○ (النساء:٦٠-٦١)

ప్రవక్తా! "నీ వద్దకు పంపబడిన గ్రంథాన్ని, నీకు పూర్వం పంప బడిన గ్రంథాలను మేము విశ్వసించాము" అని (లాంఛనంగా) ప్రకటన చేసి, తమ వ్యవహారాల పరిష్కారం కొరకు 'తాగూత్' వద్దకు పోవాలని కోరేవారిని నీవు చూడలేదా? వాస్తవానికి 'తాగూత్'ని తిరస్కరించండి అని వారికి ఆదేశించటం జరిగింది- షైతాన్ వారిని పెడత్రోవ పట్టించి సన్మార్గానికి బహు దూరంగా

తీసుకుపోవాలని చూస్తాడు. వారితో, 'అల్లాహ్ పంపిన దాని వైపు నకు రండి, ప్రవక్త వైపునకు రండి' అని చెప్పినప్పుడు, ఆ కపటులు నీ వైపునకు రాకుండా తప్పించుకోవటాన్ని నీవు చూస్తావు.

(దివ్యఖుర్ఆన్-4 : 60, 61)

ఈ ఆయతులో 'తాగూత్ వద్దకు పోవాలని కోరే వారిని' అనే వాక్యానికి ప్రతిగా 'అల్లాహ్ పంపిన దాని వైపునకు రండి, ప్రవక్త వైపునకు రండి' అని చెప్పి 'తాగూత్' అనేది దైవగ్రంథానికి, ప్రవక్త విధానానికి వ్యతిరేకంగా ఉన్న సమగ్రమయిన పోలిక అని సుస్పష్టం చేయటం జరిగింది.

ఈ వివరాల ద్వారా తెలిసేదేమంటే దైవదాస్యం నుండి, దైవ విధేయత నుండి వెళ్ళిపోయిన లేక వెళ్ళిపోయేందుకు తోడ్పడిన వారంతా 'తాగూత్' పరిధిలోకి వచ్చేస్తారు. కాబట్టి షైతాన్, మాంత్రికుడు, చేతబడి చేసేవాడు, విగ్రహాలు, విగ్రహాలయాలు, ఫిరౌన్, నమ్రూద్, అల్లాహ్ మార్గం నుండి తొలగించే నాయకులు, దైవేతర ప్రభుత్వాలు, దైవేతర న్యాయ స్థానాలు, దైవేతర విద్యాపీఠాలు, దైవేతర ఆశ్రమాలు, దైవేతర మఠాలు- ఇవన్నీ దాని క్రిందకే వస్తాయి. గ్రంథవహులు కూడా ఈ రకమయిన షిర్క్‌కు లోనై ఉండేవారు.

مَنْ لَّعَنَهُ اللّٰهُ وَغَضِبَ عَلَيْهِ وَجَعَلَ مِنْهُمُ الْقِرَدَةَ وَالْخَنَازِيْرَ
وَعَبَدَ الطَّاغُوْتَ أُولٰٓئِكَ شَرٌّ مَّكَانًا وَّأَضَلُّ عَنْ سَوَآءِ السَّبِيْلِ ۝

"వారు అల్లాహ్ శాపగ్రస్తులు. వారిపై ఆయన ఆగ్రహం విరుచుకు పడింది. వారు కోతులుగా, పందులుగా చెయ్యబడ్డారు. వారు తాగూత్ దాస్యం చేశారు. వారు ఎంతో అధ్వాన్న స్థితిలో ఉన్నారు. వారు రుజుమార్గం తప్పి బహుదూరం పోయారు."

*(దివ్య ఖుర్ఆన్- **5: 60**)*

3) షిర్క్‌ను సమర్థించటం

గ్రంథం కల ప్రజల మూడవ షిర్క్, షిర్క్‌ను సమర్థించటం. షిర్క్‌ను ఏ రకంగా సమర్థించినా, దానికి ఎలాంటి మద్దతు ఇచ్చినా అది షిర్కే.

గ్రంథవహులకు దేవుడు తన గ్రంథం ప్రసాదించాడు. వారిచేత షరీఅత్‌కు కట్టుబడి ఉంటామన్న వాగ్దానం తీసుకున్నాడు. రాబోయే ప్రవక్తకు ఆదరువుగా నిలవాలని, ప్రజలకు ఆ ప్రవక్త గురించి పరిచయం చెయ్యాలని వారికి తాకీదు చేయటం జరిగింది. యూదులతో ఇలా అనటం జరిగింది: "నేను వారి కోసం వారి సహోదరులలో నుండే నీ వంటి ఒక ప్రవక్తను ప్రభవింపజేస్తాను. నా వాక్కును అతని నోట్లో వేస్తాను." హజ్రత్ మసీహ్ (ఏసుక్రీస్తు-అ) తన హవారీలతో చాలా స్పష్టంగా చెప్పారు- "నేను మీతో ఎన్నో విషయాలు చెప్పాల్సి ఉంది. కాని మీరు వాటికి తట్టుకోలేరు. కాని ఆ సత్యాత్మ వచ్చినప్పుడు సమస్త సత్యం (ధర్మం) వైపునకు మీకు మార్గదర్శకత్వం వహిస్తాడు" (యోహానా). యూదులు **'ఆ ప్రవక్త'** రాక కోసం ఎదురు చూసేవారు కూడా. వారికి ఇవ్వబడిన భవిష్యవాణి ప్రకారం ఆ ప్రవక్త వారి సౌభాగ్యానికి విజయ ద్వారం అవుతాడని, తిరస్కారులపై వారికి విజయం చేకూరుస్తాడని కూడా వారు గట్టిగా నమ్మేవారు. ఇక క్రైస్తవులంటారా, వారైతే వేయి కళ్ళతో ఆ ప్రవక్త కోసం నిరీక్షించారు. హజ్రత్ మసీహ్ (ఏసుక్రీస్తు) ఇంజీలులో వివరించిన ఉపమానాలను విశదీకరిస్తూ పోతే ఇంజీలు ఉపమానాలలోని అతి పెద్ద భాగం అంతిమ ప్రవక్త ప్రభవనం గురించి మాత్రమే ఉందని తేటతెల్లమవుతుంది. ఇలాంటి పరిస్థితిలో గ్రంథవహుల కర్తవ్యం ఏమిటి? ఆ అంతిమ ప్రవక్త ప్రభవించినప్పుడు, తమ వద్ద ఉన్న పూర్వ 'జ్ఞానం' వెలుగులో ఆ ప్రవక్త సందేశాన్ని పరికించాల్సింది. అది గనక తమ భవిష్య

వాణికి అనుగుణంగా ఉంటే, ఆ సందేశాన్ని విశ్వసించాల్సింది. ప్రజా బాహుళ్యంలో దానికి ప్రాచుర్యం ఇవ్వాల్సింది. దానికి సహాయకులుగా నిలవాల్సింది. ఆ తరువాత ఆ ప్రవక్త చూపిన ధర్మసంస్థాపనా మార్గంలో తమ సర్వస్వాన్ని త్యాగం చేయాల్సింది. కాని జరిగిందేమిటి? హజ్రత్ మసీహ్ (ఏసుక్రీస్తు) వివరించిన కన్యల ఉపమానమే వారికీ వర్తించింది. వారు రాత్రంతా తమ కాగడాలు కాల్చుతూ వరుని రాక కోసం నిరీక్షించారు. కాని తీరా వరుడు వచ్చే సమయానికి వారి కాగడాలు ఆరిపోయాయి. వారి కుప్పులలో ఉన్న తైలం అయిపోయింది. వారు కూడా నిద్రపోయారు. గ్రంథవహులూ అంతే. వారు ఆ ప్రవక్త కోసం శతాబ్దాల తరబడి ఎదురుచూశారు. కాని ఆ ప్రవక్త ప్రభవించాక, వారాయన్ని గుర్తుపట్టి కూడా ఆయన్ని విశ్వసించ నిరాకరించారు. పైగా తిరస్కార వైఖరిలో ముందంజ వేశారు. అంతేకాదు, అసూయతో రగిలిపోతూ ఆ ప్రవక్తకు వ్యతిరేకంగా కయ్యానికి కాలుదువ్విన ముష్రిక్‌లకు బహిరంగంగా మద్దతు ఇచ్చారు. సహాయం చేశారు. పబ్లిగ్గా అతని సందేశాన్ని పరిహసించారు. అతని కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు యుద్ధాగ్నిని రాజేశారు. ఈ శత్రుత్వంలో వారు ఎంతవరకు పోయారంటే, ఆ ప్రవక్త ఇచ్చే సందేశంపై బహు దైవారాధకుల మతానికి ప్రాధాన్యత ఇచ్చారు...ఆ ప్రవక్త అనుచరుల కన్నా అవిశ్వాసులే (కుఫ్ఫారులే) ఎక్కువ సన్మార్గంపై ఉన్నారని ప్రకటించారు. (4: 51). అల్లాహ్ శపించినది కూడా ఇలాంటి వారినే. అల్లాహ్ శాపానికి గురైన వారిని ఆదుకునే వాడెవడినీ నీవు కనుగొనలేవు. (4: 52)

3. కపటుల షిర్క్

బాహ్యాపరమైన విశ్వాసాలు, ఆచరణలకు సంబంధించినంతవరకు కపటులు (మునాఫిక్‌లు) ముస్లింలే. ఈమాన్ (విశ్వాసం)కు సంబంధించిన అంశాలన్నింటినీ వారు అంగీకరించారు. అంతిమ దైవప్రవక్త(స)కు, ఇతర ప్రవక్తలకు అందిన దైవదౌత్యాన్ని కూడా వారు ఒప్పుకున్నారు. కలిమయె షహాదత్ (సాక్ష్య వచనం) కూడా పలికేవారు. ఇస్లామ్ చూపిన పద్ధతి ప్రకారం మస్జిద్‌లలో నమాజ్ కూడా చేసేవారు. జకాత్ కూడా ఇచ్చేవారు. కాబా గృహానికి వెళ్ళి హజ్జ్ విధిని కూడా నెరవేర్చేవారు. యుద్ధాలలో కూడా పాల్గొనేవారు. ఇంకా ఖుర్ఆన్ మాటల్లో చెప్పాలంటే వారి నోటి మాటల ద్వారా వారిలోని యుద్ధకాముకత సత్యవంతులైన ముస్లింలకన్నా ఎక్కువే. ఇక దైవదౌత్యంపై విశ్వాసం విషయానికివస్తే, వారు దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చి ప్రమాణం చేసి మరీ చెప్పేవారు– మేము మిమ్మల్ని దైవ సందేశహరునిగా నమ్ముతున్నామని. కాని వారు చెప్పే ఈ కబుర్లలో ఏ ఒక్కదానినీ ఖుర్ఆన్ అంగీకరించలేదు. పైగా వారిని ఈమాన్ (విశ్వాసాని)కి దూరమైన వారుగా, దైవదౌత్యాన్ని నిరాకరించినవారుగా, షైతాన్ సహవాసులుగా, నరకంలో అట్టడుగు భాగాన ఉండే వర్గంగా ఖుర్ఆన్ చాలా స్పష్టంగా ప్రకటించింది. వారిని షిర్క్‌కు ఒడిగట్టిన అపరాధులుగా ఖరారు చేసింది.

ఆయత్‌లన్నింటి సారాంశం పైన పేర్కొనబడిన పంక్తులలో ఉంది. అయినప్పటికీ వారి షిర్క్‌కు సంబంధించిన కొన్ని ఆయత్‌లను మేము

పొందుపరచి, క్లుప్తంగా వాటిని విశదీకరిస్తున్నాము. దివ్యఖుర్‌ఆన్ కపటులను, తమ వ్యవహారాలను తీర్పుకోసం తాగూత్ వద్దకు తీసుకు పోయే అపరాధులుగా ఖరారు చేసింది. ఇది షిర్క్ అని నిర్ధారించింది.

తీర్పు కోసం తాగూత్ వద్దకు పోవటం

అన్ నిసా సూరాలో ఉంది :

أَلَمْ تَرَ إِلَى الَّذِينَ يَزْعُمُونَ أَنَّهُمْ آمَنُوا بِمَا أُنْزِلَ
إِلَيْكَ وَمَا أُنْزِلَ مِنْ قَبْلِكَ يُرِيدُونَ أَنْ يَتَحَاكَمُوا
إِلَى الطَّاغُوتِ وَقَدْ أُمِرُوا أَنْ يَكْفُرُوا بِهِ وَيُرِيدُ الشَّيْطَانُ
أَنْ يُضِلَّهُمْ ضَلَالًا بَعِيدًا ○ وَإِذَا قِيلَ لَهُمْ تَعَالَوْا إِلَى
مَا أَنْزَلَ اللَّهُ وَإِلَى الرَّسُولِ رَأَيْتَ الْمُنَافِقِينَ يَصُدُّونَ
عَنْكَ صُدُودًا۔

ప్రవక్తా! "నీ వద్దకు పంపబడిన గ్రంథాన్ని, నీకు పూర్వం పంప బడిన గ్రంథాలను మేము విశ్వసించాము" అని (లాంఛనంగా) ప్రకటన చేసి, తమ వ్యవహారాల పరిష్కారం కొరకు 'తాగూత్' వద్దకు పోవాలని కోరే వారిని నీవు చూడలేదా? వాస్తవానికి 'తాగూత్'ను తిరస్కరించండి అని వారికి ఆదేశించటం జరిగింది. షైతాన్ వారిని పెడత్రోవ పట్టించి సన్మార్గానికి బహుదూరంగా తీసుకుపోవాలని చూస్తాడు. వారితో "అల్లాహ్ పంపిన దాని వైపునకు రండి, ప్రవక్త వైపునకు రండి" అని చెప్పినప్పుడు, ఆ కపటులు నీ వైపునకు రాకుండా తప్పించుకుపోవటాన్ని నీవు చూస్తావు (దివ్యఖుర్‌ఆన్– **4: 60, 61**)

దీనికి ముందు వచ్చిన ఆయత్ (4: 59)లో 'అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు, మీలో అధికారం అప్పగించబడిన పెద్దలకు విధేయత చూపండి. మీ మధ్య ఏ విషయంలోనయినా వివాదం తలెత్తితే దాన్ని అల్లాహ్‌కు, ప్రవక్తకు నివేదించండి' అని ముస్లింలకు ఆదేశించటం జరిగింది. ఆ తరువాత కపటుల (మునాఫికీన్) వైఖరి ఎలా ఉంటుందో వివరించబడింది. ఈ కపటులు అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను విశ్వసిస్తున్నామని చెబుతున్నప్పటికీ తమ వివాదాలను 'తాగూత్' చేత పరిష్కరించుకోవాలని కాంక్షిస్తున్నారు. అంటే వారు తమ వివాదాలను దేవుని, దైవప్రవక్త న్యాయ స్థానానికి తీసుకురావటానికి సుముఖంగా లేరు.

మొదటి పంక్తుల్లో మేము 'తాగూత్' అని దేనినంటారో చెప్పుకున్నాం. ఈ ఆయత్‌లలో (61) 'తాగూత్'కు ఎదురుగా వచ్చిన వాక్యమిది: **"అల్లాహ్ పంపిన దాని వైపునకు, ప్రవక్త వైపునకు రండి".** దీనిని బట్టి అవగతమయ్యే దేమిటంటే, ఇక్కడ 'తాగూత్' అంటే దైవగ్రంథానికి, దైవప్రవక్త(స) తీర్పుకు వ్యతిరేకంగా జరిగే నిర్ణయాలు. ఈ ఆయత్ అవతరణా నేపథ్యాన్ని, సందర్భాన్ని పరిశీలించినప్పుడు కపటులు తమ కేసులను గ్రంథవహుల వద్దకు, వారి ధర్మాసనాల వద్దకు తీసుకుపోయేవారని తెలుస్తోంది. మరి చూడబోతే ఆ కాలంలో–అప్పటికే–మదీనాలో దారుల్ ఇస్లామ్ (ఇస్లామీయ వ్యవస్థ) నెలకొని ఉంది. ముస్లింల సమస్త వ్యవహారాలు, వివాదాలు దైవప్రవక్త(స) న్యాయస్థానానికి నివేదించబడేవి. తీర్పులు జరిగేవి. నేరస్తులకు శిక్షలు విధించటం జరిగేది. కాని అదే సమయంలో దీనికి సమానాంతరమైన ప్రభుత్వాన్ని (Perallel Government) యూదులు మునుపటి నుంచే నడుపుతున్నారు. ఈ వ్యవస్థ మూలంగా ఎదురయ్యే చిక్కులలో ఒకటేమంటే కపటులు తమ వివాదాలను చాలావరకు

యూదుల న్యాయస్థానానికి తీసుకుపోయేవారు. వారలా చేయడానికి ముఖ్య కారణాలు రెండున్నాయి.

ఒకటి : యూదు న్యాయాధికారులకు లంచాలిచ్చి తీర్పులు తమకు అనుకూలంగా రాబట్టడం చాలా సులభం. కాగా, దైవప్రవక్త(స) న్యాయ స్థానంలో ఇలాంటి అవినీతికి ఆస్కారం ఎంతమాత్రం ఉండదు.

రెండు : కపటుల మెదడును తొలచివేస్తున్న ఒక భయం ఏమి టంటే, మదీనాలో ఇస్లామీయ ప్రభుత్వం ఇప్పుడిప్పుడే నెలకొన్నది. అది ఇంకా శైశవ దశలోనే ఉంది. దానికితోడు ముస్లింలపై నిరంతరం కురైషులు దండెత్తి వస్తూ ఉంటారు. అందువల్ల ఇస్లామీయ ప్రభుత్వం ఎప్పుడయినా బలహీనపడవచ్చు. యూదుల పటిష్టమయిన సమూహంతో ముస్లింలు ఇంతవరకు తలపడలేదు. ఒకవేళ అలాంటిదేదయినా జరిగితే ముస్లింలకు ఓటమి తథ్యం. అట్టి పరిస్థితిలో యూదులతో మాకున్న ఈ మైత్రీ సంబంధాలు మాకు ఉపయోగపడతాయి. అన్యథా ముస్లింలతోపాటే మా కథ కూడా సమాప్తమైపోవచ్చు– ఈ దుర్బుద్ధి, దురాలోచన కారణంగా ఈ ద్వంద్వ స్వభావులు తమ వ్యవహారాల పరిష్కారం కొరకు చాలావరకు యూదు న్యాయస్థానాలనే ఆశ్రయించేవారు. అయితే ఏదేని కేసులో ముస్లింల న్యాయస్థానాన్ని ఆశ్రయించటమే ఉపయుక్తంగా ఉంటుందని భావించినప్పుడు వారు కడు వినమ్రతతో ప్రవక్త మహనీయుల (స) దగ్గరకు వచ్చేవారు.

మరోవైపు యూదుల కుత్సిత బుద్ధిని చూడండి– శిక్షలు విధించటం తథ్యం అనుకున్న వివాదాలను తమ స్వప్రయోజనాల లేక రాజకీయ ప్రయోజనాల దృష్ట్యా వారు తమ శాసనాంగం ప్రకారం తీర్పులు ఇవ్వ కుండా, అలాంటి వివాదాలను దైవప్రవక్త ముహమ్మద్(స) న్యాయస్థానానికి పంపేవారు. ఒకవేళ ముహమ్మద్(స) ఇచ్చిన తీర్పు 'ఈ విధంగా ఉంటేనే' దానిని శిరసావహించండి. అన్యథా మా దగ్గరకు తిరిగి రండి అని

కక్షిదారులకు సలహా ఇచ్చేవారు. సాధారణంగా ఇవి ధనవంతులైన యూదుల వ్యవహారాలపై ఉండేవి. యూదు పండితులు వారి వద్ద నుంచి పెద్ద మొత్తంలో లంచం తీసుకొని దైవశాసనాల నుండి తప్పించేందుకు ఇలాంటి అడ్డదారులు తొక్కేవారు. దైవప్రవక్త(స) న్యాయస్థానంలో తీర్పు తమ మనోరథానికి అనుకూలంగా వెలువడితే తమ లక్ష్యం నెరవేరిందని, దానికి సంబంధించిన బాధ్యతంతా ప్రవక్త(స) ఖాతాలోకి వెళుతుందని తలపోసేవారు. ఒకవేళ తీర్పు తమ మనోవాంఛలకు వ్యతిరేకంగా వస్తే, దానిని వదిలిపెట్టి ఆ కేసుపై తమ న్యాయస్థానంలో పునర్విచారణ జరిపి, తాము అనుకున్న విధంగా తీర్పు చేసేవారు.

పైన పేర్కొనబడిన ఖుర్‌ఆన్ ఆయత్‌ను, దానిని పోలిన అలాంటివే మరి కొన్ని ఆయత్‌లను సరిగ్గా అర్థం చేసుకోవడానికి వాటి అవతరణా నేపథ్యాన్ని దృష్టియందుంచుకోవటం అవసరం.

ఇలాంటి కపటులను ఉద్దేశించే **“వారు తమ వివాదాలను పరిష్కరించుకోవడానికి తాగూత్ వైపునకు వెళతార”**ని చెప్పటం జరిగింది. అంటే ఇస్లామేతర న్యాయస్థానాలకు తమ వ్యవహారాన్ని తీసుకుపోతూనే తమకు ఖుర్‌ఆన్‌పై, అల్లాహ్‌పై విశ్వాసం ఉందని ప్రగల్భాలు పలకటం పరస్పర విరుద్ధాంశం. అల్లాహ్‌ను విశ్వసించామని చెప్పే ముందు తాగూత్‌కు స్వస్తి పలకటం అనివార్యం. అలాగే **‘ఇల్లల్లాహ్’**ను ధ్రువపరిచే ముందు **‘లా ఇలాహ’**ను అని నొక్కి వక్కాణించటం అవశ్యం. **ఫమం య్యక్ఫుర్ బిత్తాగూతి వ యూ’మిన్ బిల్లాహ్** (కనుక ఎవరు తాగూత్‌ను తిరస్కరిస్తారో, అల్లాహ్‌ను విశ్వసిస్తారో...) అని అనబడింది. మరొక చోట **ఉఁబుదుల్లాహ వజ్‌తనిబుత్తాగూతు** (అల్లాహ్ దాస్యం చేయండి. తాగూత్ బారి నుండి కాపాడుకోండి) అని కూడా చెప్పటం జరిగింది. అల్లాహ్‌పై విశ్వాసమూను, తాగూత్‌పై విశ్వాసం- ఇవి రెండూ ఒకచోట ఇమడలేవు.

యూదుల న్యాయస్థానాలకు మీ వ్యాజ్యాలు తీసుకుపోతూనే, మేము అల్లాహ్‌ను విశ్వసిస్తున్నామని అంటే అది విశ్వాసం కాదు. అది ఒట్టి బూటకం, వింత నాటకం. అల్లాహ్ అవతరింపజేసే వాటిని విశ్వసిస్తున్నా మని ప్రకటించి నప్పుడు, సమస్త వ్యవహారాలలో అల్లాహ్‌కు విధేయత చూపటం కూడా అవసరమే. దీని విధానం ఏమిటంటే, దైవప్రవక్తల మార్గాన్ని అనుసరిం చాలి. ఒకవేళ అలా చేయకపోతే అది అల్లాహ్‌పై విశ్వాసం గానీ, అల్లాహ్ అవతరింపజేసే వాటిపై విశ్వాసం గానీ, దైవ ప్రవక్తపై విశ్వాసం గానీ అనిపించుకోదు. దైవప్రవక్త కేవలం నమ్మకం వరకే పరిమితం కాదు. దైవప్రవక్తను నమ్మిన మీదట ప్రవక్తకు విధేయత కనబరచటం కూడా అవశ్యమే. దైవప్రవక్త అనుసరణా మార్గం నుండే దైవవిధేయతా మార్గం కూడా వస్తుంది. అందుకే తరువాతి ఆయత్‌లలో

فَكَيْفَ إِذَآ أَصَابَتْهُم مُّصِيبَةٌ بِمَا قَدَّمَتْ أَيْدِيهِمْ ثُمَّ
جَآءُوكَ يَحْلِفُونَ ○ بِاللَّهِ إِنْ أَرَدْنَآ إِلَّآ إِحْسَانًا
وَتَوْفِيقًا ○ أُولَٰٓئِكَ الَّذِينَ يَعْلَمُ اللَّهُ مَا فِي قُلُوبِهِمْ
فَأَعْرِضْ عَنْهُمْ وَعِظْهُمْ وَقُل لَّهُمْ فِيٓ أَنفُسِهِمْ قَوْلًا
بَلِيغًا ○ وَمَآ أَرْسَلْنَا مِن رَّسُولٍ إِلَّا لِيُطَاعَ بِإِذْنِ اللَّهِ
وَلَوْ أَنَّهُمْ إِذ ظَّلَمُوٓا أَنفُسَهُمْ جَآءُوكَ فَاسْتَغْفَرُوا اللَّهَ
وَاسْتَغْفَرَ لَهُمُ الرَّسُولُ لَوَجَدُوا اللَّهَ تَوَّابًا رَّحِيمًا ○
فَلَا وَرَبِّكَ لَا يُؤْمِنُونَ حَتَّىٰ يُحَكِّمُوكَ فِيمَا شَجَرَ بَيْنَهُمْ
ثُمَّ لَا يَجِدُوا فِيٓ أَنفُسِهِمْ حَرَجًا مِّمَّا قَضَيْتَ وَيُسَلِّمُوا
تَسْلِيمًا ○

ఈ విధంగా సెలవీయ బడింది:

"వారు తమ చేజేతులా తెచ్చుకున్న ఆపద వారిపైకి వచ్చి పడి నప్పుడు వారి ప్రవర్తన ఎలా ఉంటుంది? అప్పుడు వారు నీ వద్దకు ప్రమాణాలు చేస్తూ వస్తారు. వచ్చి, 'దేవుని సాక్షిగా! మేము మంచినే కాంక్షించాము. ప్రత్యర్థుల మధ్య ఏదో ఒక విధంగా రాజీ కుదరా లనేదే మా ఉద్దేశ్యం' అని అంటారు– వారి మనస్సులలో ఏదైతే ఉందో అది అల్లాహ్‌కు తెలుసు. కనుక వారితో వివాదానికి దిగకు. వారికి నచ్చజెప్పు. వారి హృదయాలలో నాటుకునే విధంగా బోధ చేయి. (వారికి ఇలా తెలుపు) మేము ఏ ప్రవక్తను పంపినా అల్లాహ్ అనుజ్ఞ ప్రకారం అతనికి విధేయత చూపాలనే పంపాము. వారు తమ ఆత్మలకు అన్యాయం చేసుకున్న తర్వాత వారి కొరకు ఉత్తమ మయిన పద్ధతి ఏమిటంటే, వారు నీ వద్దకు వచ్చి ఉండవలసింది, క్షమించు అని అల్లాహ్‌ను అర్థించి ఉండవలసింది. ఇంకా ప్రవక్త కూడా వారి కొరకు మన్నింపునకై విజ్ఞాపన చేసి ఉండేవాడు. అప్పుడు వారు నిశ్చయంగా అల్లాహ్‌ను క్షమించేవాడుగా, కరుణిం చేవాడుగా కనుగొని ఉండేవారు. కాదు, ముహమ్మద్(స)! నీ ప్రభువు సాక్షిగా! వారు తమ పరస్పర విభేదాల విషయంలో నిన్ను న్యాయ నిర్ణేతగా స్వీకరించనంతవరకూ, ఇంకా నీవు ఏ నిర్ణయం చేసినా దానిని గురించి వారి మనస్సులలో కూడా ఏ మాత్రం సంకోచం లేకుండా దానిని యథాతథంగా శిరసావహించనంత వరకూ వారు నిజమైన విశ్వాసులు కాలేరు."

(దివ్యఖుర్‌ఆన్– 4 : 62-65)

పై ఆయత్‌లలో **"మేము ఏ ప్రవక్తను పంపినా అల్లాహ్ అనుజ్ఞ ప్రకారం అతనికి విధేయత చూపాలనే పంపాము"** అన్న వాక్యం ప్రత్యే కంగా గమనించదగినది. ఇది కపటుల కుహనా పోకడకు చెంపపెట్టు

వంటిది. వారు తమ వ్యాజ్యాలను తీర్పు కోసం తాగూత్ వద్దకు తీసుకు పోతూనే తాము అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను విశ్వసించేవారమని కోతలు కోస్తున్నారు. దైవప్రవక్త ప్రభవింపజేయబడినది ఎందుకు? కేవలం నోటితో అంగీకరింపజేయడానికో లేక అంతర్యంలో నమ్మకముంచడానికో కాదు. ఆయనకు విధేయత చూపటానికే ప్రభవింపజేయబడ్డాడు. సమస్త వ్యవహారాలలో ఆయన్ని తీర్పరిగా శిరసావహించటం తప్పనిసరి. ఆయన ఆదేశాలను తు.చ తప్పకుండా పాటించాలి. ఆయన ఆజ్ఞల ముందు ఆత్మ సమర్పణ చేసుకోవాలి. ఆయన మార్గాన్ని కాదని వేరే దారిన పోయే వారిపై తిరగబడాలి. అందుకే ఈ ఆయత్‌లో ఒట్టేసి మరీ చెప్పటం జరిగింది: వీళ్ళు తమ సమస్త వ్యవహారాలలో ప్రవక్త ఆజ్ఞలను శిరసావహించనంతవరకూ, అతని తీర్పులను హృదయపూర్వకంగా స్వీకరించనంత వరకూ, తమ జీవితపు అన్ని విభాగాలలో ప్రవక్త ఆదేశాలకు కట్టుబడి ఉండనంతవరకూ వారు దేవుని విశ్వాసులు కారు, వారు తాగూత్ విశ్వాసులే.

పైన మేము ఉదాహరించిన ఆయత్‌లను చదివి సదరు ఆయతుల అవతరణా నేపథ్యాన్ని (పూర్వ రంగాన్ని) నిర్ధారించటంలో మేము మా ఊహలను అనుసరించామన్న సందేహం కలగవచ్చు. అందుకే వారి సంతృప్తి కొరకు మేము - ఈ సందర్భంగా- అల్ మాయిదా సూరాలోని 41-54 ఆయత్‌ల రెఫరెన్సును కూడా ఇస్తున్నాము. ఈ ఆయత్‌లపై యోచన చేసినవారు మేము ప్రస్తావించిన ఈ విషయాలన్నింటికీ మూలాధారం ఖుర్‌ఆన్‌లో పొందుతారు. ఈ ఆయత్‌ల భావార్థాన్ని మేమిక్కడ సంక్షిప్తంగా మా మాటల్లో విశదీకరిస్తున్నాం. తద్వారా పాఠకులకు విషయం సుబోధకం కాగలదు-

"మొదట దైవప్రవక్త(స)ను ఓదార్చటం జరిగింది- ప్రవక్తా!

కపటులు, యూదులు తమ వివాదాలను నీ చేత తీర్పు చేయిం చుకున్న మీదట, దాని నుండి తిరిగిపోతే నీవు దుఃఖించవలదు. ఈ యూదులు అప్పుడప్పుడూ తమ వ్యవహారాలను తీసుకొని నీ వద్దకు వచ్చినంత మాత్రాన వారు నిజంగా వ్యాజ్యాల తీర్పు నిమిత్తం వచ్చారని అనుకోకు. పైగా వారు అసత్యాన్ని కొనుగోలు చేసేవారు. యూదు నాయకుల ఏజెంట్లు. వారు స్వయంగా ముందుకు రాకుండా వెనుక నుండి తమ తొత్తుల చేత ఆటాడిస్తూ ఉంటారు. దైవధర్మంతో చెలగాటమాడుతుంటారు. 'ఒకవేళ మీ వ్యవహారంలో తీర్పు ఈ విధంగా వెలువడినట్లయితే తిరిగి వచ్చేసే యండి' అని వారికి చెప్పి మరీ పంపిస్తారు. కాబట్టి అలాంటి వారి స్థితిపై ఆవేదన చెందటం వ్యర్థం. వారి అంతరంగాలను పరి శుద్ధపరచటం అల్లాహ్‌కు ఇష్టం లేదు. పరిశుద్ధపరచదలిస్తే తౌరాతు సూచనానుసారం వారు నిన్ను విశ్వసించేవారే. అవిశ్వాసానికి బదులు విశ్వాసం, విధేయత వైపునకు ముందంజ వేసి ఉండేవారు. వారికి ప్రపంచంలో పరాభవం, పరలోకంలో కఠిన శిక్ష తథ్యం. వారు అసత్యాన్ని నమ్మేవారు. లంచం తినేవారు. ఒకవేళ వారు నీ దగ్గరకు తమ వ్యవహారం తీసుకువస్తే వారి వ్యవహారంపై తీర్పు ఇవ్వటం, ఇవ్వకపోవటమన్నది నీ ఇష్టం. ఒకవేళ తీర్పు ఇవ్వాలనే అనుకుంటే షరీఅత్ (అల్లాహ్ శాసనాంగం) ప్రకారం తీర్పు చెయ్యి. ఆ తరువాత కొన్ని ఆయత్‌లలో యూదులను శపించటం జరిగింది. ఎలాంటి జనులు వీళ్ళు?! ఒకవైపు వారు నిన్ను న్యాయ నిర్ణేతగా చేస్తూనే, మరోవైపు నీ తీర్పుల పట్ల వైముఖ్యం కనబరు స్తున్నారు. చూడబోతే వారి వద్ద తౌరాతు గ్రంథం ఉంది. అందులో అల్లాహ్ శాసనం ఉంది. (ప్రవక్తా!) నీవు ఇచ్చే తీర్పు దైవశాసనానికి

విరుద్ధంగా లేదని స్వయంగా వారికీ తెలుసు. ఆ తరువాత గత కాలపు ప్రవక్తల, సజ్జనులైన విద్వాంసుల విధానం తెలుపుతూ, వారు ఈ గ్రంథం ప్రకారం సమస్త వ్యవహారాలపై తీర్పులు చేసే వారని చెప్పటం జరిగింది. ఆ తరువాత ధర్మం (దీన్) విషయంలో ఎలాంటి విశ్వాస ఘాతుకానికి తావు ఉండకూడదని, షరీఅత్‌ను ప్రాపంచిక సముపార్జనా సాధనంగా చేయరాదని కూడా వారికి ఉపదేశించటం జరిగింది. ఎట్టి పరిస్థితిలోనూ దైవగ్రంథానుసారం తీర్పు ఇవ్వాలని, తద్విరుద్ధంగా వ్యవహరించే పక్షంలో అవిశ్వా సులు అవుతారని కూడా హెచ్చరించటం జరిగింది. దరిమిలా తౌరాతులోని ప్రతీకార శాసనం ఉదాహరించబడింది. ఎందుకంటే యూదులు ఎక్కువగా ఉల్లంఘునకు పాల్పడేది శిక్షల విషయం లోనూ, ప్రతీకార న్యాయ వ్యవహారంలోనే. ఆ తరువాత ఇంజీలు గ్రంథవహుల ప్రస్తావన వస్తుంది. దైవశాసనం ప్రకారం తీర్పులు ఇవ్వాలని, అన్యథా అవిధేయులుగా, పాపాత్ములుగా పరిగణించ బడతారని కూడా వారికి బోధించటం జరిగింది.

ఆ తరువాత ఖుర్‌ఆన్ గ్రంథం గురించి ప్రస్తావిస్తూ- (అంతిమ దైవప్రవక్త-స-కు) చెప్పటం జరిగింది: ఈ గ్రంథం తౌరాతు, ఇంజీలు గ్రంథాల భవిష్యవాణికి అనుగుణంగా ఉంది. గ్రంథ వహులు చేసిన ప్రక్షిప్తాలను అది సంస్కరించేది. కనుక (ఓ ముహమ్మద్-స) నీవు గనక వారి వ్యాజ్యమేదయినా తీసుకుని తీర్పు ఇవ్వదలిస్తే దీని ప్రకారమే తీర్పు ఇవ్వు. వారు తమ గ్రంథాలలో సమ్మిళితం చేసిన నవీన పోకడలను (బిద్‌అత్‌లను) ఏమాత్రం అనుసరించకు. వారి విశ్వాసం, మార్గబోధన గురించి నిన్ను ప్రశ్నించటం జరగదు. వారు తమ పంథాపై పాతుకుపోయి

ఉన్నారు. తమ పోకడ పట్ల వారికి ఎంత దురభిమానం ఉందంటే, దాని కారణంగా వారు నిన్ను అనుసరించరు. అల్లాహ్‌యే గనక కోరుకుంటే వారిని సన్మార్గానికి తీసుకువచ్చేవాడే. కాని బలవంతం చేయడం ఆయన సంప్రదాయానికి వ్యతిరేకం. ఆయన ఎంపిక స్వేచ్ఛను ప్రసాదించాడు. తన దాసులకు ప్రసాదించిన దాని ద్వారా వారిని పరీక్షిస్తున్నాడు. ఎవరు సదాచరణ చేస్తూ విధేయతా మార్గాన్ని అవలంబిస్తారో, ఎవరు దురభిమానంతో, అహం భావంతో మూర్ఖత్వానికి గురై తమ పద్ధతినే ఆరాధ్య దైవంగా చేసుకుంటారో పరికిస్తున్నాడు.

ఆ తరువాత ముస్లింల వైపు దృష్టి సారించటం జరిగింది. సంబో ధన సర్వసాధారణంగానే ఇక్కడ ఉన్నప్పటికీ ఇక్కడ కపటులు (మునాఫికీన్) మాత్రమే ముఖ్య సంబోధితులు. వారు యూదులతో మంతనాలు సాగించేవారు. తమ వ్యాజ్యాలను యూదుల న్యాయ స్థానాలకు తీసుకుపోయేవారు. యూదులతో, నసారాలతో ఈ రకమయిన వ్యవహారం జరపరాదని వారికి ఆదేశించటం జరిగింది. ఎవరు వారిని తమ సహాయకులుగా చేసుకుంటారో వారు కూడా ఆ వర్గం వారుగానే పరిగణించబడతారని కూడా చెప్పటం జరిగింది. ఆ తరువాత స్పష్టమయిన పదజాలంతో కపటులు సంబోధించ బడ్డారు. యూదులు- ముస్లింల మధ్యన రేపటి రోజున ఒకవేళ యుద్ధం గనక జరిగితే, ఆ యుద్ధంలో యూదులు విజయం సాధిస్తే తమ పరిస్థితి అడకత్తెరలో పోక చెక్కలా తయారవుతుందని, అందుకే వారి న్యాయస్థానాలకు వ్యాజ్యాలు తీసుకుపోయి, ఏదో ఒక స్థాయిలో వారితో మైత్రి సంబంధం పెట్టుకుంటే తాము కూడా వారి పార్టీ సభ్యులుగానే

పరిగణించబడతామని ఈ కపటులు అనుకునేవారు. ఆ తరువాత ఇలా సెలవీయబడింది. ఓ ముస్లిము లారా! మీలోని వారెవరయినా తమ ధర్మం (దీన్)నుండి తిరిగి పోయి ధర్మభ్రష్టులు (ముర్తిద్‌లు)గా మారిపోతే, వారిని అల్లాహ్ ఎంతమాత్రం లెక్కచేయడు. దరిమిలా అల్లాహ్ వారి స్థానంలో మరో వర్గాన్ని తీసుకువస్తాడు. ఆయన వారిని ప్రేమిస్తాడు. వారు ఆయన్ని ప్రేమిస్తారు. వారు ముస్లింల పాలిట మృదు మనస్కులు, సహనశీలురు అయి ఉంటారు. అవిశ్వాసుల పాలిట వారు కఠినులై ఉంటారు. వారు అల్లాహ్ మార్గంలో జిహాద్ చేస్తారు. నిందించే వారి నిందలను వారు లెక్క చేయరు."

ఈ వివరాలన్నింటినీ మేము ఇక్కడ పొందుపరచటంలోని ముఖ్య ఉద్దేశ్యం; ఆనాటి యూదుల రాజకీయ ఎత్తుగడలను, వారితో చెట్టాపట్టా లేసుకుని తిరిగే కపటుల ద్వంద్వ ప్రవృత్తిని పాఠకుల దృష్టికి తీసుకు రావటమే! తీర్పుల కొరకు కపటులు తమ కేసులను యూదుల వద్దకు తీసుకుపోవటంలోని ఉద్దేశం ఏమిటో సుబోధకం చేయటమే!! ఈ ఒక్క వస్తువే దీన్ (ధర్మం)కు సంబంధించిన మిగతా విషయాలన్నింటినీ ఎలా కూల్చివేస్తుందో విడమరిచి చెప్పటం కూడా ఒక ముఖ్య ఉద్దేశమే.

ఇంతవరకూ దివ్యఖుర్‌ఆన్ ఈ పోకడను నిర్ద్వంద్వంగా ఖండిస్తూ దీనిని ధర్మభ్రష్టత (ఇర్తెదాద్)గా ఖరారు చేసింది. ఇలాంటి హృద్రోగుల, అవకాశవాదుల, పిరికిపందల, స్వార్థప్రియుల అవసరం దైవానికి ఎంతమాత్రం లేదని, వారు యూదుల చేతుల్లో ఉన్న గాలిపటాల వంటి వారని కూడా చెప్పేసింది. దైవానికి కావలసింది ఇలాంటి అనుమానాల అయ్యలు కారు. తమ వైఖరిలో కదలని కొండలా స్థిరచిత్తం కలవారు, లక్ష్య నిబద్ధతలో వజ్ర సంకల్పం కలవారిని మాత్రమే దేవుడు ఇష్టపడతాడు. స్వలాభాలు, అవకాశవాదాల విగ్రహాలను తునాతునకలు చేసి ఇస్లాంలో

హృదయపూర్వకంగా ప్రవేశించిన వారిని, జీవితం అవిభాజ్యమైన ఏకాంకమని భావించి దానిని అల్లాహ్‌కు సమర్పితం చేసిన వారిని (ఉద్‌ఖులూ ఫిస్సిల్మి కాఫ్ఫహ్) మాత్రమే ఆయన ఇష్టపడతాడు. కేవలం స్వలాభాలను ఆశించి దైవాన్ని సేవించగోరేవారు ఏ జీవన విధానాన్న యినా ఆశ్రయించవచ్చు. అల్లాహ్‌కు, ఆయన ధర్మానికి (దీన్‌కు) వారి అవసరం లేనేలేదు. 'జనులలో కొందరున్నారు– వారు ఒక అంచున నిలబడి అల్లాహ్ దాస్యం చేస్తుంటారు. వారికేదన్నా మంచి జరిగితే సంతృప్తి చెందుతుంటారు. ఒకవేళ ఏదయినా పరీక్షకు గురయితే మడమ తిప్పి మరలిపోతారు.'

ఈ విషయాన్ని మరింత కూలంకషంగా, వివరంగా తెలుసుకోవ టానికి అన్ నూర్ సూరాలోని ఈ ఆయత్‌లను కూడా దృష్టిలో ఉంచు కోండి :

وَ يَقُوْلُوْنَ اٰمَنَّا بِاللّٰهِ وَ بِالرَّسُوْلِ وَ اَطَعْنَا ثُمَّ يَتَوَلّٰى فَرِيْقٌ
مِّنْهُمْ مِّنْۢ بَعْدِ ذٰلِكَ ؕ وَ مَاۤ اُولٰٓئِكَ بِالْمُؤْمِنِيْنَ ○ وَاِذَا دُعُوْۤا
اِلَى اللّٰهِ وَ رَسُوْلِهٖ لِيَحْكُمَ بَيْنَهُمْ اِذَا فَرِيْقٌ مِّنْهُمْ مُّعْرِضُوْنَ ○
وَ اِنْ يَّكُنْ لَّهُمُ الْحَقُّ يَاْتُوْۤا اِلَيْهِ مُذْعِنِيْنَ ○ اَفِىْ قُلُوْبِهِمْ
مَّرَضٌ اَمِ ارْتَابُوْۤا اَمْ يَخَافُوْنَ اَنْ يَّحِيْفَ اللّٰهُ عَلَيْهِمْ وَرَسُوْلُهٗ ؕ
بَلْ اُولٰٓئِكَ هُمُ الظّٰلِمُوْنَ ○ اِنَّمَا كَانَ قَوْلَ الْمُؤْمِنِيْنَ اِذَا
دُعُوْۤا اِلَى اللّٰهِ وَرَسُوْلِهٖ لِيَحْكُمَ بَيْنَهُمْ اَنْ يَّقُوْلُوْا سَمِعْنَا وَ
اَطَعْنَا ؕ وَ اُولٰٓئِكَ هُمُ الْمُفْلِحُوْنَ ○ وَ مَنْ يُّطِعِ اللّٰهَ وَ رَسُوْلَهٗ

وَ يَخْشَ اللّٰهَ وَ يَتَّقْهِ فَاُولٰٓئِكَ هُمُ الْفَآئِزُوْنَ○ وَاَقْسَمُوْا
بِاللّٰهِ جَهْدَ اَيْمَانِهِمْ لَئِنْ اَمَرْتَهُمْ لَيَخْرُجُنَّ ط قُلْ لَّا تُقْسِمُوْا ط
طَاعَةٌ مَّعْرُوْفَةٌ اِنَّ اللّٰهَ خَبِيْرٌۢ بِمَا تَعْمَلُوْنَ○ قُلْ اَطِيْعُوا اللّٰهَ
وَ اَطِيْعُوا الرَّسُوْلَ فَاِنْ تَوَلَّوْا فَاِنَّمَا عَلَيْهِ مَا حُمِّلَ وَ عَلَيْكُمْ
مَّا حُمِّلْتُمْ وَ اِنْ تُطِيْعُوْهُ تَهْتَدُوْا ط وَ مَا عَلَى الرَّسُوْلِ اِلَّا الْبَلٰغُ
الْمُبِيْنُ○ وَعَدَ اللّٰهُ الَّذِيْنَ آمَنُوْا مِنْكُمْ وَ عَمِلُوا الصّٰلِحٰتِ
لَيَسْتَخْلِفَنَّهُمْ فِي الْاَرْضِ كَمَا اسْتَخْلَفَ الَّذِيْنَ مِنْ قَبْلِهِمْ وَ
لَيُمَكِّنَنَّ لَهُمْ دِيْنَهُمُ الَّذِي ارْتَضٰى لَهُمْ وَ لَيُبَدِّلَنَّهُمْ مِّنْ بَعْدِ
خَوْفِهِمْ اَمْنًا ط يَعْبُدُوْنَنِيْ لَا يُشْرِكُوْنَ بِيْ شَيْئًا ط وَ مَنْ كَفَرَ
بَعْدَ ذٰلِكَ فَاُولٰٓئِكَ هُمُ الْفٰسِقُوْنَ○ (النور: ۴۷-۵۵)

'మేము అల్లాహ్‌ను, దైవప్రవక్తను విశ్వసించాము, విధేయతకు అంగీకరించాము' అని వారు అంటారు. కాని దాని తరువాత వారిలోని ఒక వర్గం (విధేయత పట్ల) విముఖతను చూపింది. అటు వంటి వారు ఎంతమాత్రం విశ్వాసులు కారు. దైవప్రవక్త వారి మధ్య ఉన్న వ్యాజ్యం విషయంలో తీర్పు చెప్పటానికి వారిని అల్లాహ్ వైపునకూ, ప్రవక్త వైపునకూ రమ్మని పిలిచినప్పుడు, వారిలోని ఒక ప్రత్యర్థి వర్గం విముఖత చూపుతుంది. కాని ఒకవేళ సత్యం వారికి అనుకూలంగా ఉంటే, దైవప్రవక్త వద్దకు పెద్ద విధేయులు మాది రిగా వచ్చేస్తారు. వారి హృదయాలకు (కపట) రోగమేదైనా తగి

లిందా? లేదా వారు సంశయంలో పడిపోయారా? లేదా అల్లాహ్, మరియు ఆయన ప్రవక్త తమకు అన్యాయం చేస్తారని వారికి భయమా? అసలు విషయమేమిటంటే, అన్యాయపరులు స్వయంగా వారే. విశ్వసించేవారి పని ఏమిటంటే, తమ వ్యాజ్యాన్ని దైవప్రవక్త పరిష్కరించే విషయంలో వారు అల్లాహ్ వైపునకూ, ప్రవక్త వైపునకూ పిలువబడితే, "మేము విన్నాము, విధేయత చూపాము" అని అనాలి. అటువంటి వారే సాఫల్యం పొందుతారు. అల్లాహ్‌కూ, ప్రవక్తకూ విధేయత చూపేవారు, అల్లాహ్‌కు భయపడే వారు, ఆయన పట్ల అవిధేయతకు దూరంగా ఉండేవారు మాత్రమే విజయం పొందుతారు.

వారు (కపటులు) అల్లాహ్ పేరుతో గట్టి గట్టి ప్రమాణాలు చేసి, "మీరు ఆజ్ఞాపిస్తే, మేము ఇళ్లనుండి బయలుదేరుతాము" అని అంటారు. వారితో, "ప్రమాణాలు చేయకండి, మీ విధేయత ఎలాంటిదో తెలుసు, మీ చేష్టలు అల్లాహ్ ఎరుగనివేమీ కావు" అని అను. ఇలా బోధించు, "అల్లాహ్‌కు విధేయులుకండి, దైవప్రవక్త ఆదేశాలను పాటించండి. కాని ఒకవేళ మీరు విముఖులైతే, బాగా తెలుసుకొండి, దైవప్రవక్తపై పెట్టబడిన కర్తవ్యభారం వరకే అతను బాధ్యుడు. మీపై మోపబడిన కర్తవ్య భారానికి మీరు బాధ్యులు. దైవప్రవక్తకు విధేయులైతే మీరే మార్గదర్శకత్వం పొందుతారు. లేకపోతే స్పష్టంగా ఆజ్ఞను అందజెయ్యటాన్ని మించి ఎక్కువ బాధ్యత దైవప్రవక్తపై లేదు."

మీలో విశ్వసించి మంచిపనులు చేసేవారికి అల్లాహ్ చేసిన వాగ్దాన మేమిటంటే, ఆయన వారిని, వారికి పూర్వం గతించిన ప్రజలను చేసిన విధంగా, భూమిపై ఖలీఫాలు (ప్రతినిధులు)గా చేస్తాడు,

అల్లాహ్ వారికై అంగీకరించిన వారి ధర్మాన్ని వారి కొరకు పటిష్ఠ మైన పునాదులపై స్థాపిస్తాడు. వారి యొక్క (ప్రస్తుత) భయస్థితిని శాంతిభద్రతలతో కూడిన స్థితిగా మారుస్తాడు. కనుక వారు నాకు దాస్యం చేయాలి, ఎవరినీ నాకు భాగస్వాములుగా చేయకూడదు. దీని తరువాత ఎవరైనా అవిశ్వాసానికి పాల్పడితే, అటువంటి వారే హద్దులు మీరినవారు. ***(దివ్యఖుర్ఆన్- 24 : 47 - 55)***

కేవలం కొన్ని విషయాలపై నమ్మకముంచటమే 'ఈమాన్' అని భావించేవారు పై ఆయతులపై ఒకసారి యోచన చేయాలి. కపటులు కూడా ఆ విషయాలన్నింటిపై విశ్వాసం కలిగి ఉన్నామని చెప్పేవారు. కానీ దివ్యఖుర్ఆన్ మాత్రం వారి ఈ ఒప్పుకోలును, నమ్మకాన్ని ఒప్పుకోలేదు. అసలు వారు విశ్వాసులే కారని నిర్ద్వంద్వంగా చెప్పేసింది. తమ జీవితపు సమస్త వ్యవహారాలలో దైవాజ్ఞలను, దైవప్రవక్త ఆదేశాలను శిరసా వహించని ఈమాన్ కూడా ఒక ఈమానేనా? అలాంటి ఇస్లాం కూడా ఒక ఇస్లామేనా? అని నిలదీసింది. వారి (కపటుల) పరిస్థితి ఎలా ఉందంటే, తమకేదన్నా లాభం కలుగుతుందనుకుంటే ప్రవక్త వద్దకు పరుగులు తీస్తూ వస్తారు. కాని దైవప్రవక్త(స) ఇచ్చే తీర్పు ద్వారా ప్రాపంచికంగా నష్టం వాటిల్లుతుందన్న భయం ఉంటే మాత్రం యూదు న్యాయస్థానానికి అప్పీలు చేసుకుంటారు. వారి అవినీతి, లంచగొండితనం ద్వారా లబ్ధి పొంద జూస్తారు. వారి హృదయాలలో కాపట్య రోగం ఉంది. ఇస్లాం ప్రాబల్యం వహించే విషయంలో వారికి సందేహం ఉంది. అల్లాహ్, ఆయన ప్రవక్త న్యాయంపై వారికి నమ్మకం లేదు.

సిసలైన విశ్వాసులెవరంటే, వారు తమ వ్యవహారాలన్నింటినీ దైవం, దైవప్రవక్త న్యాయస్థానానికి నివేదించుకుంటారు. అక్కడ వెలువడిన తీర్పును నిస్సంకోచంగా శిరసావహిస్తారు. చివరి ఆయత్‌లోని పదాలు

ప్రత్యేకంగా గమనించదగినవి. ఇందులో నిజ ముస్లింలకు శుభవార్త ఇవ్వ బడింది. ఇస్లాం ప్రాబల్యం వహిస్తుందన్న విషయంపై కపటులు సంశయా నికి లోనయ్యారు. కాని అల్లాహ్ ఇస్లాంకు ఆధిక్యతను ఒసగుతాడు. సత్య ధర్మం సర్వత్రా ప్రబలుతుంది. ప్రస్తుతం యూదులు, ముష్రిక్‌ల కారణంగా భయాందోళనల వాతావరణం నెలకొని ఉన్నమాట వాస్తవమే. అయితే అల్లాహ్ ఈ స్థితిని మార్చి సర్వత్రా శాంతిభద్రతలను నెలకొల్పు తాడు. నిజ విశ్వాసులు అప్పుడు ప్రశాంతంగా కేవలం అల్లాహ్ దాస్యం చేస్తారు. అల్లాహ్‌కు సహవర్తులుగా ఎవరినీ నిలబెట్టరు. ఇది కపటులకు శరాఘాతం. ఎందుకంటే వారు దైవేతరుల దాస్యం చేస్తున్నారు. అల్లాహ్‌కు ఇతరులను భాగస్వాములుగా ఎంచుతున్నారు. వారు తమ వ్యాజ్యాలను యూదుల వద్దకు తీసుకుపోయిన కారణంగా తీవ్రంగా వారి చర్య ఖండిం చబడింది. ఎవరయితే ఇబాదత్ (ఆరాధన, దాస్యం) భావంలో ఇతాఅత్ (విధేయత)ను కూడా చేర్చరో వారు పొరపాటు చేస్తున్నారు. మేము నమాజ్ చేస్తున్నాము, ఉపవాసాలు పాటిస్తున్నాము కదా! అలాంటప్పుడు మేము ఏ తాగూత్‌కు విధేయత చూపిస్తేనేమీ? అని తలపోసేవారు ఈ ఆయత్ గురించి కాస్త ఆలోచించాలి. ఒకవేళ దైవే తరుల విధేయత వల్ల అల్లాహ్ ఆరాధన (ఇబాదత్)లో తేడా ఏమీ రాదను కుంటే, మరి కపటులు దైవేతరుల దాస్యం చేసే వారుగా ఎందుకు నిర్ధారించబడ్డారో యోచించాలి.

ఈ వ్యవహారం ఎంతో ముఖ్యమైనది గనక, ఖుర్ఆన్ పట్ల అలసత్వం కారణంగా ప్రజలు ఈ వ్యవహారంలో పొరబడుతున్నందు వల్ల మరింత విపులీకరణ నిమిత్తం మేము ఇక్కడ మరో దివ్య వచనాన్ని ఉదాహరిస్తున్నాము. అన్ నిసా సూరాలో ఏమనబడిందో చూడండి :

وَمَنْ يُّشَاقِقِ الرَّسُوْلَ مِنْ بَعْدِ مَا تَبَيَّنَ لَهُ الْهُدٰى وَ
يَتَّبِعْ غَيْرَ سَبِيْلِ الْمُؤْمِنِيْنَ نُوَلِّهٖ مَا تَوَلّٰى وَنُصْلِهٖ جَهَنَّمَ

وَسَآءَتْ مَصِيْرًا ۝ اِنَّ اللّٰهَ لَا يَغْفِرُ اَنْ يُّشْرَكَ بِهٖ وَيَغْفِرُ مَا دُوْنَ ذٰلِكَ لِمَنْ يَّشَآءُ وَمَنْ يُّشْرِكْ بِاللّٰهِ فَقَدْ ضَلَّ ضَلٰلًاۢ بَعِيْدًا ۝

"తనకు రుజుమార్గం విశదమైనప్పటికీ ఎవడైనా ప్రవక్తకు వ్యతిరేకంగా నడుం బిగిస్తే, విశ్వాస వైఖరి కాక మరొక వైఖరిని అవలంబిస్తే, అతన్ని మేము అతడు మళ్ళిన దిక్కుకే నడిపిస్తాము. ఇంకా అతన్ని నరకంలో పడవేస్తాము. అది అతి నీచమైన నివాస స్థలం. అల్లాహ్ దృష్టిలో కేవలం షిర్క్ ఒక్కటే క్షమార్హం కానిది. అది తప్ప తాను కోరిన వారి అన్ని పాపాలను ఆయన క్షమిస్తాడు. ఇతరులను అల్లాహ్‌కు భాగస్వాములుగా చేసినవాడు అపమార్గాన బహు దూరం వెళ్ళిపోయాడు" ***(దివ్యఖుర్ఆన్- 4 : 115, 116)***

ఈ ఆయత్ ద్వారా స్పష్టంగా అర్థమయ్యేదేమిటంటే, ప్రవక్త చూపిన విధానాన్ని వ్యతిరేకించటం, విశ్వాసుల మార్గాన్ని కాదని అన్యుల మార్గాన్ని అనుసరించటం షిర్క్. దీనికి శిక్ష నరకం. నరకం కడు దుర్భరమయిన నివాస స్థలం.

'ఇన్నల్లాహ లా యగ్ఫిర్' (అల్లాహ్ షిర్క్‌ను క్షమించడు) అనే వాక్యం ఒకే సూరాలో రెండుసార్లు వచ్చింది. మొదటిసారి గ్రంథవహుల షిర్క్ సందర్భంగా ఇంతకుముందు ప్రస్తావనకు వచ్చింది. రెండవసారి కపటుల షిర్క్ నేపథ్యంలో వచ్చింది. నిశిత దృష్టి కల వ్యక్తి ఈ రెండు చోట్ల కూడా కాస్త ఆగి ఆలోచిస్తే, విషయంలోని గంభీరత చాలా సులువుగా అర్థమవుతుంది.

4. వెనుకటి అధ్యాయాల సారాంశం

ఈ సుదీర్ఘ వివరణలోని ప్రధాన ఉద్దేశ్యం ఒక్కటే– 'లా ఇలాహ'ను తిరస్కరించటం, 'ఇల్లల్లాహ్'ను నోటితో అంగీకరించటం సులువైనదే. పైగా ఇది ఎంతో క్లుప్తమైన ప్రక్రియే. కాని ఈ కలిమా వాంఛించే వాటిని క్రియాత్మక జీవితంలో నెరవేర్చటం మటుకు సులభం కాదు. మనిషి జీవితపు ఏ విభాగం కూడా దీని పరిధికి వెలుపల ఉండదు.

ఈ యదార్థం వెనుకటి మూడు అధ్యాయాలలో క్రమబద్ధంగా అర్థమయ్యే ఉంటుంది. మక్కావాసులు దేవుని అస్థిత్వాన్ని, ఆయన మౌలిక గుణాలన్నింటినీ సూత్రప్రాయంగా అంగీకరించేవారు. కాని ఖుర్ఆన్ వారి ఈ అంగీకారానికి ఎలాంటి ప్రాధాన్యతా ఇవ్వలేదు. ఇక గ్రంథం కల ప్రజల విషయానికి వస్తే వారు వీరికన్నా ఇంకా ముందుకు పోయి– దేవుని ఏకత్వాన్ని ఒప్పుకోవటమేకాక దైవగ్రంథాలను, దైవదూతలను, దైవప్రవక్తల రాకను కూడా ధ్రువపరిచేవారు. అయితే ఖుర్ఆన్ తులాభారంలో గ్రంథవహుల అంగీకారం కూడా 'భార రహితం' అని తేలిపోయింది. అందరికన్నా చివర్లో 'కపటుల' ప్రస్తావన వచ్చింది. కపటులు అనుకున్న దేమిటి? తాము దేవుని ఏకత్వం (తౌహీద్) వాంఛించే వాటన్నింటినీ నెరవేరుస్తున్నామని, తాము ప్రక్షాళనం చేయకుండా వదిలిపెట్టిన ఒక్క షిర్క్ మచ్చ కూడా తమ ఒంటిపై లేదని తలపోశారు. కాని దివ్య ఖుర్ఆన్ వారిలో ఉన్న షిర్క్ కల్తీని కూడా వెలికితీసి వారి కళ్ళకు కట్టింది. ఆ విధంగా మీ ముగ్గురిలో ఏ ఒక్క వర్గం వారికి కూడా దైవదాస్యం

విషయంలో చిత్తశుద్ధి లేదని, మీరు అసలు ఏకేశ్వరోపాసకులే కారని, మీలో ప్రతి ఒక్కరి జీవితం బహుదైవోపాసనకు ఆలవాలమై ఉందని నిర్ద్వం ద్వంగా చెప్పేసింది. షిర్క్ మిళితమై ఉన్న 'దాస్యానికి' అల్లాహ్ దృష్టిలో ఎలాంటి విలువ లేదని కూడా వక్కాణించింది.

ఇక ఈ మూడు వర్గాల వారు చేసిన అపరాధం ఏమిటో చూద్దాం-

ఇస్మాయీల్ సంతతి వారితో ఏమనబడిందంటే-

మీరు దైవదూతలను ఆరాధనా స్థాయికి చెందినవారుగా భావిస్తు న్నారు. వారిని దేవుని కుమార్తెలుగా ఖరారు చేశారు. వారిని పూజిస్తు న్నారు. ఆ పూజను దైవ సామీప్యానికి సాధనంగా (వారధిగా) తలపోస్తు న్నారు. ప్రపంచంలో మీకు ప్రాప్తించిన సిరిసంపదలు, ఆలుబిడ్డలు, భోగభాగ్యాలన్నీ వారి శుభం వల్లేనని నమ్ముతున్నారు. దైవసన్నిధిలో వారు మీ కోసం సిఫారసు చేస్తారని ఊహిస్తున్నారు. దైవాన్ని ప్రేమించినట్లే మీరు దైవదూతలను కూడా ప్రేమిస్తున్నారు.

అలాగే మీరు జిన్నాతులను దేవునికి సరిసమానులుగా భావిస్తు న్నారు. వారిని దైవభావనలో లాభనష్టాలు చేకూర్చేవారుగా తలపోస్తు న్నారు. వారిని మొరపెట్టుకుంటున్నారు. వారి మెప్పు కోసం మీ సంతా నాన్ని బలి ఇస్తున్నారు. వారి పలుకుబడి ఊర్ధ్వలోకాల వరకూ ఉందని అనుకుంటున్నారు. అగోచర జ్ఞానం తెలుసుకునేందుకు జిన్నాతులను వారధిగా భావిస్తున్నారు. వారికి దాస్యం చేస్తున్నారు. జగతి నిర్వహణలో నక్షత్రాలకు కీలకపాత్ర ఉందని అంటున్నారు. వర్షాలు కురవటం వెనుక నక్షత్రాల ప్రభావం ఉందంటున్నారు. మీ కార్యకలాపాలన్నీ షీరా నక్షత్ర శుభం వల్లనే అని కూడా అంటున్నారు.

ఈ విధంగా మీరు మీ దేవతల ఒక కొలువును నిర్మించుకున్నారు. అందులో దేవుని స్థానం కేవలం ఒక 'మహాదేవ్' వంటిది మాత్రమేనని,

ఆయన అధికారం ఆకాశమనే రాజధానికే పరిమితం అనుకుంటున్నారు. ఆయన ఎక్కడో దూరాన ఉండి భూ మండలంలోని పరిపాలనా వ్యవహారాలన్నింటినీ తన కార్యనిర్వాహకులకు అప్పగించి కూర్చున్నాడని తలపోస్తున్నారు. మీరు ఆ దేవుళ్ళందరినీ పూజిస్తున్నారు. వారి దేవాలయాలను, ఆస్థానాలను నిర్మించుకున్నారు. వారి సందర్శన నిమిత్తం, హజ్జ్ నిమిత్తం మీరు ప్రయాణం చేస్తారు. వారికోసం బలిదానాలిస్తారు. మొక్కుబడులు చెల్లించుకుంటారు. నైవేద్యాలు సమర్పిస్తారు. వారి పేర పశువులకు అచ్చోసి వదలిపెడతారు. వారికి సంబంధించి ఎన్నో వస్తువులను హలాల్ – హరామ్‌లుగా ఖరారు చేసుకుంటారు. వారి సమక్షంలో హాజరై బాణాల ద్వారా అదృష్టాన్ని పరీక్షించుకుంటారు. వారిపై ప్రమాణాలు చేస్తారు.

మీరు మీ పూర్వీకుల సమాధులను, వారి చిహ్నాలను పూజా స్థలాలుగా చేసుకున్నారు. వారిని సిఫారసు సాధనంగా ఎంచారు. దైవ సామీప్యం పొందాలంటే ఈ పెద్దల పూజ అవసరమనుకున్నారు. వారి ఆచార సంప్రదాయాలను ధర్మావలంబనగా తలపోశారు.

అంతేకాదు, మీరు సయితం దేవుళ్ళై కూర్చున్నారు. మీరు దైవోపదేశాల స్థానంలో మీ మనోవాంఛలను లేక ఇతరుల శాసనాలను అనుసరించటం చేస్తున్నారు. మీరు మీ తాతముత్తాతల ఆచారాలను, రీతీ రివాజులను షరీఅతుగా చేసుకున్నారు. ఈ విధంగా మీరు సొసైటీని, కుటుంబాన్ని, వర్గ తెగలను ఇలాహ్ (దైవం)గా చేసేసుకున్నారు. అంటే మీ మనసు మెచ్చిందే షరీఅత్. మీకు నచ్చినదే శాసనం. మీ పితామహులైన ఇబ్రాహీం ఇస్మాయీల్ (అలైహిముస్సలామ్) ద్వారా అల్లాహ్ మీకు ప్రసాదించిన జీవన సంవిధానం (దీన్)లో మీ అంతట మీరుగా కొంగ్రొత్త పోకడలను సమ్మిళితం చేశారు. మీ మత ధర్మానికి మీ మనసు మెచ్చిన

భాష్యం చెప్పుకున్నారు. అల్లాహ్ మీకు ప్రసాదించిన అనుగ్రహ భాగ్యాలను మీ స్వయం ప్రతిభాఫలంగా భావించారు. మీకు లోకంలో లభించిన ఆధిక్యతను చూసుకుని మీరు మిడిసి పడుతున్నారు. ఇబ్రాహీమ్ (అ) సంతతి వారమన్న గర్వం మీ నరనరాల్లో జీర్ణించుకుని ఉంది. షరీఅత్‌తో నిమిత్తం లేకుండా మీ పనులన్నీ చేసి పెట్టే బాధ్యత అల్లాహ్‌ది అని మీరు ఊహించుకుంటున్నారు. ఈ విషయాలన్నీ షిర్క్ క్రిందికే వస్తాయి. దైవదాసులమని మీరు చెప్పుకునే మాటలకూ– ఈ పోకడలకూ పొంతనే లేదు.

గ్రంథ వహులను ఉద్దేశించి ఖుర్ఆన్ ఇలా చెప్పింది :

ఏకేశ్వరోపాసకులమన్న మీ వాదన కూడా ఉత్తుత్తిదే. మీరు మీ పండితులకు, సన్యాసులకు శాసనాలు రూపొందించే, ధర్మాధర్మాలను నిర్ధారించే అధికారం కట్టబెట్టారు. వారు చెప్పిందే మీ దృష్టిలో సార్వభౌమాధికారి అయిన దేవుని వాక్కు. వీరు (ఈ మతాధిపతులు) భూ ప్రపంచంలో కట్టినదే ఆకాశంలో కట్టబడుతుంది. వీరు భువిలో విప్పినదే దివిలో విప్పబడుతుంది. మీరు దైవగ్రంథం, దైవప్రవక్త విధానం స్థానంలో జ్యోతిష్కుల పలుకులకు చోటు కల్పించారు. యూదులు ఉజైర్‌ను దేవుని కుమారునిగా చెప్పుకున్నారు. క్రైస్తవులేమో మసీహ్ (ఏసుక్రీస్తు)ను దేవుని కుమారుడుగా ఖరారు చేసుకున్నారు. మసీహ్‌ను దేవుని అవతారంగా కూడా నిర్ధారించుకున్నారు. దైవత్వాన్ని మూడు భాగాలుగా విభజించి, దేవుణ్ణి ఆ మూడింటిలో మూడవ భాగంగా ఖరారు చేసుకున్నారు.

పైపెచ్చు మిమ్మల్ని మీరు అధికులుగా చెప్పుకుంటారు. ఇబ్రాహీమ్ (అ) సంతతి వారమన్న గర్వం మీలో ఉంది. ఈ సంబంధాన్ని మీరు దైవ సామీప్య సాధనంగా, దేవుని ప్రీతిపాత్రులవటానికి కారణంగా చెప్పుకుంటారు. మీరు దైవానికి విధేయత చూపకుండా 'తాగూత్'గా

తయారయ్యారు. మీరు దైవగ్రంథానికి వారసులై ఉండి కూడా దైవేతర దాస్యానికి ఒడిగట్టారు. తాగూత్ వ్యవస్థను నెలకొల్పుకున్నారు. లేదా దౌర్జన్యపరులు స్థాపించిన తాగూత్ వ్యవస్థకు తలొగ్గారు. మిమ్మల్ని మీరు పరమ పవిత్రులుగా, ప్రత్యేకంగా ఎంపిక చేసుకోబడిన వారుగా ఊహించు కుంటున్నారు. మీ చేత జరిగినదేదైనా అది దైవాదేశానుసారం జరగక పోయినాసరే అది పవిత్రమైనదని, అది దైవకార్యమని, ధర్మబద్ధమైనదని తలపోస్తున్నారు.

మీరు దైవప్రవక్తల మధ్య విచక్షణ పాటిస్తారు. ఆ ప్రవక్తలను వర్గాలుగా విభజించుకున్నారు. వారిలో ఒక వర్గాన్ని నమ్ముతారు. మరో వర్గాన్ని తృణీకరిస్తారు. అల్లాహ్ మార్గనిర్దేశన స్థానే మీ మార్గబోధనను, మీ పద్ధతిని, మీ ప్రవక్తలను, మీ జాతిని కేంద్ర స్థానంగా పరిగణిస్తారు. పరలోకంలో మీకు పడే శిక్ష శాశ్వతంగా ఉండదని ఎద్దేవా చేస్తున్నారు. మేము ఏం చేసుకున్నా ఫరవాలేదని, తాత్కాలికంగా కొద్దికాలం శిక్ష అనుభవించి దైవసామీప్యానికి నోచుకుంటామని గొప్పలు చెప్పుకుంటు న్నారు. మీరు చేతబడి, గారడీ, తాయెత్తులు, క్షుద్రవిద్యపై విశ్వాసం ఉంచుతారు. దేవుని మార్గనిర్దేశనకు విరుద్ధమైన విధానాన్ని అవలంబించే పైశాచిక లీడర్లను, జ్యోతిష్కులను నమ్మి నడుచుకుంటారు. మీరు షిర్క్‌కు మద్దతుదారులు. విశ్వసించిన వారి పద్ధతిపై ముష్రిక్కుల పద్ధతికి ప్రాధా న్యత ఇస్తారు. ఈ విషయాలన్నీ తౌహీద్ (దేవుని ఏకత్వాని)కి, స్వచ్ఛ మయిన దైవదాస్యానికి విరుద్ధమైనవి.

కపటులతో ఖుర్‌ఆన్ ఇలా అంటోంది

కపట విశ్వాసులారా! ఏకేశ్వరోపాసకులమని మీరు చెప్పేవన్నీ కల్లబొల్లి కబుర్లే. మీ వ్యాజ్యాలను తాగూత్ వద్దకు తీసుకుపోయిన అపరాధులు మీరు. అల్లాహ్ పట్ల ఆయన ప్రవక్త(స) పట్ల వైముఖ్యం

కనబరిచిన వారికి మీరు మీ కేసులను అప్పజెప్పుతారు. మీరు ప్రవక్త విధేయతకు సిద్ధంగా ఉండరు. మరి వాస్తవానికి దైవప్రవక్తకు విధేయత చూపేవరకూ దైవవిధేయత సాధ్యం కాదు. ప్రవక్త(స)కు విధేయత కనబరచ నంత వరకూ దైవారాధన స్వీకారయోగ్యమవదు. ప్రవక్త చెప్పినది విన కుండా దైవారాధన చేస్తున్నామని చెప్పుకున్నంత మాత్రాన అది దైవారాధన అనిపించుకోదు. అది ఒట్టి బూటకం. కపట నాటకం.

దేవుని ఏకత్వానికి కట్టుబడినవారు ఆ సిద్ధాంతం పెట్టిన షరతుకు కూడా కట్టుబడి ఉండాలి. ఆ షరతు వాంఛించేదేమిటంటే, మిమ్మల్ని మీరు దైవప్రవక్త(స) ముందు సమర్పించుకోవాలి. ఆయన ఆజ్ఞలను హృదయ పూర్వకంగా శిరసావహించాలి. మీ సమస్త వ్యవహారాలలో ఆయన వైపునకే మరలాలి. ఆయన తీర్పులను మనస్ఫూర్తిగా అంగీకరించాలి. (కాని) మీరు చేసేదేమిటి? దైవోపదేశాలపై, ప్రవక్త బోధనలపై విమర్శలు గుప్పిస్తున్నారు. లేదా మీ ఆంతర్యాలలో ఆక్షేపణల చిట్టాను దాచిపెట్టుకు న్నారు. ఆయన చెప్పే విషయాలపై మీరు సందిగ్ధానికి లోనై ఉన్నారు. లేదా అపోహలు పెంచుకున్నారు. విశ్వాసుల కొరకు దేవుడు, దైవప్రవక్త సమ్మతించిన విధానం పట్ల విముఖత ప్రదర్శిస్తున్నారు. ప్రాపంచిక ప్రయో జనాలకు సంబంధించినంతవరకే ప్రవక్త మాట వింటున్నారు. అల్లాహ్ కన్నా, ఆయన ప్రవక్త కన్నా మీరు స్వప్రయోజనాలకు, ప్రాపంచిక పరమార్థాలకు, రక్తసంబంధాలకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ విషయాలన్నీ షిర్కే. అల్లాహ్ షిర్క్‌ను ఎన్నటికీ క్షమించడు.

5. నేటి ప్రపంచ స్థితి- ఒక చూపులో

ఇప్పుడు మన వద్ద 'ఆ జ్యోతి' ఉంది. దాన్ని పట్టుకుని మనం నేటి ప్రపంచ పరిస్థితిని వీక్షించి సింహావలోకనం చేసుకునేందుకు బయలుదేర వచ్చు. ప్రపంచంలో నేడున్న వివిధ జాతుల– ముఖ్యంగా 'నాగరికమయిన' జాతుల పరిస్థితి షిర్క్ రీత్యా, విగ్రహారాధన దృష్ట్యా ఎలా ఉందో చూడ వచ్చు. అయితే ఈ పుస్తకంలోని ప్రతి అధ్యాయాన్ని క్లుప్తంగానే ముగించా లనుకున్నాము. అందుచేత 1) విషయాన్ని స్థూలంగానే ప్రస్తావించదలి చాము. 2) ప్రతి మతాన్ని అవలంబించే వారి వర్తమాన పరిస్థితిని మాత్రమే దృష్టిలో ఉంచుకున్నాము. దాని ఆధారంగా ఆ మతాల వాస్తవిక తను చర్చించదలచుకో లేదు. 3) సంస్కృతీ నాగరికతల దృష్ట్యా ప్రాముఖ్యం కలిగి ఉన్న జాతులను గురించి మాత్రమే ఈ సందర్భంగా మాట్లాడదలి చాము. అన్యథా విషయం సుదీర్ఘమవుతుంది.

చర్చను సులభతరం చేసేందుకు మేము ముందుగా దూర ప్రాచ్యం లోని జాతులను, బౌద్ధ మతాన్ని అవలంబించేవారిని చూద్దాము. ఆ తరు వాత భారతదేశానికి వద్దాం. అనంతరం పశ్చిమ ఐరోపాను, అమెరికాను వీక్షించడంతోపాటు మరోవంక రష్యాపైన కూడా ఓసారి దృష్టిని సారిద్దాం. నాగరికత పరిఢవిల్లే ఈ జాతులలో షిర్క్ ఎలా వెర్రితలలు వేసి వికృతంగా మారిందో తెలుసుకోవడానికి అవలోకనం అవసరం. ప్రస్తుతం షిర్క్ (బహు దైవోపసాన) దాదాపు అంతరించిందని ఒకవైపు జ్ఞాన సంపన్నులు, పరిశోధకులు చెబుతున్నప్పటికీ, సమస్త భూమండలంపై దాని కారు

మబ్బులు ఎంత దట్టంగా ఆవరించిఉన్నాయో ఈ అవలోకన తరువాత అర్థమవుతుంది.

దూర ప్రాచ్యం

దూర ప్రాచ్యంలోని జాతులలో అత్యధికులు నాలుగు మత ధర్మాలను అవలంభిస్తున్నారు. 1) షంటూ మతం 2) తావీ మతం 3) కన్ఫ్యూషియిజం 4) బౌద్ధ మతం

జపాన్‌లోని ప్రధాన మత ధర్మం షంటూ మతం. ఆ మాటకొస్తే జపాన్ గడ్డపై ఐదొందల మతాలు పరిఢవిల్లుతున్నాయని అంటారు. కాని జపనీయుల ప్రాచీన మతం, ఆధునిక మతం కూడా షంటూ మతం అన్నది వాస్తవం. 6వ శతాబ్ది చివర్లో బౌద్ధమతం కొరియా (మార్గం) గుండా జపాన్‌లో అడుగు పెట్టింది. 9వ శతాబ్దానికల్లా అది షంటూ మతాన్ని దాదాపు మింగేసింది. అయితే 17వ శతాబ్దిలో జపాన్‌లో పెల్లుబికిన జాతీయతా వాదం కారణంగా ఆ దేశంలోని షంటూ మతం మళ్ళీ పునరుజ్జీవనం పొందింది. ఆ తరువాత ఆ మత ధర్మమే జపనీయుల జాతీయ మతంగా ఆమోదించబడింది.

ఈ మతంలోని ముఖ్య సూత్రం ప్రకృతి ఆరాధన, పూర్వీకుల పూజ. ఈ మతంలో దాదాపు 80 లక్షల దేవీదేవతలున్నారు. అయితే మరీ ముఖ్యంగా 'సూర్యదేవి'ని వారు అత్యధికంగా కొలుస్తారు. ఎందుకంటే జపనీయుల నమ్మకం ప్రకారం సూర్యదేవి మనుమడే జపాన్ రాజ్యానికి తొలి పరిపాలకుడు. అతనితోనే జపాన్‌లో అనువంశిక రాజరికం మొదలయింది. ఆ సూర్యదేవి సంతానమే వెయ్యేళ్ళుగా జపాన్‌లో రాజ్యమేలుతోంది. ఈ మతంలో సముద్ర దేవత, నదీ దేవత, పర్వతాల దేవత, అగ్ని దేవత– ఇలా ఎన్నో దేవీదేవతలు కూడా కొలవబడతాయి. దేశంలో వీర సైనికులు, రాజవంశానికి గొప్ప సేవలు చేసిన వారు కూడా పూజలందు

కుంటారు. అయినప్పటికీ షంటూ మతంలో అత్యంత కీలకమయిన ఆరాధ్య దైవాలు మాత్రం అక్కడి రాజ వంశానికి మూల స్త్రీగా ఉన్న దేవీ మాత్రమే. ఆమె సంతతికి చెందినవారు, రాజ బంధువులు కూడా అక్కడ ఆరాధించబడతారు.

ఇక చైనా విషయానికి వస్తే అక్కడి జనాభాలో చాలామంది తావీ మతాన్ని కన్‌ఫ్యూషియిజమ్‌ని, బౌద్ధ మతాన్ని అవలంబిస్తారు. అనాదిగా పూర్వ కాలం నాటి పెద్దలను, భూత పిశాచాలను, దేవీ దేవతలను పూజిం చాలని ఆ మతాలు చెబుతాయి. వీటిలో మొదటి రెండు మతాలు పూర్వీ కుల పూజను, ప్రకృతి ఆరాధనను సూత్రప్రాయంగా ఆమోదించాయి. బౌద్ధ మతం మాత్రం పూర్వీకులను పూజించమని చెప్పదు గానీ, చైనాలో కాలుమోపిన తర్వాత అక్కడి ప్రాచీన మతాలు బౌద్ధమతాన్ని కూడా తమ రంగులో రంగరించుకున్నాయి. ఈ మతాలు కూడా ప్రస్తుతం చైనాలో పెద్దల పూజను, దృశ్య పూజను, భూత పిశాచాల పూజను సమ్మతించి ఆమోదించిన మతాలుగానే వర్థిల్లుతున్నాయి. బాణామతి, చేతబడి, కనికట్టు, మంత్ర తంత్రాలు వాటి ముఖ్య విశేషాలు. వారి పూర్వీకుల ఆచార సంప్రదాయాల గాథలు ఎంత సుదీర్ఘంగా ఉంటాయంటే, చదివే వారు అలసిసొలసి సొమ్మసిల్లి పడిపోవలసిందేగాని, అవి మాత్రం తరగవు.

తావీ మత స్థాపకుడు లావుతర్జే. అతనిది 'నిరాకరణ ఫిలాసఫీ'. అతని మత గ్రంథం అతి కష్టమ్మీద మార్కు సువార్తలో సగభాగం ఉంటుంది. అయితే తరువాతి కాలంలో ఆ మతావలంబీకులు తమ మూఢనమ్మకాలను, మూఢాచారాలను అందులోఎంతగా జొప్పించారంటే వాటికి గనక గ్రంథ రూపం ఇస్తే పెద్దపెద్ద సంపుటాలు కూడా సరిపోవు. తావీ మత భిక్షువులు క్రీ.పూ. 100 నుండి తూర్పు సముద్రంలోని ఒక ద్వీపం అన్వేషణలో ఉన్నారు. అక్కడ ఒక మహిమాన్వితమయిన వృక్షం

(ఖల్ద్) మొలకెత్తుతుందనేది వారి నమ్మకం. వారు సమస్త ఆకాశాలను దేవీ దేవతలతోను, సమస్త భూమండలాన్ని మాంత్రికులతో, కనికట్టు ప్రవీణుల తోనూ నింపేశారు. మానవుడు గనక తన భావాలు భావనలను త్రోసిపుచ్చి సాత్విక జీవితం వెనుక ఉన్న రహస్యాన్ని తెలుసుకోగలిగితే అతను ఆకాశ దేవతల సరసన నిలబడగలుగుతాడన్నది ఈ మతస్థుల నమ్మకం. వారి ఆకాశ దేవతలలో 'భువన మహారాణి'కి వేరితరులకన్నా ఎక్కువ ప్రాముఖ్యత ఉంది. ఈమెయే సముద్ర దేవిగా, కెరటాల దేవిగా, తుఫానుల రాణిగా వర్ధిల్లుతోంది. ప్రతి చైనా నావికుణ్ణి, మత్స్యకారుణ్ణి, నౌకాదళాధి పతిని, నౌకా యాత్రికుణ్ణి ఈ దేవతే కాపాడుతుంది. సముద్రంలో ఎవరి కయినా, ఏదన్నా విపత్తు ఉందనిపిస్తే ఆ దేవతలను మొరపెట్టుకోవటం జరుగుతుంది. అప్పుడు ఆ దేవి ఆకాశంలో ప్రత్యక్షమై పెద్దపెద్ద తుఫాను లను తన ఖడ్గంతో అడ్డుకుంటుంది. సముద్రం లోని చీకట్లలో దారి తప్పిన నావికుల మార్గదర్శకత్వం కొరకు అది ఎర్రని లాంతరును ప్రత్యక్షపరు స్తుంది.

కన్ఫ్యూషియిజమ్ మత స్థాపకుడు కన్ఫ్యూషియస్. చైనీయుల అసలు మతం పూర్వీకుల పూజ. కన్ఫ్యూషియిజమ్ వాస్తవికత కూడా అంతకుమించి మరేమీకాదు. అది పూర్వీకుల పూజకు ఓ ధ్రువీకరణ పత్రం వంటిది. పెద్దల పూజ చైనీయుల మైథాలజీకి వెన్ను పూస వంటిది. వారి దృష్టిలో మృతుల ఆత్మకు అన్నిటికన్నా ఎక్కువ ప్రాముఖ్యం ఉంది. చైనీయుల సిసలైన దైవత్వం మృతుల చేతుల్లోనే ఉంది. ఆ మాటకొస్తే చైనీయులు తమ దేవీ దేవతలందరి పేర బలిదానాలిస్తారనుకోండి. కాని అన్నిటికన్నా అధికంగా– మనస్ఫూర్తిగా– వారు తమ తాతముత్తాతలను ఆరాధిస్తారు.

చైనీయుల నమ్మకం ప్రకారం మృతుల ఆత్మలు భూమ్మీదే

సంచరిస్తుంటాయి. వాటికి నైవేద్యాలు సమర్పించి, ప్రసన్నుల్ని చేసుకోక పోతే, వినమ్రంగా సేవించకపోతే అవి కినుక వహిస్తాయి. తత్ఫలితంగా ప్రజలపై ఎన్నో విపత్తులు వచ్చిపడతాయి అని వారు నమ్ముతారు. మృతుని వారసులు గనక అతని ఆత్మ పట్ల భక్తిభావంతో మెలగకపోతే, ఆ ఆత్మను పూజించకపోతే ఆ కుటుంబీకులు శాశ్వతమయిన పీడనకు గురవుతారని వారు నమ్ముతారు.

చైనాలో వ్యక్తికంటూ ఓ ప్రత్యేక వ్యక్తిత్వ భావన లేదు. అక్కడ ప్రతి వ్యక్తీ తన తాత ముత్తాతల సుదీర్ఘ పరంపరానుగత ఆచారాలతో ముడివడి ఉంటాడు. సజీవుడైన ప్రతి చైనీయుడు ఆద్యంతం తన పూర్వీకులైన మృతుల ఆత్మల దయా దాక్షిణ్యాలపై ఆధారపడి ఉన్నాడు. మృతుల భక్తీ ప్రపత్తులలో, వారి పూజా పునస్కారాలలో కించిత్ లోటు చేసినా అతనిపై ప్రళయం విరుచుకుపడినట్లేనన్నది వారి భావన.

వేలాది సంవత్సరాలు గడిచిపోయాయి. చైనీయులు తమ పూర్వీకుల రాతియుగపు జీవితం నుండి బయటపడి ఇప్పుడిప్పుడే నేటి ఆధునిక యుగపు జీవితంలో అడుగుపెట్టారు. ఇప్పటి వరకూ 25 రాజవంశాలు దేశాన్ని పరిపాలించాయి. భయంకరమయిన యుద్ధాలు, మహా గొప్ప విప్లవాలు ఆ దేశాన్ని, అక్కడి వ్యవస్థను ఆమూలాగ్రం మార్చివేశాయి. కాని చైనీయుల 'పెద్దల పూజ' మాత్రం మారలేదు. అది ఇప్పటికీ యధాతథంగా కొనసాగుతూనే ఉంది.

కన్ఫ్యూషియస్ ఎన్నో నైతిక సూత్రాల శిక్షణ కూడా ఇచ్చాడు. కాని అతని నైతికోపదేశాలన్నీ పెద్దల పూజ చుట్టూనే పరిభ్రమిస్తున్నాయి. మన పూర్వీకులు మనల్ని ప్రత్యక్షంగా గమనిస్తున్నారన్న తలంపుతో మనం వారిని పూజించాలంటాడు కన్ఫ్యూషియస్. అతనిలా అంటాడు : "మనం ఆత్మలను పూజిస్తున్నప్పుడు అవి మనలో ప్రవేశించాయి అన్న భావనతో తాదాత్మ్యం చెందుతూ మరీ పూజించాలి".

అతను తన ప్రబోధనలలో ఎక్కడా తాను దైవం అని చెప్పుకోలేదు గానీ, దేశంలో సర్వవ్యాప్తమైన మతం కారణంగానూ, తన ప్రబోధనల మూలంగానూ మరణించిన తరువాత అతను సయితం లావ్‌తజే మాదిరిగా దేవుడైపోయాడు. ఈనాడు చైనీయులు అతన్ని కూడా పెద్ద దేవత వలే పూజిస్తున్నారు.

బౌద్ధమతం పుట్టింది భారత గడ్డపైనే అయినప్పటికీ ఇక్కడి బ్రాహ్మణులు దానిని ఈ దేశంలో వ్రేళ్ళూనుకోనివ్వలేదు. దాంతో అది బర్మా, చైనా, జపాన్, టిబెట్ తదితర దేశాలలో శరణు జొచ్చింది. ఒక్క జపాన్ మినహా మిగిలిన అన్ని దేశాలలో దానికి మంచి ఆదరణ ఉంది. అక్కడ ఆ మతాన్ని అవలంబించేవారు చాలా పెద్ద సంఖ్యలోనే ఉన్నారు.

గౌతమబుద్ధుడు దైవాన్ని నమ్మేవాడు కాడని కొందరంటారు. కాని ఇది నిజం కాదు. ప్రాచీన ప్రపంచ చరిత్ర మనకు బహు దైవారాధకులతో నిండి ఉన్నట్టు కనిపిస్తుంది. నాస్తికుల జాడలు అసలు కానరావు. దైవాన్ని కాదనే నాస్తికులు అక్కడక్కడా ఈ ఆధునిక జగతిలో మాత్రమే కనిపిస్తారు. అలాంటప్పుడు గౌతమబుద్ధుడు లాంటి తాత్వికునికి దేవునిపై నమ్మకం లేదని ఎలా అంటారు? గౌతమ బుద్ధుని కాలానికి సంబంధించిన చరిత్ర అధ్యయనం ద్వారా గాని, ఆ మతానికి సంబంధించిన ప్రబోధనల ద్వారా గాని మనకు బోధపడినదేమిటంటే, గౌతమబుద్ధుడు అహం వినా సర్వం నాస్తి అనే తత్వాన్ని నమ్మినవాడు. గౌతమ బుద్ధునికి పూర్వమే భారత దేశంలో ఉపనిషత్తుల ద్వారా 'అహం బ్రహ్మాస్మి' 'అహం వినా సర్వం నాస్తి' తత్వం బాగా వ్యాప్తి చెందింది.

ఈ సిద్ధాంతాన్ని నమ్మేవారు. దేవుణ్ణి అంగీకరిస్తున్నారా లేదా? అనే ప్రశ్న కూడా తలెత్తదు. బుద్ధుని దృష్టిలో 'అహం' మినహా మిగతా విశ్వమంతా ఒక మాయ, మోసం. గౌతమ బుద్ధునికి పూర్వం యోగి

పనేమిటంటే, అతను జీవన్మరణాల జంఝాటం నుండి, మాయ అనే ఉచ్చు నుండి విడిపించుకుని, ఆత్మలోకంలో విలీనమైపోవాలి. వేరే మాటల్లో చెప్పాలంటే 'అహం'లో కలిసిపోవాలి. గౌతమ బుద్ధునికి పూర్వం భారతదేశంలో హిందూ యోగుల కఠోర తపస్సుల,అభ్యాసాల చరిత్రలో మనకు కనిపించేది ఇదే. వారు రకరకాల కఠోరమయిన అభ్యాసాల ద్వారా మాయామోసాల వ్యూహం నుండి విముక్తి పొంది ఆత్మల లోకంలో విలీన మయ్యేందుకు యత్నించేవారు. గౌతమబుద్ధుడు కళ్ళు తెరిచి, మోక్షం కోసం మార్గం వెతకాలన్న జిజ్ఞాస అతని మదిలో జనించినప్పుడు అతని ముందుకు వచ్చిన 'తత్వం' కూడా ఇదే. అతను కూడా బ్రాహ్మణుల మాది రిగా ప్రాపంచిక బాదర బందీల నుండి, కోర్కెల జంఝాటాల నుండి బయటపడేందుకు కఠోరమయిన తపస్సులు చేశాడు. కాని కొన్నాళ్ళ తరువాత అతనికి ఒక యదార్థం తెలిసివచ్చింది- ఆధి భౌతికతత్వపు ముసుగు నుండి బయట పడటానికి అరి వీరభయంకరమయిన అభ్యాసాల అవసరం లేదని. కోర్కెలే దుఃఖానికి మూల కారణమని, మనసుకు ఈ ఐహిక ప్రేమల నుండి ముక్తి కల్పిస్తే చాలన్న నిర్ధారణకు వచ్చాడు. అందుకే అతను బ్రాహ్మణుల కఠోర సాధనలను సంస్కరించి, ఆత్మశుద్ధి కోసం, బ్రహ్మచర్యం కోసం కొంగ్రొత్త నియమాలను ప్రవేశపెట్టాడు. బాహ్య పరిత్యాగం కన్నా అంతః పరిత్యాగానికి ప్రాముఖ్యతనిచ్చాడు.

'అహం బ్రహ్మాస్మి' సిద్ధాంతానికి పరాకాష్ఠ 'నేనే' అనేది. 'నేనే దైవాన్ని' 'నేనే సత్యాన్ని', ఈ 'అహం' హైందవ యోగులలో ఎంతగా పెన వేసుకుపోయిందంటే తత్కారణంగా వారు 'దాసులు'గా జీవించడానికి ఇష్టపడక 'తాగూత్'లై కూర్చున్నారు. గౌతమ బుద్ధుని సాధనా లక్ష్యం కూడా ఇదే. అందుకే అతను కూడా తన ఆలోచనలకనుగుణంగా ఆధి భౌతిక తత్వపు రూపాన్ని విసర్జించి ఆత్మలోకంలో విలీనమైపోయాడు. అతను

మరణించిన తరువాత అతని శిష్యులు అతన్ని దేవునిగా చేసుకున్నారు. అతని జననానికి సంబంధించి ఎన్నో కాల్పనిక విషయాలను ప్రచారం చేసి, అతన్నొక అవతార పురుషునిగా లోకం ముందు ఆవిష్కరించారు. ఈ లోకానికి నవ జీవనాన్ని ప్రసాదించడానికి వచ్చిన వాడన్నారు. చైనా, జపాన్, టిబెట్, బర్మా తదితర దేశాల్లో ప్రజలు అతన్ని దేవుని మాదిరిగానే పూజిస్తారు. అతని పేరుతో వెలిసిన బ్రహ్మాండమయిన మందిరాలు, అద్భుతమయిన విగ్రహాలు సందర్శకులను కట్టిపడేస్తాయి. చైనాలో ఈ తథాగతుని పూజించేవారు అన్ని రకాల దెయ్యాలు, దేవతల పూజలో కూడా తలమునకలై ఉండటం విశేషం. టిబెట్‌లోనైతే పరిస్థితి ఇంకా దారుణం. టిబెట్‌లోని అతిపెద్ద బౌద్ధమత గురువు (దలైలామా) తనను తాను గౌతమబుద్ధుని అవతారంగా భావిస్తాడు. గౌతమబుద్ధుని వలెనే దైవత్వం చెలాయించుకుంటాడు. అక్కడి 'దలైలామా' మరణించినప్పుడు గర్భవతి అయిన ప్రతి స్త్రీ తానొక కొత్త దేవుణ్ణి కనాలని కలలు కంటుంది. ఆ కాలంలో ఎందరో శిశువులు జన్మించినప్పుడు ఒక ప్రత్యేక పద్ధతిలో చీటీలు (లాటరీ) వేసి వారిలో నుంచి ఒక 'కొత్త దేవుణ్ణి' ఎంపిక చేసుకోవటం జరుగుతుంది.

భారతదేశం

కర్మభూమి గురించి ఇక చెప్పాల్సిన పనేలేదు. కాని ఎంతో కొంత చెప్పక తప్పదు కదా! ఇక్కడి ప్రతి అణువు దేవతే. చీమ మొదలుకుని ఏనుగు వరకు, రేణువు మొదలు సూర్యుని వరకు ఇక్కడ అందరూ దైవాలే. అందరూ పవిత్రులే. నదులు, సముద్రం, కొండలు, గుట్టలు, రాళ్ళు, రప్పలు, పశుపక్షాదులు, పిల్లి, ఎలుక వంటివి కూడా దైవాలే. ఆఖరికి మానవుని మర్మావయవాలను పూజించేవారు సయితం ఈ పుణ్యభూమిలో ఉన్నారు.

వేదాలలో మనముందు మొదటగా 'వెయ్యి కనుల' ఇంద్రుడు వస్తాడు. అతను తనను పూజించే వారికి క్రియాత్మకంగా మత్తులో ఓలలాడే శిక్షణ ఇచ్చాడు. ఆ తరువాత బ్రహ్మ, విష్ణు, శివుల త్రయం వస్తుంది. ఈ ముగ్గురిలో మొదటివాడు సృష్టికర్త, రెండవ వాడు రక్షకుడు, మూడవవాడు జీవన్మరణాల ప్రదాత.

బ్రహ్మ తాను సృష్టించిన తరువాత దానిని నాశనం చేసి సరికొత్త ఉనికిని ప్రసాదిస్తాడు.

విష్ణువు ఈ లోకంపై ఏదయినా పెద్ద విపత్తు వచ్చి పడినప్పుడు సృష్టికి విముక్తి నొసగటానికి అవతరిస్తాడు. ఈ లక్ష్యం కొరకు అతను పదే పదే అవతారమెత్తుతుంటాడు. హిందూ మైథాలజీలో అతని దశావతారం సుప్రసిద్ధం. శ్రీ కృష్ణుడు కూడా విష్ణు అవతారంగా భావించబడతాడు. శ్రీకృష్ణుని జీవితం గురించి, గోపికలతో అతని వ్యవహార సరళిని గురించి హైందవ జగతిలో ప్రాచుర్యంలో ఉన్న కథనాలు వర్ణనాతీతం.

శివుడు విష్ణువుకు సమీప ప్రత్యర్థి వంటివాడు. అతను ఏక కాలంలో రెండు పరస్పర విరుద్ధ భావాలకు నిలయమైనవాడు. అతని స్వాధీనంలో నిర్మాణంతోపాటు విధ్వంసం కూడా ఉంది. అతనిలో స్త్రీ పురుష ప్రత్యేకతలు రెండూ ఉన్నాయి. అందుకే శివుణ్ణి అర్ధనారీశ్వరుడని కూడా అంటారు.

ఆ తరువాత మన ముందుకు పతంజలి తత్వం లేక హైందవ వేదాంతం వస్తుంది. దీనికి ప్రాతిపదిక 'అహం బ్రహ్మాస్మి' సిద్ధాంతం. ఇది పూర్తిగా 'అహం'పై ఆధారపడి ఉంది. 'అహం వినా సర్వం నాస్తి' అనేది దీని ముఖ్య దృక్పథం. ఒక చిన్న రేణువు మొదలుకుని బ్రహ్మాండ మయిన ప్రభాకరుని వరకూ, ఒక చిన్న నీటిబొట్టు నుండి మహా సముద్రం, మనిషి వరకూ అన్నీ దేవుడై పోవాలి. దీనికి ఏకైక మార్గం కఠోర అభ్యాసం.

కఠోర తపస్సు. సర్వసంగ పరిత్యాగం ద్వారా ఆత్మకు ముక్తినొసగాలి. ఈ లక్ష్య సిద్ధికోసం హిందూ యోగులు, సన్యాసులు, బైరాగులు అవలంబించిన పద్ధతులను గురించి విన్నప్పుడు గుండె చెరువైపోతుంది. ఇందు నిమిత్తం వారు క్రియాత్మకంగా ప్రదర్శించిన దానిని ఊహించుకుంటేనే శరీరంలోని రోమాలు నిక్కబొడుచుకుంటాయి. కాని అతి సామాన్యమయిన లక్ష్యాల కోసం ప్రాణాన్ని పణంగా పెట్టే ఈ మానవుడు దేవుడుగా మారడానికి ఏం చేసినా, ఎంత చేసినా తక్కువే. అందుకే– ఈ హైందవ యోగులు చేసిన దీక్షలను, కఠోర సాధనాలను గమనించినప్పుడు ఇలాంటి దృష్టాంతాలు చరిత్రలో అరుదుగానే లభిస్తాయనవచ్చు. అయితే ఇదంతా దైవదాస్యం కొరకు అవలంబించబడిన పద్ధతులు కావు సుమా! దేవుడుగా మారటానికి అవలంబించినవే.

ఈ పురుష దేవతల తరువాత స్త్రీ దేవతల వంతు వస్తుంది. వీరి సంఖ్య కూడా తక్కువేమీ కాదు. వీళ్ళందరి గురించి వివరాల్లోకి పోవలసిన అవసరం కూడా లేదు. లక్ష్మీ, సరస్వతి, దుర్గామాత, భైరవీ, కాళిమాత వీరిలో కొందరు. ముఖ్యంగా హైందవుల నమ్మకం ప్రకారం కలరా వంటి భయంకరమయిన వ్యాధులు కాళిమాత ఆగ్రహిస్తేనే సమాజంలో ప్రబలుతాయి.

హైందవ సమాజంలో ఉన్న వివిధ వర్గాల తెగల విభజన కూడా చాలావరకు ఈ దేవీదేవతలను కొలవటంపై ఆధారపడినదే. లేదా భగవద్గీత, పతంజలి ఫిలాసఫీ ప్రభావం వల్ల ఏర్పడినవే. మరికొన్ని వర్గాలు ఒండొక దానికి భిన్నంగా కనిపించినప్పటికీ ఈ భిన్నత్వం బాహ్యా స్వరూపంలో మాత్రమే. సారాంశం రీత్యా, వాస్తవికత దృష్ట్యా మాత్రం వ్యత్యాసం ఏమీ లేదు. కేవలం రెండు వర్గాలకు మాత్రమే కొంత మినహా యింపు ఉందని అనవచ్చు. వాటిలో ఒకటి : ఆర్యసమాజం. రెండవది;

శిక్కు వర్గం. ఈ రెండు వర్గాలపై ఇస్లాం ప్రభావం పడింది. దేవుని ఏకత్వపు భావనతో అవి కాస్తో కూస్తో దగ్గరయ్యాయి. అయితే ఇస్లాంతో సైద్ధాంతికంగా అవి చేరువయ్యాయంటే ఆ చేరువ సకారాత్మ కంగా జరిగినది మాత్రం కాదు. ఆత్మరక్షణలో భాగంగానే అవి ఈ విధా నాన్ని అవలంబించాయి. అందుకే అవి సైద్ధాంతికంగా కొంతవరకు దగ్గరైనప్పటికీ ఇస్లాంకు బహుదూరానే ఉన్నాయి. ముస్లింలను మత పరంగా ఎదుర్కొనాలంటే బహు దైవోపాసన ఆధారంగా ఎదుర్కోవటం సాధ్యం కాదని ఆర్య సమాజ, శిక్కు మత స్థాపకులు గ్రహించారు. అందుకే వారు విగ్రహారాధనను పరిత్యజించి సంస్కరణా పంథాను అనుసరించారు. సహేతుకంగా ఆలోచించి బుద్ధికి అందే ధోరణిని అవలంబించారు. ఆఖరికి వారు ఒక నిర్ధారణకు వచ్చారు- ఫరవాలేదు, ఇప్పుడు మనం ముస్లింలను ఎదుర్కొనగలమని. ఎందుకంటే వీరికి మొదటి నుండీ ముస్లింలతో ఉన్నంత విరోధం వేరితరులతో లేదు. వాస్తవానికి వారు సైద్ధాంతికంగా ముస్లింలకు చేరువైన కారణంగా ముస్లింలను వారు అభిమానించాల్సింది. మొత్తానికి వారు ఏ ఉద్దేశ్యంతో మతంలో సంస్కరణ తీసుకువచ్చినా సంస్కరణ మాత్రం శ్లాఘించదగినదే. క్రియాత్మకంగా వారు ఇస్లాం, ముస్లింల పట్ల వైర వైఖరిని అవలంబించినప్పటికీ ప్రాథమిక బోధనల రీత్యా మాత్రం దగ్గరయ్యారు. ఇప్పుడు వారికి 'తౌహీద్' గురించి, అది వాంఛించే వాటి గురించి విశదీకరించటం సులభమయింది. కాకపోతే సత్యం వారి ముందుకు రావలసిన దారి గుండానే రావాలి.

మత భావన బలంగాఉన్న భారతదేశంలోని సామాన్య జనులు, ప్రముఖులు కూడా మూఢనమ్మకాలలో, బహుదైవోపాసనా ఊబిలో చిక్కు కుని ఉన్నారు. ఇక్కడి ఉన్నత విద్యావంతుల మనోమస్తిష్కాలపై 'నేను' లేక 'అహం వినా సర్వం నాస్తి' అనే ఆలోచన ముసురుకుని ఉంది. ఇది ఒక

ఉపద్రవం కంటే తక్కువేమీ కాదు. తాము విగ్రహారాధనకు వ్యతిరేకమని ఆర్య సమాజీలు, శిక్కు వర్గీయులు చెబుతున్నప్పటికీ సిసలైన ఏకేశ్వరోపాసనను చేరుకునేందుకు వారు ఇంకా బహుదూరం ప్రయాణం చేయ వలసి ఉంది.

భారతదేశంలో ముస్లింల ప్రాబల్య ప్రభావం చేత ఆర్య సమాజ్, శిక్కు వర్గం ఉద్భవించినట్లే ఆంగ్లేయుల ప్రాబల్యం కారణంగా, పాశ్చాత్య భావజాలం కారణంగా కూడా ఒక కొత్త వర్గం పుట్టుకొచ్చింది. అది అత్యంత ప్రగతిశీలక వర్గం. అది చాలావరకు ప్రాచీన హిందూ పుక్కిటి పురాణాల మూఢనమ్మకాల నుండి బయటపడిన మాట వాస్తవమే. కాని అది తనదైన మైథాలజీని తయారు చేసుకుంది. దానికి సంబంధించిన సరుకును అది పాశ్చాత్య ప్రపంచం నుంచి అరువు తెచ్చుకుంది. అందులో పురాతన దేవీదేవతల స్థానంలో అధునాతన దేవీ దేవతలున్నారు. ఈ మైథాలజీలో మనిషి స్వయంగా తన 'దైవం'చేత తనకు కావలసిన శాసనాన్ని రూపొందించుకుంటాడు. తనపైన తానే పరిపాలన చేస్తాడు. అతను దేవుని రాజ్యంలో తన రాజరికపు ఢంకా బజాయిస్తాడు. దాని పేరే ప్రజాస్వామ్యం (Democracy).

పశ్చిమ ఐరోపా, అమెరికా

పశ్చిమ యూరప్, అమెరికాల అసలు మత ధర్మం క్రైస్తవం. క్రైస్తవ మతం ఏవిధంగా ప్రక్షిప్తాలకు లోనయిందో, దాని తొలికాలపు చరిత్రను గురించి మనం వెనుకటి పుటల్లో కొంతవరకు తెలుసుకున్నాం. 'నీసియా' కౌన్సిల్ తీర్మానం తరువాత త్రిత్వం (Trinity) రాజ్య మతంగా రూపొందింది. ఐరోపాలో చర్చి దైవత్వపు యుగం కూడా దాంతో మొదలయింది. ఈ కౌన్సిల్ జరిగిన తరువాత మసీహ్ (ఏసుక్రీస్తు) సిసలైన వారసులైన ఆర్యూసీ వర్గం క్రమేణా క్షీణించసాగింది. అది ఒక బాధిత వర్గంగా

మారిపోయింది.[1] పాల్ చేసిన ప్రక్షిప్తాల ఆధారంగా చర్చీ ఆచారాలు, నమ్మకాల కట్టడం నిలబెట్టబడింది.

ఇప్పుడు మనం స్థూలంగా మధ్య యుగాల కాలంనుండి సంస్కరణా (Reformation) యుగం వరకూ చరిత్రపై ఓసారి దృష్టిని సారించటం అవసరం.

ఈ మధ్యన మనకు రెండు విషయాలు చాలా ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. 1) క్రిస్టియన్ చర్చీ ఏకత్వం 2) దాని సర్వతోముఖ అధికారం. మధ్యయుగాలలో చర్చీవ్యవస్థ, దాని అధికారం ఎంతగా విస్తరించిందంటే, ఆ కాలంలో చిన్నాపెద్దా రాజ్యాలు సయితం దాని చేతిలో కీలుబొమ్మలా మారిపోయాయి. చర్చీ వైభవం ముందు రోము సామ్రాజ్య తేజస్సు సయితం మసకబారిపోయింది. అయితే చర్చీ ఈ అధికారాన్ని దుర్వి నియోగం చేసింది. ఈ అధికార మత్తులో అది శిలువ యుద్ధాల (Crusades) కు శ్రీకారం చుట్టింది. ఆ యుద్ధాలు యావత్తు ఐరోపాను అతలాకుతలం చేసేశాయి. ఆ కాలంలో చర్చీకి దేవాధి దేవతలుగా వ్యవహ రించినవారు చేసిన నేరాలు అన్నీ ఇన్నీ కావు. వారు నరమేథం సృష్టించి రక్తపుటేరులు ప్రవహింపజేశారు. ముక్కుపచ్చలారని కుర్రాళ్ళను సయితం యుద్ధానికి ప్రేరేపించి విలువైన మానవ నవనీతాన్ని పొట్టన పెట్టు కున్నారు. నిర్మాణం కోసం వెచ్చించవలసిన ఒనరులను విచ్ఛిన్నం కోసం వెచ్చించి వినాశనం సృష్టించారు. తత్కారణంగా యూరోపియన్ల హృదయా లలో చర్చీ వ్యవస్థ పట్ల వెగటు, ద్వేషం జనించాయి. యువతరం పునరాలో

---

1. *ఈ వర్గానికి చెందిన కొందరు సజ్జనులే మహాప్రవక్త ముహమ్మద్(స) ప్రభవించి నప్పుడు, ఆయన్ని విశ్వసించారు. ఈ కొద్దిమంది సజ్జనుల గురించే దివ్య ఖుర్ఆన్ అనేక చోట్ల ప్రస్తుతించింది. కాగా; పాల్ అనుయాయులు మాత్రం సదా దేవుని ఏకత్వ (తౌహీద్) భావనకు శత్రువులుగానే ఉన్నారు.*

చనలో పడిపోయింది. అధికారం చర్చిపెద్దల హస్తగతం అయిందంటే అది లోక వినాశానికి దారితీయటం ఖాయం అన్న భావన ప్రజా బాహుళ్యంలో నాటుకుపోయింది. చర్చి ప్రజల మనో మస్తిష్కాలపై ఆక్టోపస్ మాదిరిగా అల్లుకుపోయిందని, ఈ ఆక్టోపస్ పీడ వదలనంతవరకూ భావ దారిద్ర్యం నుండి ప్రజలు బయటపడలేరని విజ్ఞులు, శాస్త్రవేత్తలు భావించసాగారు. ప్రభుత్వాలపై చర్చి సాగించే పెత్తనం ప్రకృతికి విరుద్ధమని, అది ఏమాత్రం సహేతుకం కాదని, అందుకే మతానికి– రాజకీయానికి మధ్య సంబంధం ఉండకూడదని ఆనాటి రాజకీయ విశ్లేషకులు, రోమన్ కేథలిక్ చర్చిపై వేలెత్తేవారు పుట్టుకువచ్చారు. ప్రపంచంపై రాజకీయ పెత్తనం చెలాయించ డానికి రోమన్ కేథలిక్ చర్చి ఒక పనిముట్టుగా ఉందని, ఆ వ్యవస్థను రూపుమాపాలని కొంతమంది తలపోయసాగారు. కడకు స్వయంగా చర్చిలోనే ఒక అసంతృప్త వర్గం పుట్టుకొచ్చింది. తాము మసీహ్ (ఏసుక్రీస్తు) జీవితం నుండి, ఆయన ప్రబోధనల నుండి వేరైపోయి ప్రాపంచిక పైశాచిక పోకడలకు ఆలవాలమైపోతున్నామని ఆ అసంతృప్త వర్గం తలపోయ సాగింది. ధనరాసులను పోగు చేసుకోవటం, కీర్తి ప్రతిష్టలను చాటుకో వడం, ప్రపంచాన్ని వినాశం అంచులకు చేర్చటమే తమ లక్ష్యంగా మారి పోయిందని, దీనికి బదులు తాము పేదరికపు జీవితాన్ని గడుపుతూ, మానవ సేవ చేస్తూ ప్రపంచ త్యాగంచేసి ఏసు అడుగుజాడల్లో నడవాల్సిన తరుణం ఆసన్నమైందని కూడా వారు సంకల్పించుకున్నారు.

ఈ పరిస్థితులన్నీ వెరసి ఐరోపాలో తీవ్రమయిన అంతర్మథనానికి పురికొల్పాయి. సంఘర్షణ సాగింది. సంక్షోభంలో నుండి అంతర్గత తరం గాలు ఉద్భవించాయి. దాని పర్యవసానమే సాంస్కృతిక పునరుజ్జీవనం (Renaissance). బైకిన్ లాంటి విద్వాంసులు, మాకియవెల్లి, హ్యూగో గ్రోటిస్ లాంటి రాజకీయవేత్తలు, గార్డినో బ్రూనో లాంటి స్వేచ్ఛా భావాలు

కల తత్వవేత్తలు ఈ సంక్షోభంలో నుండి పుట్టినవారే. ఇలాంటి విజ్ఞానుల వ్యతిరేకతను అణిచివేయడానికి చర్చీ చేసిందేమిటి? మతపరమైన నేరాలపై తీర్పులు ఇచ్చే ధర్మాసనాల (Inquistitions)కు వారిని అప్పగించింది. ఆ విధంగా సంస్కరణ వైపునకు పిలుపు ఇచ్చే రాజకీయవాదులు, మత నాయకులు, శాస్త్రవేత్తలపై అవలంబించిన దమననీతిని, వారికి విధించిన శిక్షలను తలచుకుంటేనే ఒళ్లు జలదరిస్తుంది. అయితే ఈ అణచివేత విధానాల వల్ల చర్చీ వ్యవస్థ పట్ల ప్రజాబాహుళ్యంలో గల వ్యతిరేకత తగ్గ లేదు సరికదా అది మరింతగా ఉధృతమయింది. పాశ్చాత్య రాజ్యాలలో జాతీయతా భావం బలపడసాగింది. ప్రతి జాతి వారు తమ తమ జాతీయ తను కాపాడుకునే దిశలో ప్రయత్నాలు ముమ్మరం చేశారు. వైజ్ఞానిక రంగంలో పరిశోధనలు చురుకుగా జరిగాయి. కొంగ్రొత్త ఆవిష్కరణలకు రంగం సిద్ధమైంది. ఇక తత్వవేత్తలయితే చర్చీ వ్యవస్థను తూర్పారబట్టడం మొదలెట్టారు. స్వయంగా చర్చీ అంతర్గత వ్యవస్థలోనే దిద్దుబాటు, పరివర్తన జరగాలని గొంతెత్తి ఘోషించే వారు ఉద్భవించారు. తత్ఫలితంగా 16వ శతాబ్ది మొదలయ్యేనాటికి ఈ సంస్కరణావాదులు సుసంఘటితమయిన చర్చీని నిలువునా చీల్చి రెండు ముక్కలు చేసేశారు. ప్రొటెస్టెంట్ వర్గానికి పునాది పడింది. ఏసుక్రీస్తును, దైవాన్ని ప్రసన్నుల్ని చేసుకోవడానికి మధ్యలో మధ్యవర్తుల అవసరం లేదన్నది ప్రొటెస్టంట్‌ల వాదన. బైబిల్‌ను అర్థం చేసుకునే, మతాచారాలను నిరాటంకంగా అవలంబించే హక్కు ఒక ప్రముఖునికి ఉంటే ఒక సామాన్య మనిషికి సయితం ఉందని ప్రొటెస్టెంట్లు ప్రచారం చేశారు.

జాతీయ ప్రభుత్వాలైతే 13వ శతాబ్ది నుండే ఏర్పడసాగాయి. 16, 17వ శతాబ్దాల నాటికి ఐరోపాలో జాతియతా వాదం పరాకాష్టకు చేరింది. మతాన్ని రాజకీయాల నుండి వేరుపరచాలన్న వాదన ఊపందుకుంది.

పరమత సహనం (Religious Tolerance) నినాదం ఎంతగా ఉధృత మైందంటే చర్చీ వ్యవస్థ ఆత్మరక్షణలో పడిపోయింది. కేథలిక్కులైనా, ప్రొటెస్టెంట్లయినా– అందరూ తమ ధార్మిక కార్యకలాపాల పరిధిని కుదించుకోక తప్పలేదు. సారస్వత, రాజకీయ, ఆర్థిక రంగాలకు సంబంధించిన విభాగాలన్నీ చర్చీ పెత్తనం నుండి క్రమక్రమంగా విమో చనం పొందాయి. 18, 19 శతాబ్దాలలోచర్చీ స్థానంలో ఆధునిక రాజకీయ, ఆర్థిక సంస్థలు, సిద్ధాంతాలు పుట్టుకొచ్చి ప్రజా జీవితాలను శాసించే స్థాయికి ఎదిగాయి. మతం అనేది కేవలం ప్రైవేట్ జీవితపు 'ఒక వ్యాపకం'గా మిగిలిపోయింది. ప్రజల సామూహిక జీవితంపై క్రైస్తవ మతాధిపతుల, సన్యాసుల దైవత్వం స్థానే ప్రజా సంస్థల, పార్లమెంటుల దైవత్వం మొదలయింది.

ఈ వివరాల ద్వారా తేటతెల్లమయ్యేదేమిటంటే, క్రైస్తవులకు స్వచ్ఛమయిన దైవారాధన, దైవదాస్యం చేసే అదృష్టం ఎన్నడూ దక్కలేదు. పాల్ మహాోదయుడు వచ్చి వారిని ఏసు, మరియమ్మ, మహా జ్యోతిష్కుడు, తాగూత్‌ల దాస్యానికి గురిచేశాడు. ఆ తరువాత రోమన్ కేథలిక్ చర్చి యొక్క బహుదైవోపాసనా దురాచారాల ద్వారం తెరుచుకుంది. దరిమిలా లూథర్ సంస్కరణలు చర్చీని సంఘ జీవితం నుండి వేరుపరచి, దాని స్థానంలో అధికారం ప్రజారాజ్యాలకు, చట్టసభలకు, చక్రవర్తులకు, ప్రొటెస్టంటులకు కట్టబెట్టడం జరిగింది. ఆ విధంగా ప్రైవేట్, పబ్లిక్ జీవితాలకు సంబంధించిన వేర్వేరు ప్రభువులు (Lords) చేసుకోబడ్డారు.

క్రీ.శ. 20వ శతాబ్ది (1914–18)లో మొదటి ప్రపంచ యుద్ధం జరిగినప్పుడు ప్రజాస్వామిక ప్రభుత్వాల బలహీనత బయటపడింది. ఇది గమనించిన మీదట యూరపులోని కొన్ని రాజ్యాలలో ఫాసిజం, నాజిజం, నియంతృత్వం బలపడింది. ప్రజాస్వామ్యానికి –నియంతృత్వానికి మధ్య

వ్యత్యాసం పెద్దగా లేదు. కేవలం ప్రభువుల సంఖ్యలో మార్పు ఉంటుందంతే. ప్రజాస్వామ్యంలో చాలామంది కలిసి శాసనాన్ని రూపొందిస్తారు. రాజ్యమేలు తారు. ఏకసత్తాక, నిరంకుశ నియంతృత్వ వ్యవస్థలో ఒకే దేవుడు తన ఆస్థాన భాగస్వాముల సహాయ సహకారాలతో దైవత్వం చెలాయిస్తాడు.

రష్యా

20వ శతాబ్దిలో రష్యాలో కమ్యూనిజం వచ్చింది. కమ్యూనిజం ప్రజాస్వామిక చర్యల్లో ఆఖరి అడుగు. ప్రజాస్వామ్యం మతాన్ని, దేవుణ్ణి ప్రైవేట్ జీవితానికి పరిమితం చేయగా, కమ్యూనిజం వచ్చి ఆ బంధాన్ని కూడా త్రెంచేసింది. మానవ జీవితపు ప్రతి విభాగంపై అది మానవుని పరిపాలనను రుద్దింది. అక్కడ (రష్యాలో) క్రైస్తవ 'త్రిత్వానికి' బదులు కమ్యూనిస్టుల త్రయం వచ్చింది. మార్క్స్, లెనిన్, స్టాలిన్‌ల రూపంలో ముగ్గురు దేవుళ్ళు ఒకరి తరువాత ఒకరుగా రష్యన్లను శాసించారు. ఈ ముగ్గురు ప్రభువులు రూపొందించిన విశ్వాసాలు, నైతిక నియమాలు, ఆర్థిక సూత్రాలే రష్యన్ల మతం.

6. ముస్లింల ప్రస్తుత స్థితిగతులు

ఇప్పటివరకూ మనం షిర్క్‌కు ఒడిగడుతూ ఉన్న వివిధ మతవర్గాల వారి గురించి చర్చించుకున్నాం. ఇప్పుడు కేవలం దేవుని ఏకత్వం (తౌహీద్) పునాదిపై ఏర్పడిన సముదాయం సంగతి చూద్దాం. అసలది ఉనికిలోనికి తేబడినదే ప్రపంచం నుండి షిర్క్‌ను రూపుమాపటానికి.

సందర్భం లేక స్థలం మారినంత మాత్రాన ఒక వస్తువు వాస్తవికత మారదు. బహు దైవారాధకులలో షిర్క్‌గా ఉన్న వస్తువు, గ్రంథ వహులలో షిర్క్‌గా ఉన్న వస్తువు, కపటులలో షిర్క్‌గా పరిగణించబడిన వస్తువు ముస్లిం లలోఉన్నంత మాత్రాన అది షిర్క్ కాకుండా ఉండదు. ఆ పనిని ముస్లింలు చేసినంత మాత్రాన అది తౌహీద్ అయిపోదు. మాలిన్యం చెత్తకుండీలో ఉన్నా వెండీ బంగారంతో చేయబడిన పాత్రలో ఉన్నా దాని స్వభావంలో మార్పు ఉండదు. రెండు చోట్ల కూడా అది మలినంగానే భావించబడు తుంది. కాకపోతే పరిస్థితులను బట్టి ఒక వస్తువు యొక్క 'ఆజ్ఞ'లో పరివర్తన ఉండవచ్చు. ఉదాహరణకు : షరీఅత్‌లో పంది మాంసం, సారాయి నిషిద్ధ వస్తువులుగా, మాలిన్యంగా పరిగణించబడతాయి. ఎట్టిపరిస్థితిలోనూ అవి మాలిన్యమే అన్నది తిరుగులేనిది. అయితే ఒక పీడితుడు లేక గత్యంతరం లేని వ్యక్తి తన ప్రాణాలు కాపాడుకోవటానికి ఆ వస్తువును కొద్దిగా తింటే షరీఅత్ అతనిని ఆ వ్యవహారంపై నిలదీయదు. ఎందుకంటే ఇందులో ఒకటి: సంఘటన. రెండవది: పరిస్థితుల్లో మార్పు దృష్ట్యా ఆదేశ అన్వ యింపు. ఈ అధ్యాయంలో మేము సంఘటన స్వరూపాన్ని గురించి

చర్చించి, ఆ తరువాతి అధ్యాయంలో తత్సంబంధితమయిన ఆదేశాన్ని విశదీకరించదలచాము.

ముస్లింల ప్రస్తుత పరిస్థితులను గనక తరచిచూస్తే సత్యాన్ని ఒప్పుకోవటంలో కుహనా ప్రతిష్టలు, అహంభావాలు అడ్డంకిగా నిలువకుండా ఉంటే ఒక కఠోర వాస్తవాన్ని అంగీకరించక తప్పదు. అదేమంటే; అలనాడు అరబ్బులలో అజ్ఞానులు మొదలుకొని కపటులలో తిష్ఠవేసిన షిర్క్ వరకు– ఎన్నెన్ని షిర్క్ రకాలు విశదీకరించబడ్డాయో– అవన్నీ కాకపోయినా వాటిలో ఒక పెద్దభాగం ముస్లిం సముదాయంలో కూడా ఉంది. కేవలం వాటి రూపురేఖలు వేర్వేరుగా ఉన్నాయంతే. అజ్ఞాన కాలం నాటి అరబ్బుల జిన్నాతుల పూజ, నక్షత్ర పూజ, పూర్వీకుల పూజ, స్వయం పూజ, గ్రంథవహులు తమ పండితులను పూజించటం, క్షుద్రశక్తుల పూజ, తాగూత్ పూజ, జాతి పూజ, షిర్క్‌కు మద్దతు తెలుపటం, కపటుల తాగూత్ దాస్యం, మనోవాంఛల దాస్యం, స్వార్థ ప్రయోజనాల దాస్యం– ఈ 'దాస్యాలలో' నేడు ముస్లింలలో లేనిదేదో చెప్పండి.

నేడు ముస్లింలలో ఎందరో 'క్షుద్ర విద్య' అనే శాపానికి లోనై ఉన్నారు. వారు రక్షరేకులు, మంత్రతంత్రాలు, తావీజులు తదితర క్షుద్ర పోకడల్లో చిక్కుకుని ఉన్నారు.[1] బాణామతి, కనికట్టులాంటి చమత్కారాలను

---

1. ప్రవక్త ప్రవచనాల ప్రకారం కొన్ని ప్రత్యేక పరిస్థితులలో మాత్రమే తావీజులకు అనుమతి ఉంది. అయితే వాటి ఉద్దేశం ఒక్కడైన అల్లాహ్ శరణు వేడుకోవటమై ఉండాలి. దైవేతరుల ప్రమేయానికి అందులో ఎలాంటి తావుండకూడదు. పైగా దైవేతర శక్తులతో తెగత్రెంపుల ప్రకటన జరగాలి. ఏ తావీజులోనైతే వ్యర్థ విషయాలుంటాయో లేక షిర్క్‌కు ఆస్కారమిచ్చే పలుకులుంటాయో వాటికి సుతరామూ షరీఅత్‌లో అనుమతి లేదు. కాని నేడు తావీజులు అమ్మే దుకాణాలనే చూడండి, అక్కడ జరిగే తతంగాన్ని చూసినప్పుడు అవి ముష్రిక్కు చేష్టల నుండి సురక్షితంగా ఉన్నాయంటే నమ్మశక్యం కాదు. వాటిపై పఠించే వాక్యాలు

సంపాదనా సాధనంగా చేసుకున్నారు. జిన్నాతులను షైతానులను తమ అదుపులో ఉంచుకునే మంత్రతంత్రాలే వారు చెప్పుకునే విద్య. వారు 'క్షుద్ర విద్య' ద్వారా తమ వ్యాపారాన్ని నడుపుకుంటూ దివ్య వచనాల ద్వారా మంత్రిస్తున్నామని చెబుతుంటారు. జిన్నాతులను తమ స్వాదీనంలో ఉంచుకునేందుకు రకరకాల వ్రతాలు బూనుతుంటారు. దెయ్యాలు చెయ్యమన్నవన్నీ చేస్తుంటారు. వారి గొంతెమ్మ కోర్కెలన్నీ తీరుస్తుంటారు. అగోచర విషయాలను తెలుసుకునేందుకు వారిని మధ్య దళారులుగా భావిస్తుంటారు. వాటికి లాభనష్టాలు చేకూర్చే శక్తి ఉందనుకుంటారు. వారిని మొరపెట్టుకుంటుంటారు. వాటి ప్రసన్నత కోసం దేవుడు నిషేధించిన ఎన్నో వస్తువులను ధర్మసమ్మతం చేసేసుకుంటూ ఉంటారు. దేవుడు ధర్మసమ్మతం గావించిన మరెన్నో వస్తువులను అధర్మంగా పరిగణిస్తారు.

ఈ విధంగా క్షుద్ర విద్యను ఆశ్రయించి, దానిని తమ స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకునేవారు ముస్లింలలో ఎందరో ఉన్నారు. ఒకప్పుడు యూదులు అవలంబించిన విధానాన్నే వీళ్ళూ అనుసరిస్తున్నారు. ఈ దుర్మార్గులు తమ దుర్మార్గంలో ఎంతవరకు పోయారంటే వారు దుష్ట లక్ష్యాల సిద్ధికోసం దివ్యఖుర్ఆన్ పట్ల కూడా అమర్యాదగా ప్రవర్తిస్తుంటారు. ఎందుకంటే వారలా చేసేవరకు జిన్నాతులు వారి మాట విననంటారు. అందుకే వారు అల్లాహ్ హలాల్ గావించిన కొన్ని పనులను తమ కొరకు

అరబీ బదులు అరబ్బేతర భాషలలో ఉంటాయి. ఒకవేళ అరబీ వాక్యాలున్నా అవి ప్రక్షిప్తాలకు లోనై ఉంటాయి. ఒకపెద్ద మనిషి నాకు సయితం తేలు కుట్టిన దానికి మంత్రం చెప్పదలిచాడు. అందులో ఆయన సూరయె నాస్‌లోని ప్రతి పదంలోని చివరి అక్షరాన్ని తొలగించాడు. 'మహాశయా! ఖుర్ఆన్ వాక్యాలను మార్చేసి, వాటిని అర్థ రహితం చేసే బాధ్యతను మీరే మోయండి. నాకిలాంటి మంత్రాల అవసరం లేదన్నాను. ఈ మాట విని ఆ పెద్ద మనిషి నా విషయంలో నిరాశ చెందాడు.

కొన్ని సందర్భాలలో తాత్కాలికంగానూ, మరికొన్ని సమయాలలో శాశ్వతంగానూ హరామ్ చేసుకుంటూ ఉంటారు. ఈ పనులు చేసే కొందరు ప్రబుద్ధులకు, ఈ విధంగా అల్లాహ్ అనుజ్ఞ లేకుండా ఏదేని వస్తువును హలాల్ గానో, హరామ్‌గానో నిర్ధారించుకోవటం 'షిర్క్' కదా అని చెప్పినప్పుడు, అది వారికి ఆశ్చర్యం కలిగించింది.

అంటువ్యాధులు ప్రబలి ఉన్నప్పుడు గాని, కొన్ని ప్రత్యేక జబ్బులు ఉన్నప్పుడు గానీ ఇండ్లల్లో కొన్ని వస్తువులను ఉపయోగించటం మానేస్తుంటారు. కొన్ని రకాల వంటలు కూడా చేయరు. అదేమంటే ఈ వ్యాధులకు కారకులైన ఆత్మలు ఆగ్రహిస్తాయని అంటుంటారు.

'మంచి రోజు' గురించి, సూర్యగ్రహణం, చంద్ర గ్రహణం గురించి ముస్లిం సముదాయంలోని నిరక్షరాస్యులు మొదలుకుని విద్యావంతుల వరకు మూఢనమ్మకాలలో, భ్రమల వలయంలో చిక్కుకున్న వైనం వర్ణనాతీతం.

'పెద్దల పూజ' శాపానికి గురైన ముస్లింలూ తక్కువేమీ కాదు. మత గురువుల, పూర్వీకుల సమాధులు ముస్లింల వీధివీధినా, వాడవాడనా కానవస్తాయి. పబ్లిగ్గా వాటి ముందు వారు మోకరిల్లుతున్నారు. సమాధుల ఎదుట మొక్కుబడులు చెల్లిస్తున్నారు. బలి దానాలిస్తున్నారు. దుప్పట్లు సమర్పించుకుంటున్నారు. వేడుకోళ్ళు చేసుకుంటున్నారు. తమకు వచ్చే కష్టాలు, కడగండ్లకు కారణం సమాధులలో ఉన్న ఆ పెద్దల ఆగ్రహమేనని నమ్ముతున్నారు. సమాధుల సందర్శన కోసం వేలాదిమైళ్ళు ప్రయాణం చేస్తున్నారు. రోజుల తరబడి సమాధుల దగ్గరే విడిది చేస్తున్నారు. షరీఅతులో హరామ్ (నిషిద్ధం)గా ఖరారు చేయబడిన ఎన్నో పనుల్ని ఆ సమాధుల వద్ద చేస్తున్నారు. దైవ సామీప్యం కోసం ఈ పూర్వీకులను ప్రసన్నుల్ని చేసి, వారిని మధ్యవర్తులుగా చేసుకోవటం అనివార్యమని

తలపోస్తున్నారు. వారు తమ గోడును వింటారని, తమను చూస్తారని కూడా చాలామంది భావిస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు సహాయం కోసం వారికి మొరపెట్టుకుంటున్నారు.[1] వారు దైవసన్నిధిలో తమ గురించి సిఫారసు చేస్తారని నమ్ముతున్నారు. తమకు ప్రాపంచిక విజయాలు వొసగమని, న్యాయస్థానాల్లో తీర్పు తమకు అనుకూలంగా వెలువడేలా చేయమని, తమ వ్యాపారంలో వృద్ధీ వికాసాలు ప్రసాదించమని, తమ పిల్లాజెల్లలో, గొడ్డూ గోదాములలో శుభాన్ని వొసగమని వారికి విజ్ఞప్తి చేసుకుంటున్నారు. వివిధ ఆశయాల, లక్ష్యాల సిద్ధి కోసం వారి సమక్షంలో దరఖాస్తులు చేసుకుంటున్నారు. కొన్ని సమాధుల వద్ద దరఖాస్తు పెట్టుకునే కౌంటర్లు ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడ్డాయి.

సహాబా, సహాబియాత్ (ర.అన్హుమ్), దైవప్రవక్త(సఅసం), ప్రవక్త సతీమణుల పేరుతో జరిగే బిద్అత్‌లు అసంఖ్యాకం. వాటన్నింటిలో బహు దైవత్వపు పోకడలు కొట్టొచ్చినట్లే కానవస్తాయి. వారి పేర్లతో ప్రత్యేకంగా వంటలు చేయబడతాయి. ఆ వంటకాలలో ఉన్న వ్యత్యాసాలను చూస్తుంటే

---

1. *ఒక ప్రముఖ ధార్మిక విద్వాంసుని కథనం : ఆయన ఒకసారి ఒక ముస్లిం దేశ 'ముఫ్తీ' సాబ్‌తో కలిసి కారులో వెళ్తున్నారు. అకస్మాత్తుగా ఒక చిన్న పిల్లవాడు కారుకు అడ్డం వచ్చాడు. ఆ క్షణంలో అప్రయత్నంగా ముఫ్తీ సాబ్ 'యా గౌస్!' అని అరిచారు. ఇంతకీ తమరు ఏ గౌస్ సహాయం కోసం కేకేశారు అని ఆయన్ని అడిగితే, 'షేక్ అబ్దుల్ ఖాదిర్ జీలాని' అని ముఫ్తీ సాబ్ చెప్పారు.*

మరొక సంఘటన – ఒకపెద్ద మనిషి నాతో మషాయిఖ్ వర్గానికి చెందిన ఒక ఆలిమె దీన్ ధర్మనిష్ఠ గురించి చెబుతూ ఒక నాటి సంఘటనను వినిపించారు. మేమిద్దరం ఒకరోజు గుర్రపు బండెక్కి వెళుతున్నాము. అకస్మాత్తుగా దారి మధ్యలో ఆ గుర్రం ఎగిరింది. మాకేదో ప్రమాదం పొంచిఉందనిపించింది. ఆ క్షణంలో అప్రయత్నంగా ఆ పండితుని నోట 'యా గౌస్!' అనే వాక్యం జాలువారింది. ఈ మాట వినగానే నేను మనసులోనే ఆ ఇద్దరి గురించి 'ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్' అని చెప్పుకున్నాను.

దివ్యఖుర్ఆన్‌లోని అల్ అన్ఆమ్ సూరాలో ఒకప్పటి అరబ్బు ముష్రిక్‌లు అవలంబించిన ముష్రిక్ చేష్టలు[2] జ్ఞప్తికి రాకుండా ఉండవు.

మరెన్నో చోట్ల ప్రవక్త మహనీయులు (స), ఆయన ప్రియశిష్యుల అవశేషాలు, చిహ్నాలు చూపించే 'ప్రదర్శనలు' నిర్వహించబడుతున్నాయి. ఇంకా కొన్నిచోట్ల పూర్వీకుల సమాధుల వద్ద శుభాల పేటికలు ఉంచి, వాటి కడుగునీళ్ళను 'శుభం' పేరుతో పంపిణీ చేసే ఆచారం కూడా ఉంది. దానిని గ్రహించేవారు ఆ నీళ్ళను తమ శరీరావయవాలకు, గడ్డాలకు, ముఖాలకు, కళ్ళకు కూడా పూసుకుంటారు. అలాచేస్తే తమ రోగాలు నయమవుతాయని నమ్ముతారు. ఇక ముహర్రమ్ సందర్భంగా పట్టణాలలో, పల్లె సీమల్లో జరిగే బిద్అత్‌ల సంగతి సరేసరి.

కొంతమంది తమ 'వంశ పరంపర'ను మోక్షసాధనంగా చెప్పుకుంటూ ఉండగా, మరికొంతమంది తమ కుటుంబీకులను దైవసామీప్య వారధులుగా ప్రకటించుకుంటూ ఉన్నారు. మరికొందరి దృష్టిలో తమ పూర్వీకుల 'పద్ధతి' షరీఅత్ స్థాయిని కలిగి ఉండగా, ఇంకొందరి దృష్టిలో తమ తాతముత్తాతల ఆచార సంప్రదాయాలు షరీఅత్ కన్నా అధిక ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

ధార్మిక వ్యవహారాలలో దైవోపదేశాలను, దేవుని మార్గదర్శక సూత్రాలను అవలంబించాలన్న జిజ్ఞాస బొత్తిగా లేకుండాపోతోంది. ముస్లింలలో వివిధ వర్గాలున్నాయి. ముఠాలున్నాయి. ప్రతి ముఠాలోనూ కొందరు వ్యక్తులు, ఇమాములు, 'ప్రత్యేకత'ను సంతరించుకున్నారు. వారు తమ పద్ధతిపైనే పాతుకుపోయి ఉంటారు. తమ పంథా మాత్రమే చెల్లాలం

---

2. ఉదాహరణకు : ఫలానా మొక్కుబడిని పురుషులు తినకూడదు. ఫలానా మొక్కుబడిని ఫలానా స్త్రీలు మాత్రమే తినాలి, ఇతరులు తినకూడదు. ఫలానా భోజన పదార్థం పగటిపూట మాత్రమే తినవలసి ఉంటుంది. ఫలానా వంటకం సందర్శన (జియారత్) సందర్భంగా తినాలి.

టారు. ప్రతి విషయాన్ని దైవగ్రంథం, దైవప్రవక్త విధానం ఆధారంగా చూడకుండా 'ముఠా ప్రీతి'తోనే చూస్తారు. మరికొంతమంది విద్వాంసుల పరిస్థితి ఎలా ఉందంటే; వారు దీన్ మూలాలైన దైవగ్రంథం, దైవప్రవక్త సంప్రదాయం గురించి నిర్దిష్టంగా, నిర్ద్వంద్వంగా నొక్కి వక్కాణిస్తారు గానీ, తమ ఇమామ్‌లు చెప్పిన మాటను క్రింద పడనివ్వరు. ఈ దురభిమాన వైఖరిలో మరికొంతమంది ఎంతవరకు పోయారంటే; "ఈ ఆయత్, ఈ హదీసు కూడా మన ఇమామ్ దృష్టికి తప్పకుండా వచ్చి ఉంటుంది. అయి నప్పటికీ ఆయన ఈ విధంగా ఫత్వా ఇచ్చారంటే, మనం దానిని అవలం బించాల్సిందే. ఎందుకంటే ఆయత్, హదీసు సారాన్ని ఆకళింపు చేసుకునే బాధ్యత ఆయనపైనే ఉంది" అని అంటారు.

ముస్లిం సముదాయంలోని మరెందరో వ్యక్తులు దైవకృప వల్ల ధార్మిక జ్ఞానం కలిగి ఉన్నారు. కాని వారు తమ సముదాయంలోని పెద్దల మాటనే 'సత్యానికి గీటురాయి'గా భావిస్తారు. వారి పెద్దలు అనుసరించే పంథా (మస్లక్) ఎట్టి పరిస్థితిలోనూ తప్పు కాజాలదని గట్టిగా నమ్ముతారు. వారి పెద్దలు అనుసరించని 'మస్లక్' ప్రామాణికతకి సంబంధించి మీరు ఎన్ని ఆధారాలు సమర్పించినా, ఖుర్ఆన్ హదీసుల వెలుగులో ఎన్ని నిదర్శ నాలు చూపినా, సహేతుకంగా ఎంతగా వాదించినా వారు దానిపై సంతృప్తి చెందరు. దైవం పట్ల, దైవప్రవక్త పట్ల చూపవలసిన అభిమానాన్ని వారు తమ పెద్దలపైనే చూపుతారు. దైవ మార్గదర్శకత్వానికి, దైవప్రవక్త(స) విధానానికి ఇవ్వవలసిన ప్రాధాన్యతను వారు తమ మస్లక్‌కు చెందిన ఇమాములకు, పండితులకు ఇస్తారు. సామాన్యుల సంగతి అలా ఉంచండి, విద్యాధికులు, మేధావులు సయితం ఈ 'ఫిత్నా' నుండి సురక్షితంగా లేరు.

ఇంతకుముందు మనం ముష్రిక్‌ల స్వయం పూజ గురించి, యూదుల జాతీయతా పూజ గురించి చెప్పుకున్నాం. ఈ వారసత్వ వైభవం

ఏవిధంగా ధార్మికంగానూ, ప్రాపంచికంగానూ క్రమేణా ఎలా తాగూత్‌గా మార్చివేస్తుందో, ఏ విధంగా జాతులు, సమూహాలు దైవ వాగ్దానాలను, శుభాలను– ఈమాన్ బిల్లాహ్, అమలె సాలెహ్ స్థానంలో– తమ వంశ పరంపరతో కుటుంబాలతో ముడిపెడతాయో కూడా వివరించి చెప్పాము. నేటి ముస్లింల పరిస్థితి కూడా అచ్చం ఇలాగే ఉంది. వీరు ఏం చేసినా అది–దానంతటది అదే–ఇస్లామీయ పద్ధతి అయిపోతుంది. అది దైవగ్రంథానికి, దైవప్రవక్త(స) సంప్రదాయానికి అనుగుణంగా లేకపోయినా ఫరవా లేదు. వీరు ఏ రంగులో రంగరించబడితే అదే అల్లాహ్ రంగు (సిబ్ఘతుల్లాహ్)! ఒకవేళ ఆ రంగు పాశ్చాత్యుల అజ్ఞాన పోకడకు ప్రతిబింబంగా ఉన్నాసరే! ఈ ప్రబుద్ధులు తమ పిల్లవాడికి ఇచ్చిన శిక్షణే ఇస్లామీయ శిక్షణ! ఆ శిక్షణ ఆ పిల్లవాని ఆంతర్యంలో ఉన్న సిసలైన ధార్మిక భావనను పెకలించి పారేసినా ఫరవాలేదు! మరి చూడబోతే ఆ పసివాడు సహజ ధర్మం మీదనే ఉంటాడు. అతని ఆంతర్యంలో ఇస్లాం ధర్మం పట్ల సదుద్దేశ్యమే ఉంటుంది. మనం అహోరాత్రులు ఆ ధర్మ ప్రబోధనలతో పరిహాస మాడుతుంటే అతనెలాంటి అంతర్మథనానికి గురవుతాడో ఆలోచించండి!

మన సామాజిక జీవన స్వరూపమే విచిత్రంగా తయారయింది. జీవితపు వివిధ విభాగాలకు సంబంధించిన విధానాలను బయటి ప్రపంచం నుండి దిగుమతి చేసుకుని, వాటి ఆధారంగా ఇస్లామీయ వ్యవస్థ గురించి మనం తియ్యటి కలలు కంటున్నాము. టర్కీ నుండి ముస్లిం పర్సనల్ లా, స్విట్జర్లాండ్ నుండి శిక్షాస్మృతి, ఇటలీ నుండి వాణిజ్య శాసనాలు, జర్మనీ నుండి వేరితర చట్టాలు సంగ్రహించి అత్యంత కీలకమయిన ఒక ఇస్లామీయ ప్రభుత్వం ఏర్పడిందని అనుకుంటే ఇంక చెప్పేదేముందీ? ఏ నాయకుల చెప్పుచేతల్లో ఈ వ్యవహారాలున్నాయో, వారు ధర్మ యోధులుగా, వీరులుగా, మానవ మహెూపకారులుగా భావించబడుతున్నారు.

భారత ముస్లింల దృక్పథం కూడా ఇంచుమించు ఇలాగే ఉంది. వారు తమ చుట్టూ గిరిగీసుకుని, దాని పరిమితుల్లోనే ఊహాగానాలు చేస్తున్నారు. వారి ఆలోచనలు ఇలా సాగుతున్నై: ముస్లిం సముదాయంలో అత్యధిక మంది పరిపాలనా యంత్రాంగంలో, చట్టసభల్లో ఉంటే చాలు- సామాజిక వ్యవహారాలపై అనూహ్యమయిన ప్రభావం పడుతుంది. వారికి తమ అభిమతాన్ని, అభిప్రాయాన్ని అభివ్యక్తం చేసే అవకాశం లభిస్తే తాము గీసుకున్న వృత్తాలను వారు 'ఒక ఇస్లామీయు వ్యవస్థ'గా తీర్చిదిద్దగలుగుతారు. ఆ ప్రభుత్వ వ్యవస్థ ఏదో ఒక అజ్ఞాన వ్యవస్థకు అనుకరణగా ఉన్నా ఫరవాలేదు. చట్టాలను రూపొందించే సభలో దైవగ్రంథానికి ఎలాంటి ప్రమేయం లేకున్నా ఇబ్బంది లేదు. యూదులు, బహు దైవారాధకులు తమ చేష్టలను పవిత్రమైనవిగా చెప్పుకున్న తీరును గురించి ఖుర్ఆన్ వివరించింది. ఆ విషయాన్ని ముస్లింలు ఎంతో మనోహరంగా విడమరిచి చెప్పారు కూడా. వారు (యూదులు) దేవుని ప్రియతములు! ఉన్నత స్థాయి సముదాయానికి చెందినవారు! కాబట్టి తామేం చేసినా అది అనుసరణీయం కాగలదని అనుకున్నారు. తాము సమర్పించే బలిదానం దైవం, దైవగ్రంథానికి అనుగుణంగా లేకపోయినా ఫరవాలేదని తలపోశారు.

ముస్లింల ఆలోచనలు కూడా సరిగ్గా ఈ పంథాలోనే సాగాయి. తాము ఒక శ్రేష్ఠ సమాజమనీ, అందుచేత తాము చేసే ప్రతి పనీ శ్రేష్ఠమైనది గానే ఉంటుందని, దానికి షరీఅత్‌తో నిమిత్తం లేకపోయినా ఎలాంటి ఇబ్బంది ఉండదని ముస్లింలు భావించారు. తాము ఏ ఏ భూభాగాన్ని స్థిరనివాసంగా చేసుకుంటే అదే పవిత్రమైనదనీ, తమలోని 'అధికులు' రూపొందించిందే దైవ శాసనమనీ, ముస్లింల ముఖాలకు వారు పూసిందే 'అల్లాహ్ రంగు' అనీ, ఈ మార్గంలో ఎవరు తమకు నేతృత్వం వహిస్తారో వారే మహా నేతలని వారు తలపోస్తున్నారు.

మరో విధంగా చెప్పాలంటే, ముస్లింల సమూహంలో ఉంటే చాలు, సన్మార్గాన ఉన్నట్లే. జీవితాంతం దైవంపై, దైవ విధానాలపై తిరుగుబాటు చేసినా ఫరవాలేదు. వీళ్ళు గీసుకున్న గిరి లోపల ఉంటే చాలు- దైవదాసులుగా జీవితం గడిపే బదులు తాగూత్‌లుగా మారినాసరే వారు దైవ కారుణ్యానికి హక్కుదారులై పోతారు. తాము గీసిన గీతకు అవకాడ ఉన్న వారు మాత్రమే నరకవాసులు. 'యూదులుగా లేదా క్రైస్తవులుగా మారండి. సన్మార్గం పొందుతారు' అనీ, 'మమ్మల్ని నరకాగ్ని కేవలం కొన్నాళ్ళు మాత్రమే తాకుతుంది' అనీ గ్రంథవహులు చెప్పిన దానికీ, నేటి ముస్లింలు అవలంబిస్తున్న విధానానికీ ఎంత సామ్యం ఉందో చూడండి!

యూదులు, కపటాచారులు తాగూత్‌ను పూజించటం, షిర్క్‌ను సమర్థించటం కూడా 'షిర్క్'గానే ఖరారు చేసింది ఖుర్‌ఆన్. ఇంతకీ యూదుల తాగూత్ పూజ ఏమిటంటే, వారు దేవుని మార్గదర్శకత్వాన్ని అనుసరించకుండా తమ కోర్కెలను అనుసరించమని పురికొలిపే నాయకుల అడుగు జాడలలో నడిచేవారు. నేడు ముస్లింల పరిస్థితీ ఇదే. తమ మనోరథం వెనుక పరుగెత్తే నాయకులనే వీళ్ళూ అనుసరిస్తున్నారు. వారు దైవగ్రంథం వైపునకు గానీ, ప్రవక్త విధానం వైపునకు గానీ ప్రజలను పిలువరు. ఆ విధానం ఏమిటో కూడా అసలు వారికి తెలీదు. తెలిసినా దానిని పాటించరు. తాము అభిమానించే ఆ ముస్లిం నాయకులకు దైవం గురించి, దైవప్రవక్త మార్గం గురించి తెలీకపోవచ్చు. కాని వారిలో సాటి ముస్లింల యెడల శ్రేయోభిలాష భావం ఉంది అని ఎంతో అమాయకంగా చెప్పేవారు కూడా చాలామంది ఉన్నారు. తాగూత్ అవడానికి ఇంతకు మించిన దృష్టాంతం ఇంకేముంది? నేటి ముస్లింలకు దైవం, దైవగ్రంథం, దైవప్రవక్త(స) యెడల శ్రేయోభిలాష కన్నా తమ స్వయం శ్రేయోభిలాష చాలా ముఖ్యమైపోయింది. వారికి తమ స్వప్రయోజనం నెరవేరితే చాలు,

దైవ వ్యవహారం ఏమయినా ఫరవాలేదు. ఎవరయినా ఒకరు తమను గొనిపోయే మార్గంలో తాము తలెత్తుకునే మాట ఉంటే చాలు, దైవధర్మానికి తలవంపు జరిగినా ఫరవాలేదు. అల్లాహు అక్బర్! ఎటువంటి ఉపద్రవాన్ని చవిచూసే కాలమిది! ముస్లింలు దైవదాస్య పరిధిని దాటిపోయిన మీదట కూడా ఇంకా తమను ముస్లింలుగానే చెప్పుకుంటున్నారు. దైవమార్గం వైపునకు కాకుండా ఇతరత్రా కాలిబాటల్లో తీసుకుపోయే నాయకులు వారి కంటికి 'శ్రేయోభిలాషులు'గా కానవస్తున్నారు.

ఇక కపటుల తాగూత్ పూజ ఏమిటంటే, వారు తమ వివాదాలు కొన్నింటిని యూదుల న్యాయస్థానాలకు తీసుకెళ్ళేవారు. దైవప్రవక్త(స) వద్దకు వచ్చేవారు కారు. ఇక్కడ ముస్లింల పరిస్థితిని చూడండి– జీవితపు అన్ని రంగాలలోనూ తాగూత్ ప్రాబల్యం ప్రబలి ఉంది. న్యాయస్థానాలలో తాగూత్ వ్యవస్థ ఉంది. కాగా; ముస్లింలు తమ వ్యవహారాలన్నింటినీ ఆ న్యాయస్థానాలకే నివేదించుకుంటున్నారు. ఇక్కడి పాఠశాలలు, కళాశాలల్లో తాగూత్ సిస్టమ్ ఉంది. ముస్లిములేమో తమ పిల్లలను ఆ విద్యాలయాలకే అప్పగిస్తున్నారు. ప్రభుత్వ వ్యవస్థ అంతా తాగూతీ వ్యవస్థే. ముస్లింలు ఆ వ్యవస్థలోని పనిముట్లుగా ఉన్నారు. పైగా ఆ వ్యవస్థలో ప్రమోషన్ల కోసం పోటీపడుతున్నారు. ఈ సంస్కృతి తాగూతీ సంస్కృతి. కాగా, ముస్లింలు దానిని తనివితీరా ఆస్వాదించటంలో నిమగ్నులై ఉన్నారు. ఇక్కడి ఆర్థిక వ్యవస్థ తాగూతీ వ్యవస్థ. అయితే ముస్లింలు దానిని స్వీకరించటంలో మున్ముందు ఉన్నారు. ఇక్కడి సారస్వత కళారంగాలు తాగూత్ భావాలు భావనలతో కూడుకున్నవి. కాగా, ముస్లింలు అందులో పాలుపంచుకునేందుకు తహతహలాడుతున్నారు. ఈ పనులు చేస్తూ తాము చేసేది మంచి పని కాదని మథనపడేవారు ఎందరంటే అలాంటివారిని వ్రేళ్ళపై లెక్కించవచ్చు.

షిర్క్‌ను సమర్థించటం కూడా ఒక రకంగా షిర్కేనని పై పంక్తుల ద్వారా రూఢీ అయింది. కాని ఇక్కడి ముస్లింలనే చూడండి, వారిలో ఎందరో తమ తెలివితేటలను, శక్తియుక్తులను తాగూతీ వ్యవస్థ పురోగతి కోసం వెచ్చించటంలో నిమగ్నులై ఉన్నారు. మరెంతో మంది తమ ధనం ద్వారా దాని ఉన్నతికి కృషి చేస్తున్నారు. అంతేకాదు, ఈ మిథ్యా వ్యవస్థ కోసం తమ ప్రాణాలను సయితం త్యాగం చేయడానికీ వెనుకాడటం లేదు.

ఇస్లామీయ ప్రబోధనలకు, ఆదేశాలకు వ్యతిరేకంగా కపటులు (మునాఫిఖీన్) జరిపే సమాలోచనలను, విశ్వాసులకు వ్యతిరేకంగా వారు చేసే సమీకరణలను కూడా ఖుర్‌ఆన్ 'షిర్క్'గా ఖరారు చేసింది. కాని నేడు ముస్లింలలో ఎందరో ప్రబుద్ధులు కేవలం దైవం, దైవప్రవక్త ఆదేశాలకు వ్యతిరేకంగా మాట్లాడటంతోనే సరిపుచ్చుకోకుండా, బాహాటంగా వాటిని పరిహసిస్తున్నారు. షరీఅత్ ఆదేశాలను కాలం చెల్లిన ఆదేశాలుగా ఖరారు చేస్తున్నారు. పైగా అవి ఆచరణ యోగ్యం కానివని, నాగరికతకు, బుద్ధికి వ్యతిరేకమని ఎగతాళి చేస్తున్నారు. ఇస్లామీయ శిక్షాస్మృతి అయినా, దాని ఆర్థిక విధానమయినా 13 శతాబ్దాల క్రితం ఉన్న పరిస్థితులకు మాత్రమే సరిపోతాయని అంటున్నారు. ఖుర్‌ఆన్‌లోని ఆదేశాలు ఈ కాల ప్రమాణాలతో సమన్వయం చెందజాలవని భావిస్తున్నారు. అల్లాహ్, ఆయన ప్రవక్త ముస్లింల కొరకు నిర్ధారించిన ప్రమాణాల పట్ల విముఖత ప్రదర్శిస్తున్నారు. వీరి ఆలోచనలు ఇస్లామేతర ఆలోచనలు. వీరి సామాజిక వ్యవస్థ ఇస్లామేతర వ్యవస్థ. వీరి విద్యాశిక్షణలు ఇస్లామేతర విద్యాశిక్షణలు. ఏదేని విషయాన్ని స్వీకరించడానికయినా, త్రోసిపుచ్చటానికైనా వీరు అవలంబించే ప్రమాణ నికషం ఇస్లామీయ ప్రమాణ నికషం కాదు. అల్లాహ్ దృష్టిలో, ప్రవక్త దృష్టిలో వాంఛనీయమైన వస్తువు వీళ్ళ దృష్టిలో అవాంఛనీయం. వీళ్ళు అసలు తమ మనోవాంఛలను తమ ఆరాధ్య దైవంగా చేసుకున్నారు.

లేదా తమకు విద్యాబోధన చేసిన వారి భావజాలానికి దాసోహమన్నారు. ఇస్లాంతో వారికి మిగిలి ఉన్న సంబంధమల్లా ఒక్కటే– ఈ మాటలన్నీ చెబు తూనే తమను తాము ముస్లిములుగా ప్రకటించుకోవటం!

కపటులు స్వప్రయోజనాల వెనుకపడటం కూడా 'షిర్క్'గానే ఖరారు చేయబడింది. కాని నేటి ముస్లింల వైఖరిని పరిశీలించండి; తమ స్వప్రయోజనాలకు ఎలాంటి విఘాతం కలగకుండా ఉన్నంతవరకూ వారు మనస్ఫూర్తిగానే ధర్మాన్ని అవలంబిస్తారు. కాని సొంత లాభం దెబ్బ తింటుందని అనుకోగానే ప్లేటు ఫిరాయిస్తారు. జీవితంలో పరీక్షలెదురవ గానే వారి స్వరం మారిపోతుంది. వారి ధోరణిలో మార్పు వచ్చేస్తుంది. దైవాన్ని, దైవప్రవక్తని నమ్మితే సరిపోదా! వారు విధించిన ఆజ్ఞలన్నింటినీ దైనందిన జీవితంలో పాటించి తీరాలని ఎక్కడుంది? ప్రస్తుత పరిస్థితుల్లో ఇది సాధ్యమా!? అనంటారు. వాస్తవానికి ప్రతి ప్రవక్తా **ఉఃబుదుల్లాహ్** (అల్లాహ్ దాస్యం చేయండి) అని చెప్పటంతో పాటే **వ అతీవూన్** (నాకు విధేయత చూపండి, నన్ను అనుసరించండి) అని కూడా చెప్పారు. **వలా తుతీవూ అమ్రల్ ముస్రిఫీన్** (నా విధానానికి వ్యతిరేకంగా వ్యవహరించేవారికి విధేయత కనబరచకండి) అని కూడా స్పష్టం చేశారు.

స్వీకృతికి–తిరస్కృతికి (ఇస్లాంకి –కుఫ్రకి) మధ్య సంఘర్షణ మొద లయ్యే దశ ఇదే. లేకుంటే 'అల్లాహ్ ఒక్కడే. దైవప్రవక్త దేవుని తరఫున నియుక్తులైనవారు. మేము అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను, ఆయన దూత లను, ఆయన గ్రంథాలను, అంతిమ దినాన్ని విశ్వసిస్తాము' అన్న సిద్ధాం తంపై సంఘర్షణే మొదలయ్యేది కాదు. విరోధులు కత్తులు ఝుళిపించే పరిస్థితి ఏర్పడేదే కాదు. 'విశ్వాసులు' స్వస్థలం వదలి మరో చోటికి వలస పోవలసిన అగత్యం ఏర్పడేదే కాదు. అరేబియాలో ముహమ్మద్ ప్రవక్త(స) రాకకు పూర్వం కూడా విగ్రహారాధనను నిరాకరించేవారు లేకపోలేదు.

వారిలోని కొందరు వక్తలు పబ్లిగ్గా తమ ప్రసంగాలలో దేవుని ఏకత్వ వాదనను ప్రస్తావించేవారు. కాని ఖురైషులు అలాంటి ఉపన్యాసకుల వాదనను ఖండించలేదు. ఒకవేళ ముహమ్మద్ ప్రవక్త(స) కేవలం తనను ప్రవక్తగా ప్రకటించుకుని, ఏకేశ్వరోపాసన గురించి చెప్పినా ఖురైషులు అంతగా కంగారెత్తేవారు కాదు. ముహమ్మద్ ప్రవక్త(స)పై వారి ఆగ్రహానికి, శత్రుత్వానికి ప్రధాన కారణం ఏమిటంటే, ఈ ప్రవక్త(స) ఏకదైవారాధనతో పాటు, ఆ దేవునికి విధేయత చూపాలని చెప్పాడు. అదీ ఎట్లా? తాను చూపే విధానాన్ని అనుసరిస్తేనే దైవ విధేయత సాధ్యమని పలికారు. తాను చెప్పినట్లు వినకపోతే ఆ అద్వితీయ దేవుని దాస్యంగానీ, విధేయత గానీ నెరవేరదని ప్రకటించారు.

ధర్మం (దీన్)లోని ఈ భాగం ప్రైవేట్ వ్యవహారం కాజాలదు. దీనిపై స్థిరత్వం చాలా ముఖ్యం. దీనికోసం అది తన అనుయాయుల నుండి త్యాగాన్ని కోరుతుంది. బహుశా ఈ కారణంగానే అరబ్బులు తమ సొసైటీలోని ఏకేశ్వరోపాసకులను సహించగలిగారు గాని ముహమ్మద్ ప్రవక్త(స)ను, ఆయన ప్రియశిష్యులను మాత్రం సహించలేకపోయారు. ఎందుకంటే వారు అల్లాహ్‌ను, అల్లాహ్ సందేశహరుణ్ణి విశ్వసించిన మీదట ఇతరత్రా ధర్మాలను అనుసరించడానికి ససేమిరా అన్నారు. తాము నమ్మినడుచుకునే ధర్మంలో ఇతర ధర్మాలను కలగాపులగం చేసి, దానిని కలగూర గంపగా చేయడానికి వారు సుముఖంగా లేరు.

7. విధ్యుక్త ధర్మం : కొన్ని సందేహాల నివృత్తి

ఏ వస్తువులు షిర్క్‌తో కూడుకున్నవో లేక మరే వస్తువులలో షిర్క్ లేశమయినా ఉన్నట్టు అనుమానముందో అలాంటి వాటితో ముస్లింకు గల సంబంధం స్నేహపూర్వకమైనదై ఉండదు. పైగా అలాంటి వాటితో అతని వైఖరి వైరవైఖరి అయి ఉంటుంది. అలాంటి వస్తువులను అతను ఇష్టపడడు సరికదా ఏవగించుకుంటాడు. అలాంటి వాటిని సమర్థించడు సరికదా ద్వేషిస్తాడు. వాటిపై తిరుగుబాటు వైఖరిని అవలంబిస్తాడు. ఇట్టి పరిస్థితిలో ముస్లిం అనేవాడు చేయవలసిందేమిటంటే, తనకు చేత్తో అడ్డుకునే శక్తి ఉంటే శాయశక్తులా దానిని అడ్డుకోవాలి. ఒకవేళ చేత్తో అడ్డుకునే శక్తి లేనట్లయితే నోటితోనయినా ఆ చెడుగును ఖండించాలి. ఒకవేళ నోటితో నిరసన తెలిపేందుకు కూడా పరిస్థితులు సానుకూలంగా లేకపోతే కనీసం ఆంతర్యంలోనయినా దానిపట్ల ఏవగింపును కలిగి వుండాలి. ఇది విశ్వాసం (ఈమాన్) యొక్క అత్యంత అధమ శ్రేణి.

వెనుకటి అధ్యాయంలో ప్రస్తావించబడిన ముస్లింల స్థితిగతులను బట్టి ద్యోతకమయ్యేదేమిటంటే, వారిలోని అత్యధికుల పరిస్థితి దీనికి విరుద్ధంగా ఉంది. సంకల్పం రీత్యాగానీ, విశ్వాసం దృష్ట్యా గానీ వారు అట్టడుగు శ్రేణికి చేరుకుని ఉన్నారు. పైగా వారిపై క్రమక్రమంగా షిర్క్ ఆచరణలు, షిర్క్ నమ్మకాలు ముసురుకుంటున్నాయి. దీనంతటికీ ప్రధాన

కారణం ఒక్కటే- ఒక సుదీర్ఘకాలంగా వారికి సరైన ధార్మిక వ్యవస్థ లేదు. తాగూత్ వ్యవస్థ ప్రబలటం వల్ల తౌహీద్ గురించి, అది వాంఛించే విషయాలను గురించి వారు సరిగ్గా ఆకళింపు చేసుకోలేకపోతున్నారు. కాబట్టి నేటి ఆవశ్యకత ఏమి టంటే సంస్కరణా ప్రియుల ఒక జమాఅత్ దృఢ సంకల్పంతో ఉద్భవించాలి. అది ముస్లింలలో ఏకేశ్వరోపాసనకు సంబంధించిన చైతన్యాన్ని మేల్కొల్పాలి. దైవారాధన, దైవ దాస్యానికి సంబంధించిన అసలు భావాన్ని ఆ జమాఅత్ వారు ప్రజలకు విడమరిచి చెప్పాలి. ఇస్లాం మరియు ఈమాన్ వాంఛించేదేమిటో, విశ్వాసం (ఈమాన్) ఒక వ్యక్తి జీవితంలో సృజించగోరే విశిష్ఠ నడవడి వల్ల సమాజంలో వచ్చే పరివర్తన ఎలా ఉంటుందో లోకానికి చాటి చెప్పాలి. **ఈ విధంగా మేము మిమ్మల్ని ఒక మధ్యస్థ సమాజంగా చేశాము- మీరు మానవాళిపై సాక్షులుగా ఉండటానికి, ప్రవక్త(స) మీపై సాక్షిగా ఉండటానికి (ఇలా చేయాల్సి వచ్చింది)** అన్న దైవోపదేశానికి ప్రతిబింబంగా వారు తమ కర్తవ్యాన్ని నెరవేర్చాలి. అంతిమ దైవప్రవక్త(స) అనుయాయులవటం చేత వారు ఈ పనిని విధిగా చేయాల్సి ఉంది. దేవుడు చేసిన మనుషులకు వారు ఈ సొత్తును అవశ్యంగా చేరవేయవలసి ఉంది. ఈ కర్తవ్యాన్ని నెరవేర్చని కారణంగానే యూదులు దైవాగ్రహానికి పాత్రులయ్యారు. **"వారిని వారి రిబ్బీలు, ధర్మవేత్తలు ఎందుకు ఆపటం లేదు? వారు దైవగ్రంథానికి సంరక్షకులుగా చేయబడినప్పటికీ ఎందుకిలా (నిర్లక్ష్యం వహిస్తున్నారు?)**- ఇది ఎంత మహత్పూర్వకమైన కార్యమంటే, దీని పరిపూర్తికై అల్లాహ్ పదే పదే తన ప్రవక్తలను ప్రభవింపజేశాడు. ఈ లక్ష్యం కొరకు ఆయన ఎన్నో జాతులను తొలగించి, వాటి స్థానంలో మరెన్నో జాతులను తీసుకువచ్చాడు. **"మీలో మంచివైపునకు పిలిచేవారూ, మేలు చెయ్యండి అని ఆజ్ఞాపించేవారూ, చెడు నుంచి వారించేవారూ కొందరు తప్పకుండా ఉండాలి. ఈ పని చేసేవారే సాఫల్యం పొందుతారు."**- ఈ సమూహం (జమాఅత్)

కేవలం నోటి మాటగానో, కలం చేతనో (రచనల ద్వారానో) ఈ విషయం చెబితే సరిపోదు. అది క్రియాత్మకంగా దేవుని ఏకత్వం (తౌహీద్) గురించి సాక్ష్యమివ్వాలి. అది ఈ ప్రపంచాన్ని దేవుని రంగులో రంగరించడానికి ఉద్యమించాలి. వారు స్వయంగా ఈ రంగును స్వీకరించాలి. అది జాతి, వర్ణం, వంశం, ప్రాంతం వంటి దురభిమానాలకు తిలోద కాలిచ్చి కేవలం దైవవాక్కు ఉన్నతికై పాటుపడాలి. దైవప్రవక్తల సందేశాన్ని చేరవేయటమే దాని ప్రధాన కర్తవ్యమై ఉండాలి. అది ప్రపంచంలోని ఏదో ఒక మిథ్యా వ్యవస్థతో శత్రుత్వం వహించకుండా లోకంలో ఎక్కడ అరాచకం, కల్లోలం పొడసూపినా దానిని నిరోధించటమే తన ప్రధాన ధ్యేయంగా పెట్టుకోవాలి. దాని పోరాటం ప్రతి అజ్ఞాన పెనుభూతానికి, ప్రతి తాగూతీ వ్యవస్థకు వ్యతిరేకంగా సాగాలి. ఏ తాగూత్ కూడా దాని చేత ఉపేక్షించబడరాదు. అది ఏ మిథ్యా వ్యవస్థకూ వినాయింపు ఇవ్వకూడదు. అది ఎక్కడ పొడసూపినా దాని కోరలను పెకలించివేయాలి. అది సొసైటీలోని ఒక్కో మిథ్యను వేరు పరచాలి. అలాగే సత్యబలం ఉన్న ఒక్కో వస్తువును వేరు చేయాలి. దరిమిలా సత్యంతో కూడిన వాటికి అండగా నిలిచి, అసత్యానికి తాను శత్రువునని నిర్ద్వంద్వంగా ప్రకటించాలి. ఈ మార్గంలో అవరోధంగా నిలిచే ఆకాంక్షలను, ఆశలను, స్నేహాలను, బంధుత్వాలను- అన్నింటినీ వదులుకోవాలి. ఈ పనికి గాను ప్రతిఫలంగా అల్లాహ్ వద్ద ఉన్నదానిపై సంతృప్తి చెందాలి. దాని సందేశం దేవుని సమస్త లోకవాసులకై సమానమై ఉండాలి. దాని సంచిలో ఉన్న రొట్టె, దాని తిత్తిలో ఉన్న నీరు ప్రతి ఆకలి గొన్నవాని, దప్పికగొన్న వాని బాధను దూరం చేసేదై ఉండాలి. దాని దీపం శిఖరాగ్రాన ఉన్న దీపంలా ప్రకాశించాలి. అది దారి తప్పిన ప్రతి ఒక్కరికీ మార్గం చూపేదిగా ఉండాలి. దాని మార్గదర్శక కాంతికిరణాలు దేవుని సూర్యకిరణాల మాదిరిగా సర్వతోముఖమై ఉండాలి. దాని కారుణ్య మేఘం

ఆకాశం నుంచి కురిసే వానజల్లులా ప్రతి కొండను, ఎడారిని తడిపి ముద్దచేయాలి. దాని సంబోధనలో మనుజ జాతి అంతా చేరి ఉండాలి. అది ఎలుగెత్తి మానవ జాతిని పిలవాలి. వారిని చిన్నపిల్ల వాళ్ళలా నచ్చజెప్పాలి. మనుజ జాతిలో ప్రబలి ఉన్న ఆధ్యాత్మిక, నైతిక రుగ్మతలు దానిని తీవ్రంగా వ్యాకులతకు లోను చేయాలి. అది ఏకాంతపు సజ్దాలలో (సాష్టాంగ ప్రణామాలలో) మానవ జాతి మోక్షం కొరకు బాధా తప్త హృదయంతో విలపించాలి. దాని రేత్రులు పడక సుఖాలకు దూరమై ఉండాలి. దాని పగళ్ళు తీరిక ఘడియలకు నోచుకోకుండా పోవాలి. మనుషుల మెడలలో వ్రేలాడుతున్న అసంఖ్యాకమయిన 'ప్రభువుల' లేక 'చిల్లర దేవుళ్ళ' గుదిబండలను చూసి అది దుఃఖంతో, ఆవేదనతో క్రుంగిపోవాలి. వినగలిగే ప్రతి చెవి వరకు, కానగలిగే ప్రతి కంటి వరకూ దాని సందేశం చేరాలి. ఎందుకంటే కష్టాలన్నింటికీ ఏకైక పరిష్కారం అదే గనక.

ఇటువంటి లక్ష్యబద్ధమైన జమాఅత్ తన లక్ష్యఛేదనలో ఎన్నటికీ విఫలం కాజాలదు. తాగూత్ వ్యవస్థ సర్వతోముఖంగా ప్రాబల్యం వహించి ఉన్నప్పటికీ మానవ నైజం నిర్జీవమై పోలేదు. అంతర్యంలో తౌహీద్ భావన ఉన్నవారు, తౌహీద్ వాంఛించే విషయాల గురించిన చైతన్యం ఉన్నవారు ఇప్పటికే చాలామంది ఉన్నారు. కాని పరిస్థితులకు ఎదురీత సాగించే సాహసం, దృఢ సంకల్పం వారిలో లేదు. వారు సత్యాన్ని స్వీకరించడానికి ఏదేని నిదర్శనం లేక ఆధారం కోసం నిరీక్షించటం లేదు. వారికి కావలసిందల్లా ధర్మపథాన పిలుపు ఇచ్చే శుభాత్ములే. చెప్పే మాటలకీ- చేయదలచిన చేతలకీ మధ్య వైరుధ్యం లేని నికార్సయిన ధర్మ బోధకుడు తమకు పిలుపు ఇస్తున్నాడన్న నమ్మకం వారికి కలగాలి. అలాంటి శుభాత్ములు తమకు కనిపిస్తే వారు అలసత్వమనే పడకలను సర్దేసి, సందిగ్ధాల సంకెళ్ళ నన్నింటినీ త్రెంచి వేసి వారి వెంట రావటానికి సిద్ధంగా ఉన్నారు.

మరెందరో ఉన్నారు, వారు షిర్క్ పట్ల విసుగెత్తి ఉన్నారు. కాని తౌహీద్(దేవుని ఏకత్వం) వాంఛించేదేమిటో పాపం వారికి తెలియదు. మానవ దాస్యమంటే ఏమిటో, దేవుని అధికార సత్తా అంటే ఏమిటో దైవ ప్రవక్తకు అందే 'దౌత్యం' ఏమిటో, ఇస్లాం ఈమాన్‌ల భావార్థం ఏమిటో వారు ఇంకా క్షుణ్ణంగా తెలుసుకోలేదు. వారసలు మతం గురించి అధ్య యనం చేయలేదు. చేసినా పర్యాలోచనా దృష్టితో చేయలేదు. అందుకే వారు తమ ప్రస్తుత జీవన విధానం దైవమార్గం నుండి వేరై ఉందన్న విషయాన్ని గ్రహించలేకపోతున్నారు. వారేమనుకుంటున్నారంటే, తాము దైవ మార్గం నుండి కొద్దిగా జరిగి వేరొక దారిలో పోతున్నప్పటికీ ఈ వేరే దారి ఏ అంతరాన్నీ పూడ్చలేనంత తీవ్రమైనది కాదు. దీని సంయోగం సంభవమే అనుకుంటారు. కాని ఈ వేర్వేరు దారులు రెండూ వేర్వేరు దిశ లలో పోతున్నాయని వారికి అర్థమయ్యేసరికి దారులు పూర్తిగా వేరై పోతాయి. దూరాలు మరింతగా పెరిగిపోతాయి. ఆఖరికి వారు పరలోకా నికి చేరుకునే నాటికి 'మార్గభ్రష్టులు' అయిన వారి జాబితాలో చేర్చబడ తారు. కాబట్టి దారి తప్పి, రాచబాటను వీడి, కుడిఎడమల కాలిబాటల వైపునకు పోతున్న వారిని కాస్త ముందుగానే సావధానపరచినట్లయితే వారిలో చాలామంది తమ పరిస్థితిపై పునరాలోచన చేసి మళ్ళీ సత్యపథం వైపునకు మరలే అవకాశం ఎంతయినా ఉంది.

చాలామంది సత్యాన్ని సత్యంగా అర్థం చేసుకోవటంలో వెనుకంజ వేయటం లేదు. కాని తమ కష్టాలను అంచనా వేయటంలోనే పొరబడు తున్నారు. వారు అసలు సిసలు సందేశం ద్వారా దైవం, దైవప్రవక్త ఉన్నత గుణగణాల గురించి ఎంత అధికంగా తెలుసుకుంటారో అంతగానే తమ మనోవాంఛల బంధనాల నుండి బయట పడగలుగుతారు. అప్పుడు వారు ఆత్మకు శరీరంపై ప్రాధాన్యత ఇస్తారు. విశ్వాసానికి భౌతిక వస్తువులపై,

దైవదాస్యానికి ప్రాపంచిక కుహనా ప్రతిష్ఠలపై ప్రాముఖ్యతనిస్తారు. కేవలం దైవమార్గంలోనే వారికి శాంతిభద్రతలు కానవస్తాయి. వారిలో ఆత్మ విశ్వాసం సన్నగిల్లినవారు సత్యధర్మం కోసం పాటుపడే జమాఅత్ క్రియాత్మక దృష్టాంతాలను కళ్ళారా చూసి స్ఫూర్తిని పొందుతారు. ఈ ఆకాశ పందిరి క్రింద జీవించే కొందరు దైవదాసులు తమ సృష్టికర్తను సేవించే మార్గంలో కుహనా ప్రతిష్ఠలను కాలదన్నిన వైనాన్ని, ఈ ప్రాపంచిక వైభోగాలను లక్ష్యపెట్టకుండా, తాగూత్‌పై తిరగబడిన తీరును చూసి వారు సమధికోత్సాహంతో కార్యోన్ముఖులవుతారు. వారిలో ఆత్మవిశ్వాసం రెట్టిస్తుంది. తామూ తమ శక్తియుక్తులకు తగిన సాధన చేయటం మొదలెడతారు. శాయశక్తులా ఈ ప్రాపంచిక పరీక్షలలో నెగ్గుకు రావటానికి సమాయత్తమవుతారు.

ఎందుకంటే ఆ 'జమాఅత్'పై ఏదయినా ఒక ప్రత్యేక జాతీయతా లేబుల్ అతికించబడి ఉండదు. పైగా దాని బాంధవ్యమంతా కేవలం దైవ ధర్మంతో, ధార్మిక మూల సూత్రాలతోనే ముడివడి ఉంటుంది. అందుచేత ప్రతి దైవదాసుడు ఈ సందేశం గురించి ఆలోచించేటప్పుడు దాని సుగుణాల ఆధారంగానే ఆలోచిస్తాడు. ఈ సందర్భంగా దురభిమానాలకు, రాజకీయ ప్రయోజనాలకు, జాతీయ భావాలకు ఎంతమాత్రం తావుండదు. ఇందలి 'యదార్థం' ఎంత శీఘ్రంగా ప్రస్ఫుటమవుతుందో అంతే వేగంగా ఆ సందేశానికి స్వీకృతి లభిస్తుంది. ఒక క్రైస్తవుడయినా, ఆంగ్లేయుడయినా, ఒక జర్మన్ అయినా, ఇటలీ దేశస్థుడయినా, ఒక హైందవుడయినా, ఒక చైనీయుడయినా, ఒక బౌద్ధుడయినా - ఎవరయినా సరే- దీనిని గురించి యోచన చేస్తున్నప్పుడు హేతుబద్ధంగా ఈ సందేశంలోని మహత్తు ఏమిటి? దీని నైతిక ప్రమాణం ఏమిటి? దీని సామాజిక, రాజకీయ దృక్పథం ఏ శ్రేణికి చెందినది? ప్రపంచం చవిచూసిన సిద్ధాంతాలలో, విధానాలలో దీనికి గల విశిష్ఠత ఏమిటి? ఇది ప్రపంచం ఎదుర్కొంటున్న రుగ్మతలకు

ఎటువంటి చికిత్స చేస్తుంది? లాంటి కోణాల నుంచి తరచి చూస్తారు. ఈ పరిశోధన ఇస్లాంను క్రియాశీలక శక్తిగా నిలబెడుతుంది. అప్పటివరకూ నిశ్చలంగా, ఒక తటాకంలోని నీరులా ప్రశాంతంగా ఉన్న వస్తువు కాస్తా వరద గోదారిలా పరవళ్ళు తొక్కుతుంది. తుఫాను మాదిరిగా మెట్ట పల్లాలన్నింటిపై ఆవరిస్తుంది.

ఈ జమాఅత్ ఇచ్చే సందేశం కేవలం 'ముస్లిం ప్రధాన సందేశం' అయి వుండదు. ప్రస్తుతం భారతదేశంలో ముస్లిం జనాభా 18 కోట్ల వరకూ ఉంది. ఈ జనసంఖ్యను 22 కోట్లకో, 25కోట్లకో చేర్చాలన్న లక్ష్యం ఆధారంగా దాని సందేశం ముందుకు సాగదు. దీనికి బదులు అది విశ్వాసాల, ఆచరణల ఆధారంగా పనిచేస్తుంది. "ఓ ముష్రిక్కులారా! ఒక్కడైన అల్లాహ్‌ను నమ్మండి" అని గానీ, "ఓ అవిశ్వాసులారా! అల్లాహ్‌ను విశ్వసించండి" అని గానీ అది ప్రజలను సంబోధించదు. ఇలాంటి భ్రమలకు లోనైన వారికి సందేశ పరిచయ విధానం గురించి బొత్తిగా తెలియదనే చెప్పాలి. సిసలైన విధానమేదో మహనీయులైన ప్రవక్తల (అలైహిముస్సలామ్) ద్వారానే తెలుస్తుంది. దాని సంపూర్ణ స్వరూపాన్ని ఖుర్ఆన్ స్వయంగా చిత్రీకరిస్తోంది.

ఖుర్ఆనీ సందేశం అంచెలవారీ విధానంపై దృష్టిని కేంద్రీకరించిన వారికి తెలుసు- దాని క్రమ వికాసం గురించి. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స) ప్రభవించినప్పుడు ఆయన జాతివారంతా ముష్రికులు, అవిశ్వాసులే. కాని ఆయన(స) తన సందేశాన్ని మొదలుపెట్టినప్పుడు 'ఓ అవిశ్వాసులారా!' అని గానీ, 'ఓ బహు దైవారాధకులారా?' అని గానీ సంబోధించలేదు. మరలాంటప్పుడు ఆయన(స) అనుచర సమాజ సభ్యులైన ముస్లింలు తమ మధ్యన నివసించే అశేష జనవాహిని మధ్యన నిలబడి 'కాఫిర్ లేక ముష్రిక్' అంటూ సత్యధర్మ పరిచయ కార్యక్రమాన్ని ఎలా

ప్రారంభించగలరు? ప్రవక్త మహనీయులు(స) తన సందేశాన్ని ప్రారంభించినప్పుడు 'నా జాతి వారలారా!' లేదా 'ప్రజలారా!' 'ఓ మానవులారా!' అనే పదజాలాన్నే ప్రయోగించారు. వారు జీవించే వాతావరణాన్ని, ఆనాటి పరిస్థితుల స్వరూపం వాంఛించే విషయాలను ప్రస్తావించి, తద్వారా వారిలో ఆధ్యాత్మిక చింతనను, చైతన్యాన్ని రగుల్గొలిపారు. అజ్ఞానకాలంలో వారి మధ్య పొడసూపిన పలు విషయాలు ఏవిధంగా సత్య తిరస్కారంగా, షిర్క్‌గా పరిణమిస్తాయో విడమరిచి చెప్పారు. దేవుడు తలచినంత కాలం ఈ తరహా కృషి కొనసాగింది. జాతి ప్రజలకు విషయాన్ని ఆధారాలు నిదర్శనాలతో పూర్తిగా సుబోధకం చేసిన తరువాత సత్యప్రేమికులైన వారు క్రమక్రమంగా సత్యామృతాన్ని ఆస్వాదించ సాగారు. మరెవరి హృదయాలు నిర్జీవమైపోయాయో లేక ఎవరి హృదయాలపై పడివున్న తెరలు మరీ మందంగా ఉన్నాయో వారు సత్యం పట్ల సుముఖత వ్యక్తం చేయలేదు. పైగా వారు తమ నోటితో తమ తిరస్కారాన్ని బాహాటంగా ప్రకటించారు. అంతేకాదు, తమ వద్దకు సత్యాన్ని తీసుకువచ్చిన సందేశహరుణ్ణే హత మార్చాలని సంకల్పించుకున్నారు. అప్పుడు ప్రవక్త మహనీయుల (స)కు హిజ్రత్ చేసే (వలస పోయే) ఆనతి లభించింది. అప్పటికి గాని ఆయన(స) నోట 'ఓ అవిశ్వాసులారా!' అనే మాట వెలువడలేదు. అవి శ్వాసులతో తెగత్రెంపుల ప్రకటన, హిజ్రత్ సంకేతం 'ఖుల్‌యా అయ్యుహల్ కాఫిరూన్!' సూరాలో ఉంది. అంతకుముందు (12 సంవత్సరాల సుదీర్ఘ వ్యవధిలో) ఎన్నడూ దైవప్రవక్త(స) తన జాతి వారిని ఈ రకమయిన పదాలతో సంబోధించలేదు. అలాగే 'ముష్రికులు' అనే పదం కూడా మక్కా వారి కోసం 'హిజ్రత్' సందర్భంగానో లేక ఆ తరువాతనో ప్రయోగించ బడింది.

కడకు గ్రంథం కల ప్రజలకు సందేశం అందజేస్తున్నప్పుడు కూడా 'ఓ అవిశ్వాసులారా!' 'ఓ ముష్రికులారా!' అనే వాక్యాలతో ఆ సందేశం

మొదలవలేదు. పైగా వారిని 'ఓ గ్రంథవహులారా!' 'గ్రంథం వొసగబడిన వారలారా!' 'ఓ ప్రజలారా!' లాంటి పదాలతోనే వారిని సంబోధించడం జరిగింది. వారి కర్తవ్యాన్ని వారికి గుర్తు చేయనంతవరకూ, సత్యమేదో–అసత్యమేదో వారి ముందు తేటతెల్లం చేయనంతవరకూ వారిని 'కాఫిర్లు' అని గానీ, 'ముష్రికులు' అని గానీ అనలేదు. వారితో తెగత్రెంపులు చేసుకొమ్మన్న ప్రకటన వెలువడినప్పుడే, ధర్మయుద్ధం చెయ్యమన్న ఆజ్ఞ అయినప్పుడే ఈ పదజాలం ప్రయోగించటం జరిగింది.

కపటుల (మునాఫిఖీన్)తో జరిగిన వ్యవహారం కూడా ఇంతే. కపటులు పైకి మాత్రం ఇస్లాం మూల సూత్రాలన్నింటినీ అంగీకరించే వారు. అందువల్ల ఖుర్ఆన్ నిత్యం వారిని 'ఓ విశ్వాసులారా!' అనే సంబోధించింది. ఈమాన్, ఇస్లాం వాంఛించేదేమిటో, దేవుని ఏకత్వాన్ని, దైవదౌత్యాన్ని విశ్వసించిన మీదట వారు విధిగా నిర్వర్తించాల్సిన ధర్మాలేమిటో వారికి విడమరిచి చెప్పింది. అలసత్వం వల్లనో, అజ్ఞానం కారణంగానో తప్పులు చేస్తున్నవారు జాగ్రత్తపడాలని ఇలా చేయటం జరిగింది. ఆ తరువాత వారిని హెచ్చరించింది– తమ కుత్సిత చేష్టలను, వాగ్దాన భంగాలను మానుకోని వారికి వ్యతిరేకంగా యుద్ధ ప్రకటన చేయబడుతుందని కూడా వార్నింగ్ ఇచ్చింది. బద్ర్ యుద్ధకాలం మొదలుకొని తబూక్ యుద్ధ కాలం వరకూ పిరికివాళ్ళు, కపటుల పట్ల వ్యవహరించబడిన తీరు ఇదే. ఈ లోగా ఆవేశపరులైన ముస్లింలు కపటులపై కఠినచర్యగైకొంటారేమోనన్న ఉద్దేశ్యంతో వారిని నిలువరించటం కూడా జరిగింది. ఖుర్ఆన్, హదీసులు రెండింటిలోనూ దీనికి సంబంధించిన సాక్ష్యాధారాలున్నాయి. ఈ అంచెలవారీ సంస్కరణా చర్యల వల్ల తమ తప్పులను తెలుసుకుని దిద్దుబాటు దిశగా పయనించిన వారు ఇస్లాం సేవకులుగా పరిగణించబడ్డారు. కాని ఈ హెచ్చరికల తరువాత కూడా తమ వెకిలి

చేష్టలను మానుకోకుండా–కుక్క తోక వంకర ఎంతకీ సరికాదన్న తీరులో–వక్రవైఖరిపై పాతుకుపోయిన వారి బండారం బట్టబయలు చేయటం జరిగింది. వారి వ్యవహారంపై నిర్ణయం కూడా గైకొనబడింది.

ప్రవక్త మహనీయులు(స) ఈ సంస్కరణా సరణిని అనుసరించారంటే లాంఛనప్రాయమైన చర్యలుగానో లేక ప్రదర్శన కోసమో అనుసరించిన విధానం కాదిది. నిజానికి ఆ విధానం అత్యంత ముఖ్యమైన మూలసూత్రంపై ఆధారపడినది. 'దైవంతో జరిగిన ఒప్పందం' విషయంలో సాధారణంగా ప్రజలకు ప్రతిదీ క్షుణ్ణంగా తెలిసి ఉండదు. తెలిసీ తెలియక వారు చేసిన ఏదయినా పనిలో అవిశ్వాసం, షిర్క్, వంచనతో కూడిన ఏదయినా అంశం ఉన్న కారణంగా వారు ఉన్న పళంగా అవిశ్వాసులో, ముష్రికులో, మునాఫిక్‌లో అయిపోరు. నిషిద్ధమయిన (హరామ్ చేయబడిన) ఒక వస్తువును ఒక వ్యక్తి తిన్నంత మాత్రాన అతను ఖచ్చితంగా హరామ్ సొమ్మును తినేవాడేనని, అవిధేయుడని అనలేము. బహుశా ఆ వస్తువు 'హరామ్' అని అతనికి తెలీదేమో! బహుశా అతను గత్యంతరం లేని పరిస్థితిలో తన ప్రాణాన్ని కాపాడుకునేందుకు ఆ వస్తువు తిన్నాడేమో!! లేదా బహుశా అతను షరీఅత్ సూత్రాల అన్వయింపులో జరిగిన పొరపాటు వల్ల అది ధర్మసమ్మతమని భావించి తిన్నాడేమో!! లేదా మరేదయినా కారణం వల్ల అతను ఆ పని చేశాడేమో!!! ముఖ్యంగా ఒక ప్రవక్త పరమపదించి మరో ప్రవక్త రాకపూర్వం సంధి కాలంలో ఒక విధమయిన స్తబ్ధత ఆవరిస్తుంది. కళ్ళున్నవారికి సయితం దారీతెన్నూ కానరాదు. ఆ కాలంలో వచ్చే ఏ ప్రవక్త అయినా 'కుఫ్ర్', 'షిర్క్', 'నిఫాఖ్'ల వేర్వేరు స్టాంపులు పుచ్చుకుని రాడు. దేవుని ఏ దాసునికి ఏ స్టాంపు వర్తిస్తుందో చూసి, ఆ స్టాంపు ముద్ర (అచ్చు) ఆ దాసునిపై వేయటం, నువ్వు

కాఫిర్‌వి, నువ్వు ముష్రిక్‌వి, నువ్వేమో మునాఫిక్‌వి అని చెప్పటం ప్రవక్త పని కాదు. పైగా అతను సత్యధర్మం 'జాడలను' గుర్తించి చూపుతాడు. మరుగున పడిన మార్గదర్శక చిహ్నాలను ప్రస్ఫుటం చేస్తాడు. మూసుకు పోయిన దారులను తెరుస్తాడు. ఒక నిరంతర సాధనతో, శాశ్వత ప్రాతి పదికతో కూడిన ప్రక్రియతో, పవిత్రమయిన నిష్కళంకమయిన జీవితంతో, నిస్వార్థ పూరితమయిన కార్యకలాపాలతో శుభోదయ కాంతిలా సత్యాన్ని ప్రస్ఫుటం చేస్తాడు. ఈ నిరంతర పోరాటానికి ప్రభావితులై ఆ జాతిలోని శుభాత్మలు ఆ సత్యం వైపునకు ఆకర్షితులవుతాయి. క్రమక్రమంగా మానవ నవనీతమంతా దానిని ఆస్వాదిస్తుంది. ఆ విధంగా సత్యబలం ఉన్న ఓ సముదాయం ఉనికిలోనికి వస్తుంది. సత్యం సత్యమని, అసత్యం అసత్య మని తేటతెల్లమైపోతుంది. దైవమార్గం ఇదేనని, ఈ మార్గాన నడవటం సుసాధ్యమేనని వారికి సుబోధకం అవుతుంది. అప్పుడు ఆ మార్గాన రావడానికి నిరాకరించిన వారి వ్యవహారంపై తీర్పు జరుగుతుంది. సత్య తిరస్కారులపై దైవాగ్రహం విరుచుకుపడటమయినా జరుగుతుంది. లేదా అసత్యానికి వ్యతిరేకంగా సత్యకాముకుల ఖడ్గాలు మెరవటమయినా జరుగుతుంది. మహనీయులైన దైవప్రవక్తల జీవితాల ద్వారా మనకు లభించే పాఠం ఇదే.

నేడు ధార్మిక పునరుద్ధరణకై, సున్నత్ పునరుజ్జీవనం కొరకై కృతనిశ్చ యంతో ఉద్యమించిన వారు ఈ విధానం ద్వారానే మార్గం పొందగలుగు తారు. ఈ ఉమ్మత్ ఇక ఏ ప్రవక్త రాక కోసమూ నిరీక్షించవలసిన పని లేదు. ధర్మ సంస్థాపనం కోసం అది ప్రవక్త చూపిన మార్గాన్నే అనుసరించి ముందుకు సాగవలసి ఉంది. ఆ మార్గం ఒక్కటే ముస్లింలకు అనుస రణీయం. అదే వారిని రాచబాటపై స్థిరంగా ఉంచగలుగుతుంది. ఈ విధానాన్ని ఆశ్రయించటం ద్వారానే వారు మానవాళి సమక్షంలో దైవోప

దేశాన్ని స్పష్టంగా వ్యక్తం చేయగలుగుతారు. అయితే ఈ 'వ్యవస్థ' లేక 'విధానం' ఒక సుదీర్ఘ కాలంగా అతలాకుతలమై ఉన్నది. దీని స్థానంలో ఓ తాగూతీ వ్యవస్థ ప్రబలి ఉంది. ఈ వ్యవస్థ ముస్లింల జీవితంలోని ప్రతి రంగాన్ని కలుషితం చేసేసింది. తాగూత్ ప్రాబల్యం నుండి స్వేచ్ఛ నొందిన విభాగం ఏ ఒక్కటీ లేదు. మనలో నుండి మనస్ఫూర్తిగా దీనికి విధేయత చూపనివారు అన్యమనస్కంగానయినా విధేయత కనబరచవలసి వస్తోంది. గొప్ప ధర్మపరాయణుడు సయితం దాని మాలిన్యతుంపరల నుండి తనను కాపాడుకోలేని పరిస్థితిలో ఉన్నాడు. ధార్మిక విద్యా శిక్షణల వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారయింది. అందులో ఒక విధమయిన స్తబ్ధత ఆవరించింది. కొద్దో గొప్పో ఈ రంగంలో పనిచేస్తున్న వారు కూడా తాగూతీ వ్యవస్థ ప్రాబల్యం నుండి విముక్తులై స్వేచ్ఛగా పనిచేయగలిగే స్థితిలో లేరు. నేడు దీన్, మతం పేరుతో ఏదయితే రాయబడుతుందో, ఏదయితే వినిపించబడుతుందో అందులోని ఒక పెద్ద భాగం ప్రస్తుత అజ్ఞాన వ్యవస్థ కోసం మతం తరఫున ఇవ్వబడిన లైసెన్సు మాదిరిగా ఉంది.

ఇలాంటి గడ్డు కాలంలో ముస్లింలు దీన్ గురించి, అది వారి నుండి వాంఛించే విషయాల గురించి, తౌహీద్ గురించి ఏమీ తెలియనివారులా తయారయినా ఆశ్చర్యం లేదు. ఒక అందమైన పూదోట తోటమాలి పర్య వేక్షణకు నోచుకోకుండా పోతే ఏమవుతుందో ఇదీ అంతే. తోట మాలి ఉండి కూడా ఒక సుదీర్ఘ కాలంగా దాని మంచీ చెబ్బరలను చూడకపోతే ఏమవుతుంది? ఆ తోటలోని కలుపు మొక్కలను ఏరిపారేసి, ఉపయోగ కరమయిన చెట్లకు నీరు పోసి, దానికి కాపలా కాసినట్లయితే ఆ తోట అందం చిందుతుంది. లేకుంటే అది కొంతకాలానికి తోటకు బదులు అడవిలా తయారవుతుంది. అందలి చెట్లు అడ్డదిడ్డంగా పెరుగుతాయి.

అమ్ర్ బిల్ మారూఫ్ నహీ అనిల్ మున్కర్ విధి నిర్వహణా ఉపమానం కూడా ఇటువంటిదే. ఇదొక సహజసిద్ధమైన విద్యుక్త ధర్మం. ఒక పొలం లోని రైతు, ఒక తోటలోని తోటమాలి, ఒక ఉద్యాన వనంలోని పర్యవేక్ష కుడు, ఒక జాతిలోని మార్గదర్శక నాయకుడు తన బాధ్యతలను నిర్వర్తిం చటం వంటిదే ఇదీను. ప్రాతినిధ్య వ్యవస్థ (నిజామె ఖిలాఫత్) ఈ విధిని నిర్వర్తించటం కోసం ఏర్పరచబడిన ప్రాకృతిక వ్యవస్థ. ఇది లేకుండా ముస్లింలు సరైన పంథాలో స్థిరపడలేరు. ఈ వ్యవస్థ లేనంతవరకూ లోకా నికి దైవధర్మం పరిపూర్ణ స్థాయిలో పరిచయం కాజాలదు. నేటి పరిస్థితినే చూడండి– ముస్లింలు రుజుమార్గం పట్ల విముఖత చూపటం కూడా నిందార్హంగా భావించబడటం లేదు. మనుషులు మార్గవిహీనతకు లోనవటం కూడా తీవ్ర విషయంగా పరిగణించబడటం లేదు.

కాబట్టి ముస్లింల మధ్య తౌహీద్ గురించి, (అది వాంఛించే విషయాల గురించి) పిలుపు ఇవ్వటానికి నిలబడిన జమాఅత్ గనక, ఈ ముస్లిములంతా ధర్మ విహీనులు, కాఫిర్లు అయిపోయారని భావించి నట్లయితే అది ఏమాత్రం దయాదాక్షిణ్యాలు లేని జమాఅత్ అనిపించుకుం టుంది. ఒకవేళ అది నిజంగా అలా చేసినట్లయితే పరిస్థితుల పట్ల దానికి ఏమాత్రం అవగాహన లేదని అనవలసి వస్తుంది. దైవప్రవక్తల సందేశ సరళిని అది ఏమాత్రం పుణికిపుచ్చుకోలేదని అనాలి. ఒకరిని కాఫిర్లుగానో, అవిధేయులుగానో ఖరారు చేసే ముందు అది దైవగ్రంథం గురించి బాగా విడమరిచి చెప్పాల్సిన ఆవశ్యకత ఉంది. సచ్ఛీలత ఆధారంగా ఒక సము దాయం నిర్మించేందుకు అది పూర్తి స్థాయిలో తన శక్తిసామర్థ్యాలను ధార బోయవలసి ఉంటుంది. నలువైపులా క్రమ్ముకుని ఉన్న అంధకారాలను తొలగించి సత్యాసత్యాల మధ్య విచక్షణను పాటించటం ప్రతి సత్యార్థికి సులభమైపోయేలా అది తన వంతు కృషి చేయాలి.

'తక్ఫీర్' అనేది సాధారణ విషయం కాదు. దీని అసలు భావమేమి టంటే, ఎవరయినా ఒక వ్యక్తిని ధర్మభ్రష్టుడుగా ఖరారు చేసి, ఇస్లాంలో ధర్మభ్రష్టత (ఇర్తెదాద్)కు నిర్ధారితమయిన శిక్షను విధించటం. ఈ శిక్షను ఎవరంటే వారు విధించలేరు. అధికారం కల ఒక సజ్జనుల జమాఅత్ మాత్రమే తన సందేశాన్ని, ఇస్లామీయ వ్యవస్థలోని మూలసూత్రాలను బాహాటంగా తిరస్కరించి తిరుగుబాటు చేసిన తన వ్యక్తుల్ని శిక్షించగలదు. ఈ శిక్షను అమలుపరచడానికి ఒక సుసంగఠిత జమాఅత్ ఉండాలి. అది సజ్జనుల సమూహమై ఉండాలి. ఎదుటి వారిని మంచివారు కాదని చెప్పే హక్కు, అధికారం మంచికి కట్టుబడని జమాఅత్‌కు ఉండదు. రెండవ షరతు: ఆ జమాఅత్‌కు అధికారం ఉండాలి. అధికారం లేని ఏ జమాఅత్ కూడా నేర నిర్ధారణ చేసి శిక్షలను విధించజాలదు. మూడవ షరతు: ఒక మంచి జమాఅత్ స్థాపన మూలంగా సమాజంలో మంచిని ప్రేమించే వారు, చెడులను ఏవగించుకునేవారు తగినంత మంది ఉండాలి. చెడుల ద్వారాలు మూసివేయబడి ఉండాలి. మనిషి గత్యంతరం లేని పరిస్థితిలో ఫలానా చెడు కార్యానికి ఒడిగట్టవలసి వచ్చిందన్న సాకుకు ఆస్కారం లేకుండా ఉండాలి. అన్యథా దొంగతనం చేసిన వాని చేయి నరకటం గానీ, వ్యభిచారిపై రాళ్ళు రువ్వటం గానీ, మద్యం సేవించిన వానికి కొరడా దెబ్బలు కొట్టడం గానీ సమంజసం కాదు. ఆఖరికి ఒక సౌజన్యవంత మయిన జమాఅత్ అధికారంలో ఉన్నప్పటికీ, నేరాలు ఘోరాలు జరగ కుండా నైతికమయిన బందోబస్తు కూడా పూర్తిగా జరిగి ఉన్నప్పటికీ- తాత్కాలికమయిన కారణమేదయినా ఉత్పన్నమైనప్పుడు నేరస్తునికి ప్రభుత్వం షరీఅత్ ప్రకారం శిక్ష విధించజాలదు. ద్వితీయ ఖలీఫా హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి) పరిపాలనా హయాంలో ఒకసారి తీవ్రమయిన దుర్భిక్షం ఏర్పడింది. ఈ ఆర్థిక సంక్షోభాన్ని నివారించటానికి ఆయన

శాయశక్తులా ప్రయత్నించినప్పటికీ రాజ్యంలో ఆర్థిక మాంద్యం పూర్తిగా తొలగలేదు. అందువల్ల ఆయన ఆ గడ్డు కాలంలో దొంగతనం చేసినవారి చేయి నరికే శిక్షను– తాత్కాలికంగా– వాయిదా వేసుకున్నారు.

హజ్రత్ మసీహ్ (ఏసుక్రీస్తు– అలైహిస్సలామ్) కాలంలో ఒక స్త్రీ వ్యభిచారం చేస్తూ పట్టుబడింది. ఆమె ఆయన సమక్షంలో హాజరుపరచ బడింది. ఆమెకు రాళ్ళు రువ్వే శిక్ష విధించమని యూదు పండితులు కోరారు. దానికి మహనీయ మసీహ్ (అ) ఇలా అన్నారు : "సరే, ఆమెపై రాళ్ళు రువ్వండి. అయితే మీలో ఏ నేరమూ చేయకుండా పవిత్రంగా ఉన్నవారే మొదట రాయి రువ్వాలి". అంటే ఆ కాలంలో అందరూ దోషాలు కలవారేనని, అందరూ వ్యభిచారానికి ఒడిగట్టే వారేనని, సౌశీల్యం, పారిశుధ్యం కలవారు మీలో ఎవరూ లేరు అని అనటం మహనీయ ఏసుక్రీస్తు ఉద్దేశ్యం కానేకాదు. 'మీ దేశ కాల పరిస్థితుల్ని ఓసారి నెమరువేసుకోండి' అన్నది ఆ మాటల్లోని మర్మం– ఎందుకంటే ఆనాడు అక్కడ మంచి వైపునకు పిలిచే జమాఅత్ ఏదీ లేదు. చెడుల నుండి నిరోధించే వ్యవస్థ కూడా లేదు. ఒకవేళ ఆ స్త్రీ తన భర్తకు స్వామిద్రోహం తల పెట్టి ఉంటే అది ఖచ్చితంగా పాపకార్యమే. మరైతే మీలో ఇంతకన్నా ఘోర మయిన పాపాలకు ఒడిగట్టిన వారున్నారు కదా! మరి వారికి ఏ శిక్ష విధించాలి? ఎవరు విధించాలి? మీరు దైవంతో చేసిన వాగ్దానానికి విరుద్ధంగా వ్యవహరించారు. ఈ అపరాధానికి శాస్తిగా దేవుడు ముష్రికులైన రోమనులను మీపై రుద్దాడు. మరలాంటప్పుడు ఈ స్త్రీ తన భర్తకు ద్రోహం చేసిందన్న నెపంతో ఆమెను దండించే హక్కు మీకెక్కడుంది?

ఎవరయినా ఒక వ్యక్తిపై 'తక్ఫీర్' ముద్రవేసి అతన్ని సంఘం నుండి బహిష్కరించే శిక్ష చాలా తీవ్రమయిన శిక్ష. ఈ శిక్షపడిన వ్యక్తి జమాఅత్ నుండి శాశ్వతంగా వేరైపోతారు. ఆ తరువాత అతను ధర్మభ్రష్టతకు

ఒడిగట్టిన 'ముర్తిద్'గా మరణ దండనకు గురవుతాడు. అయితే ఈ కాలంలో ఎవరికయినా అలాంటి శిక్ష విధించటం తప్పు. ఎందుకంటే ప్రస్తుతం సౌజన్యత గల జమాఅత్ ఏదీ అధికారంలో లేదు. 'అమ్ర్ బిల్ మారూఫ్, నహీ అనిల్ మున్కర్'కి సంబంధించిన షరీఅత్ వ్యవస్థ కూడా ఏదీ లేదు. జీవితపు ప్రతి విభాగంపై నేడు తాగూత్ కారుమబ్బులు దట్టంగా క్రమ్ముకుని ఉన్నాయి. సత్యాసత్యాల మధ్య విచక్షణ పాటించే పరిస్థితులు సయితం లేవు. పైగా అసత్యాన్ని సత్యంగా సమర్పించి, దానికి నీరాజనం పట్టే కాలం దాపురించింది. ఇలాంటి పరిస్థితుల్లో ఎవరయినా నువ్వు కాఫిర్వి, నువ్వు ఫాసిఖ్వి, నువ్వేమో ముష్రిక్వి అని ఇష్టానుసారం నోరు పారేసుకోవటం అంటే షరీఅత్తో చెలగాటమాడటమే. ఇలాంటి వారికి 'తక్ఫీర్' ప్రాముఖ్యత గురించి, దాని నియమ నిబంధనల గురించి బొత్తిగా తెలియదనే అనాలి. అల్లాహ్ ఏ దాసులకైతే సరైన దిశలో పనిచేసే సద్బుద్ధిని ఇచ్చాడో, వారు మాత్రం ముస్లింలపై 'తక్ఫీర్' అస్త్రాన్ని ప్రయోగించే ఆలోచనలో లేరు. వారు ముస్లింల మధ్య నిలబడి సందేశ కార్యక్రమం మొదలెట్టినప్పుడు, 'యా అయ్యుహల్లజీన అమనూ!' (ఓ విశ్వాసులారా!) అంటూనే మొదలెడతారు.

అందరూ ఒక మురికి కోనేరులో పడి ఉన్నప్పుడు నీకు మాత్రమే మలినం అంటుకుని ఉందని ఒకరింకొకరిని నిందించటంలో అర్థం లేదు. మురికిని మురికిగా ఒప్పుకుని, ఆ మురికి కూపంలోనుండి, బయట పడండి అని మాత్రమే ఒండొకరికి పిలుపునివ్వాలి. ఏ దేశాన్నయితే వారు 'దారుల్ అమన్' అనుకుని సుఖంగా నిద్రిస్తున్నారో అది 'దారుల్ అమన్' కాదని, అక్కడ దుమ్ము ధూళి కూడా ఉందని లేదా తమ పరిసరాలన్నీ కంపు కొడుతున్నాయని, ఆ వాతావరణంలో గాలి పీల్చటం కూడా దుర్లభమేనని వారికి అప్పుడు తెలిసి వస్తుంది.

మానవ నైజం షిర్క్‌తో కూడుకున్నది కాదు. ఈ విషయాన్ని మనం తరువాతి అధ్యాయంలో చర్చించనున్నాము. నిజ ముస్లిం షిర్క్‌ను ఊహించ నయినా లేడు. తాత్కాలిక అంధకారాలలో, అయినవారి కానివారి లాలింపులతో, వారిచ్చే టీకాలతో మత్తెక్కి ఉన్న మానవ నైజం మేల్కొనకుండా ఉండజాలదు. మానవుడు సిసలైన దాస్య మాధుర్యాన్ని ఆస్వాదించకుండా ఉండజాలడు.

కొంతమంది మమ్మల్ని, భారతదేశాన్ని మీరు 'దారుల్ అమన్'గా భావించనప్పుడు, అది షిర్క్‌కు ఆలవాలమైన స్థలం అని తలపోస్తున్నప్పుడు మీరు అక్కడి నుండి ఎందుకు వలసపోరు? లేక అక్కడి వారితో ఎందుకు యుద్ధం చేయరు? అని అడుగుతుంటారు. సందేశ పరిచయ కార్యక్రమాన్ని నెరవేర్చి, తిరుగులేని ఆధారాలతో ఈ ధర్మం సత్యధర్మం అని నిరూపించనంతవరకూ దేశం వదలి వలస పోవటం గానీ, యుద్ధం చేయటం గానీ ధర్మసమ్మతం కాదన్న సంగతి పాపం వారికి తెలియదు. కొంతమంది దైవప్రవక్తలు సత్యధర్మానికి అవమానం జరుగుతోందన్న పౌరుషంతో ధర్మపరిచయ కార్యం పతాక స్థాయికి చేరుకోకముందే – తొందరపడి – మరో ప్రాంతానికి వెళ్ళిపోయారు. వారు ఈ విధంగా వెళ్ళిపోవటం దైవాగ్రహానికి కారణభూతమయింది. అందువల్ల ఆ ప్రవక్తలు తిరిగి మళ్ళీ తమ జాతివారిలోకి వచ్చి సందేశ ప్రధానమయిన కార్యాన్ని నెరవేర్చాల్చి వచ్చింది. దైవప్రవక్త హజ్రత్ యూనుస్ (అలైహిస్సలాం) గారి వృత్తాంతం దీనికి ఒక మచ్చుతునక.

అలాగే ఇస్లామీయ ధర్మయుద్ధం కొరకు కొన్ని ప్రాథమికమైన షరతులున్నాయి. వాటిని లక్ష్యపెట్టకుండా యుద్ధం మొదలెట్టినట్లయితే అది ధర్మయుద్ధం అయ్యే బదులు కల్లోలం, ఉపద్రవం ఆజ్ఞ క్రిందికి వస్తుంది.

మొట్టమొదటి షరతు ఏమిటంటే, ఆ యుద్ధం అధికారం కల ఒక

నాయకుని నేతృత్వంలో జరగాలి. కాని నిరంకుశ, నియంతృత్వ వ్యవస్థల్లో అధికారం కల 'అమీర్' ఉండటం సాధ్యం కాదు. ఇలాంటి చోట్ల యుద్ధం చేయటమంటే అశాంతి అరాచకం సృష్టించటమే. ఇది ఎంతమాత్రం ధర్మసమ్మతం కాదు. అందుకే అంతిమ దైవప్రవక్త(స) మక్కాలో ఉండగా యుద్ధ ప్రస్తావనే చేయలేదు. మదీనాకు వలసపోయిన మీదటే- పీడనను నిరోధించటానికి-యుద్ధం చేశారు.

రెండవ షరతు ఏమిటంటే; యుద్ధం కొరకు నడుం బిగించేవారు కల్లోల జనకులై ఉండకూడదు. ఎందుకంటే ఇస్లామీయ పరిభాషలో జిహాద్ అనేది కల్లోలాన్ని అణచడానికే చేయబడుతుంది గాని కల్లోలాన్ని రేకెత్తించడానికి కాదు. కాబట్టి ఏ జమాఅత్ అయినా జిహాద్ పేరుతో ఇక్కడ ఉద్యమించటం అసందర్భం, అర్థరహితం. ఇలాంటి జమాఅత్‌లు ఖుద్దుగా ఉపద్రవానికి లోనవుతాయి. ఇస్లామీయ జిహాద్ ప్రతి ఒక్క జమా అత్ ద్వారా చేయబడదు. దాని కోసం ముందు ఒక సౌజన్యశీలమయిన జమాఅత్ ఏర్పడటం అవసరం.

కనుక అన్నింటికన్నా ముందు జరగవలసిన పనేమిటంటే దైవధర్మ సంస్థాపనార్థం ఒక జమాఅత్ ఏర్పడాలి. అది ముస్లింలలో తొలుత ధర్మం (దీన్) గురించి సరైన అవగాహనను కలిగించి, ధార్మిక చైతన్యాన్ని మేల్కొల్పాలి. ఇంకా అది మానవులను సత్యధర్మం వైపునకు పిలుపు ఇవ్వాలి. అది తొలి దశలోనే దేవుని ఏకత్వం (తౌహీద్) గురించి, అది కోరే అవశ్యమయిన అంశాల గురించి ప్రజలకు క్షుణ్ణంగా బోధపరచాలి. మహనీయులయిన దైవప్రవక్తల విధానం కూడా ఇదే.

8. మానవ నైజం షిర్క్‌ను వాంఛిస్తుందా?

ఈ ఆధునిక యుగంలో వైజ్ఞానిక, శాస్త్రీయ రంగంలో జరిగే పరిశోధనలన్నింటికీ ప్రధాన మార్గదర్శక సిద్ధాంతం 'పరిణామ సిద్ధాంతమే'నన్న భావన ఒకటి ఉంది. చరిత్ర అయినా– శాసనాంగ వికాసమయినా, రాజకీయాలైనా– ఆర్థిక వ్యవహారాలైనా, తత్వశాస్త్రమయినా– మతమయినా, సంస్కృతీ నాగరికతలయినా– వీటన్నింటి 'క్లూ' పరిణామ సిద్ధాంతంలోనే దొరుకుతుందని, పరిణామ సిద్ధాంతం లేని పరిశోధన అసంపూర్ణమని చాలామంది అభిప్రాయపడుతున్నారు... అది రాతి యుగం. మానవ జీవితానికి సంబంధించిన ప్రతి విభాగం చీకటిలోనే మగ్గుతూ ఉండేది. ఆనాడు మానవుడు శైశవ దశలోనే ఉన్నాడు. అది సామాజికంగా, సాంస్కృతికంగా ఎలాంటి ఎదుగూ బొదుగూ లేని వ్యవస్థ. అందుకే అది అంధకార యుగం. కాబట్టి ఆ కాలం గురించి ఏం చెప్పినా అది ఊహాస్త్రాలు సంధించటం వంటిదే. ఆ చీకట్లలో పురావస్తు శాఖ నిపుణులు, జీవశాస్త్ర ప్రవీణులు ఏం చెబితే అదే తుదివాక్కు...

అయితే అదంతా ఊహాజనితమయిన, అంచనాల (Guess) పై ఆధారపడిన విశేషాలు తప్ప మరేమీ కావు. కాని దానికి ఎంతటి ప్రాముఖ్యత ఇవ్వబడిందంటే ప్రతి వైజ్ఞానిక, శాస్త్రీయ రంగంలో అదే వాస్తవంగా చెల్లుబాటు అవుతోంది. దానితో సమన్వయం చెందేదే అసలైనది. దానితో సమన్వయం చెందనిది నిరర్థకమైనది. ఏ పునాదీ లేనిది.

ఈ ఆలోచనా ధార ఎంతగా ప్రభావం చూపిందంటే ఈ ప్రపంచంలో సుదీర్ఘకాలంగా రాజకీయ, సామాజిక మార్పుల కొరకు ఉద్యమించిన వారంతా ఈ పరిణామ సిద్ధాంతాన్ని ఆశ్రయించవలసి వచ్చింది. ప్రజాస్వామ్య ధ్వజవాహకులు మానవుని తొలి కాలపు సామాజిక స్థితిగతులను చిత్రీకరిస్తూ మానవ నైజం వాంఛించేదే ప్రజాస్వామ్యం అని చెప్పేశారు. రాజరికాన్ని సమర్థించేవారు దానికి తమదైన రంగు పులిమారు. సామాజిక ధ్వజవాహకులు దాని రూపురేఖలను తమకనుకూలంగా మలచుకున్నారు. కమ్యూనిస్టు సిద్ధాంతకర్తలు దానిని తమ సిద్ధాంత స్వభావ స్వరూపాలకు అనుగుణంగా మలచుకున్నారు. కాకపోతే పాపం ఒక్క 'పేద మతం' మాత్రమే దానిని తన పక్షాన ఉపయోగించుకోలేకపోయింది. ఎందుకంటే తొలి దశలోనే పరిణామ సిద్ధాంత ధ్వజవాహకులకు – చర్చికి మధ్య విభేదాలు పొడసూపాయి. తత్ఫలితంగా కాలాంతకులైన దాని సమర్థకులు ఆ సిద్ధాంతాన్ని ఆదిలోనే మత వ్యతిరేక సిద్ధాంతంగా చిత్రీకరించారు. తమది ప్రత్యేక వ్యక్తిత్వం గల మతమని చెప్పుకునేవారు, తమ విశ్వాసాలు వహీ (దైవ సంకేతం)పై ఆధారపడి ఉన్నాయని అనేవారు దానిని తమకు అనుకూలంగా వాడుకోరాదన్న ఉద్దేశ్యంతోనే అలా చేశారు. అందువల్ల మతానికి వ్యతిరేకంగా విజృంభించే అవకాశం నాస్తికులకు లభించింది. వారు యూదు మతాన్ని, క్రైస్తవాన్ని, ఇస్లాంను కూకటివ్రేళ్ళతో పెకలించే ప్రయత్నం చేశారు.

ఇక్కడ పరిణామ సిద్ధాంతం గురించి పూర్తిగా చర్చించే అవకాశం లేదు. అయితే మేము షిర్క్ (బహు దైవారాధన)తో, తౌహీద్ (ఏక దైవారాధన)తో దానికి గల సంబంధం వరకు స్థూలంగా సింహావ లోకనం చేయదలిచాము.

వీళ్ళు మతం గురించి ఉపన్యాసాలిస్తూ ఇలా అంటారు : మతం

అనేది మానవుని తొలి అడుగుజాడతోపాటే ఈ ప్రపంచంలో అడుగు పెట్టింది. అప్పుడు మానవుడు తాను కేవలం ఒక దేహం మాత్రమే కాదని, దానికన్నా ఉన్నతమయిన ఒక అంతఃశక్తి తన లోపల ఉందని భావించాడు. దాంతో అప్పటికప్పుడే మతం అనే ఒక పునాది రాయిని వేసేశాడు. దాని ప్రాథమిక రూపకల్పన రెండు అంశాల ప్రాతిపదికగా జరిగింది. ఒకటి: భీతి భావన. రెండు: తలంపు లేక ఊహ. భీతి భావన మూలంగా మనిషి తనను కొన్ని అగోచర శక్తులు ముట్టడించి ఉన్నాయని తలపోశాడు. దాంతో వాటి పట్ల భయభక్తులు కలిగి ఉండాలని, వాటిని సేవించాలని భావించాడు.

ఏవిధంగానయితే ఈ వస్తువులన్నింటి చరిత్ర దేహం (Body) తో, దేహాలతో ముడివడి ఉందో జీవితపు (Life) ప్రాథమిక దశతో సంబంధం కలిగి ఉందో అదేవిధంగా వస్తువులన్నింటి చరిత్ర కూడా ఆత్మతోనూ, ఆధ్యాత్మిక విషయాలతోనూ ముడివడి వుంది. ఈ మత భావన మతావలంబనగా రూపొందినప్పుడు, దాని పర్యవసానంగా సహజంగానే మతపరమయిన విధులు, ఆచారాలు, సంప్రదాయాలు ఉనికిలోనికి వచ్చాయి. కనుక మతం అనేది పరిణామ క్రియ పర్యవసానమే. అది జీవిత పరిణామమైతే, ఇది ఆధ్యాత్మిక పరిణామం. 'జీవితం' అనేది ఒకప్పుడు నేలపై ప్రాకే జంతువుల (Reptilious life form) రూపంలో దాగివుండేదన్న విషయం తెలిసిందే. అది క్రమక్రమంగా 'మానవుడు' అనే అత్యుత్తమ ఆకృతిలో ప్రస్ఫుటమయ్యింది. అలాగే తొలి దశలో కంటికి కానవచ్చే దృశ్యాల పూజ, పదార్థ పూజ జరిగేది. ఈ లోకం క్షుద్ర విద్య సంకెళ్ళలో చిక్కుకుని ఉండేది. తరువాత అది క్రమేణా స్వచ్ఛమయిన దైవారాధన వరకు చేరుకుంది.

ఈ రిపోర్టు ద్వారా పరిణామ సిద్ధాంత నిపుణులు వెలికితీసే ఫలితాలు మా మాటల్లో ఇలా ఉంటాయి–

1. మతానికి ఆరంభం అనేది భీతిభావనతో జరిగింది. ఈ భీతికి ప్రకృతి దృశ్యాలే మూలం. మేఘాల గర్జన, ఉరుముల మెరుపులు, తుఫానుల బీభత్సం, అగ్నిపర్వతాల నుండి పెల్లుబికే లావా, పర్వతాల గంభీరమయిన దృశ్యాలు మనిషిలో భయోత్పాతం సృష్టించాయి. అతను వాటిని ఆ స్థితిలో చూసినప్పుడు, అవి సజీవ శక్తులని భ్రమించి, వాటి వైపరీత్యాల నుండి తనను కాపాడుకునేందుకు వాటిని ఆరాధించసాగాడు.
2. కేవలం (ఏక) దైవారాధనను ప్రకృతి వాంఛిస్తుంది అనే దావా సరైనది కాదు. ఒకవేళ అదే నిజమైనట్లయితే మానవుడు దైవారాధన స్థానే కంటికి కానవచ్చే దృశ్యాలను, వస్తువులను పూజించేవాడు కాడు. వాటి పూజతోనే మతాన్ని ఆరంభించేవాడు కూడా కాదు. అదే నిజమయ్యే మాటైతే లోకంలో విగ్రహ పూజ, మృతుల పూజతో చరిత్ర నిండి ఉండేది కాదు.
3. మతాలన్నింటి సారం ఒక్కటే. ఈ కోణం నుంచి చూసినప్పుడు ఇస్లాం, యూదత్వంలోనూ, ఆఫ్రికా ఖండంలోని ఆదివాసుల మాయాజాల (Magic Worship) పూజలోనూ ఎలాంటి వ్యత్యాసం లేదు. కాబట్టి అన్ని మతాలు విశ్వాసాలలో గల భిన్నత్వంపై సహన భావం కలిగి ఉండాలి.

పైన పొందుపరచబడిన ఉపన్యాసం లేక రిపోర్టు ఎంత మనోహరంగా, మరెంత ఉదార బుద్ధితో కూడుకుని ఉందంటే మన వర్తమాన కాలపు కొందరు విద్వాంసుల పుస్తకాలలో సయితం అది చోటు సంపాదించుకుంది. కాని వాస్తవానికి అది నిర్హేతుకమైనది, బుద్ధికి వ్యతిరేకమైనది.

అసలు విషయం చెప్పాలంటే మత భావన అనేది అగోచర శక్తుల భయంతో మొదలయింది. ఈ 'భావనే' మానవుని మనోమయ భావాలలో

ప్రాథమికమైనది, ప్రాచీనమైనదీను. మనిషిలో ఉండే భయానికి అసలు మూలం తన వద్ద ఉన్న అనుగ్రహభాగ్యాలు, వరప్రసాదాలు లాక్కోబడతాయేమోనన్న ఆశంకే. మనిషికి అతని ప్రాణం ఎంతో ప్రియతమమైనది. జీవిత సామగ్రి ప్రీతికరమైనది. తన ఆలుబిడ్డలు ఆస్తిపాస్తులు అతనికి ఎంతో ఇష్టకరమైనవారు. అందుకే అతను ఆ వస్తువులు ఎప్పుడయినా తనకు కాకుండా చేయబడతాయోమోనన్న బెంగతో ఉంటాడు. మరో విధంగా చెప్పాలంటే; ఆ వస్తువులు తన నుండి లాక్కోబడతాయేమోనన్న భయం కంటే ముందు, అవి తన పాలిట అనుగ్రహ భాగ్యాలన్న చైతన్యం అతనిలో కలుగుతుంది. ఇంకా చెప్పాలంటే, ఈ వరాల కంటే ముందు, తనపైన ఒకానొక వరప్రదాత దయా దాక్షిణ్యాలు ఉన్నాయన్న భావన కూడా అతనిలో తప్పక జనించి ఉండాలి. తత్కారణంగా ఆ వరప్రదాత యెడల అతనిలో కృతజ్ఞతా భావం ఉప్పొంగి ఉండాలి. తత్ఫలితంగా అతనిలో దాస్యభావన కూడా పుట్టి ఉండాలి. అందుచేత 'భీతి'కి ముందు 'వరాల' గురించిన, 'వరప్రదాత' గురించిన చైతన్యం కూడా రగులుకుని ఉండటం అనివార్యం. ఈ జీవితం, దీనికి సంబంధించిన ఒనరులు 'వరం' అన్న భావన కలగనంతవరకూ మనకు జీవితానికి సంబంధించిన భయం ఉండదు. అందుకే ఈ జీవితం పట్ల నిరాశ చెందినవారు మృత్యువులాంటి భయంకరమయిన వస్తువుకు ఏమాత్రం భయపడరు. అగ్నికి ఆహుతి చేసుకుని ఆత్మహత్యలు చేసుకునేవారు, నదులలో సముద్రంలో దూకి ప్రాణాలు పోగొట్టుకునేవారు ఎందరో మనకు తెలియనిది కాదు. జపాన్ లాంటి అభివృద్ధి చెందిన దేశాలలో జ్వాలాముఖిలో దూకి ఆత్మాహుతి చేసుకుంటున్న వారిని గురించి మనం వింటున్నాం.

తేలిందేమంటే, ఆది మానవునికి ఉరుముల మెరుపులు, మేఘాల

గర్జన, తుఫాను హెూరు వల్ల భయం కలిగి వుంటే, ఆ విపత్తుల నుండి తనను కాపాడుకోవాలన్న చింతన అతనిలో నిజంగా కలిగి ఉంటే, అప్పటికే అతనిలో జీవితం గురించిన స్పృహ ఉండి ఉండాలి. జీవితానికి కావలసిన ఒనరులు, సంపత్తి ఓ మహదానుగ్రహం అన్న చైతన్యం కూడా అతనిలో అప్పటికే జనించి ఉండాలి. ఇది అవశ్యం. ఎందుకంటే ఏద యినా ఒక వస్తువు అతనికి ప్రియతమం కానంతవరకూ, దానిని కాపాడు కోవాలన్న చింతనకు అర్థమే లేదు. ఖాళీగా ఉన్న ఇంటికి ఎవడూ తాళం వెయ్యడు. తనపై వరాల వర్షం కురిపించే వాడొకడున్నాడనే భావన, ఆయన యెడల ప్రేమ, ఆయన పట్ల కృతజ్ఞతా భావం, ఆయన్ని ఆరాధిం చాలన్న భావన చాలా ముఖ్యమైనది. అది గోచర శక్తుల్ని పూజించాలన్న భావన కన్నా ప్రాథమికమైనది.

మొత్తానికి అవగతమైన విషయం ఏమిటంటే మానవునికి భీతి భావన కలగకముందే జీవితం ఒక వరమని, ఆ వరప్రదాత తనకు కావల సిన వాడనే భావన అతనిలో జనించింది. ఆయన పట్ల అతనిలో ప్రేమైక భావన పుట్టింది. గోచర శక్తుల ముందు మోకరిల్లాలన్న ఆలోచన అతనికి తట్టకముందే తనకు మహెూపకారం చేసిన దైవానికి కృతజ్ఞతా భావంతో సాష్టాంగ పడాలన్న చింతన ఖచ్చితంగా అతనిని కార్యోన్ముఖుణ్ణి చేసి ఉంటుంది. ఆ కృతజ్ఞతా భావమే ఏకేశ్వరోపాసనకు నాంది. అంతేగాని అది బహు దైవోపాసనకు పునాది కాదు. ఈ పరమ రహస్యానికి ప్రతి బింబమే దివ్యఖుర్‌ఆన్‌లోని ఆరంభ వాక్యం! అదే మానవ నైజం ఎలుగెత్తి చాటే కృతజ్ఞతా పూర్వక వాక్యం **అల్‌హమ్దులిల్లాహి రబ్బిల్ ఆలమీన్- అర్రహ్మానిర్ర హీమ్** (కరుణామయుడు, కృపాశీలుడు అయిన సకల లోక ప్రభువుకే కృతజ్ఞతలు).

మా ఈ దృక్పథాన్ని ఈ క్రింది విషయాలు కూడా సమర్థిస్తున్నాయి-

ఏ వస్తువులు మానవునిలో భయోత్పాతం సృష్టిస్తాయో అవి లోకంలో నిత్యకృత్యాలు కావు. ఉదాహరణకు: భూకంపాలు అనుదినం రావు. అగ్ని పర్వతాలు ప్రతి రోజూ బద్దలవ్వవు. మేఘాలు ప్రతిదినం గర్జించవు. పిడుగులు ప్రతి రోజూ పడవు. తుఫానుల హెూరు కూడా దైనందిన జీవితంలో భాగం కాదు. వీటికి భిన్నంగా నక్షత్రాలు ప్రతి రోజూ ప్రకాశిస్తాయి. సూర్యుడు ప్రతి దినం దేదీప్యమానమవుతుంది. ఆకాశంలోని నీలి మేఘాల కదలికలు, గాలికెరటాల సవ్వడులు అనునిత్యం ద్యోతకమవుతుంటాయి. వెన్నెల తెరలు నేలమీదనూ, కొండల మీదనూ పరచుకుని ఆహ్లాదాన్ని పంచిపెడుతుంటాయి. కారుణ్య మేఘ మాలికలలోనుండి కురిసే చిటపట చినుకులకు, ఇలగాలి పాడే పాటలకు, తలలూపే చెట్ల రూపులకు మానవుని మేను పులకిస్తూ ఉంటుంది. మరలాంటప్పుడు ప్రకృతి వైపరీత్యాల బెదిరింపులకు జడుసుకుని మానవుడు వాటి ముందు మోకరిల్లాడని, తనపై ఔదార్యాన్ని విస్తృతంగా వర్షింపజేసిన అద్వితీయ దేవుని యెడల అతనిలో ఎలాంటి తహతహ కలగలేదని అనటం ఎంత వరకు సహేతుకం? విడ్డూరం కదూ!

జీవశాస్త్రానికి చెందిన శాస్త్రవేత్తలు ఆ కాలం గురించి మరింత భయానకంగా చిత్రీకరించారు. ఆ కాలపు ప్రకృతి దృశ్యాలు భీతిగొలిపేవిగా ఉండేవని అభిప్రాయపడ్డారు. కాని ఇది శుద్ధ తప్పు. ఆ కాలపు ప్రపంచం ఒకవేళ భయానకంగా ఉండి ఉంటే అప్పటి మనిషి కూడా నేటి మనిషి లాంటి వాడు కాడు. ఆ కాలపు జగతి అంత అందమైనది కాదని అనుకుంటే, ఆనాటి మానవుడు ఈనాటి మానవుని మాదిరిగా అందగాడుగా, సుకుమారునిగా ఉండేవాడు కాడు. ఒకవేళ ఆనాటి నేల ఇప్పటి నేల మాదిరిగా చదనుగా, సారవంతమైనదిగా లేదనుకుంటే, అలనాటి మనిషి కూడా నేటి ఆధునిక యుగపు మనిషి లాగా భోగలాలస జీవితానికి

అలవాటు పడి ఉండేవాడు కాదు. అప్పట్లో సర్వత్రా ప్రమాదాలు పొంచి ఉండేవనుకుంటే ఆనాటి మానవుడు కూడా ప్రమాదాల నుండి తనను కాపాడుకునే ఉపాయాలను అమలుపరిచేవాడు. అతను కోసుల దూరం పరుగెత్తగలిగేవాడు. కోతులలో, ఉడుతలలో ఉండే చలాకితనం ఆనాటి మనిషిలో ఉండేది. అతని ఉత్సాహం ఉరకలు వేస్తూ ఉండేది. అగ్నిని రాజేసి, ఆకులు కుట్టి అతను చలి తీవ్రత నుండి తన శరీరాన్ని కాపాడుకునే వాడు. మంచు నుండి, క్రూర మృగాల దాడి నుండి తనను కాపాడుకునేం దుకు గుహలలో, బొరియలలో ఆశ్రయం పొందేవాడు. ఆకలిగొన్నప్పుడు అన్ని రకాల ప్రాణులను వేటాడి కడుపు నింపుకునేవాడు. కాబట్టి ఆనాటి మానవుడు ఏంచేసినా అది భయోత్పాతం వల్ల చేసిందేనన్న వాదన సరైంది కాదు.

కొంతమంది పరిణామ సిద్ధాంత వేత్తలు కుటుంబంలోని పెద్దల, వృద్ధుల భయభక్తులనే తొల్దొలి భావనల (Early Thoughts) కు 'మూలం'గా తలపోశారు. కాని మా దృష్టిలో కుటుంబ పెద్ద యొక్క ఈ భయం కూడా ప్రేమతో కూడుకున్నదే. శిశువులకు ఒనగూడే రుచులు, సౌకర్యాలన్నీ తల్లిదండ్రుల ద్వారా ఒనగూడుతాయి. అందువల్ల పిల్లలు వారిని ప్రేమిస్తారు. ఈ ప్రేమ కారణంగానే వారికి భయపడతారు. కాబట్టి ఈ భావన కూడా తన 'మూలం' దృష్ట్యా ప్రేమైక భావమే. దీనివల్ల ఖచ్చి తంగా తల్లిదండ్రుల యెడల గౌరవప్రపత్తుల భావన ఏర్పడుతుంది. కాని ఇక్కడ విస్మరించరాని వాస్తవం ఒకటి ఉంది - అదేమిటంటే పిల్లవాడు పసితనంలో ఉన్నంత కాలం తండ్రే సమస్త లోకం అనుకుంటాడు. కాని అతను సయితం తండ్రి అయినప్పుడు లేక తండ్రి కాగలిగే యోగ్యత పొంది నప్పుడు, తండ్రి సమకూర్చే సౌలభ్యాలకు ఒక పరిమితి ఉందని, అతను కొంతవరకు మాత్రమే తన పిల్లల అవసరాలు తీర్చగలుగుతాడన్న సంగతి

అతనికి తెలిసి వస్తుంది. ఆ 'హద్దు'ను దాటిన తరువాత తనకు ప్రాప్త మయ్యే వాటన్నింటి మూల సరోవరం వెనుక ఒకానొక అగోచర శక్తి ఉందని, కడకు తండ్రి సయితం ఆ అగోచర శక్తి ప్రసాదించే అసంఖ్యాక మయిన వరప్రసాదాలపై ఆధారపడి ఉన్నాడన్న యదార్థం అతనికి బోధపడుతుంది. కాబట్టి ఏ ప్రేమైక భావం అతనిలో తండ్రి పట్ల గౌరవ భావాన్ని, భక్తిభావాన్ని సృజించిందో అదే ప్రేమైక భావం ప్రాజ్ఞ దశకు చేరిన మీదట ఒకానొక అగోచర శక్తి పట్ల భక్తిభావంగా పరిణమిస్తుంది.

మొత్తానికి చెప్ప వచ్చిందేమిటంటే మతానికి ఆరంభం 'భయం' కాదు, 'ప్రేమ'భావమే. ఈ వ్యవహారంలో పరిణామ సిద్ధాంత నిపుణులు ప్రతిపాదించే సిద్ధాంతాలు రెండు మిథ్యే. మొదటి రూపంలో సిసలైన మహెూపకారి పట్ల కృతజ్ఞతా భావం, ప్రేమ భావం, ఆరాధనా భావం ముఖ్యం. దైవేతరుని యెడల భీతిభావన, అతని పూజా భావన అసహజ మైనది. పైగా అది ప్రకృతి పిలుపు పట్ల అశ్రద్ధ మూలంగా ఏర్పడిన తప్పుడు ఆలోచన.

రెండవ పరిస్థితిలో జరగాల్సిందేమిటంటే, మానవుడు తన తండ్రి వాత్సల్యభరితమయిన చేయి పట్టుకుని దేవుని వరకూ చేరాలి. అతనిలోని ఈ భావనకు సహజ పరిణామం ఏమిటంటే, ఒక దశకు చేరాక అతను తండ్రిని వదలి సిసలైన సృష్టికర్త వరకూ చేరాలి. దాంతోపాటు తండ్రిని కూడా ప్రేమించాలి. తండ్రిని ఆదరించాలి. కాని అతను ఆ విధంగా చేయ కుండా రాచబాటను వీడి – గుడ్డిగా సందుల్లోకి గొందుల్లోకి పోయిపడ్డాడు. ఇది అధ్యాత్మిక పరిణామంలో ఏర్పడిన అసహజమయిన స్తబ్ధత. భౌతిక జీవితంలోని పరిణామంలో మనకు కనిపించే అసహజ స్తబ్ధతా ఉప మానాల వంటిదే ఇదీను.

తల్లిదండ్రుల ప్రేమైక భావం అత్యంత ప్రాచీన భావం అన్న

విషయంలో సందేహం లేదు. అలాగే అత్యంత ప్రాచీనమైన భావన తల్లి దండ్రుల యెడల గౌరవ భావన. అయితే ఈ భావన పిల్లవాడు యుక్త వయసుకు చేరుకున్న మీదట అతన్ని దేవుని వైపునకు తీసుకుపోతుంది గాని తన పూర్వీకుల వైపునకో లేక తన తెగవారి ఇలవేలుపుల వైపునకో కాదు. ఈ కారణంగానే ఖుర్‌ఆన్‌లోనూ, తౌరాతులోనూ అనేకచోట్ల దైవా రాధన గురించి ఉపదేశించినప్పుడు తల్లిదండ్రుల యెడల గౌరవ భావంతో మెలగాలని నొక్కి వక్కాణించటం జరిగింది. దీనినిబట్టి అర్థమయ్యే దేమిటంటే మానవ నైజంలో దేవుని హక్కుతోపాటు తల్లిదండ్రుల హక్కుల గురించిన స్పృహ మొదటి నుంచే పొందుపరచబడి ఉంది. ముందు కలి గేది మాతాపితల హక్కుకు సంబంధించిన చైతన్యమే అయినప్పటికీ అంతస్తు రీత్యా దేవుని హక్కు మాతాపితల హక్కు కన్నా ప్రథమమైనది. బాల్కనీపై ఎక్కక ముందు నిచ్చెన లేక మెట్లు అతనికన్నా ఎత్తుగానే ఉంటాయి. కాని పైకి ఎక్కిన తరువాత మెట్లు (లేక నిచ్చెన) క్రింద ఉంటాయి. ఇదీ అంతే. దేవుని వరకు చేరిన మీదట మనిషికి తెలిసే పరమ రహస్యం ఒకటుంది- తన తల్లిదండ్రులు కూడా దేవుని వరప్రసాదాలపై ఆధారపడి ఉన్నారని! ఇప్పుడు తాను చేయాల్సింది వారిని పూజించటం కాదు, ఇలాంటి తల్లిదండ్రులను తనకు ప్రసాదించిన దైవానికి కృతజ్ఞతలు తెలుపుకోవాలన్న జ్ఞానోదయం అవుతుంది. కొడుకుపై తల్లిదండ్రులకు గల హక్కులను ఇస్లాం నొక్కి వక్కాణించింది. కాని అతని చేత 'షిర్క్' చేయించే హక్కు మాత్రం తల్లిదండ్రులకు లేదు- **"ఒకవేళ నీకు తెలియని వారినెవరినయినా నాకు భాగస్వాములుగా నిలబెట్టమని వారు (తల్లిదండ్రులు) నీపై ఒత్తిడి తీసుకువస్తే మటుకు నీవు వారి మాట వినకు." (లుక్మాన్- 15)** కారణమేమిటంటే; తల్లిదండ్రుల హక్కులకు, వారి గౌరవ మర్యాదలకు సంబంధించి మనిషి నైజంలోఅంతర్లీనమై ఉన్న ప్రేరణకన్నా దేవుని హక్కు లకు, భక్తి ప్రపత్తులకు సంబంధించిన ప్రేరణ బలవత్తరమైనది.

ఇక్కడ కొంతమందికి ఒక సందేహం కలగవచ్చు– దివ్యఖుర్ఆన్ లోనూ, ఇతర ఆకాశ గ్రంథాలలోనూ పలుచోట్ల విశ్వాసుల సుగుణాలు ప్రస్తుతించబడినప్పుడు 'భయభక్తుల' ప్రస్తావన పునరావృతమయ్యింది కదా! మరి ఈ విషయం పరిణామ సిద్ధాంతకర్తల వాదనను సమర్థించేదిగా లేదా? వారు చెప్పేది కూడా 'భయం' గురించే కదా! అని వారు సందేహ పడవచ్చు. కాని ఈ సందేహం పస లేనిది. కేవలం 'కీడు'తో కూడుకున్న భయం ఇస్లాం దృష్టిలో ఎన్నదగ్గది కాదు. ఉదాహరణకు : చంగీజ్‌ఖాన్, తైమూర్ లాంటివారు. సింహం, ఏనుగు, సర్పం, తేలు లాంటి వన్నీ తలం పులోకి రాగానే మనసులో భయం, అలజడి కలగవచ్చు. కాని మతంలో దేవుని పట్ల గల భయానికి, భక్తికి అర్థం వేరు. ఈ భయభక్తులన్నింటికీ ప్రాతిపదిక 'ప్రేమే'. ఈ భయభక్తుల భావన కేవలం దేవుని ఆగ్రహంతో కాకుండా అనంతమయిన ఆయన కరుణానుగ్రహాల స్పృహతో ఏర్పడు తుంది. ఆయన మంచి నామాల సంస్మరణ వల్ల కూడా ఈ భయభక్తులు జనిస్తాయి. కనుక దేవుని ఉన్నత గుణగణాల గురించి అత్యధికంగా తెలిసినవారే ఆయన్ని అత్యధికంగా ప్రేమిస్తారు. ఆయన్ని అందరికంటే అధికంగా ప్రేమించేవారే ఆయనకు అందరికంటే అధికంగా భయపడ తారు. **"నిశ్చయంగా అల్లాహ్ దాసులలో ఆయనకు భయపడేది జ్ఞానసంప న్నులే."**

మా ఈ చర్చ వల్ల భీతిభావంతోనే మతానికి ఆరంభం జరిగిందన్న పరిణామ సిద్ధాంత కర్తల దృక్పథం పూర్తిగా త్రోసిపుచ్చబడింది. కాని ఒక సందేహం ఇక్కడ జనించేందుకు ఆస్కారముంది. అదేమిటంటే, మానవుని నైజం స్వచ్ఛమయిన దైవదాస్యంతో కూడుకున్నదైతే, అతని ఆధ్యాత్మిక వికాసం దిశా నిర్దేశన కూడా అదే అయివుంటే మరి లోకంలోని అత్యధి కులు విగ్రహారాధన ఎందుకు చేస్తున్నట్టు? మృతులైన తమ పూర్వీకులను

ఎందుకు పూజిస్తున్నట్టు? క్రైస్తవ జగతినే చూడండి, ఆరు శతాబ్దాలైనా గడవకముందే క్రైస్తవులలో చిత్రపటాల పూజ మొదలైపోయింది. మరి చూడబోతే తౌరాతులో ఈ రకమయిన పూజ వారించబడింది. తౌరాతు లోని మొట్టమొదటి ఆజ్ఞ ఏకదైవారాధనే అయినప్పటికీ యూదులు బాహాటంగా విగ్రహారాధనకు పాల్పడ్డారు. దైవప్రవక్త హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) జీవితాన్నే చూడండి, ఆయన కేవలం ఏకదైవారాధన (తౌహీద్) కోసం స్వదేశం వీడారు. నిర్మానుష్యమైన ప్రదేశంలో ఏకదైవారాధన కోసం ఒక గృహం (కాబా గృహం) నిర్మించారు. కాని ఎంతోకాలం గడవక ముందే ఆయన సంతతికి చెందినవారే సాక్షాత్తూ కాబా గృహం లోనే విగ్రహాలను ప్రతిష్ఠించారు. మరి ఖుర్ఆన్‌ను చూస్తే, దేవుని ఏకత్వమే మానవ స్వభావం అంటోంది. కాని లోకంలో జరిగేది దీనికి విరుద్ధంగా ఉందే! కాబట్టి దీనికి సమాధానం ఇవ్వవలసిన అవసరం ఉంది. ఈ సమాధానమిస్తేనే పరిణామ సిద్ధాంత పండితుల వాదనను త్రిప్పి కొట్టి నట్లవుతుంది.

ప్రపంచంలో ఆది కాలాన్నుండీ విగ్రహారాధన, బహు దైవోపాసన అత్యధికంగా జరుగుతూ వస్తున్నంత మాత్రాన, ఇప్పటికీ బహు దైవారాధనే ప్రేళ్లూనుకుని ఉన్నంత మాత్రాన బహు దైవారాధనే మానవ నైజం అనే విషయానికి అది నిదర్శనం కాజాలదు. మానవ శిశువునే చూడండి. అతను పసికందుగా ఉన్నంతవరకూ అతని ముందున్న ప్రతి వస్తువునూ- అది ఇటుక అయినా రాయి అయినా, కొయ్య అయినా ఇనుప ముక్క అయినా, శుభ్రమయిన వస్తువు అయినా అపరిశుభ్రమయిన వస్తువైనా- నోట్లో వేసుకుంటాడు. అదే కన్న తల్లి స్తన్యం అనుకుంటాడు- కాసేపు దానిని చప్పరించి, ఆ తరువాత రెండవ దానిని ఎత్తుకుంటాడు. దరిమిలా మూడవ దానిని నోట్లో పెట్టుకుంటాడు. అంతమాత్రాన ఆ పసికందు ఆ

వస్తువులన్నింటినీ ఆశిస్తున్నాడని, అది అతని నైజమని భావించటం సరైనది కాదు. పిల్లవాని సహజ ఆహారమైతే తల్లి చనుబాలే. కాని ఆ పిల్లా డికి ఏది చనుబాలో తెలీదు, ఆ విచక్షణా జ్ఞానం అతనికింకా అబ్బలేదు. అందువల్ల అతను తనకు కనిపించిన ప్రతి వస్తువునూ తల్లి చనువు అనే అనుకుంటాడు. కాబట్టి మానవుడు తెలియని స్థితిలో విగ్రహారాధనకు, దృశ్య పూజకు లోనై ఉంటే, అతని నైజం వాంఛించేది అదే అని అర్థం ఎంతమాత్రం కాదు. వాస్తవమేమంటే అతను నిజ దైవం అన్వేషణలోనే ఈ ధక్కాముక్కీలు తింటాడు. పిల్లవానిలో ఉన్న మరో ప్రత్యేకత ఏమి టంటే, కొన్ని సార్లు తల్లి తన పిల్లవాణ్ణి పిలిచినా అతను పట్టించుకోకుండా తాను నిమగ్నమై ఉన్నదానిలోనే నిమగ్నమై ఉంటాడు. ఆ చంటివాణ్ణి ఎత్తు కుని, అతని పెదాలకు చనువును అందించనంతవరకూ అతను తన లోకంలోనే ఉంటాడు. మరి తల్లి అతన్ని తన నుండి వేరు చేశాక, అంతకు ముందు ఏం చేసేవాడో అదే పనిలో మునిగిపోతుంటాడు.

చరిత్రను శోధించినప్పుడు బుద్ధికి అందే విషయం ఏమిటంటే, అంధకార యుగంలో కూడా దేవుని దాసులు కొందరు ప్రభవించారు. వారు స్వయంగా జాగరూకులై ఉండటమేగాక, ఇతరులను కూడా జాగృత పరిచారు. కాని కొన్ని విరామ సమయాలలో, చిన్న పిల్లల మాదిరిగా- మానవులు తమకు ఇవ్వబడిన పాఠాలను మరచిపోయేవారు.

ఇక్కడికి చేరుకునే సరికి కొందరిలో మరో సంశయం కూడా కలుగు తుంది. ఒక వస్తువు మనిషి స్వభావం అయి ఉన్నప్పుడు, అతను ఆ స్వభావంపైనే పుట్టినప్పుడు, దానిపైనే పెరిగి, దానిపైనే మరణించినప్పుడు దానిని పదేపదే పొందుతూ పోగొట్టుకోవటమేమిటి? పోగొట్టుకుంటూ పొందటమేమిటి? అసలిదంతా సూచించేదేమిటి? ఎంతో ప్రయాసపడిన మీదట ఒక వస్తువును పొందినప్పుడు, దానిని పోగొట్టుకోకూడదు కదా!

ప్రజలు జంతువుల స్వభావానికీ– మనుషుల స్వభావానికీ మధ్య గల వ్యత్యాసాన్ని అర్థం చేసుకోకపోవడం చేతనే ఈ సందేహానికి తావు కలుగుతుంది. జంతువుల స్వభావం పూర్తిగా కొన్ని నిర్ణీత నిబంధనలకు కట్టుబడి ఉంటుంది. ఏదయినా సహజమైన అవరోధం ఏర్పడితే తప్ప అవి ఒకే రకమయిన– నిర్ధారితమయిన– నియమాలపై పుట్టి పెరుగుతాయి. ఆ నియమాల పట్ల వైముఖ్యం కనబరిచేందుకు లేక మార్చేందుకు ప్రకృతి వాటికి అనుమతించదు. తమకు విధితమయిన శాసనానికి అవి కట్టుబడి ఉంటాయి. మీరొక పావురాన్ని మాంసపు దుకాణంలో బంధించి ఉంచండి– ఆకలితో చచ్చిపోతుంది గాని ఆ దుకాణంలో ఉన్న మాంసాన్ని ఉపయోగించుకోదు. మీరొక పిల్లిని పండ్ల షాపులో కట్టి ఉంచండి–అది కూడా ఆకలితో ప్రాణం విడుస్తుంది కాని ఆ పండ్లు తినదు. కాని మనిషి స్వభావం తద్భిన్నమైనది. మేమిక్కడ మనిషి నైజాన్ని సుస్పష్టం చేయడానికి గురువర్యులు మౌలానా హమీదుద్దీన్ ఫరాహీ (రహ్మ) గారు సూరయె ఇఖ్లాస్ వ్యాఖ్యానంలో పై ప్రశ్నలకు సమాధానమిస్తూ అర్రూమ్ సూరా ఆయతుల (48–54) వెలుగులో వ్రాసిన పంక్తులను ఇక్కడ పొందుపరుస్తున్నాము.

> “జగతి అంతటా మానవునికి కానవచ్చే వివేకం, కారుణ్యాల నిదర్శనాలుగానీ, కష్టకాలంలో మనిషి తన ప్రభువు వైపునకు మరలటం గానీ చాటి చెప్పేదేమిటంటే తిరుగులేని ఒక పాలకుడు, పోషకుడు తనను నియంత్రిస్తున్నాడన్న సాక్ష్యం అతని అంతర్బాహ్యాల నుండి అతనికి లభిస్తోంది. ఇలాంటి ఒక సాక్ష్యమేదీ విగ్రహాలకు సంబంధించి గానీ, మృతులకు సంబంధించిగానీ లభించదు. కాని మనిషి ఉపమానం కట్టుబానిసల వలే ఉన్న జంతువుల వంటిది కాదు. అతనికి స్వేచ్ఛనొసగబడింది. దాన్ని ఉపయోగించుకుని అతను

అభివృద్ధి కొరకు సాధన చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. ఆ సూత్రధారి పశువులను తాను కోరిన దారి వైపునకు తోలేశాడు. కాని మనిషి సంగతి అలా కాదు. ఆయన మనిషికి బుద్ధీ వివేకాల కాంతిని వొసగాడు. ప్రజ్ఞాపాటవాలనే 'చద్దిమూట'ను ప్రసాదించి మరీ ఈ లోకంలోకి విడిచి పెట్టాడు. ఆ విధంగా అతని నైజంలో అతని సామర్థ్యం పొందుపరచబడింది. నేటి వరకు మానవుడు ఎంత ప్రగతి సాధించినా, అదంతా అతనిలోని ఆ శక్తిసామర్థ్యా లకు చిహ్నాలే. ప్రతిభకు మరోపేరే నైజం అనుకుంటే ఇది ఒక్క మనిషికి మాత్రమే ప్రత్యేకం కాదు. నెమలి పిల్ల పసిప్రాయంలో చూడటానికి ఒక మాంసపుముద్ద లాగానే ఉంటుంది కానీ అది పెరిగి పెద్దది కాగానే పురివిప్పిన నాట్య మయూరిలా కాన వచ్చిం దంటే, అది దాని సహజ గుణమనే అనుకుంటాము. మానవ శిశువు కూడా అంతే. శైశవ దశలో అతని పరిస్థితి కూడా ఎన్నో జంతువుల కంటే మరీ బలహీనంగానే ఉంటుంది. మరి అతను యుక్త వయసుకు చేరుకున్నాక అతనిలోని శక్తిసామర్థ్యాలను, ఔచితీ విజ్ఞతలను చూసి అది అతనిలోని ఉన్నత స్వభావానికి ప్రతిబింబం అని అనుకోకుండా ఎలా ఉంటాము? కాబట్టి మనుషుల్లో నయినా, ఇతర వస్తువుల్లోనయినా ప్రకృతి లేక నైజం ఒకే భావంలో ఉంటుంది. కాకపోతే ఇతని నైజంలో ఇతరులెవ్వరి లోనూ లేని ఓ విలక్షణమయిన విషయం ఉంది. ఇతను ఆదిలో అందరికన్నా అత్యంత బలహీనునిగా, పనికిరానివాడుగా ఉంటాడు. కాని అంతిమంగా అందరిపై ఆధిపత్యం వహిస్తాడు. ఇతని ఆదికి– అంతిమానికి మధ్య గల వ్యత్యాసం ఇప్పటికీ అంతు బట్టనిది. ఇదంతా రెండు శక్తిహీనతలకు మధ్యన ఉంది. అలా కాని పక్షంలో మానవునిలోని ఫిరౌనీతత్వం కూడా అసందర్భం

అనిపించుకునేది కాదు. మానవ నైజం ప్రగతి శిఖరాల ఆఖరి హద్దులకు చేరుకుంటుందన్న అంచనా ఒకవైపున ఉండగా, అతనికున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అతన్ని పెడత్రోవపట్టించేందుకు ఆస్కారముందన్న వాదన కూడా ఉంది. మొత్తానికి ఎంపిక స్వేచ్ఛ, సుదీర్ఘ మార్గం అతని వాటాలోనికి వచ్చాయి. ఈ రెండు కష్టాలతో పాటు మూడో కష్టం కూడా అతనితో వచ్చి చేరింది. అది ఎన్నడూ ఈ రెండింటి నుండి వేరవదు. అదేమిటంటే మానవుడు మంచీ-చెడు అనే రెండు మార్గాల కూడలిలో నిలబెట్టబడ్డాడు. ఇది లేకుండా అతని పాలిట స్వేచ్ఛ అనే పదానికి అర్థమే ఉండదు. ఒక విధంగా చెప్పాలంటే 'సాధన'తోపాటు 'ఆకర్షణ' మానవనైజంలో అనివార్య అంశమయింది.మంచీ చెడుల సంఘర్షణలో ముందుకు సాగటం, నఫ్సె అమ్మారా (చెడుల వైపునకు పురమాయించే మనసు)కు, విశృంఖలమైన బుద్ధికి ముకుతాడు వేసి వాటిని విధేయత (ఇతాఅత్)కు కట్టుబడి ఉండేలా చేయటం అతని కర్తవ్యంగా ఖరారయింది.

"దేవుడు మనిషిని ఈ ఒడిదుడుకులలో పడవేసిన తరువాత అతన్ని అతని మానాన వదలిపెట్టలేదు. అతనికి ఎల్లెడలా అండగా ఉంటానని వాగ్దానం చేశాడు. అతని లోపల బయట కూడా మార్గదర్శకత్వ సామగ్రిని పొందుపరిచాడు. పసిపిల్లవాడికి తల్లి ఒడిని ప్రసాదించినట్లే మానవజాతి కొరకు ప్రవక్తలను ప్రభవింపజేశాడు. మృత భూమికి వర్షం ద్వారా జీవం పోసిన దేవుడే తన దివ్యవాక్కు ద్వారా మానవ మనోక్షేత్రాలను పులకింపజేశాడు. ఆయన కొన్ని ఎత్తయిన పర్వతాలలో నుండి నీటి ఊటలను వెలికి తీసినట్లే కొన్ని హృదయాలలో నుండి దివ్య వచనాలు జాలువారేలా చేస్తాడు. ఇన్ని

విధాలుగా మార్గదర్శక ఏర్పాట్లు చేసిన మీదట కూడా ఒకవేళ మానవుడు వైముఖ్య ధోరణిని అవలంబిస్తే అది ప్రకృతి పర్యవసానం కాదు, అది కేవలం అతని అలసత్వ ఫలితం మాత్రమే. ఒకవేళ చరిత్ర ద్వారా విగ్రహారాధన దృష్టాంతాలు లభిస్తాయని అనుకుంటే అంతకంటే అధికంగా అతని స్వయంకృతాల దృష్టాంతాలు కూడా లభ్యమవుతాయి. ఏకదైవత్వపు వాదన (తౌహీద్)పై బహు దైవోపాసన (షిర్క్) దుమ్ము క్రమక్రమంగా పేరుకుని అంధకారం ఆవరించినప్పటికీ ఏకేశ్వరోపాసన యొక్క ఒక్క అగ్నికణం బహుదైవోపాసనా చీకట్లను చీల్చివేస్తుంది. దీన్నిబట్టి తేటతెల్లమయ్యే ముఖ్య విషయం ఏమిటంటే మానవ నైజానికి ఏకదైవత్వపు వాదన (తౌహీద్)తో విడదీయరాని సంబంధం ఉంది. అలాకాని పక్షంలో అతను దాని వైపునకు మరలటంలో శీఘ్రత కనబరిచే వాడే కాదు."

ఈ విశ్లేషణ ద్వారా తేటతెల్లమైనదేమిటంటే మానవ నైజంలోనూ, జంతువుల స్వభావంలోనూ మౌలికంగా కొన్ని వ్యత్యాసాలున్నాయి.

మొదటి వ్యత్యాసం : మానవునికి ఉన్నత స్వభావంతోపాటు ఉత్తమ నడవడి కూడా లభించింది. అంతేకాదు, అతనికి ఎంపిక స్వేచ్ఛ కూడా ఇవ్వబడినది. ఈ స్వేచ్ఛను సద్వినియోగం చేసుకుని అతను తన పుట్టుకకు సార్థకతనూ చేకూర్చగలడు. లేక దానిని దుర్వినియోగపరచి పాతాళంలోకి పోయి పడనూ గలడు.

రెండవ వ్యత్యాసం : మానవుని శక్తి సామర్థ్యాలు, ప్రజ్ఞా పాటవాలు లోతైనవి. అతను ప్రగతి శిఖరాల అంబరాలను చుంబించడానికి ఓ సుదీర్ఘమయిన ప్రయాణం చేయవలసి ఉంటుంది. పశువుల మాదిరిగా అతని పయన దూరం ఒకట్రెండు కోసులు కాదు; నడిచి అలవోకగా చేరుకోవ

టానికి. అతని మార్గం సుదీర్ఘమైనది. ఈ ప్రయాణంలో తనకు ప్రాప్తమై ఉన్న స్వేచ్ఛ మూలంగా అతను పడిలేవటం, మునిగి తేలటం వంటివి సహజమే.

మూడవ వ్యత్యాసం : సుదీర్ఘ ప్రయాణం, ఎంపిక స్వేచ్ఛతో పాటు అతను పరీక్షించబడుతున్నాడు. అతని దృష్టిలో ప్రపంచం నగదుగానూ, పరలోకం అరువుగానూ చేయబడింది. అతని మనసుకు సదాచరణ కఠిన మైనదిగా, దురాచరణ సులభమైనదిగా తోచేలా చేయబడింది. అతనికి అధర్మం (హరామ్) రుచికరమైనది అనిపిస్తే ధర్మం (హలాల్) చప్పగా అనిపిస్తుంది. సత్యఫలం ఎప్పుడో ఆలస్యంగా లభిస్తే అసత్య ఫలం ఇట్టే తొందరగా ప్రాప్తమవుతుందని అతను తలపోస్తాడు. ఈ విధంగా చేసి అతను పరీక్షలో పడవేయబడ్డాడు. అతను మంచి వైపునకు మొగ్గుచూపు తాడా లేక చెడు వైపునకు ఎగబడతాడా? అన్నదే అసలు పరీక్ష. అతను యదార్థాలతో కూడుకున్న సహజత్వం వైపునకు పోతాడా? లేక మనోరథం వెనుక పరుగెత్తి అసహజమైన, మోసపూరితమయిన పిలుపుకు స్పంది స్తాడా? అన్నదే సిసలైన పరీక్ష. నిశ్చయంగా ఇది కఠిన పరీక్షే. అయితే మానవ నైజంలో అంతర్లీనమై ఉన్న 'నఫ్సె లవ్వామ'(హెచ్చరించే మనసు, మథనపడే మనసు) కూడా మరీ అంత బలహీనమైనది కాదు. అది దట్టమైన చీకట్లలో సయితం తొంగి చూసే అవకాశం కల్పిస్తుంది. మార్గ దర్శనానికి అవసరమైన సంకేతాలు మనిషికి అందిస్తుంది. మనిషి భావ నలు, అనుభూతులకు సంబంధించిన ఎన్ని ముసుగులు తనపై వేసుకున్న ప్పటికీ దాని (నఫ్సె లవ్వామ) సంజ్ఞలను అతను కానగలుగుతాడు, దాని ఘోషను వినగలుగుతాడు. దాని ధ్వనిని విని కూడా అవిధేయత కన బరుస్తాడు, దాని నిదర్శనాలను చూసి కూడా కుంటిసాకులు వెతుకుతాడు– అది వేరే విషయం. కాని అతని మనస్సాక్షి మాత్రం అతనిని సదా

హెచ్చరిస్తూనే ఉంటుంది. ఈ యదార్థమే అల్ ఖియామా సూరాలోని ఈ ఆయత్‌లలో ఈ విధంగా చాటి చెప్పబడింది:

★ ... ఇంకా, నేను ప్రబోధించే (హెచ్చరించే, నిందించే) అంతరాత్మ సాక్షిగా, చెబుతున్నాను. (75: 2)

★ ... కాని ఈ మానవుడు ఇక ముందు కూడా దుష్కార్యాలు చేయగోరుతున్నాడు. (75: 5)

★ మానవుడు ఎన్ని సాకులు చెప్పినా,స్వయంగా తన గురించి తనకి బాగా తెలుసు. (75: 14, 15)

ఈ ఆయత్‌లకు వ్యాఖ్యానంగా గురువర్యులు (మౌలానా హమీదుద్దీన్ ఫరాహి) వ్రాసిన అమూల్యమైన విషయాలను ఆయన వ్యాఖ్యాన గ్రంథంలో చూడవచ్చు.

ఈ కఠిన పరీక్ష దృష్ట్యానే అల్లాహ్ మానవ మార్గదర్శకత్వం నిమిత్తం తన సందేశహరులను ప్రభవింపజేశాగ: మానవ నైజంలో ఉన్న 'దేవుని వైపునకు ఆకర్షణ' అంత బలహీనమైనది కాదు. అయినప్పటికీ ప్రపంచంలోని మాయలు మోసాలు, మనసు కవ్వింపులు, షైతాన్ పన్నే కుట్రలు కుతంత్రాలు కూడా తక్కువేమీ కావు. అందుకే ఈ మాయాజాలం నుండి తప్పించుకునే ఉపాయాన్ని కూడా మానవునికి సమకూర్చవలసిన ఆవశ్యకత ఉండింది. దైవకారుణ్యం ఇదంతా చూస్తూ కూడా మౌనంగా ఉండజాలదు. అందుకే దేవుడు దీని సమతౌల్యం కొరకు ప్రకృతి త్రాసుకు 'పడికట్టు' ఉంచాడు. ఖుర్ఆన్‌లో వచ్చిన ప్రస్తావన ప్రకారం అల్లాహ్ ఆది మానవుడైన ఆదమ్‌ను షైతాన్‌తోపాటే ఈ భూమండలంపైకి దింపినప్పుడు, అతని మార్గదర్శకత్వం కోసం తన ప్రవక్తలను పంపుతానన్న వాగ్దానం కూడా చేశాడు. ఎందుకంటే ప్రపంచంలోని ఈ పోటీ రంగంలో మానవ నైజం ఒంటరిదై పోరాదు. పైగా అతనికి అండగా దైవప్రవక్తలు, దైవ

గ్రంథాలు, దైవదూతలు కూడా ఉండాలి. తిరుగులేని విధంగా దేవుని ఏకత్వం గురించి మానవతకు సుబోధకం చేసి రేపు తీర్పుదినాన మానవులకు కుంటిసాకులు చెప్పే ఆస్కారం లేకుండా చేయాలని కూడా దేవుడు అభిలషించాడు. అంధకారం దట్టంగా అలుముకుని ఉండటం వల్ల నేను సన్మార్గాన్ని కానలేకపోయానని మనిషి చెప్పేందుకు అవకాశం లేకుండా చేయాలి. అంధకారం దట్టంగా అలుముకుని ఉన్నమాట నిజమే. అయితే స్పష్టమయిన కాంతిరేఖలు, దేదీప్యమానమైన మార్గదర్శక దీపం కూడా ఉండేది. అవి మానవ నైజంలో అణిగివున్న అతి సూక్ష్మమయిన మార్గచిహ్నాలను కూడా ప్రస్ఫుటం చేసేంత దేదీప్యమానమైనవి.

దేవుడు ఏ విభాగంలోనూ తన కరుణానుగ్రహాలను వొసగటంలో పిసినారితనం చూపలేదు. మానవుడు వినగలిగేందుకు అతనికి ఒక చెవి ఇచ్చినా సరిపోయేది. చూడగలిగేందుకు ఒక కన్ను ఇచ్చినా సరిపోయేది. కాని అతనికి రెండు చెవులు, రెండు కళ్ళు ప్రసాదించబడ్డాయి. అలాగే మానవుని మార్గదర్శకత్వ వ్యవహారం అతని నైజానికి వదిలిపెట్టినా ఎవరూ ఏమీ చేసుకోలేరు. కాని దైవకారుణ్యం ఈ వ్యవహారాన్ని అంతటితో సరిపుచ్చుకోకుండా తన ప్రవక్తల, సందేశహరుల ద్వారా మార్గదర్శకత్వానికి సంబంధించిన పూర్తి ఏర్పాట్లు చేసింది. మానవుడు తన లోపల, బయటా ఇన్ని శక్తియుక్తులను కలిగి ఉండి కూడా దైవదాస్యానికి అనుకూలంగా షైతాన్‌ను ప్రతిఘటించేందుకు సన్నద్ధుడు కాకపోతే, పైగా అతనితో కుమ్మక్కు అయిపోతే ఆ లోపం ప్రకృతిది కాదు, వాస్తవానికి దీనికి వేరే కారణాలు ఉన్నాయి. దైవచిత్తమయితే దీని కారణాలు రానున్న అధ్యాయంలో పేర్కొంటాము.

ఈ వివరణ తరువాత 'అన్ని మతాల సారం ఒక్కటే' అనే మాటను ఖండించవలసిన అవసరం కూడా మిగిలి ఉండదు. ఇంతకుముందు వచ్చిన చర్చ ద్వారా విశదమయిన విషయం ఏమిటంటే, ఇస్లామీయ

దృక్పథం గానీ, ఇతర ఆకాశ మతాల దృక్పథం గానీ 'భీతి భావన'తో ఆరంభమవలేదు, దేవుని యెడల ప్రేమైక భావంతోనే మొదలయింది. ఇక షిర్క్, విగ్రహారాధనల పునాది అయితే పూర్తిగా ఇంకొక వస్తువుపై ఉంది. దీని వివరాలు కూడా మున్ముందు రానున్నాయి. ఇస్లాం మూలాలు వేరు. షిర్క్ మూలాలు వేరు. రెంటికీ మధ్య ఎలాంటి పొంతనే లేదు. పైగా అవి పరస్పర విరుద్ధమైనవి. వాటి మధ్య మైత్రి కాదుకదా, వైషమ్యం ఉంది. వాటిలో ఒకటి ప్రకృతికి అనుగుణమైనదైతే, రెండవది ప్రకృతికి విరుద్ధ మైనది. ఈ రెండింటి దిశ వేరు. మజిలీ వేరు. వీటి మధ్య సయోధ్యకు, సఖ్యతకు ఆస్కారమే లేదు.

లోకంలో మానవుడు కేవలం బ్రతకటానికే రాలేదు. తన నైజంలో పొందుపరచబడి ఉన్న ఉన్నత శక్తి సామర్థ్యాలను, ప్రతిభా పాటవాలను వాటి క్రమ వికాసపు ఆఖరి హద్దులకు చేర్చడానికి వచ్చాడు. ఈ లక్ష్యసిద్ధి కోసమే మానవునికి ఈ లోకంలో జీవన వ్యవధి ఇవ్వబడింది. ఒకవేళ ఆ లక్ష్యం సిద్ధించకుండా ఉండే మాటైతే ఇక్కడ అతను బ్రతికి ఉండటం నిష్ఫలమే. కాగా, ప్రకృతి ప్రతి విభాగం ఎంతో యుక్తితో కూడుకున్నది. అది ఏ ఒక్క విషయంలోనూ వృధాగా లేదు. ఇంతకు ముందు మనం చదివినట్లు మానవుని ఆధ్యాత్మిక పరిణామానికి మూలం దైవదాస్యపు భావనే. మానవుడు ఆ దిశలో ముందుకు సాగిపోతున్నప్పుడు ఎప్పుడు దిశ తప్పి కుడిఎడమల అపవాదాల బారిన పడతాడోనని కరుణామయుడైన దేవుడు తన సందేశహరులను పంపి మానవతకు మార్గబోధన చేశాడు. ప్రవక్తలు సరైన దిశలో మానవాళిని నడిపించారు– అంటే వారిని స్వచ్ఛ మైన దైవదాస్యపు బిందువు వరకు చేర్చే ప్రయత్నం చేశారు.

దైవప్రవక్తలకు సంబంధించినంతవరకు దైవశాసనం ఏమిటంటే, వారు ఏ సమాజం వైపునకు సందేశ ప్రదాతలుగా ఉంటారో, దాని సహజ వనం యొక్క అత్యుత్తమ ఫలాలుగా ఉంటారు. వారు గొప్ప శీలస్వభావులై

ఉంటారు. వారి మాటలు ముత్యాల మూటలై ఉంటాయి. వారి ఆచరణ అత్యుత్తమంగా, అనుసరణీయంగా ఉంటుంది. వారు ప్రజాబాహుళ్యం మధ్యన ఓ సుదీర్ఘకాలం వరకు ఉండి ప్రకృతికి అనుగుణమైన ఓ అత్యుత్త మమైన నడవడిని ప్రదర్శించి ఉన్నత మానవీయ నైతిక సుగుణాల ప్రాతి పదికపై ఓ ఆదర్శప్రాయమైన సమాజాన్ని రూపొందిస్తారు. దీని సహజ పరిణామంగా మానవత రాచబాటపై పయనించసాగుతుంది. ఇంత చేసినా సమాజంలో అప్పటికీ కొందరు దౌర్భాగ్యులు ఉంటారు, సత్యవాణి సర్వత్రా ప్రతిధ్వనిస్తున్నాసరే అది వారి కర్ణ పుటాలకు తాకదు. అలాంట ప్పుడు దేవుడు వారిని దేనికి మిగిల్చి ఉంచాలి? వారిని మనుషులుగా చేసి కేవలం మెక్కటానికి, రుచులు మరగటానికి, పిల్లల్ని కనటానికి వదిలి పెట్టేస్తే వారివల్ల ఒరిగేదేముంటుంది? ఈ పనికోసమైతే పశువులు ఎలాగూ ఉన్నాయి. అవి తమకన్నా ఉన్నతమైన సృష్టిరాశి సేవలో ముందడుగు వేస్తూ తమదైన రాచబాటలో సాగిపోతూనే ఉన్నాయి. వీళ్ళ మార్గబోధన కొరకు చేయగలిగినదంతా చేయబడింది. మిగిలిందల్లా ఒక్కటే– అల్లాహ్ తన సంపూర్ణ శక్తితో వాస్తవాలపై పడివున్న తెరలను ఎత్తివేయటం లేదా వారికి ఊర్ధ్వలోకాల విహార యాత్ర చేయించి, పర్యవసానాన్ని ప్రత్యక్షంగా వీక్షించేలా చేసి దారికి వచ్చేలా ఒత్తిడి చేయటం! కాని వారికి ఈ విధమైన 'మర్యాద' చేయటం వారికి ఇవ్వబడిన 'ఎంపిక స్వేచ్ఛ'కు విరుద్ధం. దేవుడు విధించిన పరీక్షా వ్యవస్థకు కూడా అది వ్యతిరేకమే. ఎందుకంటే మనుష లలో ఎవరు బాగా ఆచరిస్తారో పరీక్షించడానికే దేవుడు జీవన్మరణాల వ్యవ స్థను సృష్టించాడు. మరైతే ఇప్పుడు ఇలాంటి ధిక్కారులకు దేవుడు దేనికోసం జీవిత వ్యవధిని ఇవ్వాలి?- పెడదారి పట్టిన మనిషి ఇప్పుడు చేయగలిగిం దేమిటి? తాను దారి తప్పినది గాకుండా తన మాట వినే తన భావితరాల వారిని కూడా అతను పెడత్రోవ పట్టిస్తాడు.

అందుకే ఏదయినా ఒక జాతి వారి వద్దకు దేవుడు తన ప్రవక్తను

పంపినప్పుడు, వారి విషయంలో దేవుని తరఫున విధితమయ్యే శాసనమేమి టంటే, సందేశ ప్రధాన కార్యక్రమం పూర్తయిన మీదట, తిరుగులేని రీతిలో సత్యం వారికి ప్రస్ఫుటం చేసిన మీదట, ఆ సముదాయంలోని సత్యబల మున్న సజ్జనులను వేరుపరచటం జరిగింది. ఆ తరువాత దుష్టులను, అవిధేయులను దైవశిక్ష రూపంలో – సత్యవంతుల చేతుల మీదుగా– అంతమొందించటం జరిగింది. దేవుని సంస్కరణా సరణి వాఛించేది కూడా ఇదే.

దేవుని ఈ సంప్రదాయం దైవప్రవక్తలకు ప్రత్యేకం. దీనికి సంబం ధించిన నిర్ణీత నియమ నిబంధనలు దివ్యఖుర్‌ఆన్‌లో వివరంగా వచ్చాయి. గురువర్యులు మౌలానా హమీదుద్దీన్ ఫరాహి (అలైహిర్రహ్మా) గారు సూరయె కాఫిరూన్‌కు వ్రాసిన వ్యాఖ్యానంలో ఈ సూత్రాలు సంక్షిప్తంగా పేర్కొనబడ్డాయి. ఒక్క దైవప్రవక్తలు మినహా మిగిలిన వ్యక్తులెవరూ ఈ సందేశ ప్రదాన కార్యక్రమాన్ని సంపూర్ణంగా, తిరుగులేనివిధంగా నిర్వర్తిం చలేరు. జమాఅత్‌లు కూడా ఈ పనిని దైవప్రవక్తల స్థాయిలో చేయలేవు. అందుకే– "ఇక ఈ జాతి వారిలో సత్యాన్ని స్వీకరించే గుణం ఏమాత్రం లేదు" అని వాదన చేసే అధికారం ఇప్పుడు ఏ వ్యక్తికీ, ఏ జమాఅత్‌కీ లేదు. ఈ కారణంగానే సత్యకాముకులైన వర్గాన్ని తమ సముదాయం నుండి వేరు చేసుకుని మిగిలిన వారిని అంతమొందిస్తామని చెప్పే హక్కు కూడా ఇప్పుడు ఎవరికీ లేదు – ఎవడయినా సత్యవచనాన్ని స్వీకరించిన మీదట తిరిగిపోయి మార్గభ్రష్టుడు (ముర్తద్) అవుతే తప్ప! ఎందుకంటే అతనొక సారి సత్యాన్ని స్వీకరించి, తన వరకు సత్యధర్మం (తిరుగులేని రీతిలో) చేరిందన్న విషయానికి సాక్షిగా నిలిచాడు.

ఈ వివరాలన్నింటి ద్వారా తేటతెల్లమైనదేమిటంటే మతం అనేది 'ప్రేమైక భావం'తోనే మొదలయింది. అది చిన్నపిల్లల స్వభావంలో

తల్లిదండ్రుల యెడల వుంటే, ప్రాజ్ఞతకు చేరిన పిదప తల్లిదండ్రులతోపాటు సిసలైన వరప్రదాత పట్ల కూడా జనిస్తుంది. ఈ ప్రేమైక భావం మూలం గానే వరప్రదాత యెడల కృతజ్ఞతా భావం, స్తోత్ర భావం జనిస్తాయి. కన్న తల్లిదండ్రుల యెడల సద్భావం పెంపొందుతుంది. వరప్రదాత పట్ల గల ప్రేమ దైవదాస్య భావనను సృజించింది. అదే నమాజు రూపంలో ప్రస్ఫుటం అయ్యింది. తల్లిదండ్రుల పట్ల గల సద్భావం వారి సేవకు సమాయత్తం చేసింది. ఇంకా అది క్రమ వికాసమొందుతూ బంధువుల హక్కును నెరవేర్చడానికి, జకాత్‌ను ఇవ్వడానికీ ప్రేరేపించింది. ఈ విధంగా మనిషిలో ఆధ్యాత్మికత వికసించసాగింది. అల్లాహ్ హక్కులు నెరవేర్చాలన్న భావన విశ్వాసాలను, ఆరాధనలన్నింటినీ జ్ఞాపకం చేసింది. దాసుల (తోటి మానవుల) హక్కులను నెరవేర్చాలన్న ఆలోచన అతని నడవడిని, వ్యవహారాలను సంస్కరించింది. ఇదే సహజ మార్గం! దైవదాస్యపు రుజు మార్గం!! ఇదే ఆధ్యాత్మిక వికాసంతో ముడివడిన రాచబాట. దీని ఒక అంచున ముత్తాత ఆదమ్(అలైహిస్సలామ్) ఉండగా, మరో అంచున అంతిమ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఉన్నారు. దీని మధ్యలో దేవుని వేలాది మంది ప్రవక్తలు, సందేశహరులు, సత్యసందేశ ప్రదాతలు కొద్ది కొద్ది అంతరంతో నిలబడి ఉన్నారు. వారు తమ తమ కాలాల్లో ఈ రాచబాటపైనే నడవమని మానవాళికి పిలుపు ఇచ్చారు. కాని మానవుడు పదేపదే ఈ రాచబాటపైకి వస్తూనే దాని నుండి వైదొలుగుతూ వచ్చాడు. భువిలో సంస్కరణ జరిగిన మీదట కూడా అందులో చెడుగును, విధ్వంసాన్ని సృష్టిస్తూ వచ్చాడు. అందుకే **"సంస్కరణ జరిగిన మీదట ధరణిలో కల్లోలాన్ని సృష్టించకండి"** అని ప్రవక్తలు నొక్కి వక్కాణించవలసిన పరిస్థితి ఏర్పడింది.

9. షిర్క్‌కు మూల కారణం

మానవ నైజంలో సిసలైన వరప్రదాత పట్ల గల ప్రేమైక భావన, కృతజ్ఞతా భావన అత్యంత ప్రాచీనమైనదనీ, అది అతని అణువణువునూ పెనవేసుకుని ఉందన్న విషయాన్ని వెనుకటి అధ్యాయంలో కూలంకషంగా వివరించటం జరిగింది. దీని ఆధారంగానే ఖుర్ఆన్ దావా చేసింది- విశ్వప్రభువు అల్లాహ్ ఆదమ్ సంతతికి చెందిన మనుషులందరితో తన ప్రభు సత్తాకు సంబంధించిన ప్రమాణం చేయించాడనీ, దానికి ప్రతి ఆదం పుత్రుడు అంగీకారం తెలిపాడనీని-

وَ اِذْ اَخَذَ رَبُّکَ مِنْۢ بَنِیْۤ اٰدَمَ مِنْ ظُهُوْرِهِمْ ذُرِّیَّتَهُمْ وَ اَشْهَدَهُمْ
عَلٰۤی اَنْفُسِهِمْ اَلَسْتُ بِرَبِّکُمْ قَالُوْا بَلٰی شَهِدْنَا اَنْ تَقُوْلُوْا
یَوْمَ الْقِیٰمَةِ اِنَّا کُنَّا عَنْ هٰذَا غٰفِلِیْنَ ○ (اعراف:۱۷۲)

ప్రవక్తా! ప్రజలకు ఆ సమయాన్ని జ్ఞాపకం చెయ్యి. అప్పుడు నీ ప్రభువు ఆదము సంతతి యొక్క వీపుల నుండి వారి సంతానాన్ని తీసి, ఇంకా స్వయంగా వారిని వారికే సాక్షులుగా నిలబెట్టి అడిగాడు: "నేను మీ ప్రభువును కానా?" అని. వారు ఇలా అన్నారు: "నిశ్చయంగా మీరే మా ప్రభువు. మేము దీనికి సాక్ష్యమిస్తున్నాము". మేము ఇలా ఎందుకు చేశామంటే, ప్రళయదినం నాడు 'మాకు

ఈ విషయం తెలియదు' అని అనకుండా ఉండేటందుకు.

(అల్ ఆరాఫ్ : 172)

ఈ రకమయిన **'ప్రమాణ స్వీకారం'** ఒకటి ఆదిలోనే జరిగిందన్న సంగతి మాకేం తెలుసు? 'నేను మీ ప్రభువును కానా?' అన్న విషయామూ తెలీదు. 'ఎందుకు కావు? నీవే కదా మా ప్రభువువి' అని జవాబు ఇచ్చిన సంగతి కూడా మాకు తెలీదు అని కొంతమంది అనవచ్చు. ఆ వ్యవహారానికి ఈ ఆయత్ ఒక రుజువుగా ఉంది. మరీ ముఖ్యంగా రేపు తీర్పుదినాన ఆదం పుత్రుడు సాకులు చెప్పబోయినప్పుడు ఇది అతనికి వ్యతిరేకంగా తిరుగులేని ఆధారంగా ఉండబోతోంది.

ఆశ్చర్యకరం! జనులకు తెలియనిదేముంది? ఒక మనిషి అత్యంత అల్పమైన ఒక నీటి బిందువు రూపంలో మాతృ గర్భంలో స్ఖలించబడతాడు. మాతృమూర్తి లెక్కలేనన్ని కష్టాల కోర్చి నవమాసాలు అతనిని తన గర్భంలో మోస్తుంది. తన రక్తమాంసాలతో అతన్ని పోషిస్తుంది. తన ప్రాణాలను పణంగా పెట్టి పీడనను భరిస్తూ అతన్ని ప్రసవిస్తుంది. ఆ తరువాత తన శరీరంలోని ఒక్కొక్క రక్తపు బొట్టును పాలుగా మలచి ఆ శిశువుకు త్రాపుతుంది. ఈ విధంగా కొన్ని ఏండ్ల ప్రయాస తరువాతనే అతను ఈ నేలపై సంచరించే స్థితికి చేరుకుంటాడు. ఆ తరువాత తండ్రి అవ్యాజానురాగాల, త్యాగాల, ఆలనా పాలనల వంతు వస్తుంది. అది కూడా ఒక సుదీర్ఘకాలం వరకూ కొనసాగుతుంది. ఆ వ్యవధిలో తండ్రి తన కోసం కోరుకునేదాని కన్నా అధికంగా ఆ పిల్లవాని కోసం కోరుకుంటాడు. అతను ఓ ముద్ద తక్కువ తిని పిల్లవానికి కడుపు నిండా పెడతాడు. తాను కష్టాల కోర్చుకుని కన్నపిల్లవానికి శాయశక్తులా సుఖసౌఖ్యాలనిస్తాడు. తాను తన ప్రాణాలను సయితం పణంగా పెట్టి పిల్లవాడికి పొంచివున్న ప్రమాదాల

నుండి అతన్ని రక్షిస్తాడు. ఈ పరంపరలో ఏ ఒక్క లింకు తెగినా పిల్లవాని జీవితం, భవిష్యత్తు ప్రమాదంలో పడిపోతుంది.

ఇప్పుడు ఒకవేళ ఆ పిల్లవాడు యుక్త వయసుకు చేరుకుని, తల్లి దండ్రులలో వృద్ధాప్యం తొంగిచూస్తుంటే, వృద్ధ తల్లిదండ్రులు వేరొకరిపై ఆధారపడవలసిన అగత్యం ఏర్పడి ఉండగా కుమారుడు మంచి స్థితిలో ఉండి కూడా మాతాపితల బాగోగులను పట్టించుకోకపోతే ఎవరయినా తల్లిదండ్రుల హక్కులు బాధ్యతలను గుర్తుచేసినప్పటికీ అవేమిటో నేను జానా నై అంటూ నిర్లక్ష్యంగా సమాధానమిస్తే అతని ఈ సమాధానం సమంజసం అనిపించుకుంటుందా? ఇలాంటి వాణ్ణి ఏ తండ్రీ క్షమించడు. పైగా అతన్ని తుచ్ఛుడనీ, దౌర్భాగ్యుడనీ అంటాడు. ఎందుకంటే వాడు తిరుగులేని ఒక హక్కును (తన బాధ్యతను) నిరాకరించాడు. ఈ ప్రత్యేక మైన హక్కు ప్రతి ఒక్కరినీ వెన్నంటి ఉంది. ఇది తిరుగులేనిది. దీనికి ఆధా రాలు, సాక్ష్యాలు అక్కరలేదు. ఈ నిర్దిష్ట హక్కు (Privilege), ఈ బాధ్యత (Responsibility) ప్రకృతి సిద్ధమైనది. అది ప్రతి మనిషిపై– తిరుగులేని రీతిలో– విధితమై ఉంది.

ఈ ప్రాతిపదికపైనే ఒక మనిషి తాను లబ్ది పొందిన స్త్రీ పోషణా భారం వహించడానికి, ఆమె మానమర్యాదల పరిరక్షణకు బాధ్యత వహిస్తాడు. ఈ ప్రాతిపదికపైనే ఒక వ్యక్తిపై అతని కుటుంబ రక్షణ, వంశ రక్షణ బాధ్యతలు విధితమవుతాయి. ఈ ప్రాతిపదికపైనే ఒక నగర పాలక వ్యవస్థ ఆ నగర పౌరుల సంపాదనలో భాగస్వామి అవుతుంది. ఈ ప్రాతి పదికపైనే ఒక ప్రభుత్వం తన ఏలుబడిలో ఉన్న ప్రజల శక్తిసామర్థ్యాలు, తెలివితేటలు, ధనప్రాణాలు దాని కొరకు వెచ్చించబడాలని కోరుతుంది. ఒకవేళ ఎప్పుడయినా రాజ్యం ప్రమాదంలో పడితే ప్రజలు తమ సర్వస్వాన్ని ఒడ్డి రాజ్యాన్ని రక్షిస్తారని ఆశిస్తుంది.

అయితే ఒకవేళ-

ఒక వ్యక్తి తన ఇల్లాలికి యజమాని అయి కూర్చున్నాడు. కాని ఆమెకు మనోవర్తి ఇవ్వాల్సిన బాధ్యత గానీ, ఆమె మాన మర్యాదలను కాపాడవలసిన విధిగానీ తనపైన లేదంటాడు. లేదా ఒక వ్యక్తి పురపాలక సంఘం వేసిన రోడ్లపై నడుస్తాడు. అది కల్పించిన ఆరోగ్య సదుపాయా లను ఎంచక్కా వినియోగించుకుంటాడు. దాని పార్కుల, హరిత వనాల ద్వారా లబ్ధి పొందుతాడు. అది వేసిన కరెంటు దీపాల ద్వారా వెలుగును పొందుతాడు. అది స్థాపించిన పాఠశాలల ద్వారా ప్రయోజనం పొందు తాడు. కాని పురపాలక వ్యవస్థ పట్ల గల అతని బాధ్యతలను నెరవేర్చమని కోరినప్పుడు విముఖత ప్రదర్శిస్తాడు. (లేదా) అలాగే ఒక పౌరుడు తన రాజ్యంలోని పౌర హక్కులన్నింటినీ అనుభవిస్తున్నాడు. ఆ రాజ్యం కల్పించిన శాంతిభద్రతల ద్వారా, న్యాయశాఖ ద్వారా లబ్ధి పొందుతు న్నాడు. కాని ఆ రాజ్యం అత్యవసర పరిస్థితిలో ఒక పౌరునిగా బాధ్యతలను నిర్వర్తించమని కోరినప్పుడు, ఆ బాధ్యతలేవీ తనకు వర్తించవని, అలాంటి వాటిని నెరవేరుస్తానని తానెప్పుడూ మాట ఇవ్వలేదని తప్పించుకున్నాడను కోండి, అతని ఈ వైఖరి సమంజసమనిపించుకుంటుందా?

నువ్వు ఇచ్చే ఈ సంజాయిషీ తప్పుడు సంజాయిషీ అని భార్య అంటుంది. ఏ రోజున నీవు నా మానాన్ని ఉపయోగించుకునే హక్కు పొందావో, ఏ రోజున నేను నా శీలాన్ని నీకు మనస్ఫూర్తిగా అర్పించుకు న్నానో ఆనాడే నీవు నాతో 'ఒక దృఢమయిన ఒడంబడిక' (మీసాఖె గలీజ్) చేసుకున్నావు- ఈ బాధ్యతలన్నింటినీ నెరవేరుస్తానని! ప్రకృతి కూడా భార్యను సత్యవంతురాలిగా, భర్తను తుచ్ఛునిగా ఖరారు చేస్తుంది. ఇలాంటి సమాధానమే ఒక తెగ లేక వంశం పిరికివాడైన వ్యక్తికి ఇస్తుంది. పురపాలక సంఘం కూడా బాధ్యతా రహితుడైన పౌరునికి అదే సమాధానం ఇస్తుంది.

ప్రభుత్వం కూడా నమ్మకద్రోహి అయిన పౌరునికి అదే సమాధానం ఇస్తుంది. లోకమంతా ఈ సమాధానం సరైనదేనని, దుర్మార్గులైన వారిని శిక్షించి తీరాల్సిందేనని సాక్ష్యమిస్తుంది. ఎందుకంటే హక్కులను పొందే వ్యక్తిపై బాధ్యతలు కూడా ఉంటాయి. సూర్యచంద్రులు ఎంత సత్యమో ఇదీ అంతే సత్యం.

ఈ 'హక్కులు- బాధ్యతల' సహజమైన, సర్వతోముఖమైన శాసనం ఆధారంగా మన ఇంట్లోని పెంపుడు కోడి, మన చావిడిలో కట్టబడిన ఆవులు, గుర్రాలు, మన తోటలో నాటబడిన మొక్కలు, వృక్షాలకు కూడా మనపైన హక్కులుంటాయి. వాటిని గనక మనం కాదంటే ఎంతో బాధ్యతా రహితులమని అనిపించుకుంటాము. ఏ కోడి గుడ్డును, కోడిపిల్లలను మనం తింటామో, వాటిని పిల్లుల కుక్కల బారి నుండి కాపాడుకోవాలి. మనం ఏ ఆవు పాలు త్రాగుతామో, ఏ గుర్రంపై స్వారీ చేస్తామో వాటికి గ్రాసం వేయవలసిన బాధ్యత మనపైన ఉంది. వాటి అవసరాలను తీర్చటం వాటి యజమానిగా మన కర్తవ్యం. మనం ఏ పూవనం ద్వారా పరిమళాన్ని ఆస్వాదిస్తున్నామో, ఏ వృక్షాల పండ్లను తింటున్నామో వాటికి నీరు అందించాలి. వాటిలోని కలుపు మొక్కల్ని ఏరిపారేయాలి. వాటికి ఎరువు వేయాలి. ప్రకృతి వైపరీత్యాల నుండి, ఇతరత్రా ఆపదల నుండి వాటిని కాపాడటానికి శాయశక్తులా యత్నించాలి. ఈ బాధ్యతను మన లోని వారెవరూ నిరాకరించలేరు. ఏ రోజు నుండి మనం వాటి ఉనికి ద్వారా లబ్ది పొందామో ఆ రోజు నుండే వాటి రక్షణకు సంబంధించిన బాధ్యతలను కూడా అంగీకరించాము. ఇది 'హక్కులు- బాధ్యతల'కు సంబంధించిన ఒడంబడిక. ఇది ప్రతి లబ్ధిదారునిపై దానంతట అదే విధితమైపోతుంది. మనకు తెలిసిన లోకంలో, మానవ నైజంలో దీనికన్నా అనివార్యమైన వస్తువు మరొకటి లేదు.

ఇప్పుడు ఆలోచించండి! తల్లిదండ్రుల హక్కుల్ని కాదనే హక్కు మనకు లేనప్పుడు, వారికన్నా ఎక్కువ హక్కు తల్లిదండ్రుల్ని పుట్టించిన వానికి ఉంటుంది. కట్టుకున్న ఇల్లాలి హక్కును నిరాకరించే హక్కు మనకు లేనప్పుడు మగవాని సుఖసౌఖ్యాల కోసం స్త్రీకి ఉనికిని ప్రసాదించిన వాని హక్కును మనం ఎలా కాదనగలం? మనం మన కుటుంబీకుల, వంశీయుల హక్కును అంగీకరిస్తున్నప్పుడు, పాలనాధీశుని హక్కును, ప్రభుత్వ హక్కును ఒప్పుకుంటున్నప్పుడు కుటుంబానికి, వంశానికి, పాలనాధీశునికి, ప్రభుత్వానికి ఉనికిని ప్రసాదించి, మానవ నైజంలో కుటుంబ ప్రేమను ప్రోదిచేసి, అతనిలో సంఘీభావాన్ని సృజించిన వాని హక్కును ఎలా తృణీకరించగలం? ఆయన ప్రభు సత్తాను, పోషకత్వాన్ని ఎలా కాదనగలం? మనం కోడి, పిల్లి హక్కును సయితం నిశ్శబ్దంగా అంగీకరిస్తున్నామే! ఆవు హక్కును, గుర్రం హక్కును సయితం నెరవేరుస్తున్నామే! మరలాంటప్పుడు పిల్లి, కోడి, ఆవు, గుర్రం, నదీనదాలు, సూర్యచంద్రులు, చెట్లు చేమలు, అగ్ని, వాయువు, నీరు– వీటన్నింటికీ ఉనికిని ప్రసాదించి వాటి ద్వారా మనకు లబ్ధిని చేకూరుస్తున్న సృష్టికర్త హక్కును ఎలా నిరాకరించగలం?[1]

కాబట్టి–

మనిషికి ఈ 'ఒప్పందం' గురించిన జ్ఞానం లేదనేది పూర్తిగా తప్పు. కాకపోతే, ఆ ఒప్పందానికి విధిగా విషయలోలుడైన ప్రతి ఒక్కడూ విధిగా కట్టుబడి ఉండలేడనేది నిజమే. మేము వెనుకటి అధ్యాయంలో– అల్లాహ్ మనిషి మనోక్షేత్రంలో తన ప్రేమను నాటాడని, తనను అన్వేషించే భావనను కూడా అతనిలో పొందుపరచి భీతి, ఆశ, రుజువర్తన లాంటి వాటిని

1. ఈ వ్యవహారంపై భగవద్గీతలో ఇవ్వబడిన దృష్టాంతాన్ని కూడా గుర్తుంచుకోవాలి. దైవానుగ్రహాలతో లబ్ధిని పొందుతూ కూడా ఆయన కొరకు త్యాగం చేయడానికి, ఆయన హక్కుల్ని అంగీకరించడానికి విముఖత చూపే వ్యక్తి ఉపమానం దొంగవాని లాంటిదని గీత పేర్కొంది.

కూడా కల్పించి అతని స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు పరీక్ష పెట్టాడని తెలుసుకున్నాం. ప్రతి వ్యక్తీ తన ప్రతిభను, ధైర్యసాహసాలను బట్టి దైవసన్నిధిలో గౌరవస్థానం సంపాదించాలన్నదే దీని అసలు ఉద్దేశ్యం. ఈ పరలోక పరమార్థాలే ఒక సత్యాన్వేషికి- ఒక విషయలోలునికి మధ్య విచక్షణకు గీటురాళ్ళుగా ఉంటాయి. సాహసోపేతులైన వారు ప్రతి ఎగుళ్ళు దిగుళ్ళను, ప్రతి ప్రతిబంధకాన్ని, ప్రతి దుర్గమమైన మార్గాన్ని అధిగమిస్తూ దేవుని వరకూ చేరుకుంటారు. మార్గంలో ఎదురయ్యే ప్రమాదాలను లెక్కచేయరు. ఆశామోహముల వైపునకు మొగ్గిపోరు. వారు సతతం తమ మనస్సాక్షి ఘోషను వింటూ ఉంటారు. దేవుని వైపునకు గల ఆకర్షణా శక్తి వారిని నిరంతరం లాగుతూ ఉంటుంది. తమ పాదాలకు బొబ్బలొచ్చినా, ముళ్ళు గుచ్చుకున్నా లక్ష్యపెట్టకుండా వారు ధైర్యంగా ముందుకు సాగిపోతుంటారు. మార్గంలోని మలుపులలో ధైర్యం వీడి చతికిలపడరు. వాస్తవానికి ఈ అధైర్యమే మనిషిని దైవేతర దాస్యానికి, షిర్క్ పోకడలకు ప్రధాన కారణం. మనిషి తన స్థాయి, ఔన్నత్యం గురించి ఆలోచించకుండా మార్గమధ్యంలో ఎక్కడ చల్లని నీడ కనిపించినా మేను వాల్చుతాడు. ఎక్కడ ప్రమాదం పొంచి ఉందనిపించినా పిరికిపందలా ప్రవర్తిస్తాడు. ఆ సమ యంలో అతని పిరికితనం వివిధ రూపాల్లో వ్యక్తమవుతుంది. ఆ పిరికి తనం ఎన్నెన్ని విధాలుగా అతన్ని దైవేతర దాస్యానికి పురికొల్పుతుందో వివరించే అవకాశం ఇక్కడ లేదు. కాని మస్తిష్కంలో దానికి సంబంధించిన భావనను జనింపజేయడానికి కొన్ని ముఖ్య విషయాలను ఇక్కడ క్లుప్తంగా ప్రస్తావించదలిచాము-

అన్నిటికన్నా ముందు చింతన చేయాల్సిన విషయం

అల్లాహ్ మనిషి అస్తిత్వంలో ఒక చిన్నపాటి సామ్రాజ్యాన్ని ఉంచాడు. అతన్ని అత్యుత్తమమైన ఆకృతిలో రూపొందించి, అత్యుత్తమ

మైన శక్తిసామర్థ్యాలను అతనిలో పొందుపరిచాడు. అతనికి అన్నపానీయాలు, వస్త్రధారణల అభిరుచిని ప్రసాదించడంతోపాటు తన ఆలుబిడ్డలతో, కుటుంబీకులతో కలిసి సుఖజీవితం గడిపే కాంక్షను కూడా అతనిలో ఉంచాడు. ఈ కాంక్షల మూలంగానే అతను నిరంతరం సాధన చేస్తాడు. తనలోని తెలివితేటలను ఉపయోగిస్తాడు. మంచీ చెడుల మధ్య విచక్షణను పాటించే బుద్ధిని కూడా దేవుడు అతనికి వొసగాడు. ఉన్నత ఆశయాలకు, గొప్ప లక్ష్యాలకు నిలయమైన హృదయాన్ని కూడా అతనికి ఇచ్చాడు. తన కోరికలను, అవసరాలను తీర్చుకునేందుకు కావలసిన మార్గాలను వెతికే మేథస్సును ప్రసాదించాడు. వాటన్నింటిపై పరిపాలన సాగించే అధికారాన్ని కూడా ఇచ్చాడు. వాటన్నింటినీ పొందిన మానవుడు వాటిని తన ప్రభువు ప్రసన్నతను చూరగొనే విధంగా ప్రవర్తించి దైవసన్నిధిలో ఉన్నత స్థానాన్ని పొందగలుగుతాడు. కాని అతను గమనించిందేమిటంటే, తనకు ప్రాప్తమైన వస్తువులన్నింటిలోకీ అత్యంత రుచికరమైనవి, ఇష్టకరమైనవి 'కోరికలే'. ఇవి తొందరగా లభించేవి. అందుకే అతను వాటిపైనే విరుచుకుపడ్డాడు. తన సామ్రాజ్యాన్నంతటినీ వాటికి ధారాదత్తం చేసేశాడు. కోర్కెలను అనుసరించమని తన పంచేంద్రియాలకు ఆదేశించాడు. కోర్కెలు వేటిని కావాలంటున్నాయో వాటిని సమకూర్చే యత్నంలో నిమగ్నులై ఉండమని పురమాయించాడు. తన కోర్కెల గురించి నిలదీసి అడిగేవారెవరూ ఉండకూడదన్న ఉద్దేశ్యంతో అతను 'బుద్ధి' అనే న్యాయస్థానాన్ని రద్దుపరిచాడు. అతను తన మనసును కూడా కోర్కెలకే అప్పగించాడు. పర్యవసానంగా అతను పదార్థ పూజారిగా తయారయ్యాడు. లైంగిక వాంఛలకు దాసోహమన్నాడు. అతని ఉపమానం తన వద్ద దాసిగా ఉన్న స్త్రీపై మనసు పారేసుకున్న రాజు లాంటిది. ఆ రాజు ఆ దాసీకి బానిసగా మారటమే కాకుండా తప్పొప్పుల నిర్ణయాధికారమంతా ఆమెకే కట్టబెట్టేశాడు. రాజ్యంలోని కులీనులు, మర్యాదస్తులు, పండితులు,

ఆలోచనాపరులంతా పరిపాలనా వ్యవహారాలలో ఆ దాసి చెప్పినట్లుగా వినాల్సి వచ్చింది. **'ఏమిటి, అతను తన మనోవాంఛలను ఆరాధ్య దైవంగా చేసుకోలేదా?'** అన్న దివ్య వచనానికి ప్రతిరూపంగా తయారయింది అతని వ్యవహారం.

అలాగే అల్లాహ్ తల్లిదండ్రులనిచ్చాడు. ఆలుబిడ్డల్ని,రక్త సంబంధీకుల్ని ప్రసాదించాడు. అతనికి ఆసరా ఇచ్చే పరివారాన్ని, తెగను, జాతిని ప్రసాదించాడు. సిరిసంపదలను, భోగ భాగ్యాలను వొసగాడు. పశు సమృద్ధి నొసగాడు. మనిషి తనలో దాగివున్న తెలివితేటలకు పదును పెట్టి, తనలోని సామూహిక శక్తిసామర్థ్యాలను సద్వినియోగం చేసుకోవటానికే, భువిలో దేవుని ప్రతినిధిగా ఉన్న కారణంగా తన ఉనికికి సార్థకత చేకూర్చటానికే ఇదంతా. కాని మనిషి ఈ ఒనరుల వెనుక ఉన్న అసలు ఆశయాన్ని వదలి వీటిని కేవలం తన స్వార్థం కొరకు వాడుకుంటున్నాడు. అతను మాతాపితల ప్రేమలో నిండా మునిగిపోయి వారినే దైవంగా చేసుకున్నాడు. ఆలుబిడ్డల ప్రేమలో గుడ్డివాడై దైవాన్ని, దైవాదేశాలనే విస్మరించాడు. తన కుటుంబం, వంశం, వర్గం పట్ల పిచ్చి అభిమానంలో చిక్కుకుని దైవంపైన, దైవప్రవక్తలపైనే తిరుగుబాటు చేశాడు. కడకు ఈ ప్రేమాతిశయంలో అతను తన పూర్వీకులను, తన వర్గం వారి వేలుపులనే పూజించటం మొదలెట్టాడు. ఆఖరికి తనకు లాభదాయకంగా కనిపించిన చతుష్పాదులను సయితం దేవతలుగా చేసేసుకున్నాడు. ఆవు, ఎద్దు, ఒంటె, గుర్రం తదితర పశువులు సయితం అతని దేవతలై కూర్చున్నాయి. దేవుడు అతని కోసం ఉపయోగకర సాధనాలుగా పుట్టించిన వాటినే అతను సేవించసాగాడు. ఏ వస్తువులు దైవం వరకూ చేరడానికి త్రాటినిచ్చెనలుగా ఉపయోగపడతాయని చెప్పి అతనికి ఇవ్వబడ్డాయో వాటినే అతను తన మెడకు, కాలికి గుదిబండలుగా వేసుకున్నాడు.

దేవుడు మనిషిపై అసంఖ్యాకమయిన వరాల వర్షం కురిపించాడు.

అవన్నీ–ఆసాంతం–మనిషి పాలిట లాభదాయకంగా ఉన్నాయి. అవి తాము చేకూర్చే లాభాలకు బదులుగా ఎలాంటి ప్రతిఫలాన్ని ఆపేక్షించటం లేదు. భార్యాబిడ్డలు, వంశీయులు, జాతి జనులు డిమాండ్ చేసినట్లుగా అవి అతని నుండి ఎలాంటి కోర్కెలు కోరటంలేదు. ఆవు,ఎద్దు, గుర్రం మాదిరిగా వేళకు ఇంత గ్రాసం పెట్టమని కూడా అవి కోరటం లేదు. ఉదాహరణకు– సూర్యుడు, చంద్రుడు, తారలు, గ్రహాలు, అగ్ని, వాయువు, నీరు, భూమి, నదీనదాలు, సముద్రాలు, గగనతలంలో ఎగిరే పక్షులు మొదలగు వాటినే చూడండి – మానవుడు వాటి ద్వారా ప్రయోజనం పొందేందుకు దేవుడు వాటన్నింటినీ పుట్టించాడు. వాటి 'హక్కులు-బాధ్యతల' భారం కూడా అతనిపై మోపలేదు. ఎందుకని? అతని వేళలు కేవలం ప్రభువు ప్రసన్నత బడసే పనులలో వెచ్చించబడాలన్న ఉద్దేశ్యంతోనే ఈ ఏర్పాటు చేయబడింది. కాని మనిషి అనుకున్నదేమిటి? ఈ వస్తువులు దివారాత్రులు తనకు అపారమయిన ప్రయోజనం చేకూరుస్తూ కూడా తన నుండి ఎలాంటి రుసుము తీసుకోవటం లేదంటే వాటిలో ఏదో మహత్తు ఉంది. ఆ విధంగా అతను ప్రతి వరప్రసాదానికి 'వరప్రదాత' స్థాయిని వొసగాడు. వాటిముందు మోకరిల్లి పూజించటం ప్రారంభించాడు. అతని దృష్టాంతం ఎటువంటిదంటే, ఒక రాజు గారు తన ప్రత్యేక ఆంతరంగికుడైన వ్యక్తికి అనేకమంది సేవకులను బహూకరించాడు. అతని పోషణా బాధ్యతలన్నింటినీ తనే స్వీకరించాడు. అతన్ని ఆర్థిక బరువు బాధ్యతలన్నింటి నుండి విముక్తుణ్ణి చేస్తే, ఆ వ్యక్తి తన ప్రతిభనంతటినీ రాజ్య ప్రయోజనాల కోసం వెచ్చిస్తాడని ఆ రాజు ఆశించాడు. కాని ఆ ప్రత్యేక ఆంతరంగికుడు తన దగ్గర పనిచేసే సేవకుల ఉచిత సేవలకు ప్రభావితుడై, వారినే తన సంరక్షకులుగా తలపోసి, వారికే దాస్యం చేయటం మొదలెట్టాడు. తన సిసలైన చక్రవర్తిని, అతని ప్రభుత్వాన్ని బొత్తిగా విస్మరించాడు.

ఈ విధంగా అల్లాహ్ ఎందరిపైననో తన అనుగ్రహ భాగ్యాలను కురిపించాడు. వారికి సిరిసంపదలిచ్చాడు. రాజ్యాధికారం వొసగాడు. గౌరవ మర్యాదలను ఇచ్చాడు. వీటన్నింటినీ ప్రసాదించిన మీదట వారిని పరీక్షిస్తున్నాడు– వారు తన ముందు దాస్యభావంతో తలవంచుతారా? లేదా తలపొగరుతో తిరుగుబాటు చేస్తారా? అని పరికిస్తున్నాడు. భువిపై తన శాసనాలను అమలుపరుస్తారా? లేక వారి శాసనాలను ప్రవేశపెడ తారా? అన్నది గమనిస్తున్నాడు. లోకంలో శాంతిభద్రతలను కాపాడు తారా? లేక దౌర్జన్యాన్ని, కల్లోలాన్ని సృష్టిస్తారా? అని చూస్తున్నాడు. కాని మనుషులు చేస్తున్నదేమిటి? తమ వద్ద ఉన్నదంతా తమ తెలివితేటల ప్రతిఫలం అని తలపోసి గర్వాహంకారం ప్రదర్శించారు. దైవదాస్యం చేయాల్సిందిపోయి 'దేవుళ్ళు'గా తయారయ్యారు. ఈజిప్టులో మాదిరిగా కొందరు అవతార చక్రవర్తులు (God Kings) గా భావిస్తే, భారత ప్రాచీన రాజుల మాదిరిగా కొందరు తమను దేవతలుగా, దైవాంశ సంభూతులుగా ఊహించుకున్నారు. అక్బర్ వంటి ముస్లిం పాదుషాను కూడా కొంతమంది ఆస్థాన ప్రముఖులు ఇలాంటి మూఢ భావనకే లోను చేశారు. కొందరైతే తమను ఆకాశ సృష్టిగా భావించారు. ఉదాహరణకు: చైనా, జపాన్ చక్ర వర్తులు తమను మానవాతీతులమని తలపోశారు. ఈజిప్టులో కాలుమోపే సరికి అలెగ్జాండర్ పుర్రెలో కూడా ఇదే ఆలోచన పుట్టింది. ఈ తాగూత్‌ల ఉపమానం ఎలాంటిదంటే, ఒక చక్రవర్తి తన దగ్గర ఉన్న ఒక బానిసకు హోదాను, అధికారాన్ని ఇచ్చి తన సామ్రాజ్య పరిధిలోని ఒకానొక ప్రదేశంలో ప్రత్యేక అధికారిగా నియమించాడు. అయితే ఆ అధికారి తన హోదాను, అధికారాన్ని చూసుకుని గర్విష్ఠిగా మారాడు. తానే చక్రవర్తినని ప్రకటించుకున్నాడు. చెప్పండి, అలాంటి వ్యక్తిని మీరేమంటారు?

అలాగే అల్లాహ్ చాలామందిని సిరిసంపదలకు, వస్తు సామగ్రికి దూరంగా ఉంచాడు. లేమి ద్వారా వారి సహనానికి పరీక్ష పెట్టడానికే ఇలా

చేయటం జరిగింది. జనులు ప్రాపంచిక వ్యామోహంలో పడి దేవుని తిరుగుబాటుదారులను తమ ఆరాధ్య దైవంగా చేసుకుంటారా? లేక తమకు లభించిన పచ్చడి మెతుకులతోనే సంతృప్తి చెంది, తమ ప్రకృతి ఒడంబడికకు కట్టుబడి ఉంటారా? అని దేవుడు పరీక్షిస్తున్నాడు. కాని చాలామంది ఈ పరీక్షలో నెగ్గుకు రాలేదు. వారు దేవుని బదులు తిరుగు బాటుదారులనే ఆశ్రయించి, వారి ప్రాపకం కోసం వెంపర్లాడారు. ఒక్క పరమోన్నత ప్రభువునకు తప్ప ఇతరులెవరికీ సమ్మతం కాని పూజా పుర స్కారాలను, మొక్కుబడులను దైవేతరులకు చెల్లించారు. బ్రతికి ఉన్నంత కాలం వారి దాస్యం చెయ్యటమే గాక, వారు చచ్చిన తరువాత కూడా వారి సమాధులు కట్టారు. వారి విగ్రహాలు ప్రతిష్ఠించారు.

అల్లాహ్ తన దాసులనేక మందిపై ఆధ్యాత్మిక శుభాలను అవత రింపజేశాడు. కొందరిని తన రాయబారిగా, సందేశహరునిగా చేసుకు న్నాడు. దేవుని ఈ విశిష్ఠ దాసులెన్నడూ ప్రజలను దైవేతరుల దాస్యం వైపు నకు పిలువలేదు. కాని వారి తదనంతరం కొన్నాళ్ళు గడిచిన పిదప ప్రాపం చిక వ్యామోహపరులైన కొందరు అనుయాయులు – తమ ప్రాపంచిక ఉద్దేశ్యాల పరిపూర్తికై– వారిని దేవుని సరసన నిలబెట్టారు. హజ్రత్ ఈసా (ఏసుక్రీస్తు- అలైహిస్సలామ్) గానీ, మరితర సజ్జనులుగానీ ఇదేవిధంగా దైవానికి సహవర్తులుగా చేయబడ్డారు.

ఇలాగే రాజకీయ, సామాజిక ఉద్దేశాలు కూడా ఎన్నో మార్లు బహు దైవారాధనకు, విగ్రహారాధనకు కారణభూతంగా నిలిచాయి. ప్రాచీన చరిత్ర అధ్యయనం ద్వారా అవగతమయ్యేదేమిటంటే, ఎన్నో జాతులు ఇతర జాతుల వారితో రాజకీయ సంబంధాలను సుస్థిరపరచుకునేందుకు షిర్క్‌కు ఒడిగట్టాయి. మరికొన్ని సందర్భాలలో విజేతలైన జాతులు పరాజిత జాతుల మనసులకు ఊరటనిచ్చే ఉద్దేశ్యంతో వాటి విగ్రహాలకు తమ ఆరాధ్య దైవాల శ్రేణిలో చోటు కల్పించాయి. భారతదేశంలో అక్బర్

చక్రవర్తి ఈ ఉద్దేశ్యంతోనే ఇలాంటి కొంగ్రొత్త పోకడలకు శ్రీకారం చుట్టాడు. మక్కాలో ఖురైషులు పవిత్ర కాబా గృహాన్ని అరబ్బు తెగల వారన్నింటి విగ్రహాల కేంద్ర విగ్రహారాధనా గృహంగా మార్చేశారు. అలా చేస్తే అరేబియాలోని తెగల వారంతా మక్కాను తమ పర్యాటక కేంద్రంగా, పుణ్యక్షేత్రంగా భావించి అక్కడికి తరలి వస్తారని తలపోశారు. బనీ ఇస్రాయీల్ చరిత్రను అధ్యయనం చేసినప్పుడు ముందుకు వచ్చే ముఖ్యాంశం కూడా ఇదే– వారు రకరకాల తుచ్ఛమయిన ఉద్దేశ్యాలతో తమకు ఇరుగు పొరుగున ఉన్న ముష్రిక్ జాతుల విగ్రహాలను పూజించారు. ఇంకా వారు ముష్రిక్ జాతుల మహిళలను మనువాడారు. వారితోపాటే వారు పూజించే విగ్రహాలను కూడా తమ ఇండ్లకు తెచ్చుకున్నారు. ఆ ముష్రిక్ మహిళల ద్వారా కలిగిన పిల్లలు కూడా షిర్క్‌కు అలవాటుపడ్డారు. ముస్లిములపై పడిన ఆంగ్లేయుల ప్రభావం, పాశ్చాత్య ప్రభావం కూడా అంతా ఇంతా కాదు. హైందవ సోదరులతో సహజీవనం వల్ల పడిన ప్రభావం సంగతి సరేసరి.

ఈ కొన్ని ఉదాహరణలు ప్రేమైక భావంతో, మైత్రి భావంతో ముడి వడినవి. ఇప్పుడు 'భయానికి' సంబంధించిన ఉదాహరణలను కూడా తీసుకోండి–

అల్లాహ్ సృష్టించిన వాటిలో హానికరమయినవి, ప్రమాదకర మయినవి, భయోత్పాతంతో కూడుకున్నవి తారసపడినప్పుడు మనిషి వాటికి కూడా దేవుని దైవత్వంలో భాగస్వామ్యం కల్పించాడు. (అలాగే) మనిషి తన వైపరీత్యాల మూలంగా, బద్ధకం కారణంగా లేక అజాగ్రత్త వల్ల రోగాల బారిన పడ్డాడు. ఇపుడు అతను చేయాల్సిందేమిటి? జాగ్రత్త పడాలి. వ్యాధి కారకాలకు దూరంగా ఉండాలి. తన అలవాట్లలో, అన్నపానీయాలలో సమతౌల్యాన్ని, పరిశుద్ధతను, పరిశుభ్రతను పాటించి తానొక అత్యుత్తమ జీవినని క్రియాత్మకంగా నిరూపించుకోవాలి. అంటే,

అతను మనోనిగ్రహంతో మసలుకోవాలి. ఈ ముందు జాగ్రత్త చర్యలు మనసుకు కాస్త కష్టం అనిపించినా ఓర్చుకోవాలి. మానవ నైజం వాంఛించేది కూడా ఇదే. కాని అతను ఈ కఠోర పత్యాన్ని పాటించే బదులు సులభ పద్ధతుల వెనుకపడ్డాడు. ఫలానా మహమ్మారికి ఫలానా 'అతను' లేక ఫలానా 'ఆమె' కారణమని తలపోసి వారిని శాంతపరిచే కార్యాలు చేపట్టాడు. వారి పేరిట మొక్కుకున్నాడు. మొక్కుబడులు చెల్లించుకున్నాడు. దీని దృష్టాంతం ఎటువంటిదంటే, ఒక వ్యక్తికి ఒక రాయి వల్ల ఎదురుదెబ్బ తగిలి గాయమయింది. అతను చేయా ల్సిందేమిటి? ఇకమీదట కళ్ళు తెరిచి, జాగ్రత్తగా నడవాలి. దూకుడును తగ్గించుకోవాలి. అలా చేయకుండా అతనేం చేశాడంటే, ఎదురుదెబ్బ తిన్న చోట ఒక దేవాలయం నిర్మించి, భజన చేయటం మొదలెట్టాడు. లేదా ఒక వ్యక్తి తలలో పేలు పడ్డాయి. దుస్తులలో మురికి అధికమై రోతపెట్టాయి. ఈ బాధ నుండి విముక్తి కోసం అతను స్నానం చేసి పొడిబట్టలు ధరించాలి. కాని అతను అలా చేయకుండా పీడలు తొలగిపోవాలని చెప్పి ప్రతి రోజూ ఉదయం కీర్తనలు మొదలెట్టాడు.

అలాగే పాములు కాటేయడాన్ని, తేళ్ళు కుట్టడాన్ని, సింహాలు అడవి మృగాలు ప్రాణులను చీల్చి తినడాన్ని మనిషి గమనించాడు. ఈ జీవులను అల్లాహ్ పుట్టించటంలో పరమార్థాలు లేకపోలేదు. వాటిలో ఉన్న ఒక గొప్ప పరమార్థం ఏమిటంటే మానవుడు నాగరిక జీవితం గడపటంలో, సంఘీ భావంతో మెలగటంలో, పర్యావరణ పరిరక్షణలో అవి పరోక్షంగా తోడ్పడతాయి. అడవులకు దూరంగా గృహ నిర్మాణం చేపట్టడానికి, పర్వతాలను తొలచి కట్టడాలు కట్టడానికి, ఒంటరి జీవితాన్ని కాకుండా కలిసి జీవించటానికి, మనుషులలో దాగివున్న ఆత్మరక్షణా సామర్థ్యాన్ని వెలికి తీసుకురావటానికి ఈ హానికరమయిన ప్రాణుల ఉనికి అవసరం. ఈ విషసర్పాలు, క్రూరమృగాలే గనక లేని యెడల మానవుడు అడవి మని

షిగా ఉండిపోతాడు. సర్పాలు ఉండే బొరియలలో జీవితం గడుపుతాడు. ఈనాడు మానవ సముదాయంలో కానవస్తున్న సంస్కృతీ నాగరికతల దృశ్యాలేవీ కానవచ్చేవి కావు. కాని మనుషుల్లో కొందరికి ఈ పరివర్తన కఠినంగా తోచింది. కాబట్టి వారు తామున్న స్థితిలోనే ఉండిపోవాలను కున్నారు. వారు నిరంతర సాధన చేసే బదులు, ఆ అడవినే దేవతగా ఖరారు చేసి ఆ క్రూర మృగాలను పూజించటం మొదలెట్టారు. ఆ విధంగా వాటిని ప్రసన్నుల్ని చేసి పొంచివున్న ప్రమాదాల నుండి రక్షణ పొందవచ్చని భావించారు. వారి ఉదాహరణ: మాలిన్యమున్న చోట ఇరుక్కుపోయిన సోమరి వంటిది. లేదా దట్టమైన పొగ ఉన్న ఇంట్లో నిర్బంధితుడైన వ్యక్తి లాంటిది. ఏ విధంగానయినా ఆ ఇంట్లో నుండి బయట పడి బహిరంగ స్థలంలో గాలి పీల్చమని అతని మనస్సాక్షి అతనిపై ఒత్తిడి తెస్తోంది. కాని అతనిలోని సోమరితనం అతనికి అవరోధంగా తయారయింది. అందుకే అతను అక్కడి నుండి బయటపడే బదులు అక్కడి చెత్తకుప్పనో లేక పొగనో పూజించసాగాడు - అంటే చెత్తకుప్పను లేదా పొగను వాటి దేవతగా తలపోశాడు. ఓ మలినాత్మా! ఓ కాశ్మోరా! ఓ పొగ దేవతా! నాపై దయ జూపండి. నా మొరలాలకించండి అని వేడుకోసాగాడు.

ఇదే విధంగా ప్రకృతి ఎల్లెడలా అంతులేని దయాదాక్షిణ్యాలను కురిపిస్తున్నప్పటికీ అప్పుడప్పుడు అది తనలోని న్యాయశీలాన్ని, ప్రచండ తను ప్రస్ఫుటం చేసేందుకు భూమిని కంపింపజేస్తూ ఉంటుంది. ఒక్కోసారి పర్వతాల ద్వారా నిప్పులు చెరుగుతుంది. కొన్ని సందర్భాలలో చల్లని పవనాలను తుఫాను గాలులుగా చేసేస్తుంది. ఒక్కోసారి ఆకాశం నుండి పిడుగులు పడవేస్తూ ఉంటుంది - మనిషి దేవుని జాలి గుణంపై మితిమీరిన ధీమాతో ఆయనలోని న్యాయ స్వభావాన్ని విస్మరించకుండా ఉండేటం దుకు, ఆయనలోని ఆగ్రహాన్ని, రౌద్రాన్ని గుర్తుంచుకునేందుకు ఇలా చేయాల్సి వచ్చింది. మనిషి హద్దు మీరిపోయినప్పుడు, ఎల్లప్పుడూ అతని

సేవలో ఉంటూ అతని పాలిట లాభదాయకంగా ఉండే వస్తువులనే దేవుడు అతని పాలిట భయంకరమయిన విపత్తులుగా మార్చివేయగలడు. కాని మనిషి భయోత్పాతంతో కూడుకున్న ఈ సంఘటనలకు భయపడి దైవం వైపునకు మరలవలసిందిపోయి ఆ భయానకమయిన వాటి వైపునకే పోయాడు. ఇతని ఉపమానం ఎటువంటిదంటే, ఒక చక్రవర్తి తన పాలిత ప్రజకు సర్వవిధాలా శాంతిభద్రతలను సమకూర్చాడు. అయితే చక్రవర్తి అప్పుడప్పుడూ తన కఠినచర్యల రుచి చూపే కొన్ని పనులు కూడా చేసి తాను స్థాపించిన శాంతిభద్రతల విలువ ఎంతటిదో ప్రజలకు తెలిసి వచ్చేలా చేయాలనుకుంటాడు. కాని ప్రజలు చక్రవర్తి పాండితీ ప్రకర్షను బొత్తిగా విస్మరించి, అతను ప్రదర్శించిన కఠినచర్యలనే భక్తితో ఆరాధించసాగారు.

తలబిరుసులుగా, ధిక్కారులుగా వ్యవహరించేవారికి సయితం దేవుడు విడుపు ఇచ్చాడు. ఒక నిర్ణీత కాలవ్యవధి వరకు వారికి లబ్ది పొందే అవకాశం కల్పించాడు. జగతి అంతటా ఈ విడుపుకు, పరీక్షకు సంబంధించిన శాసనం ప్రస్ఫుటమై ఉంది. ఫిరౌన్, ఖారూన్, హామాన్, అబూలహబ్, అబూజహల్ వంటి వారు, వారి పాదచిహ్నాలలో నడుచుకునే తలబిరుసులంతా ఒక వరుసలో ఉండగా, నూహ్, ఇబ్రాహీమ్, మూసా, ముహమ్మద్ (అలైహిముస్సలామ్) వంటివారు, వారి అడుగుజాడలలో నడిచే దేవుని ప్రియతమ దాసులు, ఏకేశ్వరోపాసకులంతా మరో వరుసలో ఉన్నారు. సత్యాసత్యాల ఈ సంఘర్షణ ఆదికాలం నుండే కొనసాగుతూ వస్తోంది. దైవశాసనం ప్రకారం ఇది ప్రళయం వరకూ కొనసాగుతుంది. తమ మనస్సాక్షి వాంఛించేదేమిటో తెలిసి కూడా ప్రలోభాలకు లొంగిపోయి లేదా దేనికయినా భయపడి తాగూత్‌ల ముందు తలవంచేసేవారు ఎందరో ఉన్నారు. అయితే- ఎట్టి పరిస్థితిలోనూ ఆశామోహములకు లొంగక, దేవునితో చేసిన బాసకు తాము స్వయంగా కట్టుబడి ఉండటమేగాక, ఇతరు

లను కూడా కట్టుబడి ఉండేలా కృషి చేసే దైవదాసులు కూడా లోకంలో ఎందరో ఉన్నారు. దుష్టుల వల్ల హాని కలుగుతుందన్న భయం దుష్ట దాస్యాన్ని ఒక శాశ్వత మత ధర్మంగా చేసేసింది. మజూసీలు మేలు-కీడుకు సంబంధించిన ఇరువురు దైవాలుంటారని నిర్ధారించి ఆ ఇరు దైవాలను కూడా పూజించటం మొదలెట్టారు. హిందువులు ఏర్పరచుకున్న త్రిత్వ సిద్ధాంతం ప్రకారం ప్రాపంచిక పరిపాలనా వ్యవస్థ తీరులో జీవన దానం చేసేవారు ఒకరు, జీవితానికి రక్షణ కల్పించేవారు మరొకరు, జీవితాన్ని తీసుకునేవారు ఇంకొకరు.

ఈరానీయులయినా, భారతీయులయినా ప్రాచీన కాలం నుండీ తమ విశ్వాసాలకు ఫిలాసఫీ తైలం ఎంతగా రాసినప్పటికీ, నిశిత దృష్టితో తరచి చూసినప్పుడు స్పష్టంగా కానవచ్చే దేమిటంటే ప్రపంచంలోని ఇతరత్రా జాతులలో షిర్క్ ఏఏ మార్గాల గుండా జొరబడిందో వీరిలోనూ అవే మార్గాల గుండా ప్రవేశించింది.

ఈ కొన్ని దృష్టాంతాలు మార్గనిర్దేశన ఉద్దేశంతో మాత్రమే ప్రస్తావించబడ్డాయి. మీరు విగ్రహారాధన గురించిన ఏ చరిత్రను తీసి ఈ దృక్పథంతో చదివినా మీకు స్పష్టమయ్యే యదార్థం ఒక్కటే- దైవేతర దాస్యం, అది మృతులైన దేవతల రూపంలో జరిగినా లేక సజీవులైన దేవుళ్ళ రూపంలో జరిగినా అది మానవుని మూర్ఖత్వం వల్ల జరిగేదే.

ఈ మూర్ఖత్వం యొక్క ఒక రూపం అంధానుసరణ. మానవతలోని ఒక పెద్ద వర్గానికి 'యదార్థం' గురించిన చింతన లేదు. దైవ సందేశహరుల పిలుపుపై కూడా అది చింతన చేయలేదు. తమ తాతలు తండ్రులు అవలంబిస్తూ ఉండగా చూసిన పద్ధతినే వారూ అనుసరించారు. తాతలు తండ్రులు అవలంబించిన మార్గం కాకుండా మరేదయినా నూతన పంథాను గురించి ఆలోచించటం వారికి కష్టంగా తోచింది. మరయితే మానవుడు పశువు కాడు. అతనొక బుద్ధి జీవి, ఎంపిక స్వాతంత్ర్యం గల

ప్రాణి అయి ఉండి కూడా పశువులా తయారవ్వటం, తన బుద్ధివివేకాలకు పని తగిలించకుండాఉండటం అతని స్థాయికి తగునా? ముమ్మాటికీ ఇది అతని బాధ్యతారాహిత్యానికి నిదర్శనమే.

లోకంలో మరికొంతమంది కూడా ఉన్నారు. వారు తమ పూర్వీకుల విధానాన్ని గుడ్డిగా అనుసరించలేదు. పైగా వారు తమ పెద్దల ప్రాచీన వైఖరిలో పరివర్తన తీసుకువచ్చారు. తమ ఆలోచనల, అనుశీల నల శక్తితో సమకాలీన విధానాల దిశను మళ్ళించారు. కొందరు మహాను భావులు ఈ మార్గంలో గొప్ప త్యాగాలు కూడా చేశారు. కొందరు సాహస వంతులైతే హాలాహలాన్ని సయితం దిగమ్రింగారు. కాని దేవుని ఏకత్వపు (తౌహీద్) రహస్యం మాత్రం వారికి తెలిసిరాలేదు. వారి జాతి జనులు తచ్చాడుతూ ఉన్న అంధకార లోయల్లోనే వాళ్ళూ తచ్చాడుతూ ఉండిపో యారు. ఎందుకంటే ఈ తత్వవేత్తలలో చాలామంది ఎన్నో తాత్కాలిక గమ్యాలను అధిగమించినప్పటికీ జాతీయతత్వపు దుర్గమ గమ్యాన్ని అధిగ మించలేకపోయారు. స్వచ్ఛమయిన తౌహీద్‌ను పుణికి పుచ్చుకోవాలంటే, మనిషి తన మెడలో పడివున్న ఇతరత్రా ఊడిగపు గుదిబండలను తీసి వేయవలసి ఉంటుంది. ఈ సౌభాగ్యం, సద్బుద్ధి మహనీయులైన దైవ సందేశహరులకు లేక వారి అడుగుజాడలలో నడుచుకునే సజ్జనులకు మాత్రమే ప్రాప్తిస్తుంది.

పైన మేము వివరించిన షిర్క్ కారణాలను దివ్యఖుర్‌ఆన్, ఇతర ప్రాచీన దైవగ్రంథాలు కూడా సమర్థిస్తున్నాయి. దివ్య ఖుర్‌ఆన్‌లో 'షిర్క్ చాలా పెద్ద అన్యాయం' (ఇన్నష్షిర్క ల జుల్మున్ అజీమ్)గా పేర్కొనబడింది. 'అన్యాయం' అనేది న్యాయానికి వ్యతిరేకం. ఎవరయినా ఒకరి హక్కును హరించటం అని దీని అర్థం. మనిషిపై ఉన్న అతి పెద్ద హక్కు అల్లాహ్ హక్కు అని ఇంతకుముందు మనం చెప్పుకున్నాం. కనుక ఆయన హక్కులో

వేరొకరినెవరినయినా భాగస్వామిగా ఖరారు చేయటమంటే ఆ అతిపెద్ద హక్కును కాజేయటమే. ఆ విధంగా ఇది ఘోరమైన అన్యాయం అయింది. హక్కును హరించటమనేది ఏ స్థాయికి చెందినదై ఉంటుందో దాని నీచత్వం కూడా అదే స్థాయికి చెందినదై ఉంటుంది. అందుకే ప్రాచీన దైవ గ్రంథాలలో ముష్రిక్‌ను 'లంజ'గా అభివర్ణించటం జరిగింది. తౌరాతు గ్రంథంలో ఈ విషయం అనేకసార్లు పునరుక్తమయింది- దేవుడైన యెహోవ పౌరుషవంతుడు. మీ భార్య వేరొకరి పక్కన పడుకోవటాన్ని మీరు ఏవిధంగా ఇష్టపడరో అదేవిధంగా తన దాసుడు వేరొకరి దాస్యం చేయడాన్ని దేవుడు ఇష్టపడడు. పవిత్రమైన దివ్యఖుర్‌ఆన్ ప్రబోధనలో ఈ విషయం యధాతథంగానైతే చెప్పబడలేదు గాని, ఈ భావాన్ని అది మరో విధంగా, ఎంతో మనోజ్ఞంగా చిత్రీకరించింది. ఉదాహరణకు సూరయె నూర్‌లో అది ఇలా పేర్కొంది:

الزَّانِي لَا يَنكِحُ إِلَّا زَانِيَةً أَوْ مُشْرِكَةً وَالزَّانِيَةُ لَا يَنكِحُهَا إِلَّا زَانٍ
أَوْ مُشْرِكٌ وَحُرِّمَ ذَٰلِكَ عَلَى الْمُؤْمِنِينَ

ఒక వ్యభిచారి, వ్యభిచారిణిని లేక ముష్రిక్ స్త్రీని తప్ప మరెవరినీ వివాహం చేసుకోకూడదు. వ్యభిచారిణిని ఒక వ్యభిచారి లేక ఒక ముష్రిక్ పురుషుడు తప్ప మరెవరూ వివాహం చేసుకోకూడదు. అటువంటి వివాహాలు విశ్వాసులకు నిషేధించబడ్డాయి."

(అన్ నూర్- 3)

భాగస్వామ్యం లేకుండా రెండు వస్తువుల కలయిక కుదరదు. ఈ 'మూలాన్ని' దృష్టియందుంచుకుని మనిషి ఆలోచించినప్పుడు తెలిసి వచ్చేదేమిటంటే ఒక ముష్రిక్‌కు- లంజరికం చేసే స్త్రీకి మధ్య ఎంతో ప్రగాఢమయిన నైతిక సంబంధం ఉంది. వేశ్య తన శీలాన్ని పరాయి

మగవాడికి అప్పగించుకుంటుంది. తన శీల కుసుమంపై అతనికి యాజమాన్యపు హక్కును కట్టబెడుతుంది. దానికి ప్రతిగా అతని నుండి మనోవర్తితో సహా అనేక ప్రాపంచిక ప్రయోజనాలు పొందుతుంది. ఆ తరువాత అతని యాజమాన్యపు హక్కులో వేరొక మగవాణ్ణి భాగస్వామిగా చేర్చుతుంది. సిగ్గు లేకుండా తన మానాన్ని పరాయి మగవానికి అధీన పరుస్తుంది. ముష్రిక్ (బహు దైవారాధకుడు అయిన మనిషి) పరిస్థితి కూడా ఇంతే. అతను దేవుని ప్రభుతను, పోషకత్వాన్ని అంగీకరిస్తాడు. 'బలా' అని పలికి దైవదాస్యపు ఒడంబడిక కూడా చేసుకుంటాడు. ఆయన ఇంటనే ఉంటాడు. ఆయన పెట్టిందే తింటాడు. ఆయన సరఫరా చేసిన నీరునే త్రాగుతాడు. ఆయన సమకూర్చిన దుస్తులే ధరిస్తాడు. అతనివద్ద ఉన్న దంతా అల్లాహ్ ప్రసాదించినదే. అయినాసరే అతను ఇతరుల దాస్యం చేస్తాడు. ఇతరులనే ప్రేమిస్తాడు. ఇలాంటి నైతిక పరిస్థితి ఒక వ్యభిచారిణిదే కాగలదు. లేదా ఒక ముష్రిక్ మాత్రమే ఇలా వ్యవహరించగలడు. భూమండలంలో ఈ రెండు విశ్వాస ఘాతుకాలే ఒండొక దానికి పోలికగా ఉంటాయి. ఈ కారణంగానే ఖుర్ఆన్ ముష్రిక్‌ను (బహుదైవారాధకుణ్ణి) 'స్వామిద్రోహి'గా కూడా పేర్కొంది. ఈ స్వామిద్రోహం ఒక స్త్రీ విశ్వాస ఘాతుకానికి, వాగ్దాన భంగానికి కూడా అతికినట్లే సరిపోతుంది. అందుకే అరబీ భాషలో 'ఖియానత్' (నమ్మకద్రోహం, స్వామి ద్రోహం) అనే పదం స్త్రీ విశ్వాస ఘాతుకం కొరకు ప్రసిద్ధి చెందింది.

అల్లాహ్ తాను కోరిన వారి తప్పులన్నింటినీ క్షమిస్తాడు గాని 'షిర్క్'ను మాత్రం క్షమించడన్న వాక్యం పదేపదే ఖుర్ఆన్‌లో ఎందుకు పునరావృతం అయిందో దీని ద్వారా అర్థమవుతూనే ఉంది. మర్యాదస్తుడు, పౌరుషవంతుడైన ఒక భర్త తన భార్య చేసిన ఏ తప్పునయినా క్షమించ గలడు గాని నమ్మకద్రోహాన్ని మాత్రం క్షమించలేడన్న విషయం ప్రతి మగ వాడికీ తెలుసు. ఒకవేళ అతను భార్య నమ్మకద్రోహాన్ని కూడా ఉదారంగా

క్షమించి సర్దుకుపోతుంటే అతనొక రంఢ్వా అన్నా అయి వుండాలి లేదా కొజ్జానో, తార్పుడు పనులు చేసేవాడో అయినా అయి ఉండాలి. లేదా రోషం లేని పశువు అయి ఉండాలి. మనిషిలోని పౌరుషం మరీ ఇంతగా దిగజారిపోయినప్పుడు అతని మాన మర్యాదల గురించి ఎవరయినా ఎలా ఊహించగలరు? ఆ సుందరేశుని పౌరుషం ఎంత సుందరమైనదంటే, దాని ఛాయవల్ల లోకంలోని సౌశీల్యం, పవిత్రతా పారిశుద్ధ్యాలు ప్రకాశ మానమై పోతాయి. అంత గొప్ప పౌరుషవంతుడైనవాడు, తన దాసుడు వేరొకరి దాస్యపు కళంకాన్ని తనకు అంటించడాన్ని ఎలా క్షమించగలడు? అందుకే ఖుర్ఆన్‌లో ఆయన గురించి ఇలా సెలవీయటం జరిగింది: **అల్ అజీజుల్ జబ్బారుల్ ముతకబ్బిరు- సుబ్‌హానల్లాహి అమ్మా యుష్‌రికూన్** (ఆయన సర్వాధిక్యుడు, తన ఉత్తరువులను తిరుగులేని విధంగా అమలు పరచేవాడు, ఎల్లప్పుడూ గొప్పవాడుగానే ఉండేవాడు. ప్రజలు కల్పించే దైవత్వపు భాగస్వామ్యం వర్తించని పరిశుద్ధుడు అల్లాహ్). అల్లాహ్ అత్యుత్తమ పేర్లలోని కొన్ని పేర్లు ఇక్కడ ప్రస్తావించబడ్డాయి. వాటిలో 'ముతకబ్బిర్' ఒకటి. ఈ పదంలో పెద్దరికం, పౌరుషం ఇమిడి ఉన్నాయి. ఆ స్థాయి పెద్దరికం ఆయన ఒక్కనికి తప్ప మరొకరెవరికీ శోభించదు. ఆయన పౌరుషం ఎన్నటికీ షిర్క్‌ను (దైవత్వంలో భాగస్వామ్యాన్ని) సహించ జాలదు.

వ్యభిచారానికీ- షిర్క్‌కు గల ఈ పోలిక కారణంగా షిర్క్‌ను అనేక చోట్ల 'మలినం' (రిజ్స్)గా అభివర్ణించటం జరిగింది. ముష్రిక్‌లను అశు ద్ధులు అని కూడా అనటం జరిగింది. ఈ మాలిన్యంతో కలుషితమై ఉన్న నమ్మకద్రోహుల నుండి తన పవిత్ర గృహం కాబాను పవిత్రపరచమని కూడా అల్లాహ్ ఆదేశించాడు. ఎందుకంటే ఆయన తన పవిత్ర క్షేత్రంలో నమ్మకద్రోహుల ఉనికిని సహించజాలడు. 'షిర్క్' అనే ఈ మాలిన్యంతో మైలపడిన సమూహం ఏదయినా సరే, అది దైవాగ్రహానికి గురికావటం

తథ్యం. షిర్క్ వాస్తవికతను గురించి తెలిసి కూడా ఆ చేష్టను సహించి ఊరు కున్న వారు ఆ జాతికి మరణ శాసనం లిఖించిన వారవుతారు.

قَالَ قَدْ وَقَعَ عَلَيْكُمْ مِّنْ رَّبِّكُمْ رِجْسٌ وَّ غَضَبٌ ؕ اَتُجَادِلُوْنَنِيْ فِيْۤ اَسْمَآءٍ سَمَّيْتُمُوْهَآ اَنْتُمْ وَ اٰبَآؤُكُمْ مَّا نَزَّلَ اللّٰهُ بِهَا مِنْ سُلْطٰنٍ ؕ فَانْتَظِرُوْۤا اِنِّيْ مَعَكُمْ مِّنَ الْمُنْتَظِرِيْنَ ۝ (الاعراف:٧١)

“మీపైన మీ ప్రభువు తరఫు నుండి మాలిన్యం, ఆగ్రహం విరుచుకు పడింది. ఏమిటి, మీరునూ, మీ పూర్వీకులు కల్పించుకున్న కొన్ని పేర్ల విషయమై మీరు నాతో తగవు పడుతున్నారా? వాటికి సంబంధించిన ప్రమాణమేదీ అల్లాహ్ అవతరింపజేయలేదు. కాబట్టి మీరూ నిరీక్షించండి, మీతోపాటే నేనూ నిరీక్షిస్తాను” అని అన్నాడు. *(దివ్యఖుర్‌ఆన్ - 7 : 71)*

షిర్క్ వల్ల దేవుని హక్కులు ఏవిధంగా హరించబడతాయోనన్న దానికి సంక్షిప్త వివరణ ఇది. అదలావుంచితే షిర్క్ ఒకవిధంగా ఆత్మ ద్రోహం కూడా. తన ఆత్మకు తీరని అన్యాయం చేసుకోవటమే షిర్క్. ఆ విధంగా చూసినప్పుడు షిర్క్‌కు ఒడిగట్టడం కడు నీచమైనది.

అల్లాహ్ మనిషికి వొసగిన గౌరవం, శక్తిసామర్థ్యాలు గనక బాల్యం, వృద్ధాప్యమనే రెండు అశక్తతల నడుమ ఇరుక్కుని ఉండకపోయే మాటైతే అతను తనను తాను ఫిరౌన్‌గా ప్రకటించుకునేవాడే. ఒకవేళ అతను అలా ప్రకటించుకున్నా అది అనుచితం అనిపించేది కాదేమో! అతని నైజంలో ఉన్న ఔన్నత్యం గానీ, సమస్త సృష్టిరాశులపై అతనికి లభించి ఉన్న ఆధిక్యత గానీ వేరొకరి దాస్యం చేయడానికి అతన్ని సంసిద్ధం చేయవు. అతను ఇతరులను ఆరాధించే బదులు తానే ఆరాధ్య దైవమై కూర్చోవాలని కోరుకునేవాడు. కాని అతను గమనించిన విషయం ఏమిటంటే– ఇన్ని

ఔన్నత్యాలు కలిగి ఉన్నప్పటికీ నేను నా అంతట నేనుగా ఈ లోకంలోకి రాలేకపోయాను. ఈ లోకంలో శాశ్వతంగా ఉండిపోయే శక్తి కూడా నాకు లేదు. నేను భూమ్యాకాశాలలోగానీ, వాటి మధ్యన గానీ ఏ వస్తువునూ సృష్టించలేకపోయాను. ఒక ఈగను గానీ, ఒక దోమను గానీ పుట్టించ గలిగే శక్తి నా వద్దలేదు. కాబట్టి అతను కడు అశక్తతతో, వినయ వినమ్రత లతో, భీతితో, కృతజ్ఞతా భావంతో అద్వితీయుడైన ఆ అగోచర శక్తి ముందు ఆత్మ సమర్పణ చేసుకుంటాడు. అలా చేయటం వినా తనకు మార్గాంతరం లేదు గనకనే అతనలా చేస్తాడు. అలా చేయనిదే అతని బుద్ధి నెమ్మదిం చదు. అతని మనసు కుదుటపడదు. అలా చేయనంతవరకూ ఈ జగతి లోని పజిల్ పరిష్కారమవదు. ఇలా చేసిన మీదటే అప్పటివరకూ అతని బుద్ధిపడిన తికమకకు సమాధానం దొరుకుతుంది. అప్పుడే ఈ విశ్వంలోని సమస్యలకు పరిష్కారం చూపేందుకు అతను సమాయత్తమవుతాడు.

ఆ తరువాత ఎవరయినా వ్యక్తి ఆ ఒక్కడే కాదు, తలవంచవలసిన వారు మరెందరో ఉన్నారని అంటే, దాని సాక్ష్యాధారాల బాధ్యత ఆ వ్యక్తి పైనే ఉంటుంది. అప్పుడితను, ఆ ఒక్క శక్తిమంతుని ముందే మోకరిల్ల డాన్ని నా అంతరాత్మ సహిస్తుంది. మార్గాంతరం లేదు కాబట్టే నా మనసు లోని ఔన్నత్యం దానికి అంగీకరించింది. ఈ విషయంపై నీకూ నాకూ మధ్య ఏకాభిప్రాయం కూడా ఉంది. ఇక నీవు ప్రస్తావించే మిగిలిన వారి విషయమంటావా, వారికి సంబంధించి సాక్ష్యాధారాలను నువ్వే తీసుకు రావాలి. అనవసరమైన చిల్లర దైవాల పట్ల నాకెలాంటి శ్రద్ధాసక్తులు లేవు. నా ప్రభువు, నా సంరక్షకుడైతే ఒక్కడే. అనేకమంది యజమానుల గుది బండను మెడలో వేసుకోవడానికి ఒక కట్టుబానిసే ఒప్పుకోనప్పుడు, అనేక మంది ప్రభువులకు సేవలు చేసుకునే దీనావస్థను నేనెందుకు కొని తెచ్చు కోవాలి? అని అంటాడు.

ءَ اَرْبَابٌ مُّتَفَرِّقُوْنَ خَيْرٌ اَمِ اللّٰهُ الْوَاحِدُ الْقَهَّارُ ـ (یوسف:۳۹)

అనేకమంది విభిన్న ప్రభువులు మేలా? లేక తిరుగులేని ఒక్క అల్లాహ్ మేలా?" ***(యూసుఫ్ : 39)***

ضَرَبَ اللّٰهُ مَثَلاً رَّجُلاً فِيْهِ شُرَكَآءُ مُتَشَاكِسُوْنَ وَ رَجُلاً سَلَماً لِّرَجُلٍ ؕ هَلْ يَسْتَوِيَانِ مَثَلاً ؕ اَلْحَمْدُ لِلّٰهِ ۚ بَلْ اَكْثَرُهُمْ لَا يَعْلَمُوْنَ ۝ (الزمر:۲۹)

"అల్లాహ్ ఒక దృష్టాంతం ఇస్తున్నాడు- ఒక వ్యక్తి ఉన్నాడు. అతనిని తమ తమ వైపునకు లాగే సంస్కారహీనులైన యజమానులు అనేక మంది ఉన్నారు. మరొక వ్యక్తి ఉన్నాడు, అతను పూర్తిగా ఒకే యజమానికి బానిసగా ఉన్నాడు. ఆ ఇద్దరు వ్యక్తుల పరిస్థితి ఒక్కటే అవుతుందా? 'అల్‌హమ్దులిల్లాహ్' (స్తోత్రం కేవలం అల్లాహ్‌కే). కాని చాలామంది అజ్ఞానంలో పడి ఉన్నారు."

(దివ్యఖుర్‌అన్ - 39 : 29)

అయితే అల్పబుద్ధి కలవారు తమ మనస్సాక్షిని ఖాతరు చేయలేదు. దేవుని ప్రతినిధి అన్న హెూదాను పొందిన మీదట కూడా వారు అత్యంత అధమశ్రేణికి చెందిన సేవకులను తమ ప్రభువులుగా చేసుకున్నారు. తమ లాంటి మానవులనే తమ దైవంగా చేసుకుని తమ ఆత్మకు తీరని అన్యాయం చేసుకున్నారు. తమ మనస్సాక్షిని తామే కించపరిచారు. తమను తాము దిగజార్చుకున్నారు.

"వమఁయ్యుహినిల్లాహు ఫమాలహు మిన్ ముక్‌రిమిన్"-

"వమఁయ్యుష్‌రిక్ బిల్లాహి ఫకఅన్నమా ఖర్ర మినస్సమాయి".

ఈ ఆయత్‌లలో ఈ పరాభవం, నీచత్వం గురించిన ప్రస్తావనే ఉంది.